

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹5.00

సంపుటి: 10
సంచిక: 308

సోమవారం 29-1-2018



భారత్‌లో జీవనం ఎంతో చౌక!
ప్రపంచంలో దక్షిణాఫ్రికాకు మొదటి స్థానం
2వ స్థానంలో భారత్ - బిజినెస్‌లో



సూపర్ ఫెడరర్...
ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్
సొంతం చేసుకున్న స్విస్ స్టార్ –స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

గూడూరులో పరవళ్లు తొక్కిన జనప్రవాహం





ఆదివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో జరిగిన బహిరంగ సభలో అశేషజనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. బహిరంగ సభ వెనుక వైపు కనుచూపు మేరలో కిక్కిరిసిన జనం

6 లో

నేటి నుంచే బడ్జెట్ సమరం

10 లో

- నేడే పార్లమెంటులో ఆర్థిక సర్వే

బెజవాడలో బొండాగిరి!

తప్పుడు పత్రాలు సృష్టించి స్వాతంత్య్ర సమరయోధుడి భూమి స్వాహా

రూ.50 కోట్ల విలువైన 5.16 ఎకరాలు భార్య పేరు మీద రిజిస్ట్రేషన్

విజయవాడలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా భూ కబ్జా బాగోతం

- స్థలానికి ప్రహరీ నిర్మాణం.. వారసుడిపై దౌర్జన్యం చేసి వెళ్లగొట్టిన వైనం
- మాటవినకుంటే అంతుచూస్తామని బెదిరింపులు
- బొండా ఉమా భార్య సుజాతపై సీఐడీ కేసు



ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, సతీమణి బొండా సుజాత

సాక్షి, అమరావతి బ్యూరో

విజయవాడ నగరంలో 5.16 ఎకరాల భూమి.. విలువ రూ.50 కోట్లు పైమాటే... యజమానులు సాదాసీదా వ్యక్తులు. ఇంకేముంది టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రహరీ కట్టేశారు... తప్పుడు పత్రాలు సృష్టించి దానికి తన భార్యను యజమానిని చేసేశారు. ఆ భూమికి వారసుడినని వచ్చిన వ్యక్తిపై తన మనుషులతో దౌర్జన్యం చేసి వెళ్లగొట్టారు. విషయం వెలుగులోకి వచ్చి సీఐడీ కేసు నమోదు కావడంతో అధికారదర్పం ప్రదర్శిస్తున్నారు. తమ మాట వినకుంటే

మిగతా 2వ పేజీలో ▶

జగన్ మాట తప్పడు.. ఆశీర్వదించండి

'సాక్షి' టీవీ ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ విజ్ఞప్తి




- తల్లిగా జగన్ వ్యక్తిత్వం నాకు తెలుసు
- ఇచ్చిన మాట తప్పడు.. ప్రజా సంక్షేమమే పరమావధి
- ప్రజలకు భరోసా ఇస్తున్న తీరు చూస్తుంటే వైఎస్ గుర్తొస్తారు
- నా బిడ్డ జనం పక్షాన నిలుస్తున్నందుకు గర్వంగా ఉంది
- వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోవడం మాకు పెద్ద షాక్
- అన్యాయంగా కేసులు పెట్టి జగన్‌ను వేధించారు
- న్యాయంగా వెళ్తూ ధైర్యంగా ఎదుర్కొంటున్నాడు
- నేను మాట ఇస్తున్నా.. జగన్‌కు ఒక్క అవకాశం ఇవ్వండి.. చెప్పింది చేస్తాడు
- ఒక మంచి పనైనా చేయని చంద్రబాబుకు ప్రజలే సమాధానం చెబుతారు

5 లో

నారీశక్తికి తిరుగులేదు!

ఒక కూతురు.. 10 మంది కుమారులతో సమానం



- పద్మ అవార్డుల్లో పారదర్శకతతోనే సామాన్యులకు గౌరవం
- వారంతా పేర్లతో కాకుండా సేవలతో గుర్తింపు పొందారు
- ఈ ఏడాది తొలి 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

10 లో

మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ చార్జీలు లేవు

- పార్కింగ్ బాదుడుపై స్థానిక సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు
- సమాచార హక్కు చట్టం కింద పట్టణ ప్రణాళికా శాఖ వెల్లడి
- కోర్టు తీర్పులున్నా మల్టీప్లెక్స్‌లు పార్కింగ్ చార్జీల వసూళ్లు

- వివరాలు 3లో

రైళ్లలో సీసీ కెమెరాలు

దేశవ్యాప్తంగా 11వేల రైళ్లలో 12 లక్షల కెమెరాల ఏర్పాటుకు కసరత్తు

- మహిళల బోగీల్లో ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు
- బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించే అవకాశం

- 3లో

నిత్య విద్యార్థిగా ఉంటేనే విజయం

- నాస్కామ్ అధ్యక్షుడు చంద్రశేఖర్

చంద్రశేఖర్‌తో ఈ వారం గెస్ట్ కాలమ్

భవిత 13లో

పాదగయ క్షేత్రంలో జస్టిస్ రామలింగేశ్వరరావు సూర్య నమస్కారం


పాదగయ క్షేత్రంలో సూర్య నమస్కారం చేస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు

పిఠాపురం: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలోని పాదగయ పుణ్యక్షేత్రంలో ఆదివారం సూర్య నమస్కారం చేశారు. దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానికులతోపాటు ఆయన పాల్గొన్నారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరీదేవిని, పురుహూతికా అమ్మవారిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ రామలింగేశ్వరరావు ఆలయ ఈవో చందక దారబాబు, ట్రస్టుబోర్డు చైర్మన్ కొండేపూడి ప్రకాష్ సాదరంగా స్వాగతం పలికారు. ఆయన వెంట పిఠాపురం, పెద్దాపురం కోర్టుల న్యాయమూర్తులు, ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, తహసీల్దారు బి.సుగుణ ఉన్నారు.

నేడు వృద్ధులు, దివ్యాంగులకు తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం

సాక్షి, తిరుమల: వృద్ధులు, దివ్యాంగులకు సోమవారం తిరుమలలో శ్రీవారి ప్రత్యేక దర్శనం టోకెన్లను అదనంగా జారీ చేయనున్నారు. భక్తుల కోరిక మేరకు టీటీడీ ఈ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. వయోవృద్ధులు (65 ఏళ్ల పైబడినవారు), దివ్యాంగులకు సోమవారం ఉదయం 10.00 గంటలకు వెయ్యి, మధ్యాహ్నం 2.00 గంటలకు రెండు వేల టోకెన్లు, 3 గంటలకు వెయ్యి టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. కాగా, ఏడాదిలోపు ఉన్న చంటి పిల్లలకు, వారి తల్లిదండ్రులకు మంగళవారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు సుపథం మార్గం ద్వారా శ్రీవారిని దర్శించుకునేందుకు అనుమతిస్తారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

- ప్రకాశం జిల్లా మార్టూరులో ఘటన
- పంటకు గిట్టుబాటు ధరలేక రూ. 5 లక్షల వరకు అప్పులు
- పండిన పంటతో పెట్టుబడి కూడా రాకపోవడంతో మనస్తాపం
- ఉరివేసుకుని ఉసురుతీసుకున్న అన్నదాత


వీరాంజనేయులు (ఫైల్)

మార్టూరు: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఓ యువ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా మార్టూరులో చోటుచేసుకుంది. బంధువుల సమాచారం మేరకు.. బబ్బేపల్లి గ్రామానికి చెందిన కోటా వీరాంజనేయులు (30) తన కుటుంబానికి ఉన్న 3 ఎకరాల భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. గతంలో వ్యవసాయం కోసం బయటి నుంచి తెచ్చిన అప్పు రూ.2 లక్షల వరకు ఉండటంతో గత ఏడాది భూమిని సొంతంగా సాగు చేసుకోలేక కౌలుకు ఇచ్చాడు. ఈ ఏడాది ద్రోణాదుల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.2 లక్షలు అప్పు తీసుకుని ఒక్కొక్క ఎకరం చొప్పున పత్తి, మినుము, జూట్ పంటలు సాగు చేశాడు. పత్తి ఎకరాకు నాలుగు క్వింటాళ్లు, జూట్ 2 క్వింటాళ్లు, మినుము రెండు క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. పత్తి క్వింటా రూ.4,300 లెక్కన రూ.17,200కు అమ్మాడు. జూట్ ఇంకా అమ్మలేదు. ధర చూస్తే క్వింటా రూ.2,700 మాత్రమే ఉంది. మినుములు క్వింటా రూ.4 వేల చొప్పున రూ.8 వేలకు అమ్మాడు. పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు కూడా రాలేదు. అప్పులు వడ్డీతో కలిపి దాదాపు రూ.5 లక్షల దాకా అయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం భార్యతో పత్తి అమ్మాలని మార్టూరు వరకు వెళ్లి వస్తానని ద్విచక్ర వాహనంపై వెళ్లిన వీరాంజనేయులు మార్టూరులో విగతజీవిగా కనిపించాడు. మార్టూరు కూరగాయల మార్కెట్ సమీపంలోని పొలాల్లో ఉన్న రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలం ఎదురుగా జాతీయ రహదారిపై వీరాంజనేయులుకు చెందిన ద్విచక్ర వాహనం నిలిపి ఉండడంతో అనుమానించిన బంధువులు పరిసరాల్లో గాలించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామంలో సౌమ్యుడు, వివాద రహితుడిగా వీరాంజనేయులుకి పేరుంది. గతంలో వ్యవసాయానికి సంబంధించిన బాకీలు, ప్రస్తుత సంవత్సరం కూడా పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై మృతి చెందినట్లు బంధువులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరికి సేవ వెలకట్టలేనిది

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ బూచిపూడి సాంబశివారెడ్డి
- సిటీ న్యూరో, ఒమెగా హాస్పిటల్స్ వైద్య శిబిరం విజయవంతం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

నకరికల్లు: సొంతూరికి చేసే సేవ వెలకట్టలేనిదని ప్రముఖ వైద్యుడు బూచిపూడి సాంబ శివారెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా నకరికల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిటీ న్యూరో సెంటర్, ఒమెగా హాస్పిటల్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25,00 మందికి నరాలు, ఎముకలు, గుండె, క్యాన్సర్, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ చేజర్ల లాంటి పల్లె నుంచి వచ్చి వృత్తిరీత్యా పట్టణంలో ఉన్నప్పటికీ సొంత ప్రాంతానికి ఎంతో కొంత సేవ చేయాలనే తపన తనకు ఉండేదన్నారు. దీనిలో భాగంగా నరసరావుపేట, నకరికల్లు పరిసర ప్రాంతాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజల కోసం పాఠశాల ఆవరణలో అల్పాహారం, మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వంశీధర్, మధుసూదన్, ప్రకాశ్, శంకర్‌మాధవ్ పాల్గొన్నారు.


బెజవాడలో బొండాగిరి!

▶ మొదటి పేజీ తరువాయి

అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబం నేపథ్యం ఇదీ...

విజయవాడ మొగల్రాజపురానికి చెందిన కసిరెడ్డి సూర్యనారాయణ స్వాతంత్ర్యసమరయోధుడు. అప్పట్లో కర్నూలు జైల్లో మూడేళ్లు శిక్ష అనుభవించారు కూడా. ఆయనకు ప్రభుత్వం 1952లో విజయవాడలోని సింగ్‌నగర్‌లో 10.16 ఎకరాల భూమి కేటాయించింది. ఆయనకు ఇద్దరు కుమారులు. వారిలో వెంకటేశ్వరరావుకు వివాహం కాలేదు. మరో కుమారుడు రామకృష్ణకు వివాహమై పిల్లలు ఉన్నారు. సూర్యనారాయణ కుటుంబం ఆ 10.16 ఎకరాల్లో తమ ఆర్థిక అవసరాల కోసం 5 ఎకరాలను దఫదఫాలుగా విక్రయించగా 5.16 ఎకరాలు మిగిలింది. సూర్యనారాయణ చిన్న కుమారుడు 1981లో, పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు 2013లో చనిపోయారు. ఈ నేపథ్యంలో ఆ భూమిపై విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కన్నుపడింది. ప్రస్తుతం అక్కడ ఎకరా మార్కెట్ విలువ రూ.10కోట్లు పైనే ఉంది. ఆ లెక్కన దాని విలువ రూ.50కోట్లుపైమాటే. అధికార పార్టీ ఎమ్మెల్యేగా బొండా రంగంలోకి దిగి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో తప్పుడు పత్రాలు సృష్టించారు. సూర్యనారాయణ ఇద్దరు కుమారులు వెంకటేశ్వరరావు, రామకృష్ణ తండ్రి ఆస్తిని 1983లో పంపకాలు చేసుకున్నట్లు ఒప్పంద పత్రాలు సృష్టించారు. (వాస్తవానికి రామకృష్ణ 1981లోనే చనిపోయారు.) అనంతరం వెంకటేశ్వరరావు తన వాటా భూమిని 2013లో విజయవాడకు చెందిన అబ్దుల్‌మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావులకు విక్రయించినట్లు మార్చారు. తర్వాత వారిద్దరూ ఆ భూమిని ఎమ్మెల్యే బొండా ఉమా భార్య సుజాతతోపాటు మరో అయిదుగురికి డెవలప్‌మెంట్ కోసం రాసిచ్చినట్లు పత్రాలు సృష్టించారు. ఆ మేరకు విజయవాడ గాంధీనగర్, నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించారు. వెంటనే ఆ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి ఒక షెడ్డు వేసి తన మనుషులను కాపలాగా ఉంచారు.


ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత పేరు మీద అడ్డదారుల్లో సృష్టించిన డాక్యుమెంట్లు

కోటేశ్వరరావును బురిడీ కొట్టించింది ఇలా...


రోదిస్తున్న కోటేశ్వరరావు


ఈ భూమాయ కోసం అబ్దుల్‌మస్తాన్, రామిరెడ్డి కోటేశ్వరరావులను కూడా ఎమ్మెల్యే బొండా పకడ్బందీగా బురిడీ కొట్టించారు. కోటేశ్వరరావు తన ఇంటిని తనఖా పెట్టుకుని అప్పు ఇవ్వాలని ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుడైన కార్పొరేటర్ మహేష్‌ను సంప్రదించారు. అందులో భాగంగా విజయవాడ గాంధీ నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన కోటేశ్వరరావుతో పలు పత్రాలపై సంతకాలు చేయించారు. ఆ తరువాత సాంకేతిక కారణాలతో అప్పు ఇవ్వలేమని చెప్పి పంపించేశారు. ఆ రోజు కోటేశ్వరరావు చేసిన సంతకాలతోనే కథ నడిచింది. వెంకటేశ్వరరావు నుంచి భూమిని కోటేశ్వరరావు కొనుగోలు చేసినట్లు, దాన్నే ఎమ్మెల్యేకు చెందిన సంస్థ రవితేజ బయోటెక్ లిమిటెడ్‌కు డైరెక్టర్‌గా ఉన్న తన భార్య బొండా సుజాతతోపాటు మరో అయిదుగురికి పవర్ ఆఫ్ అటార్నీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు మార్చారు. అతనితో పాటు భూమి రాయించినట్లు ఉన్న మరో వ్యక్తి అబ్దుల్ మస్తాన్ ప్రస్తుతం అనారోగ్యంతో మాట్లాడలేని స్థితిలో ఉన్నారు.

కోటేశ్వరరావుకు బొండా వర్గీయుల బెదిరింపులు

తమ భూబాగోతం బట్టబయలు కావడం, అందులో కోటేశ్వరరావు వాంగ్మూలం కీలకం కావడంతో ఆయనకు బెదిరింపులు మొదలయ్యాయి. తాము చెప్పినట్లు చేస్తే భారీ మొత్తం ఇవ్వడంతోపాటు కేసు నుంచి బయటపడేస్తామని ఆశ చూపుతున్నారు. లేకుంటే అంతు చూస్తామని బొండాకు అత్యంత సన్నిహితుడైన కార్పొరేటర్ గండూరి మహేష్ బెదిరిస్తున్నారు. దాంతో భీతిల్లిన కోటేశ్వరరావు బొండా ఉమా వర్గీయుల నుంచి తనకు రక్షణ కల్పించాలని విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్‌ను ఆదివారం కోరారు.


బొండా ఉమా కబ్జా చేసిన స్థలం ఇదే

మా భూమిని ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం కబ్జా చేసింది



'స్వాతంత్ర్య సమరయోధుడైన మా తాతగారికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఎమ్మెల్యే బొండా ఉమా కుటుంబం కబ్జా చేసింది. సామాన్యులను ఆదుకోవాల్సిన ఎమ్మెల్యే బొండా ఉమానే తన భార్య సుజాత పేరిట భూమి కబ్జా చేస్తే ఇక మాకు దిక్కెవరు? దీనిపై మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి'
– కేసిరెడ్డి సురేష్‌బాబు

వెలుగులోకి వచ్చిందిలా...

తమ భూమికి కంచె వేసిన విషయం తెలుసుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యనారాయణ మనవడు సురేష్‌బాబు (రామకృష్ణ కుమారుడు) అక్కడకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మార్చిలో అక్కడికి వెళ్లిన సురేష్‌పై ఎమ్మెల్యే మనుషులు ఆ భూమి తమదంటూ దౌర్జన్యానికి దిగారు. సురేష్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఆరు నెలల క్రితం సీఐడీ విభాగాన్ని ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. భూమి రాసిచ్చిన కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించారు. అసలు తనకు ఆ భూమి విషయమే తెలీదని... రిజిస్ట్రేషన్ ఎలా చేస్తానని ప్రశ్నించారు. సంతకాలు చూపించగా గతంలో అప్పు కోసం తాను చేసిన సంతకాలను ఇలా వాడుకున్నారని కోటేశ్వరరావుకు అర్థమై అదే విషయాన్ని వారికి చెప్పారు. దీంతో సీఐడీ వారు బొండా ఉమా భార్య సుజాత, ఆయన ప్రధాన అనుచరుడు మాగంటి బాబు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

దౌర్జన్యకాండ.. కబ్జాల పర్వం

రాజధాని అమరావతిలో అధికారపార్టీ నేతల అరాచకాలు

సాక్షి, అమరావతి: కబ్జాలు... దందాలు... సెటిల్మెంట్లు... ఇవీ రాష్ట్ర రాజధాని అమరావతిలో టీడీపీ నేతల వ్యవహారాలు. అధికారపక్ష నేతలు, వారి అండతో అనుచరులు పెట్రేగిపోతున్నారు. తాజాగా మరో అక్రమాలపర్వం బయటపడటంతో అధికారపక్షం నేతల దందాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీశాయి. స్వాతంత్ర్య సమరయోధుడి భూమి కబ్జా ఆరోపణలపై విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి సుజాత, ఆయన ప్రధాన అనుచరుడు మాగంటి రాంబాబుపై కేసు నమోదు కావడం ప్రజల్ని ఆశ్చర్యానికి గురిచేసింది. మాగంటి రాంబాబు గతంలో ఒక దాడి కేసులో ప్రధాన నిందితుడు. 2011 జూన్ 27న ఆర్టీఏ ఏజెంటు బండారు రంగారావు మృతి కేసులో ఇటీవల విజయవాడ కోర్టు మాగంటి రాంబాబుకు ఏడాది జైలు శిక్ష కూడా విధించింది. రాంబాబు బెయిల్‌పై తిరుగుతూ దందాలు చేస్తుండటం గమనార్హం. గతేడాది ఎమ్మెల్యే బొండా ఉమ అనుచరుల దారుణంతో 13 ఏళ్ల చిన్నారి మాదంశెట్టి సాయిశ్రీ వైద్యసేవలు కూడా అందక బలైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం విదితమే. బెజవాడలో ఉన్న తమ ప్లాట్‌ను బొండా అనుచరులు కబ్జా చేశారని, న్యాయం చేయాలని చిన్నారి సాయిశ్రీ, ఆమె తల్లి సుమశ్రీ వేడుకున్నా ఫలితం లేకపోయింది.

దేవినేని పేరుతో కొందరు..

రాజధాని అమరావతిలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో కొందరు దందాలు, సెటిల్మెంట్లు చేస్తున్నారు. తాజాగా మంత్రి ఉమ, ఆయన అనుచరుల నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ అట్లూరి ప్రవిజ, సురేష్ దంపతులు డీజీపీకి ఫిర్యాదు చేశారు. కృష్ణా జిల్లా పోరంకిలోని భూ వివాదంలో జోక్యం చేసుకున్న మంత్రి, ఆయన అనుచరులు తమను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆ దంపతులు కొద్ది రోజుల క్రితం విజయవాడ సూర్యారావుపేట, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణా జిల్లాలోని పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు భూఆక్రమణ, అక్రమ లేఅవుట్ల విషయం విజిలెన్స్ విచారణలో నిగ్గుతేలడంతో ఇటీవల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఆరుగురు సస్పెండ్ అయ్యారు.

పరిటాల అనుచరులమంటూ..

మంత్రి పరిటాల సునీత తనయుడు శ్రీరామ్ అనుచరులు కూడా బెజవాడలో మకాం వేశారు. వివాదాస్పద భూములు, భవంతుల విషయంలో సెటిల్మెంట్లు చేస్తున్న వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్లింది. గతేడాది గాంధీనగర్ ప్రాంతంలో ఒక భవనంలో అద్దెకు ఉంటున్న వ్యక్తిని బెదిరించగా.. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. రాయలసీమ టీడీపీ నేతల వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు రూపొందించినట్లు సమాచారం. టీడీపీ నేతల అండతో సాగుతున్న సెటిల్మెంట్లు, దందాలతో రాజధాని ప్రాంతంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

'వాక్ విత్ జగనన్న' నేడే

- కార్యక్రమ నిర్వహణకు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఏర్పాట్లు
- నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో నేడు వెయ్యి కి.మీ. పాదయాత్ర పూర్తిచేయనున్న వైఎస్ జగన్
- నవరత్నాలకు మరింత ప్రచారం
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కదనోత్సవం

సాక్షి, అమరావతి/రాజంపేట/బెంగళూరు: రాష్ట్ర ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులు స్వయంగా తెలుసుకోవడానికి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని అధిగమిస్తున్న నేపథ్యంలో 'వాక్ విత్ జగనన్న' (జగనన్నతో కలిసి నడుద్దాం) కార్యక్రమాన్ని సోమవారం భారీఎత్తున నిర్వహించడానికి రంగం సిద్ధమైంది. ఏపీ, తెలంగాణ తో పాటు దేశంలోని పలు నగరాల్లోనూ ఈ కార్యక్రమం జరగనున్నది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది నవంబరు 6న ఇడుపులపాయలోని తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద నుంచి కాలినడకన రాష్ట్ర పర్యటనకు బయల్దేరిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆయన వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పాదయాత్ర పూర్తిచేసుకుని నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించారు. 74వ రోజు అయిన సోమవారం నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో జగన్ 1000 కిలోమీటర్ల యాత్రను పూర్తిచేసుకోనున్నారు. మూడో వంతు యాత్ర అవలీలగా పూర్తిచేయడం పట్ల పార్టీ వర్గాలకు ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ నేపథ్యంలో 'వాక్ విత్ జగనన్న' నిర్వహించాలని పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపునివ్వడంతో దానిని భారీఎత్తున విజయవంతం చేయాలని శ్రేణులు ముందుకు కదులుతున్నాయి. 29న దాదాపు ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ వేల సంఖ్యలో కార్యకర్తలు ఎక్కడికక్కడ జగన్‌కు సంఘీభావం తెలపాలన్న కృతనిశ్చయంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


వైఎస్సార్ జిల్లాలో వాక్ విత్ జగనన్న కార్యక్రమంలో ఆకేపాటి, సురేష్‌బాబు, అంజాద్‌బాష తదితరులు

'నవరత్నాలు'కు విస్తృత ప్రాచుర్యం

జగన్ ప్రకటించిన 'నవరత్నాలు' విశేషాలను పార్టీ శ్రేణులు 'వాక్ విత్ జగనన్న' ద్వారా ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లనున్నాయి. జిల్లాల వారీగా స్థానిక సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్లు, ఇతర నేతలు ఈ కార్యక్రమ నిర్వహణకు సిద్ధమయ్యారు. కాగా, నెల్లూరు జిల్లాలో సోమవారం జగన్ 1000 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయ్యే ప్రదేశంలో పండుగ వాతావరణం నెలకొంది. చెన్నై, పుణే నగరాల్లో ఆదివారమే 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమాలు జరిగాయి. పార్టీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో ఒకరోజు ముందుగానే ఈ కార్యక్రమం జరిగింది.

ప్రజాసంకల్ప యాత్రకు బ్రహ్మరథం: ఆకేపాటి


రాజంపేట: జననేత జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం చెర్లోపల్లె వద్దనున్న వినాయకుని గుడి నుంచి ఒంటిమిట్ట కోదండ రామాలయం వరకు ఆదివారం ఆయన 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప మేయరు సురేష్‌బాబు, ఎమ్మెల్యే అంజద్ బాషా, జడ్పీ వైస్‌చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ నేతలు ఆకేపాటి వేణుగోపాలరెడ్డి, గోపిరెడ్డి, భాస్కరరాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

బెంగళూరులో సంఘీభావ యాత్ర

సాక్షి, బెంగళూరు: వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు మద్దతుగా ఆదివారం బెంగళూరులో సంఘీభావ యాత్ర చేపట్టారు. యాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంలో 'వాక్ విత్ జగనన్న' పేరుతో ఈ యాత్ర నిర్వహించారు. నగరంలోని పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు మారతహళ్లి కృతుంగా రెస్టారెంట్ నుంచి అభిమానులు యాత్ర సాగించారు. పలమనేరు నియోజకవర్గ సమన్వయకర్త రాకేష్‌రెడ్డి ఈ యాత్రను ప్రారంభించారు.

మద్దతు ధర ఏటా 20% పెంచాలి

- అప్పుడే వచ్చే ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు
- అఖిలపక్ష భేటీలో కేంద్రాన్ని కోరిన ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం అందుకు అనుగుణంగా పంట దిగుబడులకు ఏటా కనీస మద్దతు ధర 20% పెంచాలని కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి కోరారు. సోమవారం నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. గతేడాది బడ్జెట్ సందర్భంగా వచ్చే ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే కేంద్రం లక్ష్యమని ఆర్థిక మంత్రి ప్రకటన చేశారన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి ఏడాది ప్రాంత స్వభావాన్ని బట్టి రైతులు పండించే పంటలకు 20% కనీస మద్దతు ధర పెంచాలని, అప్పుడే రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యాన్ని చేరుకోగలమని కేంద్రానికి వివరించారు. ఒక శాతం ధర పెంచడం వల్ల లక్ష్యానికి చేరుకోలేమన్నారు.

హోదాపై పునరాలోచించండి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత ఏటా రూ. 80 వేల కోట్ల ఎగుమతులు కలిగిన సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, సినీ పరిశ్రమ, ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సుమారు 90% వరకు తెలంగాణలోనే ఉండడం వల్ల ఏపీ కేవలం వ్యవసాయంపై ఆధారపడే రాష్ట్రంగా మిగిలిపోయిందని విజయసాయిరెడ్డి వివరించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని కేంద్రం చేసిన ప్రకటనపై పునరాలోచన చేయాలని కోరారు. అలాగే విభజన హామీల అమలుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర పార్టీలోకి ఫిరాయించిన ప్రజాప్రతినిధులపై ఫిర్యాదులు అందిన వెంటనే నిర్ణీత కాలవ్యవధిలో పార్లమెంటు, అసెంబ్లీ స్పీకర్లు చర్యలు తీసుకొనేలా చట్టాన్ని తీసుకురావాల్సిందిగా కోరినట్టు ఆయన మీడియాకు తెలిపారు. జనాభా ప్రాతిపదికన మహిళలకు చట్టసభల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రవేశపెట్టిన ప్రైవేటు మెంబర్ బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

- కర్నూలులో ఘటన
- బైరెడ్డి అనుచరులపై పోలీసులకు ఫిర్యాదు

కర్నూలు (కొండారెడ్డి ఫోర్ట్): వైఎస్సార్‌సీపీ నేత రఘురామిరెడ్డిపై ప్రత్యర్థులు కర్నూలులో ఆదివారం హత్యాయత్నం చేశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం కోనేటమ్మపల్లికి చెందిన రఘురామిరెడ్డి నగరంలోని ఓ దాబా వద్ద తన అనుచరులు జగదీశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలతో ఉన్నాడు. ఇంతలో మాస్కులు ధరించిన ఐదారుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి కత్తులు, రాడ్లతో రఘురామిరెడ్డిపై దాడి చేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఈ దాడిలో జగదీశ్వరరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రఘురామిరెడ్డిని కర్నూలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. తనపై దాడికి పాల్పడింది మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అనుచరులేనని బాధితుడు డీఎస్పీ ఖాదర్‌బాషాకు వాంగ్మూలం ఇచ్చాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యా పథకాల కుదింపు

- ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ, టీచర్ ఎడ్యుకేషన్‌పథకాలు విలీనం
- రాష్ట్రాల సలహాలు, సూచనలను కోరిన కేంద్రం
- ఒకే పథకంగా అమలుకు 30న జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: వివిధ విద్యా పథకాలను విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాల విద్యలో కీలక సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), ఉపాధ్యాయ విద్య, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) పథకాలను విలీనం చేయాలని నిర్ణయించింది. ఆ మూడింటినీ కలిపి ఇకపై ఒకే సమగ్ర విద్యా పథకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రాల అభిప్రాయాలు, సలహాలు కోరింది. త్వరలో ఆ మూడింటి స్థానంలో ఒకే సమగ్ర విద్యా పథకం అమల్లోకి రానుంది.

ప్రయోజనాలు చేకూరడం లేదని గుర్తించిన కేంద్రం

ఆర్ఎంఎస్ఏ మినహా మిగతా రెండు పథకాల వల్ల గత 15 ఏళ్లుగా ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదు. నాణ్యమైన విద్య అనేది ఇప్పటికీ చాలెంజ్‌గానే మిగిలిపోయిందన్న వాస్తవాన్ని కేంద్రం గుర్తించింది. ఏటా నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే వంటి అధ్యయనాల్లో ఇప్పటికీ విద్యార్థులకు సరైన చదువు రావడం లేదన్న విషయం వెల్లడైంది. పైగా ప్రాథమిక విద్యకు ఒక పథకం, సెకండరీ విద్యకు మరో పథకం, ఉపాధ్యాయ విద్యకు ఇంకో పథకం.. ఇలా వేర్వేరు పథకాలు ప్రవేశపెట్టినా ప్రయోజనం ఉండటం లేదన్న వాస్తవాన్ని గ్రహించింది. ఒక్కో పథకానికి వేర్వేరు ఉన్నతాధికారుల విధానం ఒక సమస్య కాగా, వాటి మధ్య సమన్వయ లోపం మరో సమస్యగా మారిందన్న వాస్తవాన్ని గుర్తించింది.

సమగ్ర విద్యా పథకంపై దృష్టి

కేంద్రం సమగ్ర విద్యా విధానం తీసుకు రావాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో కొనసాగిస్తున్న పాఠశాల విద్యలోని మూడు కీలక పథకాలను ఒకే పథకం కింద అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, సమగ్ర విద్యా పథకం రూపొందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నెల 30వ తేదీన అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో జాతీయ సదస్సును నిర్వహించాలని నిర్ణయించింది. అంతేకాదు రాష్ట్రాల నుంచి సలహాలు, సూచనల స్వీకరణకు చర్యలు చేపట్టింది. రాష్ట్రాల అధికారులు తమ సలహాలు, సూచనలను మెయిల్ ద్వారా ఎంహెచ్ఆర్‌డీ జాయింట్ సెక్రటరీ మనీశ్ గార్గ్‌కు, డైరెక్టర్ సురబీ జైన్‌కు పంపించాలని పేర్కొంది.



ఆ ప్రొఫెసర్‌ను తొలగించాలి


- జేఎన్‌టీయూకే వద్ద ఎంటెక్ విద్యార్థుల ఆందోళన
- ప్రొఫెసర్ బాబులును తాత్కాలికంగా విధుల నుంచి తప్పించిన వీసీ

కాకినాడ/బాలాజీచెరువు: ఎంటెక్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన జేఎన్‌టీయూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఎస్‌టీ) డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాబులును తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆదివారం ఆందోళనకు దిగారు. కాకినాడలోని జేఎన్‌టీయూకే ప్రధాన ద్వారం వద్ద దాదాపు 200 మంది ఎంటెక్ విద్యార్థినీ విద్యార్థులు బైఠాయించి ప్రొఫెసర్ బాబులుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పలువురు విద్యార్థులు విలేకర్లతో మాట్లాడుతూ, విద్యార్థినులను, ప్రొఫెసర్ బాబులును వేర్వేరుగా విచారించడాన్ని వ్యతిరేకించారు. ఆందోళన నేపథ్యంలో వైస్ ఛాన్సలర్ వీఎస్ఎస్ కుమార్, రెక్టార్ పూర్ణానందం విద్యార్థుల వద్దకు వచ్చి చర్చించారు. వీసీ మాట్లాడుతూ, లైంగిక వేధింపుల ఫిర్యాదుపై ఐదుగురు సభ్యుల కమిటీ విచారణ జరుపుతోందని, నివేదిక వచ్చిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రొఫెసర్ బాబులును రెక్టార్ పూర్ణానందం అధ్యక్షతన ఏర్పాటైన ఐదుగురు సభ్యుల కమిటీ ఆదివారం విచారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ బాబులును ఐఎస్‌టీ డైరెక్టర్ పదవితోపాటు, ఎంటెక్ కోర్సు విధుల నుంచి తప్పిస్తూ వీసీ కుమార్ ఆదివారం రాత్రి నిర్ణయం తీసుకున్నారు.

మల్టీప్లెక్స్‌ల్లో పార్కింగ్ చార్జీలు లేవు

- పార్కింగ్ బాదుడుపై స్థానిక సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు
- సమాచార హక్కు చట్టం కింద పట్టణ ప్రణాళికా శాఖ వెల్లడి
- కోర్టు తీర్పులున్నా మల్టీప్లెక్సులు పార్కింగ్ చార్జీల వసూళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని థియేటర్లు, మల్టీప్లెక్స్ కాంప్లెక్సులు, మల్టీప్లెక్స్ థియేటర్లలోని పార్కింగ్ చార్జీల వసూళ్లకు చెక్ పడింది. పార్కింగ్ చార్జీలు వసూలు చేయరాదని గతంలో న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినా యాజమాన్యాలు పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా మల్టీప్లెక్స్ కాంప్లెక్సుల్లో వస్తువుల కొనుగోలుకు వెళ్లిన వాహనదారుల నుంచి యాజమాన్యాలు ముక్కుపిండి మరీ చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇక మల్టీప్లెక్స్ థియేటర్లు, సాధారణ థియేటర్లు ఇష్టం వచ్చిన రీతిలో పార్కింగ్ చార్జీలను వసూలు చేస్తున్నాయి. విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో ఇవి మరింత భారంగా ఉన్నాయనే అభిప్రాయాన్ని వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం థియేటర్ల యాజమాన్యాలు మోటారు సైకిళ్లకు రూ. 20, కార్లకు రూ. 40, ఆటోలకు రూ. 30, సైకిళ్లకు రూ.10 చొప్పున పార్కింగ్ చార్జీలుగా వసూలు చేస్తున్నాయి. రాష్ట్రంలో 16 మల్టీప్లెక్స్‌లలో 58 స్క్రీన్‌లు, 2,809 థియేటర్లు ఉన్నాయి. పార్కింగ్ చార్జీలు వసూలు చేయరాదనే కోర్టు తీర్పులున్న విషయం వాహనదారులకు తెలియకపోవడం, చార్జీల బాదుడును నియంత్రించాల్సిన స్థానిక సంస్థలు పట్టించుకోకపోవడంతో పార్కింగ్ మాఫియా దందా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన న్యాయవాది వి.హరనాథ్‌బాబు సమాచార హక్కు చట్టం కింద పార్కింగ్ చార్జీల వివరాలు కోరుతూ రాష్ట్ర పట్టణ, ప్రణాళికశాఖ సంచాలకులకు ఈ నెల 10న అర్జీ పెట్టారు. దీనిపై ఆ శాఖకు చెందిన ప్రజా సమాచార అధికారి స్పందిస్తూ, పార్కింగ్ ఫీజులు వసూలు చేసేలా ఎటువంటి నియమ నిబంధనలు, ఉత్తర్వులు లేవంటూ హరనాథ్‌బాబుకు వివరణ ఇచ్చారు. పార్కింగ్ చార్జీలను వసూలు చేస్తున్న మల్టీప్లెక్సులు, థియేటర్లపై స్థానిక సంస్థలకు వాహనదారులు ఫిర్యాదు చేయవచ్చని ఆ లేఖలో స్పష్టం చేశారు. కాగా, పార్కింగ్ చార్జీలు వసూలు చేయరాదని 2003 మే నెలలో హైకోర్టు తీర్పునిచ్చిందని, సిహెచ్ మదన్ మోహన్ అండ్ అదర్స్ వర్సెస్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ కేసులో మల్టీప్లెక్స్ యాజమాన్యాలు, మల్టీప్లెక్స్ థియేటర్లు, సాధారణ థియేటర్లు పార్కింగ్ చార్జీలు వసూలు చేయకూడదనే తీర్పు ఉందని హరనాథ్‌బాబు స్పష్టం చేశారు.



రాష్ట్ర పట్టణ, ప్రణాళికశాఖ సంచాలకులు పార్కింగ్ చార్జీలపై ఇచ్చిన వివరాలు

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ నాగార్జునరెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.భవానీ సుబ్బరామన్, రాష్ట్ర లా సెక్రటరీ వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని అంతరాలయంలో అష్టోత్తర పూజలు, గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. తర్వాత వీరికి అర్చకులు ఆశీర్వచనం చేయగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

జగన్ సీఎం కావాలని నాగోల్‌లో యాగం



సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ప్రార్థిస్తూ గుంటూరు జిల్లాకు చెందిన డాక్టర్ ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి చేపట్టిన మహారుద్ర సహిత సహస్ర చండీ యాగ మహోత్సవం వైభవంగా సాగుతోంది. ఈ యాగాన్ని నాగోలులోని స్నేహపురి కాలనీలో గతేడాది జూలై 29న ప్రారంభించారు. ఆదివారం 200వ రుద్రహోమం జరిగింది. మహారుద్రంతో అభిషేకం చేశారు. చండీ పారాయణ చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా లఘు పూర్ణాహుతి నిర్వహించారు. నెల్లూరులో ప్రజా సంకల్పయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం కలిసి యాగ ప్రసాదాన్ని అందజేస్తామని వేద పండితుడు ప్రతాపశర్మ తెలిపారు. కార్యక్రమంలో 11 మంది వేద పండితులు, యాగ నిర్వాహకుడు వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఓటు అడిగేందుకు రాలేదు

- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- అనంత పరిస్థితి అధ్యయనం చేసేందుకే వచ్చా


పరిటాల సునీత ఇంట్లో మాట్లాడుతున్న పవన్

కదిరి/అనంతపురం/నల్లమాడ: 'జనసేన పార్టీకి ఓట్లు వేయమని అడిగేందుకు నేను రాలేదు. ఇక్కడి పరిస్థితులు అధ్యయనం చేసేందుకు వచ్చాను. సమస్యలు పరిష్కారం కోసం ఏ అధికారిని అడిగినా మా డిపార్ట్‌మెంట్‌లో నిధులు లేవని చెబుతున్నారు. అనంతపురం జిల్లా బాగా వెనుకబడింది. ఈ జిల్లాలో నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రధాని నరేంద్ర మోదీకి ఓ నివేదిక రూపంలో సమర్పిస్తాను. ప్రజలు కూడా నాయకులను నిలదీసేందుకు సిద్ధంగా ఉండాలి. నన్ను కూడా నిలదీయండి' అని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం ఆయన అనంతపురం జిల్లా కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో పర్యటించారు. కదిరిలో రోడ్‌షో అనంతరం స్థానిక ఓ హోటల్‌లో మహిళలతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. పలువురు మహిళలు చంద్రబాబు సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు నయాపైసా కూడా చంద్రబాబు సర్కార్ సాయం చేయలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ స్పందిస్తూ.. తెలంగాణలో కేసీఆర్ సర్కారు కొంత మెరుగ్గా స్పందిస్తోందన్నారు. అనంతరం ఖాద్రీ లక్ష్మీ నరసింహుని పవన్ దర్శించుకున్నారు. సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు.

పరిటాల ఇంటికి పవన్: పవన్ కల్యాణ్ మంత్రి పరిటాల సునీత నివాసానికి వెళ్లి అల్పాహారం తీసుకున్నారు. మంత్రి సునీత, తనయుడు శ్రీరామ్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో కరువు పరిస్థితులపై అధ్యయనం చేయడంలో భాగంగా మంత్రిని కలిశానని పవన్ తెలిపారు. ఎన్నికల్లో టీడీపీతో పొత్తు విషయంపై ప్రజల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటామని పవన్ సమాధానమిచ్చారు. మంత్రితో భేటీ అనంతరం పవన్ వైఎస్సార్‌సీపీలో గెలిచి టీడీపీలోకి ఫిరాయించిన కదిరి ఎమ్మెల్యే చాంద్‌బాషా ఇంటికి వెళ్లి పలకరించి వచ్చారు. పవన్ కదిరి నుంచి నల్లమాడ మీదుగా పుట్టపర్తికి వెళుతుండగా కాన్వాయ్ నల్లమాడలోని వైఎస్సార్ కూడలికి చేరుకోగానే తోపులాటలో వడ్డె మహేష్ అనే యువకుడు కింద పడిపోయాడు. కాన్వాయ్‌లోని వాహనం యువకుడిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహేష్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు.

సూర్యుడు ముందు ఉదయించేది ఏపీలోనే

- సూర్యారాధన అనేది ఒక సైన్స్
- సూర్యుడిని ఆరాధించడం వల్ల ఆస్పత్రులకు వెళ్లక్కర్లేదు
- సూర్యారాధన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు


సూర్య నమస్కారం చేస్తున్న సీఎం చంద్రబాబు

విజయవాడ స్పోర్ట్స్: చరిత్రలో మొదటి సారిగా ప్రభుత్వం తరపున ప్రకృతిని ఆరాధించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. భారత దేశంలో మొదటిగా ఆంధ్రప్రదేశ్‌లోనే సూర్యుడు ఉదయిస్తాడని, ఆ తర్వాతే ఇతర రాష్ట్రాలకు సూర్యోదయం జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. సూర్యారాధన మతం కాదని, సైన్స్ అని అన్నారు. కులమతాలకు అతీతంగా సూర్యారాధన కొనసాగించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన సూర్యారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సూర్యారాధనను జీవితంలో భాగంగా చేసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఫిట్‌గా తయారై ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ప్రతి మతంలోనూ వివిధ పద్ధతుల్లో సూర్యారాధన జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న మాదిరిగానే సూర్యారాధనను రాష్ట్ర స్థాయి ఉత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒక చైతన్య స్ఫూర్తిగా సూర్యభగవానుడు ప్రజలకు 24 గంటలు ప్రపంచంలోనే ఏదో ఒక ప్రాంతానికి సూర్యశక్తిని అందిస్తూనే ఉన్నాడని తెలిపారు. సూర్యుడు పెద్ద శక్తి కేంద్రంగా వేల నక్షత్రాలలో మహానక్షత్రంగా వెలుగొందుతున్నాడని తెలిపారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా సూర్యుడిని ఆరాధిస్తున్నారన్నారు. సూర్యరశ్మి వల్ల బ్రెస్ట్ క్యాన్సర్, బాక్టీరియాలు నశించిపోతాయన్నారు. కొలస్ట్రాల్ తగ్గడం, బీపీ కంట్రోల్‌గా ఉండడం, డి విటమిన్ లభించడం జరుగుతుందన్నారు. సూర్యారాధన ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ప్రతి రోజూ కనీసం 15 నిమిషాలు సూర్యభగవానునితో వివిధ రకాలుగా మమేకం అయితే తిరుగుండదని పేర్కొన్నారు. ముందుగా అన్ని మతాల పెద్దలతో సూర్యారాధనపై వారి వారి ప్రవచనాలు చెప్పించి శాంతి సూక్తులు అందజేశారు. విద్యార్థులతో సూర్యనమస్కారం చేయించారు. కార్యక్రమంలో మంత్రి దేవినేని ఉమా, ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, బోడే ప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులు హాజరయ్యారు.

గురువుల దీవెనలతోనే ఈ స్థాయికొచ్చాం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.భట్


గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు, హైకోర్టు జడ్జి

మదనపల్లె టౌన్: గురువుల దీవెనలతో ఈ స్థాయికి ఎదిగామని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.భట్ అన్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలోని బీసెంట్ థియో సాఫికల్ (బి.టి) కళాశాలలో ఆదివారం 1983 బ్యాచ్ నాటి బి.కామ్ విద్యార్థులు సమావేశమయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.భట్ కూడా హాజరయ్యారు. ముందుగా అప్పటి అధ్యాపకులు నూర్‌మహమ్మద్, వెంకటశివనాయుడు, ఎం.వెంకటరమణ, కిజర్‌మహ్మద్, మధుసూదన్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. గురువుల వెల కట్టలేమని, వారిచ్చిన స్ఫూర్తి, ధైర్యం, జ్ఞానంతోనే ఈ స్థాయికి ఎదిగామని తెలిపారు. చదువుకున్న కళాశాల రుణం తీర్చుకోవాలన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, సిద్ధార్థశివ, శ్రీనివాస్, మురళి, మోడెం వెంకటరమణ, గార్ల శ్రీనివాసులు, వలసపల్లె ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


సాక్షి ఇండియా స్పెల్‌బీ-1 విజేతలు

సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ

కేటగిరీ-1 విజేతలు వీరే

SAKSHI INDIA SPELL Bee | MATH BEE | Dukes Waffy presents SAKSHI arena one School fest | DELHI PUBLIC SCHOOL

హైదరాబాద్: 'సాక్షి' మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ-2017 (కేటగిరీ-1, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం) విజేతలను ప్రకటించారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు ఎంతో ఉత్కంఠగా కొనసాగాయి. చివరగా నిర్వహించిన ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విజేతలు, వారి తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషపై, మ్యాథ్స్ విషయంలో అంతర్గతంగా ఉన్న భయాలు పోగొట్టి, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడంతో పాటు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఈ పోటీలు కలిగించాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాక్షి యజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

స్పెల్‌బీ విజేతలు వీరే: సాక్షి స్పెల్‌బీ పోటీల్లో ప్రథమ బహుమతిని రాజమండ్రిలోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న రక్ష టికురు కైవసం చేసుకున్నారు. రక్షకు బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ విజేతలు వీరే: సాక్షి మ్యాథ్‌బీ పోటీల్లో ప్రథమ బహుమతిని అనంతపూర్‌లోని విశ్వభారతి స్కూల్‌లో చదువుతున్న కె.లహరి కైవసం చేసుకున్నారు. లహరికి బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ ద్వితీయ బహుమతి: రాజమండ్రిలోని ఆదిత్య స్కూల్, శ్రీనగర్‌లో చదువుతున్న బి.రాహుల్ నాయక్ కైవసం చేసుకున్నారు. రాహుల్ నాయక్‌కు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ ద్వితీయ బహుమతి: అనంతపూర్‌లోని విశ్వభారతి స్కూల్‌లో చదువుతున్న పి.వెన్నెల కైవసం చేసుకున్నారు. వెన్నెలకు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ తృతీయ బహుమతి: రాజమండ్రిలోని శ్రీ గౌతమి స్మార్ట్స్ స్కూల్‌లో చదువుతున్న బి.శ్రీలాస్య కైవసం చేసుకున్నారు. విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000లు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ తృతీయ బహుమతి: తృతీయ బహుమతిని కడపలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న కె.దస్తగిరమ్మ, అలాగే రాజమండ్రిలోని ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న టి.హితీషలు సంయుక్తంగా కైవసం చేసుకున్నారు. విజేతలకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000లు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.


సాక్షి మ్యాథ్‌బీ విజేతలు

సమర్థ రాజకీయ వారసులను సమర్థించవచ్చు

- న్యాయమూర్తిని కాకముందు ఒక రాజకీయ పార్టీతో సంబంధం ఉంది
- డిక్లరేషన్‌లో ఈ విషయం పేర్కొన్నా
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



సాక్షి, అమరావతి బ్యూరో/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): సమర్థులైన రాజకీయ వారసులను సమర్థించవచ్చని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో 'ప్రజాస్వామ్యం- పౌర సమాజ బాధ్యతలు' అంశంపై ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో పేర్కొన్న అంశాల్లో సమానత్వ హక్కు ముఖ్యమైందని చెప్పారు. మన దేశంలో మతం, కులం, భాష, ఆర్థిక పరంగా అసమానతలున్నాయని తెలిపారు. అగ్రరాజ్యమైన అమెరికాలో కూడా అసమానతలు ఉన్నాయన్నారు. పౌర సమాజం బాధ్యతగా ఉండి రాజ్యాంగంలోని అంశాలను గౌరవించి, పాటించినప్పుడే దానికి విలువ ఉంటుందన్నారు. సోషల్ మీడియా ద్వారా భావ ప్రకటనకు ఎలాంటి నియంత్రణలు లేవని చెప్పారు. అయితే మనం చెప్పే అభిప్రాయం హేతుబద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమేనని, ఒక ఎన్నికల్లో రెండు సీట్లు వచ్చిన పార్టీ మరో ఎన్నికల్లో 200 సీట్లు పొంది అధికారంలోకి రావచ్చునని తెలిపారు. తాను ఒక రాజకీయ పార్టీకి చెందినవాడినని అందువల్లే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నానని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని మిత్రులు తన దృష్టికి తెచ్చారని జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. దేశంలో ఎక్కడైనా జడ్జిగా బాధ్యతలు స్వీకరించే ముందు ఇచ్చే డిక్లరేషన్‌లో 'మీకు రాజకీయ పార్టీతో సంబంధం ఉందా' అనే కాలమ్ ఉంటుందని చెప్పారు. తనకు రాజకీయ పార్టీతో అనుబంధం ఉండేదనే విషయాన్ని ఆ కాలమ్‌లో పేర్కొన్నానని వెల్లడించారు. న్యాయమూర్తి అయ్యాక ఆ రాజకీయ పార్టీతో సంబంధాన్ని వదులుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా జడ్జి జస్టిస్ సత్యనారాయణరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, వి.డి.సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ వి.హెచ్.దివాకర్ బాబు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్ర పథకాలు

రాష్ట్రం పైసా కూడా ఇవ్వడం లేదు: సోము వీర్రాజు

జియ్యమ్మవలస: ఎన్టీఆర్ జలసిరి, చంద్రన్న బీమా అంటూ డబ్బాకొట్టుకుంటున్న పథకాలకు రాష్ట్రం ఒక్కపైసా కూడా కేటాయించడం లేదని, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వమే రూ.170 కోట్లు కేటాయించిందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలో ఆదివారం నిర్వహించిన బూత్ కమిటీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇస్తున్న నిధులను చంద్రబాబు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి 24 గంటల విద్యుత్ సరఫరా మోదీ ఘనత అన్నారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ చేసిన మోసాన్ని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. మిత్ర ధర్మం పాటిస్తున్నా టీడీపీ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కురుపాంలో సొంతంగా పార్టీ అభ్యర్థిని బరిలోకి దించుతామని స్పష్టం చేశారు.

'దేవాలయాల నిర్వహణ చేతకాకపోతే మాకు అప్పగించండి'



బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): దేవాలయాల నిర్వహణ చేతకాకపోతే తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి సూచించారు. రాష్ట్రీయ హిందూ సేన ఆధ్వర్యంలో కాకినాడలో ఆదివారం నిర్వహించిన హిందూ ధర్మ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇష్టానుసారం దేవాలయాలను కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో దేవాలయాల్లో అన్నదానం, ఉచితంగా వైద్యం చేసేవారని.. ప్రస్తుతం దేవాలయాలు కో'వెల'గా మారాయని ఎద్దేవా చేశారు. దేవాలయాల్లో భక్తులు వేస్తున్న డబ్బులు ఏమైపోతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

18 ఏళ్ల లోపు యువతితో లైంగిక చర్య అత్యాచారమే

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాదరావు



బొబ్బిలి: పద్దెనిమిదేళ్లు నిండని యువతితో లైంగిక చర్య అత్యాచారం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు ఓ కేసులో తీర్పు ఇచ్చిందని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు తెలిపారు. ఆదివారం బొబ్బిలిలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. జువనైల్ చట్టం ప్రకారం కొన్ని కేసుల్లో 18 ఏళ్లలోపు యువతులతో లైంగిక చర్యలు తీవ్ర నేరంగా పరిగణిస్తున్నామని, మరికొన్ని కేసుల్లో మాత్రం పెళ్లయిన యువతులకు 18 ఏళ్లు నిండకపోయినా మినహాయింపు ఉంటోందన్నారు. దీని వల్ల తల్లిదండ్రులు సైతం బాల్య వివాహాలకు మొగ్గుచూపే ప్రమాదం ఉందన్నారు. పెళ్లయినా, కాకపోయినా లైంగిక చర్యల విషయంలో 18 ఏళ్లు నిండకపోతే అత్యాచారంగా పరిగణించాలని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమన్నారు.

రైళ్లలో సీసీ కెమెరాలు

- దేశవ్యాప్తంగా 11వేల రైళ్లలో 12 లక్షల కెమెరాల ఏర్పాటుకు కసరత్తు
- ఒక్కో కోచ్‌లో 8 కెమెరాలు..

సాక్షి, అమరావతి: రైళ్లలో పెరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసి, ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేసేందుకు భారతీయ రైల్వే నిర్ణయించింది. దేశంలో మొత్తం 11వేల రైళ్లలో 12 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకు రైల్వే బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. అలాగే, తమ పరిధిలోని అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కూడా సీసీ కెమెరాలు అమర్చేందుకు నిధులు కేటాయించాలని దక్షిణ మధ్య రైల్వే ఇటీవలే తన ప్రతిపాదనలు పంపింది. రైళ్లలో విధులు నిర్వహించేందుకు ఆయా జిల్లాల పరిధిలో ఎస్పీలు అవసరమైన మేర సిబ్బందిని పంపించడంలేదు. అలాగే, ఆర్పీఎఫ్‌లోనూ సిబ్బంది కొరతతో రైళ్లలో బందోబస్తుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైల్వే నేరాల్లో ఏపీ ఆరో స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా మొత్తం 11వేల రైళ్లలో 12 లక్షల సీసీ కెమెరాల ఏర్పాటుకు రైల్వే బోర్డు యోచిస్తోంది. అంతేకాక, 8,500 రైల్వేస్టేషన్లలో కూడా కెమెరాలను ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇందుకోసం రాబోయే బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించనున్నట్లు రైల్వే శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

ఒక్కో కోచ్‌లో 8 కెమెరాలు

ప్రయాణికుల భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా ఒక్కో కోచ్‌లో ఎనిమిది కెమెరాలు ఏర్పాటుచేసే అవకాశముంది. ప్రస్తుతం దేశంలో 395 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 50 రైల్వేస్టేషన్లలో మాత్రమే సీసీటీవీల మానిటరింగ్ ఉంది. ఏపీలో విజయవాడ, విశాఖ, తిరుపతి, గుంటూరు రైల్వేస్టేషన్లలో ఇప్పటికీ ఆ వ్యవస్థ ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో సీసీ టీవీల ఏర్పాటుకు దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించింది. వీటి పర్యవేక్షణ బాధ్యత ఆర్పీఎఫ్‌కు అప్పగించనున్నట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీలపై ఆయా స్టేషన్ మాస్టర్లకు కూడా నియంత్రణాధికారాలు ఇవ్వనున్నట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. మహిళల కంపార్ట్‌మెంట్లలో ఎక్కే వారిని గుర్తించడానికి ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నారు.

మత్స్యకారుల జీవితాలతో చంద్రబాబు చెలగాటం

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి



శ్రీకాకుళం అర్బన్: గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు మత్స్యకారులను భారీగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు అసలు పట్టించుకోవట్లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. 49 రోజులుగా మత్స్యకారులు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకుండా వారి జీవితాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్‌తో శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆదివారం కృష్ణమూర్తి సందర్శించి సంఘీభావం తెలిపారు. మత్స్యకారుల ప్రధాన డిమాండ్లను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నేతలు సూరిబాబు, కేఆర్ పాత్రుడు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కథాసారం

హృదయ సౌందర్యం

ఒకరు సాదామనిషిలాగా కనిపించవచ్చు. కానీ కష్టసమయం వచ్చినప్పుడు ఆ మనిషిలోకి ఎనలేని శక్తి ప్రవహిస్తుంది. శక్తి అంటే దేహదారుఢ్యమే కాదు; కరుణ, ప్రేమ ఏ రూపంలోనైనా ఆ శక్తి వెల్లడి కావచ్చు.

యెగర్ డ్రోమొవ్, అందగాడు. దృఢకాయుడు. సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నాడు. యుద్ధంలో ఎంత మంది శత్రువులనైనా చీల్చిచెండాడే వీరాధివీరుడు. అతడిది వోల్గా నదీ తీరంలోని ఒక గ్రామం. వాళ్లమ్మ ఫొలికార్పొన్నా. తండ్రి, యెగర్ యెగరోవిచ్. ఆ వూళ్లోనే కాత్యాను డ్రోమొవ్ ప్రేమించాడు. చలికాలంలో అందరూ భోంచేసి కందకంలో చలిమంట చుట్టూ కూర్చుని వున్నప్పుడు సైనికులు తమ ప్రియురాళ్లను గురించీ, భార్యలను గురించీ బోలెడు మాట్లాడుకునేవారు. కాత్యా తన గురించి వేచిచూస్తుందనీ, వేచిచూస్తుందంటే తను ఒంటరి కాలితో వెళ్లినా స్వీకరిస్తుందనీ చెప్పేవాడు డ్రోమొవ్.

ఆరోజు డ్రోమొవ్ వాళ్ల మలుపు తిరగగానే గుట్టమీద నాజీల ట్యాంకు కనబడింది. అక్కడున్న కొద్దిపాటి చెట్లను మాటు చేసుకుంటూ వీరి ట్యాంకు ముందుకు సాగింది. శత్రుట్యాంకు శతఘ్నిని గురిపెట్టింది. ఈలోగా డ్రోమొవ్ పేల్చిన గుండు వారి ట్యాంకు డొక్కలో తగిలింది. రెండో గుండు డ్రరెట్‌కు తగిలింది. అది మోర పైకెత్తి ఒరిగిపోయింది. మంటలు సుమారు మూడువందల అడుగుల పైకి లేచాయి. అట్లా పోరాటం జరుగుతున్న కుర్క్స్ యుద్ధపు చివరి దశలో హఠాత్తుగా డ్రోమొవ్ ట్యాంకుకు షెల్ తగిలింది. సిబ్బందిలో ఇద్దరు వెంటనే చచ్చిపోయారు. రెండవ షెల్‌తో ట్యాంకు అంటుకుంది. డ్రైవర్ చువిల్యోవ్ ట్యాంకుమీదకు ఎక్కి డ్రోమొవ్‌ను బయటికి లాగాడు. అప్పటికే అతడికి స్పృహ తప్పింది. బట్టలు అంటుకున్నాయి. తలమీదా, బట్టలమీదా మట్టి చల్లి మంటలు ఆర్పేశాడు.

డ్రోమొవ్ బతికాడు. కళ్లు పోలేదుగానీ ముఖం ఎంత కాలిపోయిందంటే అక్కడక్కడా యెముకలు బయటపడ్డాయి. ఆసుపత్రిలో ఎనిమిది నెలలు ఉన్నాడు. ప్లాస్టిక్ సర్జరీతో ముక్కూ, చెవులూ, పెదవులూ, కనురెప్పలూ పెట్టారు. ఎనిమిది నెలల తర్వాత కట్లు విప్పినప్పుడు డ్రోమొవ్ అద్దంలో చూసుకున్నాడు. తనదేనా ఆ ముఖం?

చేతులతో తడుముకుంటూ ఈ కొత్త ముఖానికి అలవాటు పడటానికి ప్రయత్నించాడు. వైద్యబృందం అతణ్ని యుద్ధేతర కొలువుకు యోగ్యుడిగా ప్రకటించింది. కానీ డ్రోమొవ్ జనరల్ దగ్గరకు వెళ్లి, తనను మళ్లీ రెజిమెంటుకు పంపమని కోరాడు. జనరల్ తనతో మాట్లాడుతున్నప్పుడు తన ముఖం వైపు చూడకుండా చూపును పక్కకు తిప్పుకోవడం అతడు గమనించాడు. ముందైతే పూర్తిగా కోలుకోవడానికి ఇరవై రోజుల సెలవిచ్చారు. దాంతో స్వగ్రామానికి బయల్దేరాడు డ్రోమొవ్.

డ్రోమొవ్ బతికాడు. కళ్లు పోలేదుగానీ ముఖం ఎంత కాలిపోయిందంటే అక్కడక్కడా యెముకలు బయటపడ్డాయి. ఎనిమిది నెలల తర్వాత కట్లు విప్పినప్పుడు డ్రోమొవ్ అద్దంలో చూసుకున్నాడు. తనదేనా ఆ ముఖం?

రైల్వే స్టేషన్ నుండి ఊరికి గుర్రపుబండి లేదు. పది మైళ్లూ మంచులో నడిచే వెళ్లాడు. ఊరికి చేరుకునేసరికి చీకటి పడుతోంది. వీధి వెంబడి పోతే ఆరవ యిల్లు వాళ్లది. హఠాత్తుగా అతడు ఆగి, జేబులలో చేతులు పెట్టుకొని, తల పంకించాడు. వాకిలి వద్దకు పోకుండా, వెనక్కి వెళ్లి కిటికీలోంచి చూశాడు. తల్లి కనబడింది. కిరసనాయిల్ దీపపు మసక వెలుతురులో ఆమె టేబుల్ మీద రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తోంది. మునుపటిలాగే తలకు నల్లని శాలువా కట్టుకుంది. భుజాలు మాత్రం పలుచబడ్డాయి. వయసు పెరిగింది. గిన్నెలో పాలూ, కాస్త బ్రెడ్డూ, రెండు గరిటెలూ, ఉప్పుడబ్బీ టేబుల్ మీదకు చేర్చింది. ఆ అమాయకమైన చిన్న ముఖాన్ని నిస్పృహతో మాడ్చివేయకూడదని డ్రోమొవ్ నిశ్చయించుకున్నాడు.

ముందు వైపు వెళ్లి, గేటు తెరుచుకుని లోగిట్లోకి వచ్చి, తలుపు తట్టాడు. ''యెవరు?'' అని తల్లి గొంతు వినిపించింది. ''లెఫ్టెనెంట్ గ్రోమొవ్'' అని జవాబిచ్చాడు. గుండె దడదడలాడటంతో అతడు ద్వారబంధానికి ఆనుకోవలసి వచ్చింది. లేదులే, తల్లి తన గొంతు గుర్తుపట్టలేదు. తనకే అది మొదటిసారి వింటున్నట్లు అనిపించింది.

''యేం కావాలి బాబూ?'' అడిగింది.

''మీ అబ్బాయి సీనియర్ లెఫ్టెనెంట్ డ్రోమొవ్ వద్ద నుండి వర్తమానం తెచ్చాను''

''మా యెగర్ బతికేవున్నాడా? లోపలికి రా, బాబూ, లోపలికి రా''

డ్రోమొవ్ టేబుల్ దగ్గర బెంచీ మీద కూర్చున్నాడు. తాను పసివాడుగా ఉన్నప్పుడు తన ఉంగరాల జుట్టు నిమురుతూ తల్లి 'తిను బంగారూ' అని బుజ్జగించేది. అతడు ఆమె కుమారుని గురించి, అంటే తనను గురించే చెప్పసాగాడు. ఆమె అతని ముఖం వైపు చూసినట్లే వుందిగానీ, చూపులు యెక్కడనో వున్నాయి. ఈలోపు తండ్రి యెగర్ యెగరోవిచ్ వచ్చాడు. ఆయనకు గడ్డం సగం నెరిసింది. అతిథిని చూసి, ఫెల్టుబూట్లకు అంటుకున్న మంచుగడ్డను గడప దగ్గర వదిలించుకుని, మెడచుట్టూ వున్న మఫ్లర్ నిదానంగా తొలగించి, చలికోటు విప్పి టేబుల్ దగ్గరకు వచ్చి కరచాలనం చేశాడు.

డ్రోమొవ్ తాను మరొకరైనట్లు నటిస్తూ తనను గురించే మాట్లాడటం కొనసాగేకొద్దీ ఆ నటనను వదిలేయలేకపోయాడు. 'అమ్మా, నాన్నా, నేను యెంత విరూపినైనా నన్ను గుర్తుపట్టలేదా?' అని అడగటం అసాధ్యమైంది.

'సరే భోంచేద్దాం. అతిథికి వడ్డించు' అంటూ తండ్రి లేచి, చిన్న అలమార తెరిచాడు. చేపల కొక్కేలు గల అగ్గిపెట్టె అక్కడ వుంది. ముక్క బోయిన టీపాట్ కూడా వుంది. అవన్నీ డ్రోమొవ్‌కు తెలుసు. తండ్రి వోద్కాసీసా బయటకు తీశాడు. అందులో కొద్దిగానే వుంది.

అందరూ భోజనానికి కూర్చున్నారు. తాను గరిటె పట్టుకున్న కుడిచేతి యొక్క ప్రతి కదలికనూ తల్లి గమనిస్తున్నదని డ్రోమొవ్ కొద్దిసేపు తర్వాత గుర్తించాడు.

''యెగర్ యింటికి ఎప్పుడు వస్తాడో మీరు చెప్పనేలేదు. అబ్బాయిని చూసి మూడేళ్లయింది. బాగా పెద్దవాడయివుంటాడు'' అంది.

''అవును, అతను తిరిగివస్తే మీరు గుర్తు పట్టలేకపోవచ్చు''

అతనికి పడక ఏర్పాటు చేశారు. సొంత యింటి సౌఖ్యాన్ని అనుభవిస్తున్నాడు. కొయ్య దడికి ఆవల తండ్రి మెత్తగా గుర్రు పెడుతున్నాడు. తల్లి మంచం మీద నిట్టూరుస్తూ పొర్లుతున్నది.

ఉదయం పొయ్యిలో కట్టెల చిటపటలతో నిద్రలేచాడు. అప్పటికే తల్లి అతడి మేజోళ్లు వుతికి ఆరవేసింది.

''ఈ వూళ్లో కాత్యా మల్యీషేవా అనే అమ్మాయి వుందా? ఆమెకు మీ అబ్బాయి శుభాకాంక్షలు అందజేయమన్నాడు'' అన్నాడు డ్రోమొవ్.

కాత్యా బడిలో పంతులమ్మగా పని చేస్తోంది. ఆమెకోసం పొరుగింటి పిల్లను పంపింది తల్లి. వెంటనే కాత్యా ప్రత్యక్షమైంది. ఆమె నేత్రాలు మిలమిలలాడుతున్నాయి. ఆ వెచ్చని మెత్తని వెంట్రుకలు ముద్దుపెట్టుకోగలిగితే!

'యెగర్ నాకు శుభాకాంక్షలు పంపాడా?' అని ఆమె అడిగినప్పుడు ఆమె వైపు చూడటం డ్రోమొవ్‌కు కష్టమైంది. తన విరూపితనపు ప్రతిబింబం వాళ్ల ముఖంలో కనిపించకూడదనే ఉద్దేశంతో ఇక ఒక్క క్షణం కూడా నిలువదలుచుకోలేదు. తండ్రి గుర్రాన్ని తెస్తానన్నా వినలేదు. నడుస్తూ స్టేషన్‌కు వెళ్లిపోయాడు. 'ఇప్పుడేం చేయాలి నేను?' అని బాధతో మూలిగాడు.

తిరిగి రెజిమెంటులో కలిశాడు డ్రోమొవ్. రెండు వారాల తర్వాత అతడికి ఒక ఉత్తరం వచ్చింది తల్లి నుంచి.

''బాబూ, నీకు జాబు రాయాలంటే భయమౌతోంది. ఒక మనిషి మన ఇంటికి వచ్చాడు. నీ వద్దనుండి వచ్చానని చెప్పాడు. మంచివాడు. కానీ ముఖం విరూపం చెందింది. కొన్నాళ్లు వుండటానికి వచ్చి హఠాత్తుగా మనసు మార్చుకుని వెళ్లిపోయాడు. కానీ ఆ మనిషి నీవే అని నాకు అనిపిస్తున్నది. మీ నాన్నేమో అలా ఎందుకు నటిస్తాడు? అలాంటి ముఖం ఉన్నందుకు ఎవరైనా గర్వించాలి అంటున్నాడు. అతను నీవే కదూ! అతని చలికోటు దులపడానికి పెరట్లోకి తీసుకుపోయి గుండెలకత్తుకుని ఏడ్చాను. బాబూ, యెగర్, భగవంతుని మీద ఆన, జాబు రాయి''.

డ్రోమొవ్ తల్లికి జాబు రాశాడు, క్షమించమని. కొన్ని రోజుల తర్వాత ఇద్దరు ఆడవాళ్లు ఆ రెజిమెంటుకు వచ్చారు. ఒకరు, తల్లి, రెండో మనిషి, కాత్యా. తల్లిని గాఢంగా కౌగిలించుకున్నాక, కాత్యా వైపు తిరిగి అన్నాడు డ్రోమొవ్: ''కాత్యా, నువ్వు కాచుకుంటానన్నది ఈ మనిషి కోసం కాదు''.

''యెగర్, నా జీవితమంతా నీతోనే కలిసివుంటాను. నా సమస్త హృదయంతోనూ నిన్ను ప్రేమిస్తున్నాను''.

అదీ అంతఃశక్తి. మానవ హృదయపు మహాసౌందర్యం!





అలెక్జీయ్ తోల్‌స్తోయ్ (1883–1945) 'రష్యన్ క్యారెక్టర్'కు సంక్షిప్తరూపం. దీన్ని రా.రా. అనువదించారు. ఈ కథ రాసిన కాలం 1944. 'ఒక సంస్కృతి వృద్ధి కావడానికి కావాల్సిన ప్రాథమిక నియమం, శాంతి' అని నమ్మారు అలెక్జీయ్. పీటర్ 1, నికితాస్ చైల్డ్‌హుడ్, సిస్టర్స్, ఇవాన్ ద టెరిబుల్ ఆయన ఇతర రచనలు.

అలెక్జీయ్ తోల్‌స్తోయ్

గ్రేట్ రైటర్

హెర్మన్ హెస్సె



చిన్నతనంనుంచే పొగరుబోతుగా కనబడేవాడు హెర్మన్ హెస్సె (1877–1962). దానికి తన తెలివితేటలే కారణం. స్నేహితులతో కన్నా పుస్తకాలతో ఎక్కువగా గడిపేవాడు. దాని వల్ల వారితో కలిసిన సందర్భాల్లో వారిలో ఇమడలేక ఇబ్బంది పడేవాడు. అంతెందుకు, తన కుమారుడికి నాలుగేళ్ల వయసుకే ఇంత విస్మయం గొలిపే మెదడు ఎలా ఉందని ఆశ్చర్యపోతూ భర్తకు ఉత్తరం రాసింది హెస్సె వాళ్లమ్మ. పుట్టుకతో జర్మనీయుడైన హెస్సె వేదాంతం, తత్వశాస్త్రం, గ్రీకు పురాణాలు ఎక్కువ చదివి, వాటి సారాన్ని జీర్ణించుకున్నాడు. ఇక రచయితగా అవతరించడంలో ఆశ్చర్యం ఏముంది! గౌతమబుద్ధుడి జీవితపు సారాన్ని సిద్ధార్థుడనే సాధారణ మానవుడికి ఆపాదించి, అతడు బుద్ధుడి(జ్ఞాని)గా పరిణామం చెందిన తీరును చిత్రించిన 'సిద్ధార్థ' హెస్సె క్లాసిక్స్‌లో ఒకటి. ఇది హెస్సె మీద భారతీయ సారస్వతపు ప్రభావాన్ని సూచిస్తుంది. ఈ నవల ఆధారంగా అదే పేరుతో శశికపూర్ ప్రధాన నటుడిగా సినిమా కూడా వచ్చింది. 'దేమియాన్', 'స్టెపెన్‌వూల్ఫ్', 'ద గ్లాస్ బీడ్ గేమ్' ఆయన ఇతర ప్రసిద్ధ నవలలు. 1946లో నోబెల్ పురస్కారం పొందిన హెస్సె, నిన్ను నువ్వు వదిలేసుకోవాలి, ఆకాశంలోని మేఘంలా; నిరోధించకు, అంటాడు.

సాహిత్య మరమరాలు


పడండి ముందుకు పడండి తోసుకు

ఒకసారి శ్రీరంగం శ్రీనివాసరావూ, అబ్బూరి వరద రాజేశ్వరరావూ విశాఖపట్నంలో సముద్రతీరానికి బయల్దేరారు. 'నువ్వెప్పుడైనా లైట్‌హౌస్ పైకి వెళ్లి సముద్రాన్ని చూశావా?' అడిగాడు దారిలో వరద. దీపస్తంభాన్ని ఎన్నేళ్లనుంచో చూస్తున్నప్పటికీ అది ఎక్కి సముద్రాన్ని చూడొచ్చన్న ఆలోచన అంతకుముందు రాని శ్రీశ్రీ ఆశ్చర్యపోయాడు. దాని పైకెక్కటం ఎలా అని అడిగాడు. సరాసరి పొన్నాంబళ్ దగ్గరికి పోయారు. అతడు వరదకు పరిచయం. 'ఇదే ఆఖరు' అంటూ అతడు ఇద్దరినీ మెలికలు తిరుగుతూ పోయిన మెట్ల మీది నుంచి పైకి తీసుకుపోయాడు. శ్రీశ్రీ సముద్రం వంక చూస్తూ నిశ్చలంగా నిలబడిపోయాడు. తదేక దృష్టితో చూస్తున్నాడు. ఈలోగా వరద బైనాక్యులర్స్ ఇచ్చాడు. అందులోంచి చూశాడు. చూస్తున్నాడు. చూస్తున్నాడు. శ్రీశ్రీ ముఖకవళికలు మారిపోయినై. హఠాత్తుగా 'పడండి ముందుకు, పడండి తోసుకు పైపైకి', 'ఫెళ ఫెళా విరుచుకుపడండి' 'వండర్‌ఫుల్' అన్న మాటలు ఆయన నోటినుంచి వచ్చినై. కిందికి మెట్లు దిగుతుండగా, 'ఆ కెరటాల్ని దగ్గరినుంచి చూశావు కదా, ఎలా విరుచుకుపడుతున్నాయో; అంత భయంకర దృశ్యాన్ని చూడటం నాకిదే మొదటిసారి' అన్నాడు శ్రీశ్రీ. ఆ తరంగాల్ని చూస్తూ అన్న ఆ మాటలే మరో రెండేళ్లకు మరో రూపంలో శ్రీశ్రీ ప్రసిద్ధ కవితలోని పంక్తులుగా నిలిచినాయి.



ప్రతిధ్వనించే పుస్తకం

హిమజ్వాల



వడ్డెర చండీదాస్

సాహిత్యంలోకి ఒక వురుములా, మెరుపులా ప్రవేశించాడు వడ్డెర చండీదాస్. తొలి నవలతోనే సంచలనం సృష్టించాడు. ప్రత్యేకమైన వచనమూ, అంతే ప్రత్యేకమైన జీవితపు చూపూ ఆయన్ని కూడా అంతే ప్రత్యేకమైన రచయితగా నిలబెట్టాయి. 'గమనాన్నీ, యానాన్నీ, ప్రవాహాన్నీ అక్షరాలలో చిత్రించాలని -- అంతర్ బహిర్ వర్తనాల మధ్యన వుండే గొలుసు పొరలు చిరగకుండా వొక్కొక్కటె విప్పి; యేదో శూన్య రహస్యాన్ని తెలుసుకోవాలన్న కోర్కె'తో ఆయన రాసిన అస్తిత్వ వాద మనోవైజ్ఞానిక నవల 'హిమజ్వాల'.

ప్రమాదవశాత్తూ పరిచయమైన కృష్ణచైతన్య, గీతాదేవిల బంధం ఏవో పరా పాపభీతుల కారణంగా ఏ తీరమూ చేరదు. తదుపరి పరిణామాల్లో శివరాం వైవాహిక సంకెళ్లలో గీతాదేవి బందీయవుతుంది. వారిరువురిలోని రసభేదాలు ఆ బంధాన్ని బీటలు వారుస్తాయి. ప్రకృతిలో పురివిప్పే నెమలికీ, దానికో కోక కప్పాలని చూసే అతడికీ మధ్య ఏమీ మిగలదు. అనంతరం, వయసు మళ్లిన విజయసారథి ఆమెను అంతరంగంలోకి ఆహ్వానిస్తాడు. మరోవైపు, గాలికి కొట్టుకుపోయిన కృష్ణచైతన్యకు రోగి చిదంబరరావుతో పరిచయం కావడం, ఆయన భార్యతో సంబంధం ఏర్పడటం, అనూహ్యంగా రోగి కోలుకోవడం, మరోసారి గాలికి విసరివేయబడి తండ్రి మరణవార్తతో ఇల్లు చేరడం, అక్కడ తండ్రి సహచరిగా గీతాదేవి కనబడటం, ప్రియుడిగా మారబోయిన కృష్ణచైతన్యను ఆమె అంగీకరించకపోవడం, పిచ్చివాడైన శివరాం తలతో మోది తాను చస్తూ గీతాదేవిని చంపేయడం...

హిమజ్వాలను రెండు పొరల్లో అర్థం చేసుకోవాలనిపిస్తుంది. ఒక పొర: మనుషుల చర్యలకు ఏ ప్రత్యేక అర్థం లేదనీ, జీవితాలు ఊరికే గాలికి కొట్టుకుపోయేవేననీ, అలా కొట్టుకుపోకుండా నిలిచిన ఆ కాస్త కాలంలో మాత్రం నేలను గట్టిగా తొక్కిపట్టడానికి ప్రయత్నిస్తాయనీ చెప్పినట్టనిపిస్తుంది. రెండో పొర: ఆ తొక్కిపట్టిన ఆ కొద్ది కాలంలో కూడా తాగడానికి రసం నిండిన పాత్రొకటి సిద్ధంగా ఉన్నదనీ, దాన్ని వృథాగా ఒలకబోసుకోకూడదనీనూ!

'సరోవరం లాంటి హృదయంలో ఉండాల్సిన నేను నీ గాజు గుండెలో ఉండాలని కోరుకోనని తెలియదేమో నీకు! నువ్వొక కాగితం పువ్వువి. నాక్కావలసిన పరిమళం లభ్యం కాదు. నువ్వొక రంగు పువ్వులు చెక్కిన గాజు హృదయానివి. కానీ నాక్కావల్సింది పచ్చని పచ్చిక హృదయం. ప్రపంచంలో ఏ ఒక్కరి కోసమూ నన్ను నేను వంచించుకోలేను. కానీ ఒక్క రసస్పందనకోసం, ఒక్క వెన్నెల కోసం, రసహృదయపు లోలోతుల పలవరింతల కోసం నా సర్వస్వాన్ని అర్పించుకోగలను' అంటుంది గీతాదేవి.


'నీటిబుడగ చిట్లినట్లుగా', 'తారు పూసినట్టు ఆకాశంలో మబ్బులు', 'పర్వతపు పచ్చని నుదుటి మీద నిప్పురవ్వ ఐ పడి, పగకొద్దీ కాల్చి – అక్కడికీ కసి తీరక దోసిళ్ళతో మసియెత్తి గాలిలోకి యెగబోసి, వెళ్ళిపోయాడు సూర్యుడు' లాంటి వాక్యాలు బుచ్చిబాబును గుర్తు చేస్తాయి. నవల కూడా ఆయనకే అంకితం ఇచ్చాడు.

కొత్త బంగారం

బ్రిటిష్‌రాజ్ కాలంలో ఒక స్త్రీ

కుమావ్ పర్వతాలని ఆధారంగా చేసుకుని, నమితా గోఖలే రాసిన హిమాలయన్ ట్రయోలొజీకి ఆఖరి భాగం అయిన నవల, 'థింగ్స్ టు లీవ్ బిహైండ్'. ఇది మూడు తరాల బ్రిటిష్ పాలకుల గురించీ, స్థానికుల గురించీ రాసినది. కథాకాలం 1840–1912.

మొదటి ప్రపంచ యుద్ధమప్పటి తిరుగుబాటు కాలం గురించి చెప్తూనే, ఒక చిన్న అస్పష్టమైన కథలాంటిది కూడా అల్లుతారు రచయిత్రి. ప్రధాన పాత్రల్లో ఒకరైన తిలోత్తమ(తిల్లీ)కి బంధువైన బద్రీ దత్ 1857 విద్రోహంలో ఉరితీయబడతాడు. తల్లి మరణిస్తుంది. ఈ రెండు కారణాల వల్లా తిల్లీకి 19 ఏళ్ళు వచ్చేవరకూ పెళ్ళి అవదు. దాంతో వెసులుబాటు దొరికి కొంచం చదువు అబ్బుతుంది. ఈ పాత్ర ద్వారా, 19వ శతాబ్దంలో స్వతంత్రంగా ఆలోచించే స్త్రీల కష్టాలని రచయిత్రి చూపిస్తారు. నైన్ చంద్‌తో పెళ్ళయ్యాక, తిల్లీ ఇంటిపనులు చేయడానికి ఇష్టపడదు. బద్రీ దత్ చెప్తూ ఉండే, 'ఎప్పుడూ భయపడకు. నీకిష్టం అయినది కాక, నీక్కావలిసినది చెయ్యి' అన్న సలహానే పాటిస్తుంటుంది.





నమితా గోఖలే

తిల్లీ గర్భవతి అయినప్పుడు ఇంగ్లిష్ నేర్చుకోవడం వంటి పనులతో ఖాళీ లేకుండా ఉంటుంది. బొల్లితో పుట్టిన కూతురు దియొకీని తన కజిన్ తరిణికి దత్తతకిస్తుంది. భర్తకి రహస్య ప్రేమిక దొరుకుతుంది.


ఆధునిక ఆలోచనలూ, బ్రిటిష్ అమ్మాయి రోస్ మేరీ పట్ల ప్రేమా ఉన్న జయేష్ చంద్ పంత్‌తో దియొకికి పెళ్ళవుతుంది. అతను క్రైస్తవం పుచ్చుకుని, జయేశ్ జోనాస్ పంత్‌గా పేరు మార్చుకుంటాడు. బ్రాహ్మణురాలైన తిల్లీ, కూతురి చేతుల్లో బైబిల్ కుక్కి, దియొకిని డియానాగా మార్చి, అల్లుడి వద్ద వదిలిపెడుతుంది. దేశంలాగానే కుమావ్ కూడా కల్లోలానికి గురయినప్పటి కాలంలో, అప్పటి కుమావనీ సూక్ష్మప్రపంచం కనబడుతుంది పుస్తకంలో. స్థానికులు– బ్రిటన్నీ భారతదేశాన్నీ వేర్వేరుగా చూసినప్పటికీ, వలసదారుల చపలత్వం పట్ల మాత్రం విధేయతతో ఉంటారు. 'యూరోపియన్ల కోసమూ, గుర్రాల కోసమూ మీది మాల్ రోడ్డూ, కుక్కలకీ, నౌకర్లకీ, ఇతర భారతీయులకీ కేటాయించినది కింది మాల్ రోడ్డూ' అన్న నియమాన్ని ప్రశ్నించరు.

కథ 'బ్రిటిష్ రాజ్' కాలాన్ని కళ్లకి కట్టేలా చూపిస్తుంది. అప్పుడున్న కుల వ్యవస్థా, తెల్లవారికీ స్థానికులకీ మధ్యనుండే పరస్పర వైరాలూ, బ్రిటిష్ వారి జాత్యహంకారం, ఆ కాలంలో స్త్రీల పరిస్థితీ, గుడ్డినమ్మకాలూ, స్వాతంత్ర్య పోరాటం గురించీ రాసిన ఈ నవల ఆసక్తికరంగా సాగుతుంది. బ్రిటిష్ కాలవ్యవధిని అనుసరిస్తూ– విషయాలకి ఒక ప్రామాణిక అర్థాన్నీ, చారిత్రకతనీ ఆపాదించడానికి నమితా గోఖలే– పదాల, స్థలాల అక్షర క్రమాలని అలాగే ఉంచారు. ఉదా: 'నైనీతాల్'.

ఇది చారిత్రక రూపంలో ఉన్న కాల్పనిక నవల. పుస్తకపు రెండవ భాగం 'మోడర్న్ టైమ్స్'లో మరింత ఉత్తరదేశపు చరిత్ర ఉంటుంది. ఈ భాగానికీ, ఆఖరిదైన మూడవ భాగానికీ మధ్యన–అనవసరమైన పాత్రలూ, వివరాలూ, పిట్టకథలూ అస్తవ్యస్తంగా పరిచయం చేయబడతాయి. ఈ పుస్తకం వచ్చినది నవంబర్ 2016లో. అక్టోబర్ 2017లో రచయిత్రికి అసోమ్ సాహిత్య సభలో మొట్టమొదటి 'సెంటినరీ అవార్డ్ ఫర్ లిటరేచర్' అవార్డ్ ప్రదానం చేశారు.

◆ కృష్ణవేణి


ఈవారం పుస్తకాలు




ఆకుపచ్చ సూర్యోదయం (మన్యం వీరుడు అల్లూరి గాథ)
రచన: డా॥ గోపరాజు నారాయణరావు; పేజీలు: 312 (పెద్ద సైజు); వెల: 300; ప్రతులకు: జనప్రియ ఉటోపియా, 3వ బ్లాక్, నాల్గవ ఫ్లోర్, ఫ్లాట్: 34006, అత్తాపూర్, హైదరాబాద్. ఫోన్: 9849325634



గోరపిట్ట (కథలు)
రచన: సువర్ణముఖి; పేజీలు: 190; వెల: 120; ప్రతులకు: సిక్కోలు బుక్ ట్రస్ట్, ఎం.ఐ.జి.–100, హౌసింగ్ బోర్డు కాలనీ, జిల్లా పరిషత్ ఎదురుగా, శ్రీకాకుళం–532001. ఫోన్: 9989265444



పాడుతా తీయగా (ఆత్రేయ నూట పదార్లు)
రచన: డా॥ పైడిపాల; పేజీలు: 250; వెల: 150; ప్రచురణ: హాసం ప్రచురణలు; ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్–27. రచయిత ఫోన్: 9989106162



విక్రమ్ సారాభాయి (జీవితం)
రచన: అమృతా షా; అనువాదం: పి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి; పేజీలు: 208; వెల: 200; ప్రతులకు: అలకనంద ప్రచురణలు, 59–6–15, కంచుకోట వీధి, విజయవాడ–8. ఫోన్: 0866–2476966

కవిత్వ ప్రపంచం

ఆర్నెల్లుగా రోజూ ఫ్రీగా నా కవిత్వం విని టీ తాగి పోతుంటే కవితాభిమానివనుకున్నా!!
నీకు పుట్టెడు చెవుడని ఇవాళే తెలిసింది!



పదం పలికింది - పాట నిలిచింది

తీపి కన్నా ఇంకా తీయనైన తేనె ఏది...

ప్రియురాలి గురించి ఎందరు ఎన్నిసార్లు వర్ణించినా అది తియ్యగానే ఉంటుంది. ఒక మామూలు మగవాడిని సైతం కవిగా మలుస్తుంది కదా ప్రేయసి! మరి ఆమెను వర్ణించే ప్రయత్నంలో అతడు కవిత్వం రాయకా తప్పదు; అతిశయాలకు పోకా తప్పదు. 2006లో వచ్చిన 'బొమ్మరిల్లు' చిత్రంలోని 'అపుడో ఇపుడో ఎపుడో కలగన్నానే చెలి' పాటలోని ఈ పాదాలు దీనికి సాక్ష్యమిస్తాయి.

'తీపి కన్నా ఇంకా తీయనైన తేనె ఏది అంటే/ వెంటనే నీ పేరని అంటానే
హాయి కన్నా ఎంతో హాయిదైన చోటే ఏమిటంటే/ నువ్వు వెళ్లే దారని అంటానే
నీలాల ఆకాశం ఆ నీలం ఏదంటే/ నీ వాలు కళ్లల్లో ఉందని అంటానే'

ఈ పాటకు క్రెడిట్ కులశేఖర్/ అనంత శ్రీరామ్ అని ఇద్దరి పేర్లూ వున్నప్పటికీ, ఈ వెర్షన్ రాసింది మాత్రం తానేనని అనంత శ్రీరామ్ స్వయంగా వెల్లడించారు. అప్పటికి ఆయన పరిశ్రమకు కొత్త కావడం, అప్పటికే కులశేఖర్‌కు నిర్మాత దిల్ రాజు డబ్బులు చెల్లించి ఉండటంతో మార్కెట్ దృష్ట్యా ఇద్దరి పేర్లూ వేశారట. 'అది దిల్ రాజు గారి విశాల హృదయానికి చిహ్నం' అంటారు అనంత శ్రీరామ్. 'అపుడో ఇపుడో ఎపుడో' లైన్ ఇచ్చింది మాత్రం సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్. పాడింది సినిమాలో నాయకుడు కూడా అయిన సిద్ధార్థ.



రారండోయ్



- తిరుమల వేంకటేశ్వరుని విశేషాలతో తాను ఇంగ్లిష్‌లో రాసిన 'శ్రీవారి దర్శన్' అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ లైబ్రరీలోనూ, కార్నెల్ లైబ్రరీలోనూ; బ్రిటన్‌లోని బ్రిటిష్ లైబ్రరీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లైబ్రరీ, కేంబ్రిడ్జ్ లైబ్రరీలోనూ; జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీలోనూ అందుబాటులో ఉంచబడినట్లు ఆధ్యాత్మిక రచయిత విశ్వపతి (టి.వి.ఆర్.కె.మూర్తి) సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య స్వర్ణోత్సవం, సప్తతి సందర్భంగా వివిధ గ్రంథాల ఆవిష్కరణ, అంకితోత్సవ సభ ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 2:30కు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరగనుంది. నిర్వహణ: తెలంగాణ సాహిత్య కళా వేదిక.
- డాక్టర్ ఎ.ఎం.అయోధ్యారెడ్డి కథల సంపుటి ఆహారయాత్రకు బొందుగులపాటి సాహిత్య అవార్డు ప్రదానం ఫిబ్రవరి 4న సాయంత్రం 5 గంటలకు వాగేశ్వరీ కళాశాల, కరీంనగర్‌లో జరగనుంది. నిర్వహణ: సాహితీ గౌతమి.
- కె.విల్సన్ రావు 'దేవుడు తప్పిపోయాడు' కవితా సంపుటి ఆవిష్కరణ ఫిబ్రవరి 4న సాయంత్రం 6 గంటలకు విజయవాడలో జరగనుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం. తిథి శు.త్రయోదశి రా.12.24 వరకు, తదుపరి చతుర్దశి. నక్షత్రం ఆరుద్ర రా.9.50 వరకు, తదుపరి పునర్వసు. వర్జ్యం ఉ.7.17నుంచి 8.47 వరకు. దుర్ముహూర్తం ప.12.33 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.48 నుంచి 3.33 వరకు. అమృత ఘడియలు ప.12.30 నుంచి 2.00 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం : 5.48
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.34
జొహర్ : 12.29
అసర్ : 4.34
మగ్రీబ్ : 6.10
ఇషా : 7.25

'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూ

ఎన్ని కష్టాలు, అడ్డంకులు ఎదురైనా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తన బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన తల్లి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ విజ్ఞప్తి చేశారు. తన తండ్రిలాగే ప్రజల కోసం మంచి పనులు చేసి చరిత్రలో నిలిచిపోవాలన్న తపన జగన్‌లో ఉందన్నారు. ఇచ్చిన మాట తప్పే మనిషి కాదని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నందుకే తాము కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిపోయే పరిస్థితులు సృష్టించారని చెప్పారు. మూడు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన వైఎస్సార్ కుమారుడిపై కేసులు పెట్టడం బాధ కలిగించిందని అన్నారు. ముఖ్యమంత్రి కావాలని జగన్ ఏనాడూ కోరుకోలేదని తెలిపారు. సీఎం చంద్రబాబు జనం కోసం ఏం చేశారని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓట్లు వేయాలని ప్రశ్నించారు. వైఎస్సార్ పాలన చూశారు కనుక జగన్ పాలన రావాలన్న కోరిక ప్రజల్లో కనిపిస్తోందని పేర్కొన్నారు. విజయమ్మ 'సాక్షి' టీవీ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావుకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు...

- సాక్షి, హైదరాబాద్

జగన్ మాట తప్పడు.. ఆశీర్వదించండి



'సాక్షి' టీవీ ప్రత్యేక ఇంటర్వ్యూలో వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ విజ్ఞప్తి

● ప్రజాసంకల్ప యాత్రకు వస్తున్న స్పందన చూస్తే మీకేమనిపిస్తోంది?

విజయమ్మ: జగన్ పాదయాత్రకు లక్షలాది మంది వస్తున్నారు. నా దృష్టిలో ఎన్ని కిలోమీటర్లు నడిచారనేది పెద్ద ప్రాతిపదిక కాదు. మనం ఎన్ని లక్షల మందిని కలిశాం? ఎంతమందికి విశ్వాసం కల్పించాం? ఎంతమందికి ధైర్యం కల్పించగలుగుతున్నామనే అంశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కావడానికి 25 ఏళ్లు పట్టింది. అన్ని రోజులూ జనం ఆయనను నాయకుడిగా నమ్మారు. ఆయనపై అభిమానం చూపారు. ప్రజలకు తాను రుణపడి ఉన్నానని రాజశేఖరరెడ్డి అనుకునేవారు. ఈ రోజు ఆ జనం కోసం నా బిడ్డ నిలబడుతున్నాడని తలచుకుంటే ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

> ఎమ్మెల్యేలతో జగన్ సంతకాలు పెట్టించాడన్న అపవాదు చాలా తప్పు. రాజశేఖరరెడ్డి మరణంతో మేము షాక్‌లో ఉన్నాం. సంతకాలు పెట్టించిన సంగతి కూడా జగన్‌కు తెలియదు. సీఎం కావాలని జగన్ అనుకోలేదు. కాబట్టే రోశయ్య గారిని ముఖ్యమంత్రి చేద్దామంటే ఒప్పుకున్నారు. రఘువీరారెడ్డి, మరికొందరు వచ్చి ఒప్పుకోవద్దని చెప్పారు.

● జగన్ భవిష్యత్తు, వైఎస్సార్‌సీపీ భవితవ్యంపై మీరేమనుకుంటున్నారు?

విజయమ్మ: ప్రజలు విజ్ఞులు. వారికి అన్నీ తెలుసు. ఈ రోజు వారి కష్టాలను జగన్ వింటున్నాడు. అవి తీరుస్తానంటున్నారు. జగన్ కూడా తండ్రిలా మంచి చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది. చంద్రబాబు నాయుడిని ప్రజలు నమ్మడం లేదు. వైఎస్ కుటుంబం ఒక మాట ఇస్తే చేస్తుందని ప్రజలు నమ్ముతారనే ప్రగాఢ విశ్వాసం నాకుంది. రాజశేఖరరెడ్డి రక్తం కాబట్టి జగన్ చెప్పింది కచ్చితంగా చేస్తారనే విశ్వాసం ప్రజల్లో ఉంది. అందువల్ల తప్పకుండా జగన్ ప్రభుత్వం వస్తుందని, వాళ్ల తండ్రి చేసిన పనులను తప్పకుండా చేస్తారని నమ్ముతున్నా.

● జగన్ పాదయాత్రలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా? సలహాలేవైనా ఇచ్చారా?

విజయమ్మ: వాళ్ల నాన్న చనిపోయినప్పటి నుంచి జగన్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తాను ఎన్ని కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజలు ఎక్కడ బాధల్లో ఉన్నా నేనున్నానంటూ వెళ్లడం జగన్‌కు ఉన్న ప్రత్యేక లక్షణం. అతడికి సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదనుకుంటా.

■ అప్పుడే తొమ్మిదేళ్లు అయిపోయాయి. కష్టాలు, నష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు? వీటిని తలచుకుంటే ఏమనిపిస్తోంది?

విజయమ్మ: రాజశేఖరరెడ్డి పోవడమే మాకు పెద్ద షాక్. ఆయన దాదాపు 35 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీకి సేవ చేశారు. మరణించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ వారికి రాజశేఖరరెడ్డి నచ్చలేదు. జగన్ నచ్చలేదు. ఆయన ద్వారా పైకి వచ్చినవారు, సహచరులు, ఆయనతో చాలా దగ్గరగా ఉన్న వారు ఎవరూ ఈ కుటుంబ పక్షంగా నిలబడకపోవడం బాధగా అనిపించింది. అన్యాయంగా కేసులు పెట్టి జగన్‌ను వేధించారు. జైలులో పెట్టించారు. ఎన్నో ఇబ్బందులను ఈ కుటుంబం ఎదుర్కొంది. అయినా జగన్ ధైర్యంగా ముందుకెళ్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లాలని జగన్ ఎప్పుడూ అనుకోలేదు. పొమ్మనలేక పొగబెడతారన్నట్లుగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు సృష్టించారు. కేంద్ర మంత్రి పదవి ఇస్తా న్నా వద్దన్నాడు. ఓదార్పు యాత్రకు అనుమతి తప్ప మరేమీ అడగలేదు. అందరూ మాతో బాగానే ఉండేవారు. కానీ సోనియా గాంధీకి, కేంద్రంలోని వాళ్లకు తప్పుడు సమాచారం ఇచ్చారు. అప్పట్లో సీఎం పదవి కోసం జగనే సంతకాలు పెట్టించాడన్నట్లుగా ఆమెకు రిపోర్టులు పంపించినట్లు ఉన్నారు. ఆమె దాన్నే చాలా సీరియస్‌గా తీసుకున్నట్లున్నారు.

■ ఒక్క విషయంలో రాజీపడి ఉంటే మీకు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కాదు కదా

విజయమ్మ: ఓదార్పు యాత్రను మధ్యలో ఆపేశారు. రాజశేఖరరెడ్డికి అంత మంచి పేరు ఉందని కాంగ్రెస్ వారు కూడా ఊహించలేదనుకుంటా. ఒక జిల్లాలో యాత్ర చేయడానికి అనుమతించారు. ఆ జిల్లాలో ప్రజలు రాజశేఖరరెడ్డిపై ఉన్న ప్రేమనంతా జగన్‌పై చూపించారు. ఇది కాంగ్రెస్ వారికి నచ్చలేదనుకుంటా. అందుకే ఓదార్పు యాత్ర వద్దని ఆపించారు. తర్వాత మేం పరిస్థితులను వివరించడానికి అవకాశం ఇవ్వడంటూ సోనియా గాంధీకి లేఖ రాశాం. ఐదు వారాల తర్వాత సోనియాగాంధీ పిలిచారు. దీంతో నేను, షర్మిల, జగన్, భారతమ్మ కలిసి వెళ్లాం. 'మీరు రాష్ట్రమంతా ఓదార్పు యాత్ర చేయడానికి వీల్లేదు. ఒకే చోటకు అందరినీ పిలవండి. ఒక విగ్రహమే పెట్టండి. అంతకు మించి తిరగొద్దు. ఇది పార్టీ నిర్ణయం' అని సోనియా చెప్పారు. షర్మిల కళ్లల్లో నీరు పెట్టుకుని అడిగారు. 'నాన్న మరణవార్త విని తట్టుకోలేక మరణించిన వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించడమే సరైన పద్ధతి' అని షర్మిల నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ఒకచోటకు పిలవాలనడం మాకు నచ్చలేదు. అందుకే ఇచ్చిన మాట మేరకు జగన్ ఓదార్పు యాత్ర చేయాల్సిందేనని నిర్ణయించుకుని బయటకు వచ్చారు. ఓదార్పు యాత్ర మొదలు పెట్టారు. యాత్రకు వెళ్లొద్దు, సహకరించొద్దంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కట్టడి చేశారు. తర్వాత పరిస్థితులన్నీ మారిపోయాయి.

■ పార్టీ నుంచి బయటకు వెళితే ఇబ్బంది పడాల్సి వస్తుందని కేవీపీ లాంటి వారు చెప్పారట కదా?

విజయమ్మ: చెప్పారు. వీరందరూ చెప్పారు. ఈ పార్టీలోనే ఉంటే ముఖ్యమంత్రిని చేస్తారు, బయటకు వెళ్లవద్దని చెప్పారు. అయితే పార్టీ నుంచి జగన్ బయటకు వెళ్లక తప్పని పరిస్థితి సృష్టించారు. కడప జిల్లాకే పరిమితం చేశారు. మా ఇంట్లో తన నుంచి చిన్నాన్నను విడదీసేందుకు జరిగిన కుట్ర జగన్‌కు నచ్చలేదు. ఇక ఆ పార్టీలో మనం మన్నన పొందలేమమ్మా, బయటకు వెళ్లిపోదామని అన్నాడు.

■ కొత్త పార్టీ పెట్టడానికి మీరు అంగీకరించారా?

విజయమ్మ: ఆ సమయంలో అదే సమంజసం అనిపించింది.

■ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర చేస్తుండడం మీకు ఎట్లా అనిపిస్తోంది?

విజయమ్మ: ఈ కుటుంబంలో నేను ముగ్గురి (వైఎస్సార్, షర్మిల, జగన్) పాదయాత్రలు చూశా. అందరిదీ ఒకే లక్ష్యం. వాళ్ల నాన్న లాగా ప్రజలతో ఉండాలని, వారికి మేలు చేయాలనే తపన జగన్‌లో చాలా ఎక్కువగా ఉంది. అతడు రాజకీయాల్లోకి రావడానికి కూడా ఇదే కారణం. ప్రజలు తన దగ్గరకు వచ్చి సమస్యలు చెప్పుకున్నప్పుడు జగన్ భరోసా ఇస్తున్న తీరు చూస్తుంటే నాకు రాజశేఖరరెడ్డి గుర్తొస్తారు.

■ మీ అబ్బాయిని చూడు, మా అబ్బాయిని చూడు ఎలా పెంచానో... అని అసెంబ్లీలో చంద్రబాబు అన్నారు కదా!

విజయమ్మ: ఎవరినీ విమర్శించడం నాకు ఇష్టముండదు. నా బిడ్డకు ఒక్క దురలవాటు కూడా లేదు. చిన్న అబద్ధం కూడా చెప్పడం తెలియదు. సిగరెట్ ముట్టడు. పబ్‌లకు వెళ్లే అలవాటు లేదు. నా బిడ్డకు పని చేయడం, ఇంట్లో అందరితో సంతోషంగా ఉండటమే తెలుసు.

■ చంద్రబాబు విమర్శించినప్పుడు మీకు ఎలా అనిపించేది?

విజయమ్మ: అసెంబ్లీలో జగన్‌ను మంత్రులు రెచ్చగొట్టినప్పుడు, కొందరు నేతలు జగన్ గురించి ఏదేదో మాట్లాడినప్పుడు, అసత్య ఆరోపణలు చేసినప్పుడు నాకు తెలియకుండానే కన్నీళ్లొచ్చేవి. చాలా బాధ కలిగేది. జగన్ మాత్రం ధైర్యంగా ఎదుర్కొన్నాడు. వాళ్లు అలా అనకుండా ఇంకేమంటారమ్మా.. అంటూ నన్ను సముదాయించేవాడు.

జగన్‌పై కేసులు పెట్టినప్పుడు తల్లిగా మీరు ఎలా ఫీలయ్యారు?

విజయమ్మ: చాలా బాధ కలిగింది. వైఎస్ మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు సేవ చేశారు. ఆయన తన పేరు ఎక్కడా వాడుకోలేదు. ఎక్కడైనా కార్యకర్తలు రాజశేఖరరెడ్డి జిందాబాద్ అంటే రాజీవ్ గాంధీ జిందాబాద్ అనాలని సూచించేవారు. అంత సేవ చేసిన నాయకుడి కుమారుడిపై కేసులు పెట్టడం బాధ అనిపించింది.

■ జగన్‌పై పెట్టిన కేసుల్లో పస ఉందనుకుంటున్నారా?

విజయమ్మ: కాంగ్రెస్‌లో ఉన్నంత కాలం రాజశేఖరరెడ్డి, జగన్ మంచివాళ్లు. పార్టీ పెట్టాలని నిర్ణయించడంతోనే కాంగ్రెస్ వారికి చెడ్డవాళ్లయిపోయారు. అలా అనుకున్న వారంలోనే నోటీసులు వచ్చాయి, ఆ వెంటనే కేసులు పెట్టారు. ఈ రోజు 'ఓటుకు కోట్లు' కేసులో ఆధారాలున్నా ఏమీ చేయడం లేదు. కానీ ఆ రోజు కోర్టుకెవరో లేఖ రాస్తే దాన్ని సీరియస్‌గా తీసుకొని ఈ కేసులన్నీ నడిపించారు. కాంగ్రెస్, టీడీపీలు కలిసి కేసులు పెట్టాయి.

■ ఇలాంటి సమయంలో రాజకీయాలెందుకని బాధపడ్డారా?

విజయమ్మ: చాలా బాధపడ్డాను. జగన్‌కు కూడా చెప్పాను. వాళ్లకు వ్యతిరేకంగా వెళ్తే కష్టపడతావని అన్నాను. అలా అంటే న్యాయం, ధర్మం అనేవాడు. అబద్ధం చెప్పడం జగన్‌కు రాదు. న్యాయంగా వెళ్తూ కేసులన్నీ ధైర్యంగా ఎదుర్కొంటున్నాడు. అన్నిటికీ దేవుడున్నాడనేది అతడి నమ్మకం. మనం తప్పు చేయనప్పుడు భయపడాల్సిన పని లేదంటాడు.

> ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ నేను ఒక్కటే చెబుతున్నాను. జగన్ మాట తప్పే మనిషికాదు. ఒక తల్లిగా అతడి వ్యక్తిత్వం నాకు తెలుసు. మాట ఇస్తే పూర్తిగా కట్టుబడి ఉంటాడు. జగన్‌ను ఆశీర్వదించండి. ఒక్కసారి అవకాశమివ్వండి. జగన్ అన్నీ చేస్తాడని మాట ఇస్తున్నా. జగన్‌కు జీవితమే అన్నీ నేర్పిస్తోంది. ఎక్కడ బస్సు, రైలు ప్రమాదం జరిగినా, వరదలొచ్చి ఎవరైనా చనిపోయినా వెంటనే అక్కడికి వెళ్లి బాధితులను ఓదార్చుతాడు. ప్రయాణాల్లోనే గడుపుతున్నాడు. ఇంట్లో ఉండేది ఎప్పుడని అడిగితే, మన బాధ్యత మనం నెరవేర్చాలి కదమ్మా అంటుంటాడు. వైఎస్సారే మనకు ఆదర్శం. ఆయన ఏనాడూ అబద్ధం ఆడలేదు. ఆయన చెప్పినవి చేశారు. చెప్పనివీ చేశారు. ప్రజల్లో నమ్మకం కలిగించి వెళ్లారు.



వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అవుతారని మీరు ఊహించారా?

విజయమ్మ: ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ వైఎస్‌ను చిన్న వయసులోనే పీసీసీ అధ్యక్షుడిని చేసింది. కాంగ్రెస్ నుంచి పెద్ద పెద్ద నాయకులు వెళ్లిపోయారు. అప్పుడు చిన్న వాడిని పీసీసీ అధ్యక్షుడిని చేసినందుకు పెద్ద వారికి కోసం వచ్చింది. సహాయ నిరాకరణ చేశారు. చిన్న మీటింగ్ పెట్టాలన్నా కష్టంగా ఉండేది. అలాంటి పరిస్థితుల్లో వైఎస్ అందరినీ కలుపుకుని వెళ్లి పార్టీని పటిష్టం చేశారు. 'రాజశేఖరరెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే రాజశేఖరరెడ్డి' అనే స్థితికి పార్టీని తీసుకొచ్చారు. పదేళ్ల ముందే రాజశేఖరరెడ్డి సీఎం అవుతారనే ప్రచారం సాగింది. రాజకీయాలపై నాకు అంతగా ఆసక్తి లేదు. సీఎం అయ్యాక ఆయన ఇంటికి వచ్చినా మా అందరితో సరదాగా గడిపే వారు తప్ప రాజకీయాల గురించి చెప్పేవారు కాదు.

■ వైఎస్ చేసిన పనుల్లో మీకు బాగా నచ్చినవి?

విజయమ్మ: రాజశేఖరరెడ్డిగారు చేసినవన్నీ మంచి పనులే. ఇప్పుడున్న వాళ్లు రాజశేఖరరెడ్డి పెట్టారని ఏ పథకం తీసేయాలన్నా తీయలేనివే. ఆయన ఎంతో ఆలోచన చేసి పథకాలను ప్రవేశపెట్టారు. ఇంకా ఏం చేయాలా? అని ఎప్పుడూ తపన పడేవారు. ఇప్పుడు చంద్రబాబు ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నారంటే అవన్నీ రాజశేఖరరెడ్డిగారి పుణ్యమే. చంద్రబాబు ఆరోగ్యశ్రీని తీసేయగలరా? ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తీసేయగలరా? రాజశేఖరరెడ్డి పేరు లేకుండా చేయాలని వాళ్లకు ఉన్నా అలా చేయలేనివి ఆయన పథకాలు.

■ అప్పుడు వాతావరణం బాగోలేకపోయినా రాజశేఖరరెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు ఎందుకు వెళ్లారు. అధికారులు వద్దన్నారా? అధికారులు వద్దన్నా ఈయన వెళ్లారా? అసలేం జరిగింది?

విజయమ్మ: ఆ రోజు నేను కూడా చెప్పా. వర్షం పడుతోంది, అసెంబ్లీ కూడా అయిపోయింది, ఇప్పుడు వెళ్లకుంటే ఏమవుతుంది? అన్నా. చాలా పనులున్నాయన్నారు. త్వరగా జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేయాలి, రాష్ట్రానికి ఏమేం కావాలో అవన్నీ చేయాలి అని తపన పడేవారు. మూడేళ్లలో పోలవరం, ప్రాణహిత సహా ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామనేవారు. సోనియా గాంధీని కూడా వీటి గురించి అడిగి వచ్చారు. 33 మంది ఎంపీలను గెలిపించి తీసుకొస్తానంటే ఆమెకు నమ్మకం కలగలేదు. పదో, పన్నెండు మందో గెలుస్తారనుకున్నారు. వైఎస్ ఒక్కటే చెప్పారు. ఎన్నికలు అయిపోయాక డిసైడ్ చేయండమ్మా, మీరు పది 12 సీట్లు అనుకుంటున్నారు, నేను 33 నుంచి 36 మంది ఎంపీలను తీసుకొస్తాను, అప్పుడు మీరు నిర్ణయం తీసుకోండి అని అన్నారు.

■ వైఎస్ మరణం ఒక కుట్ర అని ప్రచారం జరిగింది. హెలికాప్టర్ ప్రమాదమేనని అనుకున్నారా?

విజయమ్మ: నాకు కూడా ఏదో జరిగింది అన్న అనుమానం ఉండేది. జగన్‌ను చాలాసార్లు అడిగాను. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకుంటే తప్ప ఏం జరిగినా బయటకు రాదమ్మా, రెండు ప్రభుత్వాలు దీని గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు కాబట్టి బయటకు వచ్చేది ఏమీ ఉండదు అని అన్నాడు.

> 2014 ఎన్నికల్లో 41 మంది ఎంపీలను గెలిపించుకొచ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తానంటూ నాన్న చెప్పిన మాటను తాను నెరవేరుస్తానన్నాడు. ఆ తర్వాతే ముఖ్యమంత్రి అవుతానని సోనియాగాంధీకి జగన్ చెప్పాడు. అప్పుడు పెద్దాయన చనిపోయారనే షాక్‌లోనే మేమున్నాం. అప్పుడు ముఖ్యమంత్రి కావాలనే ఊహ కూడా మాకు లేదు.

> ఎందుకొచ్చిన రాజకీయాలు, ఒక రోజు ఇంటి పట్టున అందరూ కలిసి ఉండే పరిస్థితి లేదు, నాలుగు పరిశ్రమలు పెట్టుకుని దర్జాగా కాలిమీద కాలేసుకుని ఏసీ రూముల్లో ఉండొచ్చని, రాజకీయాలు మనకు వద్దని అప్పట్లోనే జగన్‌కు చెప్పాను. 'మా నాన్న ఎంతోమంది హృదయాల్లో ఉన్నారు. మా నాన్న ఫొటో ఇంట్లో పెట్టుకునేవారు ఎందరో ఉన్నారు. నాకు అలాంటి జీవితమే ఇష్టమమ్మా' అని జగన్ అన్నాడు. చిన్నప్పుడు జగన్ నన్ను ఎప్పుడూ ఎలాంటి ఇబ్బంది పెట్టేవాడు కాదు.

జగన్ కుమార్తె హర్షకు లండన్ స్కూల్‌లో సీటు వచ్చింది కదా, ఎలా ఫీలయ్యారు?

విజయమ్మ: ఆమె చాలా తెలివైనది. ఎక్కడైనా సీటు వస్తుంది. బాగా చదువుతుంది. సబ్జెక్టు పుస్తకాలే కాకుండా నాలెడ్జ్ పెరిగే ఇతర పుస్తకాలు చాలా చదివింది.

■ మీ బాల్యం, చదువు గురించి చెబుతారా?

విజయమ్మ: ఎనిమిదో తరగతి వరకు నేను తాడిపత్రి సమీపంలోని యాడికి దగ్గరి గ్రామంలో మా నాన్నమ్మ దగ్గర పెరిగాను. ఆ తర్వాత పులివెందులకు వచ్చాను. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు రాజశేఖరరెడ్డితో పెళ్లయ్యింది.

■ 2019 ఎన్నికల్లో మీరు, షర్మిల ప్రచారానికి వెళ్తారా?

విజయమ్మ: 2014లో జగన్ లేని సమయంలో నేను, షర్మిల బయటకు రావాల్సి వచ్చింది. ఇప్పుడు చిన్న రాష్ట్రమే.. 13 జిల్లాలే కనుక అంత అవసరం ఉండకపోవచ్చు. అవసరమైతే వెళ్తాం.

■ ఇంట్లో మీరు ఎలా వ్యవహరిస్తుంటారు?

విజయమ్మ: ఇంట్లో ఉదయం అందరం కలుస్తాం. జగన్ వచ్చినప్పుడు కలుస్తాం. పిల్లలతోసహా అందరం కలిసి మాట్లాడుకుంటాం. రాజశేఖరరెడ్డి ఈ అలవాటు మాకు చేశారు.

■ మీ మనవడు, మనవరాళ్లకు రాజకీయాలపై ఆసక్తి ఉందా?

విజయమ్మ: చిన్నపిల్లలు కదా? ఇంకా వాళ్లకేమీ తెలియదు. మా కోడలు భారతి నాతో సొంత కూతురిలాగే ఉంటుంది. వాళ్లంతా మాకు దేవుడు ఇచ్చిన బిడ్డలు.

■ ఈ కష్టాల నుంచి ఎలా గట్టెక్కగలమని అనుకుంటున్నారు?

విజయమ్మ: ఎన్ని సమస్యలున్నా దేవుడే అధిగమింపజేస్తాడని అనుకుంటాం. సమస్యలను ఎదుర్కొనే ధైర్యం మనిషికి దేవుడే ఇస్తాడు. జగన్‌కు ఆ ధైర్యం ఉంది. మనమెన్ని మాటలు మాట్లాడినా చివరకు దేవుడికి జవాబుదారీగా ఉండాలి.



> 8 ప్రాజెక్టులు జాతీయ ప్రాజెక్టులుగా కావాలని సోనియా గాంధీని వైఎస్ అడిగారు. ఆమె చేస్తానని చెప్పారు. వైఎస్ బతికి ఉండి ఉంటే పోలవరం, ప్రాణహితతో పాటు అన్ని ప్రాజెక్టులూ పూర్తయ్యేవి. బంగారం లాంటి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ చీలిపోకుండా ఉండేది.

చంద్రబాబు 1978లో గెలిచాక అప్పట్లో రాజశేఖరరెడ్డికి మిత్రుడట కదా? చంద్రబాబుకు మంత్రి పదవి ఇప్పించడంలో రాజశేఖరరెడ్డి పాత్ర ఉందంటారు. నిజమేనా?



విజయమ్మ: అప్పుడు ఎక్కడికి వెళ్లినా వాళ్లు కలిసి వెళ్లేవారు. కేఈ కృష్ణమూర్తి, చంద్రబాబు కలిసి ఉండేవారు. ఇంటికి కూడా బాగా వస్తుండేవారు. అంజయ్య గారితో పోట్లాడి మరీ చంద్రబాబుకు మంత్రి పదవి ఇప్పించారు.

■ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు మధ్య తేడాను ఎట్లా పోల్చుతారు.

విజయమ్మ: ఆయనకు, ఈయనకు పోలికే లేదు. నక్కకూ, నాగలోకానికున్నంత తేడా ఉంది. వైఎస్‌తో చంద్రబాబును పోల్చాల్సిన అవసరం కూడా లేదు.

■ చంద్రబాబు కాకుండా జగన్ సీఎం కావాలని ప్రజలు ఎందుకు కోరుకోవాలనుకుంటున్నారు?

విజయమ్మ: ఎవరైనా ప్రజలకు మంచి చేయాలి. మంచి పనులు చేస్తామనే వారికి కాకుండా వేరేవాళ్లకు ప్రజలు ఎందుకు ఓటు వేస్తారు. మంచి చేస్తానంటున్న జగన్‌కే తప్పకుండా ఓటు వేస్తారు. వైఎస్ పాలన చూశారు కనుక జగన్ పాలన రావాలన్న కోరిక ప్రజల్లో నాకు కనిపిస్తోంది. చంద్రబాబు దగ్గర అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలుంటే, మా దగ్గర ప్రజలున్నారు. వైఎస్ ఒక మాట చెప్పేవారు. ప్రజల్లో నిలబడి ఉంటే నాయకులు వాళ్లంతట వాళ్లే వస్తారనేవారు.

■ జగన్ ఇలా రాజకీయాల్లోకి వస్తారని అనుకునేవారా?

విజయమ్మ: 2009లో ఎంపీగా నిలబడాల్సి వచ్చినప్పుడు తాను నిలబడనని జగన్ చెప్పాడు. చిన్నాన్నతో పోటీ చేయించండని అన్నాడు. అలా మాట్లాడొద్దు, నా 30 ఏళ్ల అనుభవం నీకు ఉపయోగపడుతుంది, ఎక్కువ మంది ప్రజలకు మంచి చేయాలంటే అధికారంలో ఉంటేనే చేయగలుగుతావు అని వైఎస్ చెప్పారు.

■ ఏపీకి ప్రత్యేక హోదా గురించి ఏమని భావిస్తున్నారు?

విజయమ్మ: విభజన వల్ల హైదరాబాద్ పోయింది కనుక ప్రత్యేక హోదా ఎంతో అవసరం. ఏపీలో పరిశ్రమలు లేవు, ఆసుపత్రులు లేవు. ఏపీకి హైదరాబాద్ లాంటి రాజధాని రావాలంటే కష్టమే. మహిళలపై జరుగుతున్న దురాగతాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉంది. ఇక చంద్రబాబు ఏ వర్గానికి కూడా న్యాయం చేయడం లేదు. నాలుగేళ్లవుతోంది. చంద్రబాబు అసెంబ్లీ కట్టారా? హైకోర్టు కట్టారా? ఆయన ఎవరికి మేలు చేశారు? ఎంతమందికి మేలు చేశారు? తన పేరు గుర్తుండిపోయేలా చంద్రబాబు ఒక్క పనైనా చేశారా? ఏదీ లేదు. ప్రజలే ఆయనకు తగిన సమాధానం చెబుతారు.

■ చంద్రబాబు కంటే జగన్ మేలు, ఆయనకు ఓటేయాలని ప్రజలకు ఎలా చెప్పగలుగుతారు?

విజయమ్మ: గతంలో వైఎస్ ఎంపీల మీటింగ్‌లో చంద్రబాబుకు చెప్పారు. 2000వ సంవత్సరం కంటే ముందు ప్రాజెక్టులు కట్టి ఉంటే నికర జలాలు కేటాయిస్తారు, ప్రాజెక్టులు మొదలు పెట్టు అని బాబుకు సూచించారు. దేవుడు అవకాశం ఇచ్చి 14 ఏళ్ల అధికారంలో ఉన్నా చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయనప్పుడు చరిత్రలో అలాంటి వ్యక్తిని మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం లేదని అనుకుంటున్నా.

■ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు చాలా డబ్బు ఖర్చు పెడతారంటున్నారు. వాటిని ధీటుగా ఎదుర్కొనే పరిస్థితి మీ పార్టీలో ఉందా? మీ పార్టీ నడుస్తున్న తీరుపై మీరేమంటారు?

విజయమ్మ: అనుభవం కొంతమేర ఉపయోగపడవచ్చేమో గానీ నాయకుడు కావాలనుకొనే వ్యక్తికి మానవత్వం చాలా ముఖ్యం. అలా ఉన్నప్పుడే ఏమైనా చేయగలుగుతారు. అది జగన్‌లో ఉంది. చంద్రబాబులో లేదు. అనుభవం అంటున్నారు. దేనిలో చూపించారు. హైకోర్టు కట్టారా? అసెంబ్లీ కట్టారా? ఏం చేశారు?

■ జగన్‌ను ప్రజలకు అప్పగించానని మీరంటున్నారు. ప్రజలు ఆయనను ఎట్లా చూస్తున్నారు?

విజయమ్మ: ఓదార్పు యాత్రలో జగన్‌ను చూసేందుకు బయటకు రానివారు ఎవ్వరూ లేరు. నేను ప్రచారానికి వెళ్లినప్పుడూ అంతే. ఎంతో ప్రేమ చూపించారు. వాళ్లకు ఈ కుటుంబం ఎంత రుణపడి ఉందో వారు కూడా అదే విధంగా ప్రేమను చూపిస్తున్నారు. నా బిడ్డ అందరికీ మంచి చేస్తాడు.

> చంద్రబాబుకు దేవుడు చాలా సమయం ఇచ్చాడు. ఇంతకు ముందు తొమ్మిదేళ్లు, ఇప్పుడు ఐదేళ్లు. చంద్రబాబు సద్వినియోగం చేసుకోవడం లేదెందుకో అర్థం కావడం లేదు. రాజశేఖరరెడ్డి ఏం చేశారు, ఆయన పోయాక కూడా జనం ఎందుకు గుర్తు పెట్టుకుంటున్నారన్న ఆలోచన సైతం చంద్రబాబుకు కలగడం లేదు.



ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తానని తెలిపారు. జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభిస్తోందని, జగన్‌కు ప్రజలు ప్రతిచోటా నీరాజనాలు పడుతున్నారన్నారు.
– సాక్షిప్రతినిధి, నెల్లూరు



గూడూరు కోర్టు సెంటర్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న జగన్

బాబు యావంతా లంచాల మీదే

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లంచాలు, కమీషన్ల మీద ఉన్న ధ్యాస ప్రజల సంక్షేమంపై లేదని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. పేదల ఇళ్ల మొదలు పెన్షన్ల వరకు లంచాలు వచ్చే పనులే చేస్తున్నారని మండిపడ్డారు. దుగరాజపట్నం పోర్టు వద్దని కేంద్రానికి లేఖ రాయడానికి, ప్రత్యేక హోదా వద్దని చెప్పడానికి చంద్రబాబు ఎవరని ప్రజలే ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 73వ రోజు ఆదివారం సాయంత్రం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు కోర్టు సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గూడూరు అభివృద్ధిని విస్మరించారని, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే ఆలోచన చేయడం లేదని చంద్రబాబు పాలనను ఎండగట్టారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తర్వాత నవరత్నాల్లో భాగంగా చదువుల విప్లవం తెస్తామన్నారు. పేద కుటుంబాల్లోని పిల్లలు ఎంత పెద్ద చదువులు చదువుకున్నా అంత వరకు ఎంత ఖర్చయినా తాను చదివిస్తామంటూ భరోసా ఇచ్చారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

నిప్పులు చెరిగిన ప్రతిపక్ష నేత జగన్

- రైతులకు గిట్టుబాటు ధర కల్పించడు.. అర్హులకు పింఛన్లు ఇవ్వడు
- దుగరాజపట్నం పోర్టు పట్టదు.. గూడూరు అభివృద్ధిని విస్మరించారు..
- ఓటుకు కోట్లు కేసుల్లో అడ్డంగా దొరికినా రాజీనామా చేయరు
- నిరుద్యోగులు రాష్ట్రానికి చంద్ర గ్రహణం పట్టిందంటున్నారు..
- మనందరి ప్రభుత్వం రాగానే చదువుల విప్లవం
- ప్రతి పేద బిడ్డనూ ఉచితంగా చదివించే బాధ్యత నాది..
- ఎన్ని లక్షలు ఖర్చయినా, ఎంత పెద్ద చదువైనా చదివిస్తాం
- అవ్వాతాతలకు నెలనెలా పింఛన్ రూ.2 వేలు ఇస్తాం
- ప్రతి పేదకూ సొంతిల్లు కట్టిస్తాం

దుగరాజపట్నం వద్దనడానికి చంద్రబాబెవరు?

''నేను ఇక్కడకు వస్తున్నప్పుడు చాలా మంది యువతీ యువకులు నా దగ్గరకు వచ్చి.. 'అన్నా, ఉద్యోగాలు దొరకడం లేదన్నా, చదువుకున్న మేము ఎక్కడికి పోవాలో అర్థం కావడం లేదన్నా.. పక్కనే దుగరాజపట్నం పోర్టు ఉందన్నా.. ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టేటప్పుడు 2018 నాటికి ఈ పోర్టు తొలిదశను పూర్తి చేస్తామని విభజన చట్టంలో కూడా పెట్టారన్నా. కానీ మా ఖర్మ ఏమిటంటే మా ప్రాంతానికి చంద్రగ్రహణం పట్టిందన్నా.. విభజన చట్టంలో పేర్కొన్నదాని ప్రకారం దుగరాజపట్నం పోర్టును కేంద్రం పూర్తి చేస్తామని అంటుంటే మన ముఖ్యమంత్రి మాత్రం.. ఆ పోర్టు కట్టకపోయినా పర్వాలేదు.. దానికి బదులు రామాయపట్నం పోర్టు కట్టండని లేఖ రాశారన్నా.. మా తరఫున లేఖ రాయడానికి ఈ చంద్రబాబు ఎవరన్నా? దుగరాజపట్నం పోర్టు వద్దనడానికి ఆయన ఎవరన్నా?' అని ఆ పిల్లలు అడుగుతూ ఉన్నారు. ఇదేకాకుండా ప్రత్యేక హోదా వద్దనడానికి చంద్రబాబు ఎవరని కూడా ఆ పిల్లలు ప్రశ్నించారు. దుగరాజపట్నం పోర్టు పూర్తి కాకపోవడంతో ఈవేళ చదువుకున్న పిల్లలు ఉద్యోగాల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.



పాలిచర్లలో అక్కచెల్లెమ్మలతో మాట్లాడుతున్న జగన్

ఉద్యోగాలివ్వాలన్న ఆలోచనే లేదు..

ఈ పక్కనే కృష్ణపట్నం పోర్టు ఉంది. తొమ్మిదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేశారు. కానీ ఏ రోజూ ఈ జిల్లాకు పోర్టు తీసుకురావాలన్న ఆలోచన చేయలేదు. ఈ జిల్లా పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆలోచన చేయలేదు. కానీ కృష్ణపట్నం పోర్టు అనంగానే మనకు గుర్తుకు వచ్చేది ఆ ప్రియతమ నేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. చంద్రబాబు తన తొమ్మిదేళ్ల పాలనలో చేయలేని పనిని మన ప్రియతమ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన ఐదేళ్ల పాలనలో చేశారు. పోర్టు కట్టించారు. ఉద్యోగాలు వచ్చేట్టు చేశారు. ఆ తర్వాత మన ప్రియతమ నేత మన మధ్య లేకుండా పోయారు. ఆయన చనిపోయిన తర్వాత కథ మళ్లీ మొదటికి వచ్చింది.

ఆవేళ వేసిన పైపులైన్లో ఈవేళ నీళ్లొచ్చే పరిస్థితి లేదు..

ఇదే గూడూరు మున్సిపాలిటీ పరిస్థితి ఏమిటో చూడండి.. కండలేరు నుంచి ఈ మున్సిపాలిటీకి నాన్నగారు రూ.63 కోట్లతో పైప్‌లైను వేయించి తాగునీళ్లు అందించారు. నాన్నగారు చనిపోయిన తర్వాత ఈవేళ పరిస్థితి ఏమిటంటే ఆ పైప్ లైను ద్వారా నీళ్లు కూడా సరిగా ఇవ్వలేని అధ్వాన పరిస్థితి. ఈ చంద్రబాబు పాలన ఎంత అధ్వానంగా ఉందో చెప్పాలంటే మీ కళ్ల ముందే ఫ్లై ఓవర్ కనబడుతోంది. గూడూరు పాత టౌన్, కొత్త టౌన్‌ను కలిపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ అది. నాన్నగారు మంజూరు చేయించి సగానికిపైగా పూర్తి చేయిస్తే ఆ మిగిలిన సగభాగాన్ని చంద్రబాబు తన నాలుగేళ్ల పాలనలో పూర్తి చేయించలేకపోయారు. ఆ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనకు, చంద్రబాబు పాలనకు ఉన్న తేడా ఇది.

80 కిలోల నిమ్మకాయలు రూ.500లేనా?

నెల్లూరు జిల్లాలోని నిమ్మ రైతుల పరిస్థితి ఇవాళ చంద్రబాబు పాలనలో దారుణంగా ఉంది. సుమారు 40 వేల ఎకరాలలో నిమ్మ తోటలు వేశారు. నిన్నా, మొన్నా నిమ్మరైతులు వచ్చి నన్ను కలిశారు.. 80 కిలోల నిమ్మకాయలు ఈవేళ రూ.500కు కొంటున్నారన్నా.. మేము ఎలా బతకాలన్నా? అని అడుగుతా ఉన్నారు. కనీసం రూ.2 వేలన్నా ఉండాలన్నా అని ఆ రైతులు చెబుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడు లేడు. నిమ్మకాయల రైతులే కాదు సరుగుడు రైతుల పరిస్థితీ అలాగే ఉంది. నాన్నగారి హయాంలో ఎకరాకు గతంలో మూడు, మూడున్నర లక్షల రూపాయల ఆదాయం వస్తే ఇప్పుడు రూ.80 వేలకు మించడం లేదు. చంద్రబాబు హయాంలో ఈవేళ ఏ రైతుకూ గిట్టుబాటు ధర లేదు. ఈ ప్రాంతమే కాదు.. రాష్ట్రం అంతటా ఇదే పరిస్థితి.

నల్లధనంతో అడ్డంగా దొరికిపోయినా..

చంద్రబాబు పాలనలో మంచి జరక్కపోగా పైనుంచి కింది దాకా డబ్బులు ఎలా మేయాలన్న యావే. ఈ దిక్కుమాలిన పాలనలో దేన్నీ వదలడం లేదు. మట్టి, ఇసుక, బొగ్గు, కాంట్రాక్టులు, ప్రాజెక్టులు, రాజధాని భూములు, గుడులు, గుడి భూములు.. ఇలా దేన్నీ వదలకుండా లంచాల మీద లంచాలు మేసేస్తున్నారు. పైన ఆయన తింటుంటే కింది స్థాయిలో గ్రామాల్లో జన్మభూమి కమిటీలు మేస్తున్నాయి. పెన్షన్లు రావాలన్నా, రేషన్ బియ్యం ఇవ్వాలన్నా, చివరకు మరుగుదొడ్లు మంజూరు కావాలన్నా ఈ కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి. ఎక్కడా మంచి జరగడం లేదు. చట్టాలను ఉల్లంఘిస్తున్నారు.. ఎమ్మెల్యేలను విచ్చలవిడిగా రూ.20 కోట్లు, రూ.30 కోట్లు పెట్టి కొనుగోలు చేస్తారు. ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించరు. అనర్హత వేటు వేయరు. కొనుగోలు చేసిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తారు. ఈవేళ చంద్రబాబు క్యాబినెట్ చూస్తా ఉంటే అది తెలుగుదేశం క్యాబినెట్టా, లేక మరో క్యాబినెట్టా అనేది ప్రజలకు అర్థం కాని పరిస్థితి. విచ్చల విడిగా అవినీతి సొమ్ముతో, నల్లధనంతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో, వీడియో టేపులతో దొరికిపోతాడు. ఎవరైనా ఉద్యోగో మరొకరో లంచాలు ఇస్తూనో, తీసుకుంటునో దొరికిపోతే వెంటనే ఉద్యోగాల నుంచి తీసివేస్తారు. అవునా? కాదా? (జనం నుంచి అవును, అవును అంటూ ప్రతిస్పందన) ముఖ్యమంత్రి లాంటి వ్యక్తి లంచాలు ఇస్తూ ఆడియో, వీడియో టేపులతో దొరికిపోతే.. నల్లధనంతో పట్టుబడితే అది ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన్ను జైల్లో పెట్టి నాలుగు తన్ని అడగాలి.. కానీ అదే వ్యక్తి ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతా ఉంటాడు. పదవికి రాజీనామా చేయడు.. అనర్హత వేటు పడదు.. ఇంతటి దారుణమైన పాలన రాష్ట్రంలో కొనసాగుతా ఉంది. వ్యవస్థలను దిగజార్చుతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో మిమ్మల్ని ఒక్కటే ప్రశ్న అడుగుతున్నా.. మీకు ఎలాంటి నాయకుడు కావాలి? మోసం చేసే ముఖ్యమంత్రి కావాలా? అబద్ధాలు చెప్పే ముఖ్యమంత్రి కావాలా? (వద్దు, వద్దు అని జనం నుంచి జవాబు) చంద్రబాబు లాంటి వాళ్లను క్షమిస్తే ముమ్ముందు ఏమంటారో తెలుసా? ఇంటికో కేజీ బంగారం అంటాడు.. దానికి బోనస్‌గా ఇంటికో బెంజి కారు అంటాడు. మీరు నమ్ముతారా? (నమ్మం, నమ్మం అని జనం అరుపులు) మీరు నమ్మరని తెలిస్తే అప్పుడు ఓట్లు కొనేందుకు తాను సంపాయించిన అవినీతి సొమ్మును బయటకు తీసి తలా రూ.3 వేలంటూ బిస్కట్ వేస్తాడు. గుండెల మీద చేయి వేసుకుని ఒక్కసారి ఆలోచించండి. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చాలి. అది నా ఒక్కడి వల్లే కాదు, మీ అందరి సహాయ సహకారాలు, ఆశీస్సులు కావాలి. పాదయాత్రగా మీ ముందుకు వచ్చిన మీ బిడ్డను ఆశీర్వదించండి.

ప్రతి బిడ్డా చదవాలి.. ఎంత ఖర్చయినా భరిస్తాం..

మీ అందరి ఆశీస్సులతో మన ప్రభుత్వం వచ్చాక అమలు చేయబోయే నవరత్నాలను ఇప్పటికే ప్రకటించాం. వాటిలో ఒకటైన పేదల చదువు గురించి చెబుతా.. పేదరికంలో ఉన్న మనం ఈవేళ మన పిల్లల్ని ఇంజినీరింగో, డాక్టరో చదివించే పరిస్థితిలో ఉన్నామా? ఇంజినీరింగ్ వంటి కోర్సుల ఫీజులు లక్షల్లో ఉన్నాయి. కానీ ఈ ప్రభుత్వం రూ.30 వేలు, 35 వేలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తా ఉంది. అది కూడా ఏడాది, ఏడాదిన్నర తర్వాత. ఈ ఏడాది ఇంకా రాలేదని పిల్లలు చెబుతున్నారు. లక్షకు పైచిలుకు ఫీజు ఉంటే మిగతా 60, 70 వేల రూపాయలు ఎక్కడి నుంచి తేవాలి? ఎన్నికలప్పుడు మాత్రమే ఈ పెద్దమనిషి (చంద్రబాబు)కి పేదలు, బీసీలు గుర్తుకువస్తారు. నిజంగా పేదలపై ప్రేమ చూపిన వ్యక్తి వైఎస్ మాత్రమే. ఆయన హయాంలో ఇంజినీరో, డాక్టరో, మరొక పెద్ద కోర్సో చదవాలంటే ధైర్యంగా చదువుకునే వారు. ఇపుడా పరిస్థితి లేదు. అందుకే చెబుతున్నా.. పేదల కోసం నాన్నగారు ఒక్క అడుగు ముందుకు వేస్తే ఆయన కుమారునిగా నేను రెండడుగులు ముందుకు వేస్తున్నా.. మీ పిల్లలు ఇంజినీరింగ్, డాక్టర్, కలెక్టర్ లేదా మరేదైనా పెద్ద చదువు చదువుతానంటే ఎంత ఖర్చయినా నేను చదివిస్తా.. హాస్టల్, మెస్ చార్జీల కింద ప్రతి పిల్లవానికీ ఏటా రూ.20 వేలు ఇస్తాం. చిట్టిపిల్లల్ని బడికి పంపే ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం. అవ్వా తాతలకు పింఛన్లు పెంచితే చంద్రబాబుకు కమీషన్లు రావు. అదే కాంట్రాక్టర్ల రేట్లు పెంచితే కమీషన్లు వస్తాయి. మన ప్రభుత్వం రాగానే ప్రస్తుత పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచుతాం. ప్రతి పేదకూ ఇల్లు కట్టిస్తాం. నవరత్నాల్లో సూచనలు, సలహాలు ఉంటే చెప్పండి''అని జగన్ అన్నారు.

స్విచ్ వేయాలంటే షాక్ కొట్టే పరిస్థితి...

- అధికారంలోకి రాగానే కరెంట్ చార్జీలు తగ్గిస్తానన్నాడు. తీరా మూడుసార్లు చార్జీలు పెంచారు. ఈవేళ మనం స్విచ్ వేస్తేనే షాక్ కొట్టే పరిస్థితి. కరెంట్ వాళ్లు రూ. ఐదారు వేలు.. బిల్లులు ఇస్తూ పెనాల్టీలు వేస్తున్నారు.
- పెట్రోలు, డీజిల్ ధరలు మన రాష్ట్రంలో భగ్గుమంటున్నాయి. తమిళనాడులో రూ.7, కర్ణాటకలో అయితే రూ.6 తక్కువ.
- రేషన్ షాపుల్లో నేడు బియ్యం తప్ప మరేమీ దొరకడం లేదు.
- బెల్ట్ షాపులు తొలగించకపోగా ఫోన్ కొడితే ఇంటికే మద్యం తెచ్చిచ్చే పరిస్థితిని కల్పించారు. ఏటేటా 15 శాతం విక్రయాలు పెంచుతున్నారు.
- రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను పూర్తిగా, బేషరతుగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఇపుడు రుణ మాఫీ కింద ఇచ్చిన సొమ్ము రైతులు తీసుకున్న పంట రుణాల వడ్డీకే సరిపోని పరిస్థితి. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రాకపోగా వేలం నోటీసులొస్తున్నాయి.
- పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రూపాయి కూడా మాఫీ కాలేదు.
- బాబు వస్తే జాబు అన్నాడు. లేకుంటే నిరుద్యోగ భృతి అన్నాడు. ఇలా ప్రతి ఇంటికీ గత 45 నెలలకు రూ.రెండు వేల చొప్పున రూ.90 వేలు బాకీ పడ్డాడు. ఎక్కడైనా కనిపిస్తే ఆ డబ్బు ఎప్పుడిస్తావ్ బాబూ అని అడగండి.

బాబు లంచాల కోసం పేదోడిపై భారం

చంద్రబాబు పాలన అంతా లంచాల చుట్టే తిరుగుతోంది. ప్రతి దాంట్లో.. తనకు డబ్బు ఎంత వస్తుంది? లంచం ఎంత ఇస్తారన్నదే పరిస్థితి. గూడూరుకు సమీపంలోనే దివిపాలెం పక్కన పేదలకు ఫ్లాట్స్ కడతా ఉన్నారట. 300 అడుగుల ఫ్లాట్స్ అవి. ఒక్కో అడుగుకు రూ.2 వేల చొప్పున ధర నిర్ణయించారట. అంటే ఆ ఫ్లాట్ రూ.6 లక్షల ధర పడుతుంది. పేదవాళ్ల కోసం కట్టే ఈ ఫ్లాట్లలో లిఫ్టులు, మార్బుల్స్, డే లైట్ కిచెన్లు ఉండవు.. ఇలాంటివన్నీ లేనప్పుడు అడుగు వెయ్యి రూపాయలు కూడా పడదని, రూ.850, రూ.900 కూడా అయ్యే పరిస్థితి ఉండదని బిల్డర్లు చెబుతున్నారు. ఒకవేళ రూ.వెయ్యి అనుకున్నా ఈ తరహా ఫ్లాట్ల ఖరీదు రూ.3 లక్షలకు మించకూడదు. కానీ చంద్రబాబు మాత్రం వీటిని పేదలకు రూ.6 లక్షలకు అమ్ముతారట. ఈ ఆరు లక్షల్లో లక్షన్నర కేంద్ర ప్రభుత్వం, లక్షన్నర రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందట. అంతవరకు బాగానే ఉంది. కానీ మిగతా రూ.3 లక్షల భారాన్ని పేదవాడి నెత్తిన అప్పుగా రాసుకుంటాం అని చంద్రబాబు చెబుతున్నారు. 20 ఏళ్ల పాటు ఆ పేదవాడు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున కట్టుకుంటూ పోవాలట. చంద్రబాబుకు లంచాలు రావడం కోసం పేదవాడు భారం మోయాలా? ఇప్పుడు ఇక్కడ కడుతున్న ఫ్లాట్లకు దగ్గర్లోనే ఆ ప్రియతమ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కట్టించిన ఇందిరమ్మ గృహాలు కనిపిస్తాయి. అవి పేద వాడికి ఎంతో సంతృప్తిని ఇచ్చాయి. తన సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నామన్న తృప్తి. కానీ ఈవేళ చంద్రబాబు నాలుగేళ్ల పాలనలో ఆ ఇందిరమ్మ కాలనీలకు నీళ్లు లేవు.. కరెంటు లేదు.. డ్రైనేజీ లేదు అన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. పేద ప్రజల్ని పట్టించుకునే పరిస్థితి లేదు.

ప్రజాసంకల్ప యాత్ర 73వ రోజు	73వ రోజు
ఇప్పటి వరకూ నడిచిన దూరం	నడిచిన దూరం
992.5 కిలో మీటర్లు	12 కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8 గంటలకు తిమ్మసముద్రం క్రాస్

ముగింపు
సా. 6 గంటలకు గూడూరు కోర్టు సెంటర్

ముఖ్యాంశాలు
- కొండగుంట, పాలిచెర్లలో పార్టీ జెండాల ఆవిష్కరణ
- గూడూరులోని గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీ, తిలక్‌నగర్, సబ్ కలెక్టర్ సెంటర్ మీదుగా కోర్టు సెంటర్ వరకు జనంతో మమేకం
- కోర్టు సెంటర్‌లో బహిరంగ సభ

నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉ. 8 గంటలకు గూడూరు కోర్టు సెంటర్

ముఖ్యాంశాలు
- గోగినేనిపురం, చెన్నూరు మీదుగా వెంకటగిరి క్రాస్‌రోడ్డు వరకు జనంతో మమేకం
- భోజన విరామం అనంతరం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురం మండలం తూర్పుపూండ్ల క్రాస్ వరకు జనంతో మమేకం.
- సైదాపురం వద్ద వెయ్యి కి.మీ చేరనున్న పాదయాత్ర
- విజయ సంకల్ప స్థూపం ఆవిష్కరణ.
- 'వాక్ విత్ జగనన్న' కార్యక్రమం

ఉప్పొంగిన అభిమానం.. ఉప్పెనలా జనం

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: జనం.. జనం.. ప్రభంజనం. ఊళ్లకు ఊళ్లే తరలొచ్చినట్టు.. కెరటం ఎగిసిపడ్డట్టు.. నేలే కన్పించనట్టు.. జనమే జనం. జనమెక్కడానికి చెట్లు చాల్లేదు. భవనాలూ సరిపోలేదు. గోడలు.. వాహనాలు.. ఏది కన్పిస్తే అది.. ఎక్కడ కాసింత చోటు కనిపిస్తే అక్కడా జనం. తోసుకొచ్చేవాళ్లు, ఎగిరెగిరి చూసేవాళ్లు.. వాళ్లను వాళ్లే మైమరచి జననేతను తదేకంగా చూస్తూ.. ఆయన మాటలను వింటున్న సన్నివేశాలు గూడూరు చరిత్రలో అరుదైన ఘట్టమంటున్నారు స్థానికులు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం గూడూరు కూడలిలో విపక్ష నేత వైఎస్ జగన్ బహిరంగ సభ దగ్గర కన్పించిన సన్నివేశమిది. చిన్నారులు మొదలు.. వృద్ధుల వరకు అభిమాన నేతను చూసేందుకు భారీగా తరలివచ్చారు. జగన్ ప్రసంగించే సభా స్థలి జనంతో నిండిపోయింది. అందరికీ కన్పించేందుకు ఆయన తన చుట్టూ ఉన్న నేతలను వెనక్కు పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ స్వరం జనం గొంతుకైంది. ప్రజల కష్టాలు.. ప్రభుత్వ అవినీతే జగన్ వాగ్బాణాలయ్యాయి. రోజూ అనుభవించే కష్టాలు.. అనుక్షణం కన్నీరు పెట్టించే అగచాట్లు.. గుండెలను పిండేసే పేదోడి హృదయఘోష.. ఇవే జగన్ మాటల్లో విన్పించాయి. అందుకే ప్రతీ పేదవాడి గుండె ఆ క్షణం ఉద్వేగంతో ఉప్పొంగింది.. షాక్ కొట్టే కరెంట్ బిల్లులు.. చావు దగ్గరైనా దిక్కులేని పెన్షన్లు.. చదవించాలన్నా చేయూతనివ్వని సర్కార్.. చదువుకున్నా ఉపాధి కల్పించలేని వ్యవస్థ.. పేదవాడికి రోగమొస్తే ఆదుకోని పాలకులు.. వీటన్నింటి గురించి జననేత నిప్పులు చెరుగుతుంటే జనం ప్రతీమాటకు ప్రతిస్పందించారు. రెండు చేతులూ పైకెత్తి మద్దతు పలికారు. 'మోసం చేసే ముఖ్యమంత్రి అవసరమా?' అని జగన్ ప్రశ్నిస్తే 'వద్దు.. వద్దంటూ...' దిక్కులు పిక్కటిల్లేలా సమాధానమిచ్చారు. విశ్వసనీయత పెంచేందుకే వచ్చానని చెప్పినప్పుడు ఆత్మీయంగా చప్పట్లతో స్వాగతించారు. పేదల కోసం ఏదైనా చేస్తాడనే నమ్మకం.. బతుకుకు భరోసా ఇస్తాడనే ధైర్యం.. సభకొచ్చిన ప్రతీవ్యక్తిలోనూ కన్పించాయి. జననేత సభకు ఫిరాయింపు ఎమ్మెల్యే అడుగడుగునా విఘ్నాలు కలిగించినా ప్రజాభిమానం చెక్కు చెదరలేదు. ఏ స్థాయిలో బెదిరించినా జనం భయపడలేదు. జననేత ఫ్లెక్సీలు చూసి ఈర్ష్య పడటమే కాదు.. గూడూరులో 150 ఫ్లెక్సీలు తీయించినట్టు జనం తెలిపారు. ఆఖరుకు ఓ చోట అభిమాని కట్టిన బెలూన్‌ను కూడా ఎమ్మెల్యే అనుచరగణం తొలగించడం గమనార్హం. అంతటితో ఆగకుండా పాదయాత్ర కోసం వచ్చే వారికి ఆశ్రయమే ఇవ్వొద్దని లాడ్జీల యజమానులను కూడా హెచ్చరించినట్లు ఫిర్యాదులొచ్చాయి. టీడీపీ నేతలు కాలనీల్లో మకాం వేసినా, జనం కసితో అభిమాన నేత కోసం తరలివచ్చారు. పాదయాత్రలో తిమ్మసముద్రం క్రాస్ నుంచి గూడూరు వరకూ వేలాది మంది జననేత అడుగులో అడుగు వేశారు. వందలాది మంది సమస్యలు చెప్పుకున్నారు.




గూడూరులో జగన్‌ను చూసేందుకు చెట్టు ఎక్కిన అభిమానులు



పాలిచర్లలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జగన్

73వ రోజు

28-01-2018, ఆదివారం
గూడూరు కోర్టు సెంటర్,
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా



వేతనాల కోసం గళమెత్తితే.. ఉద్యోగాల్లోంచి తొలగించడం ఎంత దుర్మార్గం!

కుల ధ్రువీకరణ కోసం సంవత్సరాలుగా పోరాడాల్సిరావడం చాలా ఆశ్చర్యమనిపించింది. ఉదయం యాత్ర ప్రారంభంలోనే వెందోడు గ్రామానికి చెందిన శెట్టి సుబ్రహ్మణ్యం అనే అన్న తన ఇద్దరు కూతుళ్లతో వచ్చి కలిశాడు. వారు కమ్మర కులానికి చెందినవారట. ఆ కులం ఎస్టీ జాబితాలో ఉందట. ఆయనకు, ఆయన తండ్రికి ప్రభుత్వం ఇచ్చిన ఎస్టీ కులధ్రువీకరణ సర్టిఫికెట్లు కూడా చూపించాడు. 'అన్నా.. ఏడాదిన్నర నుంచి నా పిల్లల క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నాను. అధికారులు ఇవ్వడంలేదు. ఎంక్వైరీ చేసి ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారు. ఇతర మండలాల్లోని మా బంధువులకు ఇచ్చారు. మా గ్రామస్తులకు మాత్రం ఇవ్వడంలేదు. కనీసం మాది ఏ కులమో తేల్చమనండి.. లేకపోతే నా ఇద్దరు కూతుళ్ల భవిష్యత్తు ఏమైపోతుందో.. అంటూ కన్నీరుపెట్టుకున్నాడు. తాతను, తండ్రిని, బంధువులను ఎస్టీలుగా గుర్తించి సర్టిఫికెట్లు ఇచ్చి.. ఇప్పుడా పిల్లలకు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం? వారిది ఏ కులమో సంవత్సరాలుగా నిర్ధారించకపోతే, ఆ కారణంగా ఆ పిల్లలు విద్య, ఉద్యోగావకాశాలు కోల్పోతే.. ఎవరు బాధ్యత వహిస్తారు? ఈ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం ఎంతోమంది తల్లిదండ్రులకు మానసిక క్షోభ కలిగిస్తోంది.

అంగన్‌వాడీలంటే ఈ ప్రభుత్వానికి ముందునుంచీ చిన్నచూపే. వెట్టిచాకిరీ చేయించుకుంటారు.. వేతనాలు సరిగా ఇవ్వరు. అంగన్‌వాడీ మహిళలంటే చంద్రబాబు గారికి గిట్టదేమో! తమకు జీతాలు పెంచాలని ఆ పేద మహిళలు అడిగితే.. గుర్రాలతో తొక్కించిన ఘనత ఆయనదే. ఆయనలో ఇప్పటికీ మార్పు రాలేదు. వారి సమస్యలను చెప్పుకోడానికి కూడా భయం భయంగా నా వద్దకొచ్చారు ఆ అక్కచెల్లెమ్మలు. ఎందుకంటే, గతంలో మహిళా దినోత్సవం రోజున నెల్లూరులో జరిగిన మీటింగ్‌లో సాక్షాత్తూ ముఖ్యమంత్రి గారికి తమ గోడు వెళ్లబోసుకుందామని ప్రయత్నించారట. వారి సమస్యలు వినకపోగా, ఫిర్యాదు చేయడానికి నా దగ్గరికే వస్తారా.. అంటూ గుడ్లురిమాడట. మీ సంగతి చూస్తానంటూ బెదిరించిన 24 గంటల్లోనే 15 మందిని ఉద్యోగాల్లోంచి తీసేశారట. 'అన్నా.. ఇప్పుడు మీ దగ్గరకు వచ్చినందుకు ఇంకేం చేస్తారో..' అని భయపడ్డారు. ఫొటోలు తీయొద్దని, పేర్లు రాయొద్దని మీడియాను వేడుకున్నారు. అసలు మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? ఎవరైనా ఏదైనా అభిప్రాయం చెబితేనో, హక్కులను అడిగితేనో.. ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అంగన్‌వాడీలకు ఏ రాష్ట్రంలో లేనంత తక్కువగా వేతనాలివ్వడం, నెలల తరబడి జీతాలివ్వకపోవడం, ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో, అధికార పార్టీ కార్యక్రమాల్లో వారిచే గొడ్డుచాకిరీ చేయించుకోవడం, వారితోనే ఖర్చులు చేయించడం, వేతనాలు, కనీస సౌకర్యాల కోసం గళమెత్తితే.. బెదిరించడం, ఉద్యోగాల్లోంచి తొలగించడం ఎంత దుర్మార్గం!

సాయంత్రం ఇందిరమ్మ కాలనీవాసులు కలిశారు. ఆ కాలనీలో దాదాపు 1600 కుటుంబాలు నివసిస్తున్నాయట. వారికి నీరు, కరెంటు లాంటి మౌలిక వసతులేవీ లేవట. మున్సిపాల్టీ వాళ్లను అడిగితే.. పంచాయతీ వారిని అడగండి అంటున్నారట. పంచాయతీ వాళ్లేమో.. అది మున్సిపాల్టీ వాళ్ల బాధ్యతని చేతులు దులుపుకొంటున్నారట. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సంవత్సరాలుగా ప్రజలను ఇక్కట్ల పాల్జేసే హక్కు వారికి ఎవరిచ్చారు? ఆ కాలనీ వారు మన రాష్ట్ర పౌరులు కాదా? వారికి కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత మీకు లేదా? సాక్షాత్తు మున్సిపల్‌శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో.. మున్సిపాల్టీ ప్రజల కష్టాలు పట్టించుకోకపోతే ఎలా? అయినా.. రాజధాని భూముల మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద ఎందుకుంటుంది!

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మహిళా సాధికారత గురించి గొప్పగొప్ప మాటలు చెబుతుంటారు. కానీ అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మలు, పొదుపు సంఘాల మహిళలు తమ న్యాయమైన సమస్యలు విన్నవిస్తే.. కక్ష సాధింపు చర్యలు చేపట్టడం న్యాయమేనా? మీరిచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగే హక్కు కూడా వారికి లేదా?

వైఎస్. జగన్.

ప్రజా సంకల్ప యాత్ర
మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం ॥ 29-1-2018

ఉమన్ పవర్

పని జెండర్ ఎరగదు



'ఎవరన్నారీ పని మగవాళ్లదని...' సంధ్యా మారవి ఈ మాట అనలేదు. కానీ...

ఇది మగవాళ్ల పని మాత్రమే కాదు, అవసరమైనప్పుడు ఆడవాళ్ల పని కూడా. అంతకంటే ముందు ఇది మనిషికి అన్నం పెట్టే పని... అని నిరూపించింది.

ఒక చాదస్తపు సంప్రదాయ గిరిగీతను చెరిపివేసింది.

కుటుంబాన్ని పోషించడానికి ఇంటి మగవాడు ఉన్న ఆడవాళ్లకు ఇది మగవాళ్ల పనిగానే కనిపిస్తుందేమో! అన్నం పెట్టే వాడు 'పిల్లలకు ఇక నుంచి తల్లీతండ్రీ నువ్వే' అని అకస్మాత్తుగా తనువు చాలించిన సంధ్య లాంటి వాళ్లకు మాత్రం కాదు. 'ఇది ఆడవాళ్లు చేసే పని కాదు' అని చేతులు ఒడిలో పెట్టుకుని, మౌనంగా కూర్చుంటే పిల్లలకు వేళకింత అన్నం ఎవరు పెడతారు?... ఇవన్నీ సంధ్య మౌనంగా సంధించే ప్రశ్నలు.

సంధ్యకు ఇద్దరు కొడుకులు, ఎనిమిదేళ్ల సాహిల్, ఆరేళ్ల హర్షిత్. కూతురు పాయల్‌కు నాలుగేళ్లు. సంధ్య ఉద్యోగానికి వేళ్లకు వెళ్లాలంటే తెల్లవారు జామున లేచి బయలుదేరాలి. సంధ్య అత్త ఇంట్లో ఉండి పిల్లలను చూసుకుంటుంది. 'నా కొడుకు అర్ధంతరంగా పోయాడు. ఇంటి బరువును కోడలు తలకెత్తుకుంది. పిల్లల్ని చక్కగా బడికి పంపించి చదివిస్తాం. పెద్దయిన తర్వాత వాళ్లమ్మ కష్టాలను ఈ పిల్లలే తీర్చాలి' అంటోందామె.

సంధ్యామారవి కాట్ని రైల్వే స్టేషన్‌లో కూలీ. ఆమెది మధ్యప్రదేశ్, జబల్పూర్ జిల్లా కుందం గ్రామం. జబల్పూర్ నుంచి కాట్నికి 90 కిలోమీటర్లు. ఆమె ఉద్యోగానికి వెళ్లాలంటే రోజూ బస్సులో సొంతూరు కుందం నుంచి జబల్పూర్‌కి, అక్కడి నుంచి రైల్లో కాట్నికి చేరుకోవాలి. డ్యూటీ ముగిసిన తర్వాత అదే రూట్‌లో తిరుగు ప్రయాణం. అటూఇటూ కలిపి రోజుకు 200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి మరీ ఉద్యోగం చేస్తోంది.

కాట్ని స్టేషన్‌లో 40 మంది పోర్టర్లున్నారు. వారిలో సంధ్య మాత్రమే అమ్మాయి. పసితనం పోని సంధ్య చేత పెట్టెలు మోయించుకోవడానికి ప్రయాణికులు ఇబ్బందిపడుతుంటారు. ఇంత బలహీనంగా ఉన్న అమ్మాయి తమ సామాను మోయలేక కిందపడేసి పాడు చేస్తుందేమోననే భయం కూడా. 'నేను మోయగలను సార్' అని వాళ్లకు భరోసా ఇచ్చి మరీ బరువులు మోస్తోంది.

రోజంతా బరువులు మోయడం కష్టంగా అనిపించడం లేదా అని ఎవరైనా ఆత్మీయంగా అడిగితే... 'ఇంకా లోకం తెలియని ముగ్గురు పిల్లల భారం మోస్తున్నాను' అంటుంది. ఆమె మాటల్లో లోతు అర్థం చేసుకుంటేనే అర్థమవుతుంది. ఆమెను చూస్తే బరువు మోయడానికి శక్తికంటే ఎక్కువగా ధైర్యం ఉండాలనిపిస్తుంది.



ఆమె ఎవరి నుంచి కూడా సహాయాన్ని ఆశించడం లేదు. తన కుటుంబాన్ని తానే పోషించుకోగలను అంటోంది. అయితే ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌ను కోరుతున్న సహాయం ఒక్కటే. అది కాట్ని స్టేషన్ నుంచి జబల్పూర్ స్టేషన్‌కి బదిలీ. అధికారులు స్పందించినప్పుడు ఆమెకి ఈ సుదీర్ఘమైన ప్రయాణం తప్పుతుంది.

– మంజీర



కూరగాయలను కోస్తున్న క్లోవీ ఎలిజబెత్, హన్నారోస్

అరకదున్నుతున్న క్లోవీ ఎలిజబెత్

ఆవలి తీరం నుంచి

సేవల సేద్యం కోసం

మదర్ థెరిస్సా ఒక మాట అనేవారు. 'మనం గొప్ప గొప్ప పనులు చేయలేకపోవచ్చు. కానీ చేసే పనులను గొప్ప మనస్సుతో చేస్తే అదే మనిషి ఔన్నత్యానికి కొలబద్ద అవుతుంది' అని! ఈ మాటలు క్లోవీ ఎలిజబెత్, హన్నారోస్‌లలో స్ఫూర్తిని నింపాయి. ఆ స్ఫూర్తితో వాళ్లిద్దరూ గత ఏడాది ఇండియా వచ్చి తిరువళ్లూరు సమీపంలోని 'సేవాలయ' ఆశ్రమంలోని వృద్ధులకు సేవ చేస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్లం బోధిస్తున్నారు. అంతేకాదు, సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు! క్లోవీ ఇంగ్లండ్ యువతి. హన్నారోస్ స్కాట్‌లాండ్ అమ్మాయి.

క్లోవి తండ్రి జాన్ పర్యావరణ పరిరక్షణ అధికారి. తల్లి శారా ప్లేస్కూల్ నడుపుతున్నారు. అలాగే ఇంగ్లండ్‌లో ఓ అనాథ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. తల్లి పోలికే కూతురికీ వచ్చింది. పెరిగి పెద్దవుతున్న కొద్దీ క్లోవీ కూడా సేవారంగం వైపు మళ్లారు. ప్లస్ వన్ స్టడీస్ ముగింపు సమయంలో క్లోవీ ఒక ప్రత్యేక ప్రాజెక్టు చేయాల్సి వచ్చింది. 'ఆహార పదార్థాలలో విషాలు – తరచూ అనారోగ్యం' అనే అంశంపై ప్రాజెక్టు చేయడానికి 2016లో స్కాట్‌లాండ్‌కు వెళ్లారు. అక్కడ క్లోవీకి హన్నారోస్‌తో పరిచయం ఏర్పడింది.

పేరెంట్స్‌ని ఒప్పించారు: క్లోవీ, హన్నా ఇద్దరూ కలసి ఆహార పదార్థాలలో రసాయనాల కలుషితాలకు, విషతుల్యతకు కారణం ఏమిటన్న దానిపై బ్రిటన్‌లోని ప్రముఖ వైద్య పరిశోధకుల నుండి వివరాలు సేకరించారు. ఆహారధాన్యాలు, కూరగాయల సాగులో రసాయన ఎరువుల వాడకమే అనారోగ్యాలకు ప్రధాన కారణమన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ పరిస్థితి భారత్‌లోనే ఎక్కువగా వుందని గుర్తించారు.

ఇద్దరి ఆలోచన విధానం ఒకటే అవడంతో ఇంటర్ పూర్తయ్యాక దొరికే ఏడాది సమయాన్ని సేంద్రియ సాగు కోసం ఉపయోగించుకోవాలనీ నిర్ణయించుకున్నారు క్లోవీ, హన్నా. ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పారు. 'మంచి నిర్ణయమే'నని వారు ప్రోత్సహించారు. అయితే శారీరక శ్రమను, భారత్‌లో తీవ్రంగా వుండే ఎండలను, ఇతర సమస్యలను వీళ్లు తట్టుకోగలరా అని సందేహించారు వారి తల్లిదండ్రులు. వ్యవసాయం చేయాలంటే మెళకువలు అవసరం. ఏయే పంటలు ఎప్పుడు వేయాలి? ఎలాంటి ఎరువులు వేయాలి? అనే విషయంపై అవగాహన ఉండాలి. అదే అడిగారు ''పర్లేదు, తెలుసుకుంటాం'' అన్నారు వీళ్లు. మొత్తానికి పేరెంట్ చేత 'ఎస్' అనిపించుకున్నారు. తర్వాత గూగుల్‌లోకి వెళ్లి వ్యవసాయానికి, పంటల సాగుకు, నిరాశ్రయులకు సేవ చేయడానికి అనువైన ప్రాంతంగా భారత్‌లోని 'సేవాలయ'ను ఎంపిక చేసుకుని గత సెప్టెంబర్‌లో తిరువళ్లూరు వచ్చారు. ఈ ఆగస్టు వరకు ఇక్కడే ఉంటారు.



గడ్డిమోపుతో క్లోవీ ఎలిజబెత్, హన్నారోస్

సేంద్రియం రప్పించింది!: సేంద్రియ సాగు చేయాలన్న ఉద్దేశంతో మొదట సేవాలయకు వచ్చినప్పుడు క్లోవీ, హనా ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. వెంటనే తమ పనులను పక్కా ప్రణాళికతో ప్రారంభించారు కూడా. మొదట కూరగాయలను సాగుచేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు అనువైన కొంత భూమిని చదును చేసి బెండకాయ విత్తనాలను వేశారు. అయితే మరుసటి రోజే వర్షం పడడంతో విత్తనాలు కుళ్లిపోయి వారిలో నిరాశను మిగిల్చాయి. 'విత్తనాలను విత్తుతూనే వుండండి. మొలిస్తే చెట్టు. లేకుంటే భూమికి ఎరువు' అన్న సేంద్రియ వ్యవసాయ శాస్త్రవేత్త నమ్మాళ్వార్ మాటలు వారికి గుర్తుకు వచ్చాయి. వ్యవసాయం అనేది వ్యాపారం కాదు, జీవించడానికి వున్న ఒక మార్గం అని మాత్రమే అనుకుని మళ్లీ పొలం బాట పట్టాం. స్థానిక రైతులు, ఆన్‌లైన్‌లో వున్న సాగు పద్ధతులపై వున్న సమాచారాన్ని సేకరించి బెండ, చిక్కుడు కాయల విత్తనాలను వేశాను. ప్రతి మొక్కకు రెండు అడుగుల దూరం పాటించడం, సేంద్రియ ఎరువుల వాడకం, బిందు సేద్యం కోసం పైపులు ఏర్పాటు చేసి నీరు పారించడం వంటి పనుల్లో గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా జాగ్రత్త పడాలని అనుకున్నారు. ఎలాగైనా పంటల సాగులో విజయం సాధించాలన్న పట్టుదల వారిలో పెరిగింది. ''విజయం పక్కనే ఓటమీ పొంచి వుంటుందన్న విషయం మాకు తెలుసు. అందుకే పంటల సాగు కోసం శారీరకంగా మానసికంగా సిద్ధం అయ్యాం. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం ఆరు గంటల నుండి పదిన్నర వరకు అరకపట్టి దున్నడం, భూమికి నీళ్లు పారించడం, కలుపు తీయడం, పాడి పశువుల బాగోగులు చూసుకోవడం మా దినచర్యలో భాగమైంది. సేద్యపు పనులు పూర్తయిన తరువాత ఆశ్రమానికి వచ్చి సేవ చేసి, సాయంత్రం మళ్లీ వ్యవసాయంలో నిమగ్నమయ్యేవాళ్లం' అని వివరించారు క్లోవీ.

'సేవాలయ'ను మెప్పించారు: క్లోవీ, హన్నా.. నాట్లు వేసి మూడు నెలలు దాటింది. ప్రస్తుతం కూరగాయల పంట (వంకాయ, ఉల్లి, టమాటా వగైరా) చేతికి వచ్చింది. తాము వేసిన పంటల ప్రతిఫలాన్ని సంతృప్తి నిండిన కళ్లతో ఆపేక్షగా చూసుకుంటున్నారు. వాటిని ఆశ్రమంలోని చిన్నపిల్లల ఆహారానికి వినియోగిస్తున్నారు. ఇక్కడ నేర్చుకున్న సాగు పద్ధతులను తమ దేశాలకూ అందివ్వాలన్నదే వీరి లక్ష్యం. అక్కడి ప్రజలకు సైతం సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కల్పించాలని వారి సంకల్పం. భారత్‌లో సాగు పద్ధతులతో పాటు నిండైన వస్త్రధారణ, సంప్రదాయం, ఆహారపు అలవాట్లు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ.. క్లోవీ, హన్నాలకు బాగా నచ్చిందట. 'సేవాలయ' కూడా వారి పనితీరుకు, పట్టుదలకు ముగ్ధురాలైంది!

మనవాళ్లు విదేశీ మోజులో పడి, ప్రపంచ దేశాలకే ఆదర్శంగా వున్న భారతీయ సంప్రదాయానికి, వ్యవసాయ పద్ధతులకు తిలోదకాలిస్తున్న తరుణంలో.. ఈ విదేశీ యువతులు మన సంస్కృతికి, సంప్రదాయానికీ, సేంద్రియ సాగుకు ప్రాముఖ్యాన్ని ఇవ్వడం అభినందనీయం.

- కోనేటి వెంకటేశ్వర్లు, తిరువళ్లూరు (తమిళనాడు)

చెట్టు నీడ

జానీ... అబద్ధమే చెప్పాడు!

''నాన్నా! రైమ్స్ బుక్... మామయ్య తెచ్చాడు'' చూపించింది కృతి.

''రైమ్స్ నేర్చుకుందామా'' అంటూ బుక్ చేతిలోకి తీసుకుని కూతుర్ని ఒళ్లో కూర్చోబెట్టు కున్నాడు కృతి నాన్న.

''జానీ జానీ... ఎస్ పపా, ఈటింగ్ షుగర్? నో పపా, టెల్లింగ్ లైస్? నో పపా, ఓపెన్ యువర్ మౌత్? హహ్హహ్హ...''

చెప్పే మాటకి, చేసే పనికి మధ్య వైరుధ్యం కనిపిస్తే కృతి అడిగినటువంటి ప్రశ్నలు సమాజం నుంచి వస్తాయి. తేడా అంతా చిన్నారి కృతి అడిగినట్లు సమాజం ప్రశ్నలు మాటల్లో ఉండవు. ఆ మనిషిని విశ్వసించకపోవడం అనేది చూపుల్లో కనిపిస్తుంది.

నాన్న చెప్పినట్లు పలుకుతోంది కానీ... కృతి చూపంతా జానీ వెనుక దాచేసిన చక్కెర బాటిల్, నోట్లోంచి కారుతున్న చక్కెర మీదనే ఉంది.

''జానీ చేతిలో షుగర్ బాటిల్ నాన్నా, నోట్లో కూడా చక్కెర ఉంది'' చూపించింది.

''నిజమే బంగారం'' కాదనడానికి వీల్లేని పరిస్థితి.

''చక్కెర తింటూ తినట్లేదని అబద్ధం చెప్పాడు, అబద్ధాలు చెబుతున్నావా అని అడిగితే కాదని మళ్లీ అబద్ధమే చెప్పాడు. జానీ రెండు అబద్ధాలు చెప్పాడు'' వేళ్లు చూపించింది కృతి.

ఆన్సర్ దొరకదని తెలిసినా క్షణకాలం కృతిని తప్పించుకుందామని పుస్తకంలో ముఖం దాచుకున్నాడు నాన్న. రైమ్స్ బుక్‌లో నక్షత్రాలు గిర్రున తిరుగుతున్నాయి.

జానీ అబద్ధం చెప్పాడని చెబితే ఎందుకు చెప్పాడని మళ్లీ ప్రశ్న వస్తుంది, అది తప్పు కదా అని అనుబంధ ప్రశ్న, ఈ చైన్ ఈ రోజుకి తెగదు. ''నాకు ఆఫీస్‌కి టైమయింది కన్నా'' అంటూ ఒడిలో నుంచి కృతిని దించేశాడు నాన్న.

చిన్నప్పుడు తార్కికత చాలా చురుగ్గా ఉంటుంది. వయసుతోపాటు లాజిక్ సెన్స్‌ను కొద్ది కొద్దిగా తగ్గించుకుంటూ పెద్దవాళ్లమవుతాం. ఇక మిగిలే సెన్స్ అంతా 'ఒకరికంటే మనం వెనుకపడకూడదు'... అనేదొక్కటే. రేపటి రోజున మనల్ని మనం మనిషిగా నిలబెట్టుకోవడానికి ప్రయత్నించే సహనం ఎప్పుడు ఎక్కడ జారిపోయిందో గుర్తుండదు. ఇప్పుడు తెలిసిందల్లా రేపటిలోకి వెళ్లడానికి అడ్డుగా ఉన్న నేటిని దాటేయడమే. నేటిని దాటడానికి చెప్పిన అబద్ధం మర్నాడు నిలదీస్తుంది. దానికి సమాధానం చెప్పడం కృతిని మాయ చేసినంత సులభం కాకపోవచ్చు. నిన్నటి రోజున చెప్పిన అబద్ధం నేడు నిలదీస్తూనే ఉంటుంది.

పొల్యూషన్ ప్రాబ్లమ్


కాలుష్యంతో మానసిక్

వాయు కాలుష్యం వల్ల వాటిల్లే శారీరక అనర్థాలు అందరికీ తెలిసినవే. వాయు కాలుష్యం మితిమీరిన ప్రాంతాల్లో నివాసం ఉండేవారిలో ఉబ్బసం, నిమోనియా వంటి శ్వాసకోశ రుగ్మతలు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశాలు ఉంటాయని ఇప్పటికే పలు పరిశోధనలు రుజువు చేశాయి. వాయు కాలుష్యం మానసిక సమస్యలకు కూడా దారితీస్తుందని ఇటీవల ఒక తాజా పరిశోధన నిగ్గు తేల్చింది. వాయు కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాల్లో నివసించే టీనేజర్లలో కోపాన్ని అదుపు చేసుకోలేని అసహనం, చిరాకు, దురుసు ప్రవర్తన ఎక్కువగా కనిపిస్తున్నట్లు అమెరికన్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సౌత్ కాలిఫోర్నియా వర్సిటీలోని కెక్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తలు 682 మంది టీనేజర్లపై అధ్యయనం జరిపి ఈ విషయాన్ని నిర్ధారణ చేశారు. వాయుకాలుష్యం వల్ల మెదడు కణజాలంలో సూక్ష్మమైన వాపు ఏర్పడుతుందని, దీని ప్రభావానికి గురైన వారి ప్రవర్తనలో అసహజమైన మార్పులు కనిపిస్తాయని వారు చెబుతున్నారు. పిల్లల్లో అకస్మాత్తుగా దురుసు ప్రవర్తన కనిపించినట్లయితే, వారిని కాలుష్యానికి దూరంగా కొన్నాళ్లు ఉంచితే వారి పరిస్థితి మెరుగుపడుతుందని వారు పేర్కొన్నారు. కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు తమ పరిశోధన వివరాలను 'అబ్నార్మల్ సైకాలజీ' జర్నల్‌లో ప్రచురించారు.



సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
సోమవారం
29-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

అరటిపండు గారు.. నేను డైలీ మీ సలహాలు చదువుతుంటాను. నా బాధ ఏంటంటే... ఐయామ్ సింగిల్! ఐ వాజ్ డిస్టర్బ్‌డ్ బై వన్ గర్ల్. ఐ యామ్ నాట్ కాన్‌సన్‌ట్రేటింగ్ ఆన్ మై లైఫ్ అండ్ గోల్. ప్లీజ్ ! గివ్ మీ ఎ బనానా ఐడియా సార్!!
ప్లీజ్.. ప్లీజ్...

– నరేష్

పోరా పోకిరి...
అల్లరి జింగిరి...
వంకర టింకరి...
ఎందుకు చెయ్యాలి నీకు.. బనానా చాకిరీ..???
స్టాప్ దిస్ కిరికిరి...!!!
'అవును సార్, ఐడియాల అరటిపండ్లేవో..
చెట్లకు కాసినట్టు...
మీ అడ్వైజ్ లాగా చీపుగా
దొరుకుతున్నట్టు..
బనానా అడగడమేంటి సార్!...
కరెక్టుగా ఆన్సర్ చేశారు సార్!'
నీలాంబరీ... నువ్వు నన్ను పొగుడుతున్నావో...
తిడుతున్నావో అర్థం కావడం లేదు...!!
'అవన్నీ ఎందుకు సార్?
నరేష్‌కి ఇవ్వాల్సిన బనానా, మీరు తిని హ్యాపీగా..
ఎంజాయ్!!'

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8		7	2				1	
4	2			9	8		6	
		3	4		6	2	8	5
		2				1		
5	3						2	7
		1				5		
3	5	9	7		1			
	1		3	4			7	8
	4				2	3		1

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	5	1	8	6	2	3	9	7
8	7	6	3	5	9	4	2	1
9	2	3	4	1	7	8	5	6
5	1	4	9	8	6	7	3	2
6	8	9	2	7	3	5	1	4
2	3	7	5	4	1	6	8	9
1	4	5	7	9	8	2	6	3
3	9	8	6	2	4	1	7	5
7	6	2	1	3	5	9	4	8

రియల్ టు రీల్

షకీలా ముఖ్యతారగా సాయిరాం దాసరి దర్శకత్వంలో జీ స్టూడియోస్ పతాకంపై రాఘవ ఎమ్. గణేశ్, వీరు బాసింశెట్టి నిర్మించిన చిత్రం 'శీలవతి'. షూటింగ్ కంప్లీటైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సాయిరాం మాట్లాడుతూ– '' కేరళలో జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా తెరకెక్కించిన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది. మా హీరోయిన్ షకీలాకు 250వ చిత్రమిది. నిర్మాతల ప్రోత్సాహంతో అనుకున్న దానికన్నా అవుట్‌పుట్ బాగా వచ్చింది'' అన్నారు. ''పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ స్టార్ట్ చేశాం. ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు రాఘవ. ''ఈ సినిమాతో మళ్లీ నిర్మాతగా మారినందుకు హ్యాపీగా ఉంది. విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు వీరు బాసింశెట్టి. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్.



షకీలా

విర్రవీగితే తొక్కేస్తాడు
- మోహన్‌బాబు


లక్ష్మి, శ్రియ, విష్ణు, సుబ్బరామిరెడ్డి, నిర్మల, మోహన్‌బాబు, మదన్

''మాకు తెలిసిన ఫీల్డ్, వ్యాపారం సినిమా. నటుడిగా పుట్టా. నటుడిగా.. నిర్మాతగా తప్ప వేరే వ్యాపకాలు లేవు. భగవంతుడి ఆశీర్వాదాలతో విద్యాసంస్థ స్థాపించా'' అని నటులు మంచు మోహన్‌బాబు అన్నారు. మోహన్‌బాబు హీరోగా విష్ణు, శ్రియ, నిఖిలా విమల్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకత్వంలో అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పణలో శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మించారు. తమన్ స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ– ''కష్టపడి సినిమా తీశాం. విజయం భగవంతుని ఆశీస్సులతో ఉంటుంది. అలా తీశాం.. ఇలా తీశాం.. అంటుంటాం. కానీ అన్నీ భగవంతుడు చూస్తుంటాడు. ఎంత అణిగి మణిగి ఉంటే అంత గొప్ప ఆశీర్వాదాన్ని ఆయన మనకు ఇస్తాడు. విర్రవీగినప్పుడు ఒక తొక్కు తొక్కుతాడు. దాదాపు 60పైన సినిమాలు తీశాం. జయాలు.. అపజయాలున్నాయి. విజయం వచ్చినప్పుడు విర్ర వీగలేదు.. అపజయం వచ్చినప్పుడు కుంగిపోలేదు. ఐదు సినిమాలు హిట్ అయినా.. ఒక్క సినిమా ఫ్లాప్ అయితే.. ఐదు సినిమాల హిట్టూ పోతుంది. నన్ను నటుడిగా పరిచయం చేసిన మా గురువు దాసరి నారాయణ రావుగారు ఎంత గొప్ప దర్శకుడో ఈ జనరేషన్‌కి తెలీదు. మహానటుడు ఎన్టీఆర్ తర్వాత డైలాగులు చెప్పగలడని నాకు పేరొచ్చిందంటే ఆ క్రెడిట్ మా గురువుగారిదే. నన్ను నా వైఫ్ నిర్మల ఎప్పుడూ 'బావా' అని ప్రేమగా పిలిచేది. కానీ.. ఈ మధ్య పిలవడం లేదు. ఎందుకంటే నాకు సక్సెస్ లేదు కదా. సక్సెస్ లేకపోతే ఎవరూ పిలవరు (నవ్వుతూ). 'గాయత్రి' సినిమాలో శ్రియ నటన చూసి నాకు కౌగిలించుకోవాలని కోరిక ఉండేది. కానీ విష్ణు ఎక్కడ సీరియస్ అవుతాడోనని ఊరుకున్నా (నవ్వుతూ). 'గాయత్రి' చిత్రంలో విష్ణు తన నటనతో కంటతడి పెట్టించాడు. సెన్సార్ కాకుండా ఫిబ్రవరి 9వ తారీఖు రిలీజ్ అవుతుందని చెప్పకూడదు. సెన్సార్ పూర్తయి అదే తారీఖుకి సినిమా విడుదలవుతుందని.. అవ్వాలని కోరుకుందాం. మదన్ 'గాయత్రి' సినిమాను అద్భుతంగా తీశాడు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు'' అన్నారు. ''42 ఏళ్ల కెరీర్‌లో ఓ పాత్రకీ మరో పాత్రకీ సంబంధం లేని పాత్రలు చేశారు మోహన్‌బాబు'' అన్నారు ఎంపీ, 'కళాబంధు' టి. సుబ్బరామిరెడ్డి. మదన్ మాట్లాడుతూ– ''ఆ నలుగురు' సినిమాలో ఓ డైలాగ్ రాశా. 'మనుషులను చదివినవాడు వేదాంతి అయినా అవుతాడు లేదా వ్యాపారి అయినా అవుతాడు' అని. ఈ సందర్భంలో ఆ డైలాగ్ రాయాల్సి వస్తే 'మనుషులను చదివినవాడు వేదాంతి అయినా అవుతాడు.. వ్యాపారి అయినా అవుతాడు.. లేదా మోహన్‌బాబుగారి లాగా మహా నటుడైనా అవుతాడు'' అన్నారు. ''గాయత్రి'లో నా పాత్ర నా కెరీర్‌లో వన్నాఫ్ ది మోస్ట్ టర్నింగ్ పాయింట్ అవుతుంది'' అన్నారు విష్ణు. నటులు కోటా శ్రీనివాసరావు, గిరిబాబు, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, డైరెక్టర్ బి.గోపాల్, మంచు లక్ష్మి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శత్రువుల భరతం పట్టాడు


మహేశ్‌బాబు

వందల మంది జనం. భరత్‌పై అభిమానంతో వచ్చారు వాళ్లంతా. కొందరు మాత్రం పగతో కత్తులు తెచ్చారు. భరత్‌పై దాడి చేయడానికి అవకాశం కోసం చూస్తున్నారు. కత్తి కంటే పదునైన ఆలోచనతో వారిని కనిపెట్టి, శత్రువుల భరతం పట్టాడు భరత్. అదెలాగో సిల్వర్ స్క్రీన్‌పై చూడాల్సిందే. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో శ్రీమతి డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. ఇందులో కియరా అద్వాని కథానాయిక. సీయం భరత్ పాత్రలో మహేశ్‌బాబు నటిస్తున్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ ఓత్ అండ్ మహేశ్ లుక్‌కు సూపర్ రెస్పాన్స్ వస్తోందని చిత్రబృందం చెబుతోంది. ప్రస్తుతం ఈ సినిమాలోని క్లైమాక్స్ ఫైట్‌ను రామ్–లక్ష్మణ్ నేతృత్వంలో హైదరాబాద్‌లో తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఫైట్ ఓ పబ్లిక్ మీటింగ్ బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. సినిమాను ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు.

వేసవిలో ప్రేమ మొదలు


విజయ్ దేవరకొండ

ముహూర్తాల మీద ముహూర్తాలు పెట్టేస్తున్నారు, సినిమాల మీద సినిమాలు ఒప్పుకుంటున్నారు విజయ్ దేవరకొండ. 'అర్జున్ రెడ్డి' ఇచ్చిన సక్సెస్‌తో వరుసగా సినిమాలు సైన్ చేస్తూ దూసుకెళ్తున్నారీ యంగ్ హీరో. విజయ్ కమిట్ అయిన వాటిలో 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' ఫేమ్ క్రాంతి మాధవ్ డైరెక్షన్‌లో సినిమా ఒకటి. చక్కని లవ్ స్టోరీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు క్రాంతి మాధవ్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్‌లో మొదలు కానుందట. ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ సినిమాకు హీరోయిన్‌ను ఎంపిక చేసే పనిలో ఉన్నారట దర్శకుడు క్రాంతి మాధవ్. ప్రస్తుతం పరశురామ్ దర్శకత్వంలో ఓ సినిమా, సావిత్రి బయోపిక్ 'మహానటి'లోనూ విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. 'మహానటి'లో జర్నలిస్ట్‌గా, పరశురామ్ సినిమాలో టాక్సీ డ్రైవర్‌గా కనిపించనున్నారు.

ఆయన ఎప్పుడు పిలిచినా కాదనను - ప్రభాస్

సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వీవీ వినాయక్ దర్శకత్వంలో సీకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సి. కల్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఫిబ్రవరి 9న రిలీజ్ కానున్న ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్ 'లెట్స్ డు'ను హీరో ప్రభాస్ ఆదివారం రిలీజ్ చేశారు. ప్రభాస్ మాట్లాడుతూ– ''సాంగ్ లాంచ్ చేయాలని వినాయక్‌గారు మొహమాటపడుతూ పిలిచారు. ఆయన ఒక్క మెసేజ్ చేసి, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్తా. ఆయన ఎప్పుడు పిలిచినా కాదనను. వినాయక్‌గారితో సినిమా చేయడం లక్కీ అని తేజ్‌కు చెప్పాను. చిరంజీవిగారు చేసిన 'చమకు.. చమకు..' నా మోస్ట్ ఫేవరెట్ సాంగ్. ఈ సాంగ్‌ను తేజ్ ఎలా చేశాడో చూడాలని ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను'' అన్నారు. ''ప్రభాస్ అంటే స్నేహానికి నిలువెత్తు రూపం. ప్రభాస్ లాంటి మనిషి ఇండస్ట్రీలో ఉండటం అరుదు. సినిమాలో తేజ్ ఇరగదీశాడు'' అన్నారు దర్శకుడు వినాయక్. ''ప్రభాస్ అన్నను ఫ్యామిలీ మెంబర్‌లా ఫీలవుతాం. సాంగ్‌ను రిలీజ్ చేసిన ప్రభాస్ అన్నకు థ్యాంక్స్'' అని సాయిధరమ్ తేజ్ అన్నారు.


సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, ప్రభాస్

నా ధైర్యం ఆ ఇద్దరే

'పద్మావత్' సినిమా సృష్టిస్తున్న సంచలనాలు గురించి తెలిసిందే. విడుదలకు ముందు, ఆ తర్వాత ఈ సినిమా చుట్టూ ఎన్నో వివాదాలు. దీపికా పదుకోన్ పై దాడులు చేస్తామని కొందరు, చెవి, ముక్కు నరికి తెస్తే నగదు బహుమతి ఇస్తామని మరికొందరు బహిరంగంగా పేర్కొన్న విషయమూ విదితమే. ఈ బెదిరింపులను దీపికా పదుకోన్ ఎలా ఎదుర్కొని నిలబడగలుగుతున్నారు అనే సందేహం కలగవచ్చు. దానికి కారణం మా పేరెంట్స్ నన్ను పెంచిన విధానమే అంటున్నారు దీపికా పదుకోన్. ''ఈ వివాదాలు జరిగిన అన్ని రోజుల్లో ఒక్కసారి కూడా మా పేరెంట్స్ 'నీ దగ్గరకు వచ్చి ఉంటాం' అనలేదు. ఎందుకంటే వాళ్లకు తెలుసు.. నేను ఈ సిచ్యువేషన్స్‌ను హ్యాండిల్ చేయగలనని. సమస్యలను మా అంతట మేం డీల్ చేసుకొనేలా నన్ను, నా చెల్లెల్ని (అనీషా పదుకోన్) మా పేరెంట్స్ పెంచారు. ఏది తప్పు ఏది ఒప్పు అని తెలుసుకోవటం నేర్పించారు మా తల్లిదండ్రులు. మా ధైర్యం ఆ ఇద్దరే'' అని చెప్పారు దీపికా పదుకోన్. 'పద్మావత్' చూశాక తన తల్లిదండ్రులు ఎలా స్పందించారనే విషయం గురించి చెబుతూ – ''ఈ సినిమా చూసి చాలా గర్వంగా ఫీల్ అయ్యారు. సినిమా చూసిన వెంటనే నాకు వీడియో కాల్ చేశారు. వాళ్ల ముఖాలు గర్వంతో వెలిగిపోవటం నాకు కనిపించింది. వాళ్లు వీడియో కాల్ చేసేటప్పటికి నేను పైజామాలో ఉన్నాను. సినిమాలో రాణీ పద్మావతిగా చూసి, మళ్లీ మామూలుగా చూసేసరికి ఈ అమ్మాయినేనా మేము స్క్రీన్ పై అంత అద్భుతంగా చూసింది అనే ఆశ్చర్యం కనిపించింది అమ్మానాన్న కళ్లలో'' అని పేర్కొన్నారు దీపికా.


దీపికా పదుకోన్

భాగమతి బాగుందంటున్నారు

''నాకు అవసరమైన టైమ్‌లో 'భాగమతి' సినిమా రూపంలో బిగ్ సక్సెస్ రావడం చాలా ఆనందంగా ఉంది. టీమ్ వర్క్‌తో సినిమాను కంప్లీట్ చేశాం. అనుష్క యాక్టింగ్ సూపర్'' అన్నారు దర్శకుడు అశోక్. అనుష్క లీడ్ రోల్‌లో ఆయన దర్శకత్వంలో రూపొందిన సినిమా 'భాగమతి'. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజ్ అయ్యింది. సినిమా హిట్ టాక్ తెచ్చుకుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ– ''మనిషి మెదడును మించిన దెయ్యం ఉందా? లేదా మనిషి తెలివితేటలకు మించిన దెయ్యం ఉందా? అన్న ప్రశ్నలను రైజ్ చేస్తూ చేసిన సినిమా 'భాగమతి'. సినిమాలో భయం అనేది ఒక ఫ్యాక్టర్ మాత్రమే. అంతకు మించిన ట్విస్ట్ సినిమాలో ఉందని ముందే చెప్పాం. అనుష్కను మా ఇంటి అమ్మాయి అని ప్రేక్షకులు మరోసారి దగ్గరకు తీసుకుని మంచి హిట్ అందించారు. కథ విని భాగమతి బంగ్లా ఇలా ఉండబోతుంది సార్ అని చూపించినప్పుడు కన్నీళ్లు ఆగలేదు. 'భాగమతి బంగ్లా' అనే క్యారెక్టర్‌ను సూపర్‌గా పెర్ఫార్మ్ చేయించిన ఆర్ట్ డైరెక్టర్ రవీందర్‌కి కృతజ్ఞతలు. తమన్‌తో పాటుగా టీమ్ అందరూ చాలా శ్రమపడ్డారు. మార్నింగ్ షో నుంచే 'భాగమతి' సినిమాకు మంచి టాక్ తెచ్చుకుంది. తమిళనాడు, కేరళ ఇలా అన్ని రాష్ట్రాల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మంచి రివ్యూస్ అండ్ కలెక్షన్స్ వస్తున్నాయి. ఇందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు. పైరసీని ప్రోత్సహించకండి'' అన్నారు. ''టెక్నీషియన్స్‌కు మంచి స్కోప్ ఉన్న చిత్రమిది. అనుకున్న టైమ్‌లోనే సెట్‌ను కంప్లీట్ చేయగలిగాం. 'భాగమతి' టీమ్ తరపున ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు'' అన్నారు ఆర్ట్ డైరెక్టర్ రవీందర్.


రవిందర్, అశోక్

సస్పెన్స్ థ్రిల్లర్..

''తెలుగు చిత్ర పరిశ్రమకి సరి కొత్త ఆలోచనలతో ఎందరో అడుగుపెడుతున్నారు. వైవిధ్యమైన సినిమాలు తీసి సక్సెస్ అవుతున్నారు. యంగ్ అండ్ డైనమిక్ టీం రూపొందిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు సముద్ర అన్నారు. చెన్నకుని శెట్టి(కుమార్) దర్శకత్వంలో భరతవర్ష క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న నూతన చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''మైథలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. వినోదంతో పాటు, విస్మయానికి గురి చేసే అంశాలున్నాయి'' అన్నారు శెట్టి. ''కొత్త ట్రెండ్ సృష్టించే అన్ని అంశాలు మా కథలో ఉన్నాయి'' అన్నారు జి.వి.ఆర్.–4 మ్యూజిక్ అధినేత వి. గోపాల కృష్ణ. తెలంగాణ ఫిల్మ్‌చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ , కార్యదర్శి సాయివెంకట్ పాల్గొన్నారు.


సముద్ర, రామకృష్ణగౌడ్, సాయివెంకట్

పరి పరిశోధన

ఉపగ్రహాల మరమ్మతులకు డ్రోన్లు..

ఒకసారి కక్ష్యలోకి చేరిన తరువాత ఉపగ్రహాలు చెడిపోతే ఇక అంతే సంగతులు. వాటికి నీళ్లు వదులుకోవాల్సిందే. ఇకపై మాత్రం ఈ సమస్య లేదంటుందోంది యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందని కంపెనీ ఒకటి. డ్రోన్ల సాయంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను మరమ్మతు చేసేందుకు ఈ కంపెనీ వినూత్న పద్ధతిని ఆవిష్కరించింది మరి. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించినప్పుడు అవి నిర్దిష్ట కాలం మాత్రమే పనిచేస్తాయని అంచనా వేస్తారు. ఇంధనం ఖర్చయిపోవడం.. లేక ఉపయోగించిన పరికరాల్లో సమస్యలు రావడం వంటి కారణాలతో అవి కొంత కాలం తరువాత నిరుపయోగంగా మారిపోతాయి. ఇంధనమైపోయిన ఉపగ్రహాలు నెమ్మదిగా జారిపోతూ భూమ్మీదకు పడిపోవడమూ కద్దు. ఈ నేపథ్యంలో ఎఫెక్టివ్ స్పేస్ అనే కంపెనీ కక్ష్యలోని ఉపగ్రహాల మరమ్మతుకు ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఇంకో రెండేళ్లలో అంటే 2020 నాటికి రెండు డ్రోన్లతో భూ స్థిర కక్ష్యలోని రెండు ఉపగ్రహాల్లో ఇంధనం నింపుతారు. ఫలితంగా అవి మళ్లీ పనిచేయడం మొదలుపెడతాయి. ఆ తరువాత తాము ఉపగ్రహ పరికరాల మరమ్మతు వంటివి కూడా చేపడతామని కంపెనీచ ఎబుతోంది. అంతరిక్షంలో పేరుకుపోతున్న ఉపగ్రహ వ్యర్థాలకు ఈ కొత్త పద్ధతి ఓ విరుగుడు అన్నమాట.



దోమలు మనల్ని గుర్తు పడతాయిట!

దోమలు ఎక్కువ కుడుతున్నాయని ఎవరైనా పిల్లాడు చెబితే.. నువ్వు స్వీట్ బాయ్‌వి రా అందుకే దోమలు నీపై మోజు పెంచుకున్నాయని అంటూ సరదాగా అంటూంటాం. అయితే ఇందులో వాస్తవం కూడా లేకపోలేదంటున్నారు వర్జీనియా టెక్ శాస్త్రవేత్తుల. మనుషుల తాలూకూ వాసనలను దోమలు గుర్తుపెట్టుకోవడం మాత్రమే కాకుండా.. ఎవరిని కుట్టాలన్న విషయంలో ఇష్టాఇష్టాలూ కలిగి ఉంటాయని క్లెమెంట్ వినాగర్ నేతత్వంలోని శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా తెలుసుకున్నారు. ఈడీస్ ఈజిప్టీ జాతి దోమలకు షాక్‌లు, ప్రకంపనల ద్వారా వాసనలు గుర్తు పెట్టుకునేలా చేసిన తరువాత ఆయా వాసనలు చూపినప్పుడు దోమలు కొన్నింటిని ప్రత్యేకంగా ఎంచుకున్నట్లు ప్రయోగాల ద్వారా తెలిసింది. తమకు బాగా ఇబ్బంది కరమైన వాసనలను పట్టించుకోకుండా కొన్నింటిపై మాత్రమే మక్కువ చూపేందుకు వాటి మెదళ్లలోని డోపమైన్ అనే రసాయనం కారణమవుతోందని కెమెంట్ తెలిపారు. ఈ పరిశోధనల ఆధారంగా భవిష్యత్తులో దోమల నియంత్రణకు మరింత మెరుగైన పద్ధతులను అభివద్ధి చేయవచ్చునని ఆయన చెప్పారు. ఈడీస్ ఈజిప్టీ జాతి దోమలు డెంగీ మొదలుకొని జికా వైరస్ వరకూ అనేక వ్యాధి కారక సూక్ష్మజీవులను మనుషులకు అంటగడుతున్న విషయం తెలిసిందే.



మొక్కల కంటే.. చేపల ఒమేగా కొవ్వులు మేలు!

ఒమేగా –3 రకం కొవ్వులతో గుండెకు మేలు. కొన్ని రకాల కేన్సర్లను నివారించవచ్చు కూడా. అయితే వీటిని అవిశలు.. తదితర మొక్కల నుంచి కాకుండా చేపల ద్వారా తీసుకోవడం ఎక్కువ ఫలితాలిస్తుందని అంటున్నారు యూనివర్శిఈ ఆఫ్ గులెఫ్ శాస్త్రవేత్తలు. కేన్సర్ కణితుల పెరుగుదలను అడ్డుకునే విషయంలో చేపల నుంచి సేకరించే ఒమెగా –3 ఫ్యాటీ యాసిడ్లు మొక్కల కొవ్వుల కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ ప్రభావశీలంగా ఉన్నట్లు తాము ప్రయోగాల ద్వారా తెలుసుకున్నామని అంటున్నారు ప్రొఫెసర్ డేవిడ్ మా! రెండు రకాల ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్లు కేన్సర్ నివారణకు ఉపయోగపడేవే అయినప్పటికీ దేని ప్రభావం ఎంతో నిర్ధారించేందుకు తాము ప్రయత్నించామని ఆయన చెప్పారు. రొమ్ము కేన్సర్ కలిగిన ఎలుకలకు వేర్వేరు రకాల ఒమేగా 3 యాసిడ్లు అందించడం ద్వారా వారిలో కణితి పెరుగుదల ఎలా ఉందో చూశామని, మొత్తమ్మీద కణితుల సైజు 60 నుంచి 70 శాతం తగ్గగా.. సంఖ్య కూడా 30 శాతం వరకూ తగ్గిందని వివరించారు. ఒమెగా 3 యాసిడ్లు మొత్తం మూడు రకాలు కాగా.. అవిశగింజలతోపాటు సోయా, ఆవ నూనెల్లో ఉండే ఆల్ఫాలినోలెనిక్ యాసిడ్ల కంటే స్పిరులీనా వంటి నాచు, ఫైటోప్లాంక్టన్, చేపల్లో ఉండే ఈపీఏ, డీహెచ్‌ఏలు ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లు తెలిసిందన్నారు.



సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం
29-1-2018



ఆడపిల్లలు నవ్వితే 'ఏంటా నవ్వు' అని
హద్దులు పెడుతుంది లోకం.
కాని ఈ ఆడపిల్లల విషయంలో 'ఇంకో జోకు చెప్పవా' అని
బతిమిలాడుతోంది లోకం.
స్టాండప్ కామెడీలో మగవాళ్లే కనిపిస్తుంటారు ఎక్కువగా.
కాని మేమూ తక్కువ కాదు అని
ముందుకు వచ్చారు ఈ ఐదుగురు.

సుముఖి సురేష్, కనీజ్ సుర్కా, మల్లికా దువా,
అదితీ మిట్టల్, పుణ్యా అరోరాలు...
పొట్ట చెక్కలు చేయడానికి మగవాళ్లే
అయి ఉండక్కర్లేదు అని నిరూపిస్తున్నారు.
వీళ్లను చూస్తే నవ్వు నాలుగు విధాల రైటు అనిపిస్తుంది.

లాఫ్టర్ పంచ్



సుముఖి సురేష్

'పుష్పవల్లి' అనే తమిళ క్యారెక్టర్‌తో ఫేమస్ అయిన కమెడియన్ సుముఖి సురేష్. తన సృష్టించిన క్యారెక్టర్ పుష్పవల్లి లాగే సుముఖి కూడా తమిళియన్. కాని పెరిగింది నాగ్‌పూర్‌లో. చెన్నైలో గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడే థియేటర్ పట్ల ఆసక్తి పెంచుకుంది. కాలేజ్ ఫెస్టివల్స్‌లో నాటకాల్లో నటించేది. డిగ్రీ అయిపోయాక బెంగళూరులోని ఓ ఫుడ్ ల్యాబరేటరీలో ఉద్యోగం రావడంతో బెంగుళూరు వెళ్లింది. 2013లో అక్కడే 'ది ఇంప్రూవ్' అనే తన తొలి కామెడీ షోను ప్రదర్శించింది. దానికి వచ్చిన రెస్పాన్స్‌తో ఆమె కెరీర్‌నే మార్చేసుకుంది. ఓ రెండేళ్లు ఇటు ఉద్యోగం, అటు కామెడీ షోలు నిర్వహిస్తూనే 2015లో ఉద్యాగానికి రాజీనామా చేసి కామెడీనే ప్రొఫెషన్‌గా ఎంచుకుంది. తన జీవితం స్ఫూర్తిగా పుష్పవల్లి అనే క్యారెక్టరును క్రియేట్ చేసి అదే పేరుతో యూట్యూబ్ షోను మొదలుపెట్టింది. 'ఉద్యోగం మానేసి స్టాండప్ కామెడీని వృత్తిగా స్వీకరిస్తుంటే మీ పేరెంట్స్ ఏమన్నారు?' అని ప్రశ్నిస్తే.. 'మా అమ్మకు మంచి హాస్య చతురత ఉంది. అదే నాకూ వచ్చినట్టుంది. అందుకే నేను స్టాండప్ కమేడియన్‌గా అవతారమెత్తున్నానని తెలియగానే చిరునవ్వుతో నన్ను బ్లెస్ చేసింది. బహుశా నాలో తనను చూసుకోవాలనుకుందేమో' అంటుంది సుముఖి నవ్వుతూ. ప్రస్తుతం ముంబైలో ఉంటూ 'బెటర్ లైఫ్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించింది సుముఖి. 'మీరు మహిళ అయినందువల్ల మీ హాస్య చతురతకు ఏమైనా పరిమితులు ఉంటాయా?' అన్న ప్రశ్నకు 'ఆకాశమే హద్దు. నేను జోక్ వేయని అంశమేదీ లేదు. అయితే మగవాళ్ల కన్నా మేం కచ్చితంగా డిఫరెంటే. హాస్యం పట్ల వాళ్ల అప్రోచ్ వేరు. మా అప్రోచ్ వేరు. మాది సున్నితిమైన హాస్యం. మగవాళ్లు హాస్యం పేరిట మానవసంబంధాలను, మనుషులను ఓ ఫ్రేమ్‌లో పెడ్తారు. కాని మహిళలు అలా కాదు. ఒక విషయాన్ని అన్ని కోణాల్లో చూసి, ఆలోచించి ఎవరినీ నొప్పించకుండా ప్రెజెంట్ చేస్తారు. ఎందుకంటే బేసిక్‌గా స్త్రీలు సున్నిత మనస్కులు కాబట్టి' అంటుంది సుముఖి.





ఇండియన్ స్టాండప్ కామెడీ సీన్ మీద అదితి మిట్టల్ కూడా ఫస్ట్ ఫీమేల్ కమెడియనే. అంతేకాదు 'ఫూల్స్ గోల్డ్ అవార్డ్', 'రిప్పింగ్ ది డికేడ్'లలో నటించిన టాప్ స్టాండప్ కమేడియన్స్‌లో ఆమె ఒకరు. పుణెలో పుట్టిపెరిగిన అదితి యూకేలోని రాక్స్‌టన్ కాలేజ్‌లో డ్రమెటిక్ లిటరేచర్ చదివింది. అక్కడే కొంతకాలం పాటు పని చేసిన ఆమె తిరిగి ఇండియా వచ్చేసింది. 2009లో ఆల్ ఇండియన్

అదితి మిట్టల్

స్టాండప్ షోలో పాలుపంచుకుంది. ఆమె షోలన్నీ ఇంగ్లిష్‌లోనే ఉంటాయి. దేనిమీదైనా హాస్యం పండించగలదు. హాస్యంతో స్త్రీ సమస్యల మీద సమాజాన్ని చైతన్యం చేస్తోంది. మనుషులు, వాళ్ల ఆకారాలు, కులాలు, మతాల వంటి జోలికి పోకుండా మనుషుల నైజం, సమాజం తీరుతెన్నుల మీద వ్యంగ్యాన్ని గుప్పిస్తుంది, హాస్యాన్ని పండిస్తుంది. 'మార్వాడీల పిసినారితనం మీద, మాయావతి లావు మీద జోకులు వేయడం హాస్యం కాదు. మనుషుల మధ్య ఉన్న దూరాలను చెరిపేసి వాళ్లను దగ్గర చేయడమే హాస్యం ఉద్దేశం' అంటుంది అదితి మిట్టల్.





'మేకప్ దీదీ'గా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో చాలా ఫేమస్ మల్లికా దువా. సరోజినీ నగర్ ఎడిషన్ అనే యూ ట్యూబ్ వీడియో కూడా ఆమెకు ఎనలేని అభిమానులను సంపాదించి పెట్టింది. ఢిల్లీలో పుట్టి పెరిగిన మల్లికా ప్రముఖ జర్నలిస్ట్ వినోద్ దువా కూతురు. తల్లి పద్మావతి డాక్టర్. మల్లికా విద్యాభ్యాసమంతా న్యూఢిల్లీలోనే సాగింది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. పెన్సిల్వేనియా రాష్ట్రం, ల్యాన్‌కాస్టర్‌లోని ఫ్రాంక్లిన్ అండ్ మార్షల్ కాలేజ్‌లో చదివింది. చిన్నప్పట్నుంచీ హాస్యాన్ని ఇష్టపడే మల్లిక అడ్వర్టయిజింగ్ రంగంలోకి వచ్చింది. కాని ఎంతో కాలం నిలవలేక మళ్లీ నవ్వుల మీదే మనసు పారేసుకొని ఫన్నీ డబ్‌స్మాషెస్, స్నాప్‌చాట్ వీడియోలు చేయడం ప్రారంభించింది. ఇది పేరుతో పాటు ఆదాయాన్ని తీసుకురావడంతో దీన్నే కెరీర్‌గా ఖాయం చేసుకుంది మల్లికా దువా.

మల్లికా దువా





సీఎన్ఎన్ – ఐబిఎన్ చానెల్‌లో 'ది వీక్ దట్ వజన్ట్' షో చూస్తున్న వాళ్లెవరకైనా తెలుస్తుంది కనీజ్ సుర్కా ఎవరో. సైరస్ బ్రొవోచా, కునాల్ విజయ్‌కర్‌లతో కలిసి సమకాలీన రాజకీయాల మీద వ్యంగ్యపూరితమైన షోలు చేస్తుంటుంది. 'ఇంప్రొవైజేషన్'లో దిట్ట. సౌత్ ఆఫ్రికాలో పుట్టిపెరిగిన ఆమె స్కూల్, కాలేజ్ చదవుల న్నీ అక్కడే పూర్తి చేసింది. వీళ్ల కుటుంబం సౌత్ ఆఫ్రికాలో ఉంటే మిగిలిన బంధువులంతా ముంబైలో ఉండేవాళ్లు. దాంతో ప్రతి యేడాది ముంబైకి వచ్చే కనీజ్ యూనివర్సిటీ చదువు తర్వాత 2005లో ముంబైకి పూర్తిగా వచ్చేసింది. ఓ యేడాది గడిపి తర్వాత మళ్లీ వెళ్లి 'లా'లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలనుకుంది. కాని తిరిగి వెళ్లనేలేదు. కామెడీకి కనెక్ట్ అయిపోయి ఇక్కడే స్థిరపడింది. మొదట థియేటర్‌లో పని చేసింది. రెండేళ్లు గడిచాక ఇంప్రొవైజేషన్ కళను ఇంకా బాగా నేర్చుకోవాలనిపించింది ఆమెకు. దాంతో ఇంప్రూవ్ కామెడీ చదవడం కోసం న్యూయార్క్ వెళ్లింది. ముంబై వచ్చాక ఇంప్రూవ్ కామెడీ షోలు చేయడం మొదలుపెట్టింది. 2007లో పెళ్లయింది. అప్పటికీ కామెడీని కెరీర్‌గా తీసుకోవాలనే సీరియస్‌నెస్ లేదు ఆమెకు. ఏదో చేయాలనే తపన మాత్రం ఉండేదట. కొన్ని కారణాల వల్ల 2011లో భర్తతో విడిపోయింది కనీజ్. చాలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఆఫ్రికా వచ్చేయమని తల్లిదండ్రులు, స్నేహితులు కోరినా వెళ్లలేదు. ఇక్కడే ఏదో ఒకటి సాధించాలి అని నిర్ణయించుకొని అప్పటి నుంచి స్టాండప్ కామెడీ మీద దృష్టి పెట్టింది కనీజ్. అలా స్టాండప్ కమేడియన్‌గా మారిపోయింది. 'స్టాండప్ కామెడీ అంటే మగవాళ్ల రాజ్యం అంటారు చాలామంది. కాని ఓ మహిళగా ఈ రంగంలో నేను ఎలాంటి వివక్షనూ ఎదుర్కోలేదు. ఫీమేల్ కమేడియన్‌గా నేను కోల్పోయిన అవకాశాలూ లేవు. కమేడియన్ కమ్యూనిటీ అంతా చాలా ఓపెన్‌గా, ఫ్రెండ్లీగానే ఉంటుంది' అని చెప్తుంది కనీజ్ సుర్కా.

కనీజ్ సుర్కా



పుణ్య అరోరా ఒక టీచర్, ఫొటోగ్రాఫర్, స్టాండప్ కమేడియన్. ఒక్కమాటలో ఆమె ఒక ఆల్ రౌండర్ అని చెప్ప వచ్చు. బెంగుళూరులో పుట్టి పెరిగిన ఈ పంజాబీ అమ్మాయి ఎంబీఏ కంటే ముందు తన హాబీ అయిన ఫొటోగ్రఫీలో పీజీ డిప్లమా చేసింది. ఆ తర్వాత అదే ఇన్‌స్టిట్యూట్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగానూ పనిచేసింది. అండర్ వాటర్ ఫొటోగ్రఫీ అంటే ఆమెకు చాలా ఇష్టం. ఫొటోగ్రఫీతోపాటు కామెడీని ఎంజాయ్ చేసేది చిన్నప్పటి నుంచి. అమ్మతో కలిసి కామెడీషోస్‌కు వెళ్లడం, ఆన్‌లైన్‌లో చూడటం చేసేది. 'సరదా కోసం కామెడీని చూసేదాన్ని కాని ఏరోజూ అనుకోలేదు తర్వాత అదే నాకు సీరియస్ కెరీర్ అవుతుందని' అంటుందిప్పుడు పుణ్య. 'నా వరకు నాకు హాస్యానికి సంబంధించి స్పెసిఫిక్‌గా ఈ అంశం అంటూ ఏదీ ఉండదు. ఏదీ ఫన్నీగా అనిపిస్తే దాన్నే సబ్జెక్ట్‌గా తీసుకుంటా. అవి నా పర్సనల్ లైఫ్ ఎక్స్‌పీరియెన్సెస్ కూడా కావచ్చు' అంటుంది. ఫీమేల్ స్టాండప్ కమేడియన్స్ పట్ల ఆడియెన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటుంది అని అడిగితే... 'స్టాండప్ కమేడియన్స్‌గా ఆడవాళ్లు చాలా తక్కువ మందే ఉన్నారు కాబట్టి డెఫినెట్‌గా ప్రేక్షకుల్లో ఒకరకమైన కుతూహలం ఉంటుంది. కానీ... ఆడ అయినా మగ అయినా ఒక కమేడియన్‌గా నువ్వు ఆడియెన్స్‌ను ఎంత నవ్విస్తున్నావనే అంశం మీదే వాళ్ల ఆదరణ ఆధారపడి ఉంటుంది. నవ్వించడమే కమేడియన్ క్వాలిటీ. దీనికి జెండర్ డిస్క్రిమినేషన్ ఉండదని నా ఉద్దేశం' అని చెబుతుంది పుణ్య అరోరా.

పుణ్య అరోరా

– శరాది

ఈ వారం YouTube హిట్స్

దారి చూడు దుమ్ము చూడు మామ

దారి చూడు దుమ్ముచూడు మామ
దున్నపోతుల బేరి చూడు
కమలపూడి కట్ట మింద కన్నెపిల్లల జోరె చూడు...

జానపదంలో ఎప్పుడూ ఒక కిక్ ఉంటుంది. కవ్వించే శృంగారం ఉంటుంది. చెణుకులు విసిరే వయ్యారం ఉంటుంది. అది నింపుకున్న పాట ఎప్పుడూ ఆకట్టుకుంటుంది. నాని నటిస్తున్న 'కృష్ణార్జునయుద్ధం' సినిమాలో ఒక జానపద గీతాన్ని రికార్డ్ చేసి విడుదల చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన చిత్రకారుడు, గాయకుడు అయిన పెంచలదాసు రాసి పాడిన ఈ పాట సంగీత దర్శకుడు హిప్‌హాప్ తమిళ సంగీతంలో మంచి ఊపు తెచ్చేలా ఉంది. 'కురస కురస అడవిలోన పిలగ కురిసినాది గాంధారి వాన' వంటి వాక్యాలు ఈ పాటలో కొత్త సొగసును తెచ్చేలా ఉన్నాయి. కథ ప్రకారం ఇందులో నాని చిత్తూరు జిల్లాకు చెందినవాడట. అందుకని ఆ ప్రాంతపు జానపదాన్ని పెట్టారు. రెండువారాల్లో ఇరవైలక్షలకు పైగా హిట్స్ సాధించిన పాట ఇది.



నిడివి : 3 ని. 12 సె; హిట్స్: 25,06,100



నిడివి : 15 ని. 26 సె; హిట్స్: 1,41,730

గురుకులం- ది స్కూల్

తల్లిదండ్రులు పిల్లలను అర్థం చేసుకోవడానికి ఎప్పుడూ అవస్థ పడుతూనే ఉంటారు. బడి అంటే నాలుగుగోడలు ఉండే పాఠశాల కాదు ఈ విశాల ప్రపంచం కూడా బడే... దాని నుంచి నేర్చుకోవాల్సింది ఉంది... పిల్లలు నేర్చుకుంటూనే ఉంటారు... అనే మెసేజ్‌తో తెలుగులో తయారైన షార్ట్‌ఫిలిమ్ 'గురుకులమ్ ది స్కూల్'. ఇందులో నటుడు రాజీవ్ కనకాల ముఖ్యపాత్ర పోషించాడు. ఊరిలో చిన్న పనులు చేసుకుని బతికే రాజీవ్‌కు ఇద్దరు పిల్లలు ఉంటారు. పెద్దకొడుకు సరిగా చదవడం లేదని కంప్లయింట్స్ వస్తాయి. కాని ఆ పెద్దకొడుకు నిజంగా ఏ చదువు చదువుతున్నాడో తెలిసి ఆనందంతో ఉప్పొంగిపోతాడు. ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్స్‌లో నామినేషన్లు అవార్డులు పొందిన ఈ షార్ట్‌ఫిల్మ్‌ను 'బాహుబలి' సినిమాకు కలరిస్ట్‌గా పని చేసిన శివకుమార్ దర్శకత్వం వహించాడు. పోస్టయిన మూడు నాలుగు రోజులకే సుమారు లక్ష హిట్స్ సాధించింది ఈ షార్ట్ ఫిల్మ్.

వెల్‌కమ్ టు న్యూయార్క్

మన వైజాగ్ కుర్రాడు, అమెరికాలో స్థిరపడి స్పెషల్ ఎఫెక్ట్స్ రంగంలో పేరు గడించిన 'చక్రి తోలేటి' గతంలో కమలహాసన్ నటించిన 'ఈనాడు', తమిళంలో అజిత్ నటించిన 'బిల్లా2' సినిమాలకు దర్శకత్వం వహించాడు. ఇప్పుడు తాజాగా అతడి రొట్టె విరిగి నేతిలో పడింది. హిందీలో పెద్ద కాస్టింగ్‌తో 'వెల్‌కమ్ టు న్యూయార్క్' సినిమాకు దర్శకత్వం వహించాడు. పంజాబీ సూపర్‌స్టార్ దిల్‌జిత్, సోనాక్షి సిన్హా, బొమన్ ఇరానీ ముఖ్యపాత్రలు ధరిస్తున్న ఈ సినిమాలో దర్శకుడు కరణ్ జొహార్ ముఖ్య పాత్ర పోషించాడు. అంతేకాదు రానా, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, రితేష్ దేశ్‌ముఖ్ వంటి వాళ్లు కూడా ప్రత్యేక పాత్రలు పోషించారు. ఒక ఈవెంట్ షోలో పాల్గొనేందుకు ఇండియా నుంచి న్యూయార్క్ బయలుదేరిన దిల్‌జిత్, సోనాక్షి అక్కడ ఎలాంటి సంఘటనలు ఎదుర్కొన్నారు అనేది కథ. ఆద్యంతం హాస్యం నిండి ఉండే ఈ సినిమా ట్రైలర్ పోస్టయిన వారంలోనే రెండు కోట్ల హిట్స్‌ను దాటడం విశేషం.

నిడివి : 2 ని. 30 సె; హిట్స్: 2,05, 28,767





రంగస్థలం టీజర్

భిన్నమైన సినిమాలు తీస్తాడనే పేరు పొందిన సుకుమార్ తాజా సినిమా 'రంగస్థలం' కూడా భిన్నమైనదే అని టీజర్‌ని చూడగానే అర్థమైంది. రామ్ చరణ్ వంటి స్టార్ పల్లెటూరి మెకానిక్‌గా, చెవిటివాడుగా నటించడం విశేషమే కదా. నాటకంలో డైలాగ్ చెప్పడం ఎంత ముఖ్యమో ఎదుటివారి డైలాగ్ వినడం కూడా అంతే ముఖ్యం. అది వినపడకుండా నటుడిగా రాణించడం అసాధ్యం. రంగస్థలంలో రామ్‌చరణ్ స్టేజ్ నటుడని భోగట్టా. మరి చెవిటివాడు ఈ ఇబ్బందిని ఎలా అధిగమనించి రాణించాడనేది ఆసక్తికరమైన విషయమే. 'మనల్ని అందరూ ఊళ్లో సౌండ్ ఇంజనీర్ అంటారు' అనే డైలాగ్‌తో రిలీజైన 'రంగస్థలం' టీజర్ పోస్టయిన మూడు రోజుల్లో 80 లక్షల హిట్స్‌ను దాటేసింది. సమంత్, ఆది పినిశెట్టి, ప్రకాశ్‌రాజ్ ఈ సినిమాలో ప్రధాన పాత్రలు.

నిడివి : 1 ని. 3 సె; హిట్స్: 87,92,630

హెల్దీ డైట్

బ్రెస్ట్ ఫీడింగ్‌కోసం బెస్ట్ ఫుడ్




ఈలోకంలో పుట్టిన ప్రతిబిడ్డా మొదట తల్లిపాలనే తాగుతుంది. మొదటి పాల చుక్క నుంచి మొదలుకొని... బిడ్డకు జీవితాంతం ఆరోగ్యాన్ని పంచాలంటే తల్లి కూడా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. అప్పుడే అటు తల్లీ, ఇటు బిడ్డా నూరేళ్లపాటు హెల్దీగా ఉంటారు. తల్లికి అలాంటి డైట్ ప్లాన్ ఏమిటో తెలుసుకుందాం.

మన సమాజంలో బాలింతకు ఎన్నో ఆహారపరంగా ఎన్నో ఆంక్షలు. చాలా పథ్యాలు పాటించాలంటూ ఇళ్లలోని పెద్దలు కొందరు కొత్తగా తల్లి అయిన ఆమెను కట్టడి చేస్తుంటారు. అందుకే పథ్యం భోజనం అంటూ చప్పిడి మెతుకులు పెడతారు. కొన్ని కూరలు జలుబు చేస్తాయంటూ పచ్చడి మెతుకులూ పెడుతుంటారు. ఆకు కూరల్లో ఏ బీరకాయ, దొండకాయ కూరలో ఇస్తుంటారు. తల్లి కొన్ని రకాల పదార్థాలు తినడం వల్ల బిడ్డకు సమస్య అవుతుందంటూ ఎన్నెన్నో ఆంక్షలు విధిస్తుంటారు. కాని పాలిచ్చే ప్రతి తల్లికి పోషకాహారం ఉంటేనే పాలు బిడ్డకు సరిపడేటన్ని వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చనుబాలు ఇచ్చే తల్లి అన్ని రకాల పోషకాలు ఉండే ఆహారం తీసుకోవడం అవసరం. అందుకోసం ఆమె డైట్‌ప్లాన్ ఇలా ఉంటే మేలు...

డెయిలీ తల్లి తీసుకోవాల్సిన ఆహారం ఇలా...

- ఉదయం 8 గంటలకు అల్పాహారంగా: పాలు 250 ఎం.ఎల్ + పండు + 2 ఇడ్లీలు సాంబార్‌తో లేదా చపాతీ పప్పుకూర + ఉడికించిన రెండు గుడ్లు
- ఉదయం 11 గం.లకు: గుప్పెడు నట్స్, డ్రై ఫ్రూట్స్ ఉదా: 3 బాదంపప్పులు + 3 అంజీర్లు +3 వాల్ నట్స్ + 10 ఎండు ద్రాక్ష + 1 గ్లాస్ జ్యూస్ లేదా కొబ్బరినీళ్లు లేదా బటర్‌మిల్క్
- లంచ్ 1 గం.కు: దంపుడు బియ్యపు అన్నం 2 కప్పులు + పప్పు లేదా మాంసం + కూరగాయలతో కూర + మజ్జిగ + అరకప్పుడు ఉడికించిన కూరగాయల సలాడ్.
- సాయంకాలం శ్నాక్స్ 4 గం.కు: అటుకులు–బెల్లం, పచ్చికొబ్బరి, పాలు లేదా కొత్తిమీర చట్నీతో మినప గారెలు లేదా ఆకుకూరతో రాగి రొట్టె.
- సాయంకాలం 6 గం.కు: ఏదైనా పండు



- రాత్రిభోజనం 6 గం.కు: మధ్యాహ్న భోజనం లాగానే తీసుకోవచ్చు. నాలుగు మీడియం సైజు రొట్టెలు లేదా 2 రోటీలు కప్పు అన్నం.
- పడుకునేముందు 10 గం.కు: గ్లాస్ పాలు

ప్రొటీన్లు, పిండిపదార్థాలు, కొవ్వు, క్యాల్షియం, ఐరన్, బి అండ్ సి విటమిన్, పీచుపదార్థాలు పాలిచ్చే తల్లి తీసుకునే ఆహారంలో తప్పకుండా ఉండాలి. వేపుడు పదార్థాలతో అజీర్తి, కడుపునొప్పి రావచ్చు. ఇక నిల్వ ఉండేవీ, ఫుడ్ కలర్లు వేసిన పదార్థాల వల్ల... ఆమె చనుబాలు తాగిన బిడ్డకు ఆరోగ్యసమస్యలు వస్తాయి. చాలామంది వెల్లుల్లి, బెల్లం.. వంటివి తింటే తల్లికి పాలు బాగా పడతాయని అనుకుంటారు. కాని దీనికి ఎలాంటి సైంటిఫిక్ ఎవిడెన్స్ లేదు. తల్లికి పాలు బాగా పడాలంటే తల్లి సమతులాహారం తప్పనిసరిగా తీసుకోవాలి. పాలు ఇచ్చిన తర్వాత తల్లికి బాగా ఆకలిగా అనిపిస్తే తాజా పండ్లు లేదా నట్స్ లేదా కప్పు తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. టైమ్‌కు ఆహారం తీసుకోవడం అవసరం. దానితో పిల్లలకు సరిపడ ఆహారం లభించడంతో పాటు... తల్లిలోనూ రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

టెస్ట్ టైమ్

మామోగ్రామ్ ఏ వయసు నుంచి?

రొమ్ము క్యాన్సర్ ముప్పును కనుగొనేందుకు మామోగ్రామ్ ఏ వయసు నుంచి చేయించాలనే అంశంపై భిన్నాభిప్రాయాలున్నాయి. దీన్ని 40వ పడి నుంచే చేయించాలంటూ కొంతమంది మంది డాక్టర్లు సలహా ఇస్తుండగా, మరికొంతమంది 50 తర్వాత నుంచి చేయించవచ్చని చెబుతుంటారు. ఈ విషయాన్ని నిర్ధారణ చేసేందుకు అమెరికాలోని ఓరెగాన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ దాదాపు 66 అధ్యయనాలను నిర్వహించింది. రెండు రకాల రిస్కులు ఉన్న మహిళల్లో దీన్ని నలభై దాటినప్పటి నుంచే ఈ పరీక్షను రొటీన్‌గా తరచూ చేయించడం మంచిదని ఆ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. **ఆ రిస్కులు ఏమిటంటే...** ● తమకు సమీప బంధువుల్లో ఎవరికైనా బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్న కుటుంబ చరిత్ర ఉండటం. ●ముందుగా చేయించిన మామోగ్రామ్‌లో బ్రెస్ట్ టిష్యూ చాలా మందంగా ఉన్నదనే ఫలితం వచ్చి ఉండటం. ● దూరపు బంధువుల్లోనూ రొమ్ము బయాప్సీలో హానికరంకాని (బినైన్) గడ్డలు ఉన్నట్లు తేలినా లేదా అలాంటి బయాప్సీ పరీక్షలో రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు తేలినా. ● అంతకు ముందు గర్భనిరోధక మాత్రలు (పిల్స్) వాడే అలవాటు ఉండటం లేదా పిల్లలు లేకపోవడం లేదా 30 ఏళ్ల తర్వాతే తొలి చూలు గర్భం రావడం లాంటి కేసుల్లో రొమ్ము టిష్యూ మందం మరీ ఎక్కువగా లేకుండా ఒక మోస్తరుగా ఉన్నా 40 ఏళ్ల నుంచే మామోగ్రామ్ పరీక్షలు చేయిస్తుండటం మంచిదని ఆ అధ్యయనాలు చెబుతున్నాయి.

నేటి నుంచే బడ్జెట్ సమరం


ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో మోదీ, మంత్రులు అనంత్ కుమార్, రాజ్‌నాథ్, జైట్లీ

ఉభయ సభల్ని ఉద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి

- నేడే పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే
- ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమైన విపక్షాలు

న్యూఢిల్లీ: నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం కోసం సాధ్యమైనంత కృషి చేస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై ఏకాభిప్రాయం కోసం వివిధ పార్టీలతో చర్చిస్తామంది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ హౌస్‌లో ప్రభుత్వం అఖిల పక్ష భేటీ నిర్వహించింది. బడ్జెట్ సమావేశాలు విజయవం తమయ్యేలా ప్రతిపక్షాలు సహకరించాలని అన్ని పార్టీలను కోరింది. సమావేశంలో ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, అనంత కుమార్, కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే, సింధియా, ములాయం సింగ్ యాదవ్ (సమాజ్‌వాదీ), డి.రాజా(సీపీఐ), కనిమొళి(డీఎంకే), డెరెక్ ఒబ్రియాన్(తృణమూల్), తారిక్ అన్వర్ (ఎన్సీపీ) తదితరులు పాల్గొన్నారు.

భేటీ అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ మాట్లాడుతూ.. 'సమావేశం ఫలవంతంగా సాగింది. బడ్జెట్ సమావేశాల్ని విజయవంతం చేయాలని అన్ని పార్టీల నేతలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. పార్టీలు లేవనెత్తిన అంశాలకు ప్రాధాన్యమిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అదే సమయంలో నిర్మాణాత్మక చర్చ జరిగేలా సహకరించాలని ప్రధాని కోరారు. రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదానికి వీలైనంత మేర ప్రయత్నిస్తాం. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో జీఎస్టీ ఆమోదం పొందినట్లే.. ట్రిపుల్ తలాక్ బిల్లు కూడా ఆమోదం పొందుతుంది' అని చెప్పారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌పై ప్రశ్నించగా.. 'బిల్లు ఇప్పుడు రాజ్యసభ ఆస్తి. సభే నిర్ణయం తీసుకుంటుంది' అని సమాధానమిచ్చారు. పార్లమెంటరీ కమిటీల వ్యవస్థను బలోపేతం చేయాలని, జాతీయ ప్రాధాన్యత ఉన్న అంశాలపై స్టాండింగ్ కమిటీలు వాస్తవిక పరిష్కారాలు సూచించాలని పార్టీలకు ప్రధాని సూచించారు. సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీల నేతలతో స్పీకర్ సుమిత్రా మహాజన్ ఆదివారం రాత్రి విందు సమావేశం ఏర్పాటు చేశారు. సభలో సహకారం ఉంటుందని నేతలు హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.


అత్యాచారాలు, వర్తకుల దుస్థితిపై నిలదీస్తాం

మరోవైపు పార్లమెంట్ సమావేశాల్లో పలు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షం సిద్ధమైంది. అత్యాచార సంఘటనలు, మహిళలపై అకృత్యాలు, రాజ్యాంగ సంస్థలపై దాడులు, వర్తకుల దుస్థితితో పాటు ఉత్తర ప్రదేశ్‌లో మత ఘర్షణలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ చెప్పారు. ఈ అంశాల్ని లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించాలని, సభలో సహకార ధోరణితో వ్యవహరించాలని ఆయన కోరారు. పార్లమెంటులో వ్యవహరించాల్సిన తీరుపై వ్యూహ రచన కోసం ప్రతిపక్ష పార్టీల నేతలు నేడు సమావేశం కానున్నారు. ఇక అదే ఎజెండాతో ఈ రోజు బీజేపీ పార్లమెంటరీ పార్టీ కార్యనిర్వాహక వర్గ భేటీ కూడా జరగనుంది.

ఫిబ్రవరి 9 వరకూ తొలి దశ సమావేశాలు


బడ్జెట్ సమావేశాల తొలిరోజైన నేడు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తారు. అనంతరం ప్రభుత్వం పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతుంది. ఎన్డీఏ సర్కారు చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న జైట్లీ పార్లమెంటులో ప్రవేశ పెడతారు. తొలిదశ సమావేశాలు ఫిబ్రవరి 9తో ముగుస్తాయి. మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకూ మలిదశ సమావేశాలు జరుగుతాయి.

ధనిక ఎంపీలు జీతాలు వదులుకోవాలి



న్యూఢిల్లీ: ధనిక పార్లమెంట్ సభ్యులు తమ జీతభత్యాలను వదులుకొని సరికొత్త ఉద్యమానికి నాంది పలకాలని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు వరుణ్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చొరవ తీసుకోవాలని కోరారు. తద్వారా ప్రజాప్రతినిధులపై ప్రజలకు మరింత విశ్వాసం కలుగుతుందని, దేశవ్యాప్తంగా సానుకూల సంకేతం పంపినట్లవుతుందని స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని.. ప్రజాస్వామ్యానికి ఇది హానికర పరిణామమని హెచ్చరించారు. దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితులకు ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలన్న వరుణ్.. ఇలాంటి నిర్ణయాలు కొంతమంది ఎంపీలకు ఇబ్బంది కలిగించవచ్చన్నారు. రూ.కోటి కన్నా ఎక్కువ ఆస్తులున్న ఎంపీలు ప్రస్తుతం 449 మంది ఉన్నారని, 132 మంది ఎంపీలు తమ ఆదాయం రూ.10 కోట్లకుపైగా ఉన్నట్లు ప్రకటించారన్నారు.

'మహా' శకటానికి ప్రథమ బహుమతి



న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌పథ్‌లో ప్రదర్శించిన శకటాలకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. రాష్ట్రాల కేటగిరీలో ఛత్రపతి శివాజీ పట్టాభిషేక ఘట్టాన్ని చూపుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శకటానికి ప్రథమ బహుమతి దక్కింది. అస్సాం, ఛత్తీస్‌గఢ్‌ల శకటాలు వరసగా రెండో, మూడో బహుమతులు పొందాయి. రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఢిల్లీలో బహుమతులను ప్రదానం చేశారు. కేంద్ర మంత్రిత్వ శాఖల కేటగిరీలో క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఉత్తమ శకటం అవార్డు దక్కింది. వివిధ దళాల కేటగిరీలో ఆర్మీ పంజాబ్ రెజిమెంట్, పారా-మిలిటరీ దళాల కేటగిరీలో ఐటీబీపీలు ఉత్తమ కవాతు ట్రోఫీని పొందాయి.

అవినీతి కాంట్రాక్టర్ల గొంతు కోస్తా!

న్యూఢిల్లీ: అవినీతికి పాల్పడితే గొంతు కోస్తానంటూ కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని ఆర్రా స్థానం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సింగ్ శనివారం తన నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ 'ఏ కాంట్రాక్టరైనా అవినీతికి పాల్పడితే అలాంటివారి గొంతుకోసి, కేసు పెట్టి, జైలుకు పంపిస్తా' అని హెచ్చరించారు. అందుకు సంబంధించిన వీడియో తాజాగా బయటకొచ్చింది.

విడాకులిచ్చాం.. ఇక ఫొటోలు పెట్టకండి



న్యూఢిల్లీ: ఇటీవల ఓ జంటకు విడాకులు మంజూరు చేసిన సుప్రీంకోర్టు ఇకపై భార్యాభర్తల్లో ఎవరూ కూడా ఒకరి ఫొటోలను మరొకరు సామాజిక మాధ్యమాలు సహా ఎక్కడా పెట్టకూడదని ఆదేశించింది. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తన భార్య నుంచి విడాకులు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఇందుకు ఆమె కూడా ఒప్పుకోవడంతో కోర్టు వారి వివాహాన్ని రద్దు చేసింది. విడాకులు ఇచ్చినందున ఇకపై భార్యాభర్తలు ఒకరి ఫొటోలను మరొకరు సామాజిక మాధ్యమాలు సహా ఎక్కడా ప్రదర్శించకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. భార్యకు భర్త రూ. 37 లక్షల భరణాన్ని కూడా ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. వీరి వైవాహిక జీవితం, ఆస్తి గొడవలు తదితరాలపై ఉన్న అన్ని కేసులనూ కొట్టేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

టాటూ ఉంటే ఉద్యోగం పోయినట్టే

న్యూఢిల్లీ: శరీరంపై శాశ్వతంగా ఉండే టాటూ వేయించుకున్న వారు తమ విభాగంలో ఉద్యోగాలకు అనర్హులంటూ ఎయిర్‌ఫోర్స్ విధించిన నిబంధనను న్యాయస్థానం సమర్థించింది. టాటూ ఉందన్న కారణంతో తనను అనర్హుడిగా ప్రకటించారంటూ ఓ యువకుడు వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. సదరు అభ్యర్థి ఉద్యోగ ప్రకటనలో పేర్కొన్న మేరకు తన శరీరంపై ఉన్న టాటూ ఫొటోను జత చేయలేదని ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఆచారాలు, సంప్రదాయాల మేరకు టాటూలు వేయించుకునే గిరిజన అభ్యర్థులకు మాత్రం ఈ విషయంలో మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. కాగా, ఉద్యోగ ప్రకటనలో పేర్కొన్న నిబంధనలకు లోబడే ఎయిర్‌ఫోర్స్ అధికారులు నిర్ణయం తీసుకున్నారని పేర్కొంటూ కేసును న్యాయస్థానం కొట్టివేసింది.

భిక్షాటనా ఉద్యోగమేనా: చిదంబరం



న్యూఢిల్లీ: పకోడీలు అమ్మడమూ ఉద్యోగమేనని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆదివారం తీవ్రంగా స్పందించారు. భారత్‌లో ఉద్యోగ సృష్టి ఎలా చేయాలన్న విషయం మోదీ ప్రభుత్వానికి అంతుపట్టకుండా ఉందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఎలాంటి కొత్త ఉద్యోగాల సృష్టి లేకుండానే దేశం ముందుకెళ్తోందని వ్యాఖ్యానించారు. 'మరో కేంద్ర మంత్రి ఉపాధి హామీ కూలీలను కూడా ఉద్యోగులుగా పరిగణించాలని కోరుకుంటున్నారు. అలాగైతే వారిని 100 రోజులు ఉద్యోగులుగా, మిగతా 265 రోజులూ నిరుద్యోగులుగా పరిగణిస్తారా?' అని ప్రశ్నించారు.

ఇక 'సోషల్ మీడియా హబ్'!

న్యూఢిల్లీ: కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పథకాల అమలు, జిల్లాలో ట్రెండింగ్ సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా 'సోషల్ మీడియా కమ్యూనికేషన్ హబ్'ను ప్రారంభించనున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా సమాచార సేకరణకు ప్రతి జిల్లాలో మీడియా ప్రతినిధుల్ని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని వెల్లడించింది. వీరు ఆయా జిల్లాల్లో జరిగే సంఘటనలతో పాటు కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటారని పేర్కొంది. ఈ సమాచారాన్ని విశ్లేషించడానికి కేంద్ర స్థాయిలో నిపుణుల్ని నియమిస్తామంది. ఈ ప్రాజెక్టు ఇంగ్లిష్, హిందీ, తెలుగు, బెంగాలి, తమిళ్, కన్నడ సహా పలు భాషల్ని సపోర్ట్ చేస్తుందనీ.. దీంతో అన్ని సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాల్లోని సమాచారాన్ని సేకరించవచ్చంది.

ఆ వ్యాపారవేత్తల పేర్లు వెల్లడించండి

న్యూఢిల్లీ: విదేశీ పర్యటనల సందర్భంగా ప్రధాని మోదీ వెంట ఉండే ప్రతినిధుల పేర్లను వెల్లడించాలని ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) ఆర్.కె.మాథుర్ ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో)ను ఆదేశించారు. 'జాతీయభద్రత'తో ముడిపడిన అంశమైనందున పేర్లను వెల్లడించలేమంటూ పీఎంవో అభ్యంతరం వ్యక్తం చేయటాన్ని తోసిపుచ్చారు. అయితే, ప్రధాని వెంట ఉండే భద్రతా సిబ్బంది, అధికారుల వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదన్నారు.

నారీశక్తికి తిరుగులేదు!

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- ఒక కూతురు.. 10 మంది కుమారులతో సమానం
- పద్మ అవార్డుల్లో పారదర్శకతతోనే సామాన్యులకు గౌరవం
- ఈ ఏడాది తొలి 'మన్‌కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: దేశాన్ని నడిపిస్తోంది నారీ శక్తేనని.. భారత్‌లో చోటుచేసుకుంటున్న సానుకూల మార్పుల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. మనోబలముంటే సాధించలేనిదేదీ లేదని మహిళలు నిరూపిస్తున్నారని.. వివిధ రంగాల్లో వీరి ప్రగతే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఈ ఏడాది తొలి 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి మోదీ రేడియోలో ప్రసంగించారు. వైదిక యుగం నుంచీ భారత మహిళలు కుటుంబం, సమాజాన్ని ఏకం చేయడంలో కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. పద్మ అవార్డుల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం వల్లే సామాన్యులకు, ప్రజాసేవ చేస్తున్న వారికి గుర్తింపు దక్కిందన్నారు. నిస్వార్థంగా సేవచేస్తున్న వారున్న సమాజంలో ఉండటం మన అదృష్టమన్నారు. ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లడమే భారత సంస్కృతి గొప్పదనమన్నారు.

ముందుండి నడుపుతున్న మహిళలు

'నారీశక్తి కుటుంబాన్ని, సమాజాన్ని ఏకం చేస్తుంది. వైదిక కాలం నుంచీ ఇది నిరూపితమైంది. మహిళలే మనకు స్ఫూర్తి. దేశానికి కొత్త వెలుగులు తెచ్చేదీ వారే' అని గార్గి, మైత్రేయి, మీరాబాయి, అహల్యాబాయి హోల్కర్, రాణి లక్ష్మీబాయి తదితరుల పేర్లను ప్రస్తావించారు. 'ఫిబ్రవరి 1.. నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలిచిన వ్యోమగామి కల్పనా చావ్లా వర్ధంతి. ఆమె మనతో లేకపోవటం బాధాకరం. ఆమె జీవితం, సాధించిన విజయాలు ప్రపంచంలోని యువతులకు, ప్రత్యేకంగా భారతీయులకు ఆదర్శం. నారీ శక్తికి పరిమితుల్లేవని కల్పనా చావ్లా నిరూపించారు. భారత మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ.. తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. దేశం గర్వపడేలా చేస్తున్నారు' అని మోదీ ప్రశంసించారు. ప్రాచీన భారత సమాజంలోనూ మహిళలు సాధించిన విజయాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాయన్నారు. 10 మంది కుమారులతో కలిగే పుణ్యం.. ఒక కూతురితో సమానమని పేర్కొన్నారు. ఇదే భారత సమాజం మహిళలకు ఇచ్చే గౌరవమన్నారు. ఓ పౌరుడు మహిళాశక్తి గురించి 'మైగవ్' యాప్‌కు పంపిన లేఖను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సుఖోయ్-30 యుద్ధ విమానంలో ప్రయాణించడాన్ని ప్రస్తావిస్తూ.. మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్లడంతోపాటు ముందుండి నడిపిస్తున్నారనే విషయం అర్థం చేసుకోవాలన్నారు. రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో మహిళా బీఎస్‌ఎఫ్ జవాన్లు చేసిన విన్యాసాలు స్వదేశీ, విదేశీ అతిథులను ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. అసాధారణ ప్రతిభ కనబరుస్తున్న మహిళలతో (ఆయా రంగాల్లో మొదటి స్థానంలో ఉన్న మహిళలతో ఇటీవలే ఈ సమావేశం జరిగింది) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమావేశమవటాన్ని మోదీ అభినందించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మావో ప్రాబల్య ప్రాంతాల్లో ఆదివాసీ మహిళలు ఈ-రిక్షాలు నడపటాన్ని ప్రస్తావించారు.


ఎన్‌సీసీ ర్యాలీలో ఓ క్యాడెట్‌కు బహుమతి అందజేస్తున్న మోదీ

సిఫారసుల్లేవ్..

పద్మ అవార్డు విజేతల ఎంపికలో అనుసరించిన పారదర్శక విధానం వల్లే సామాన్యులకు సరైన గౌరవం దక్కిందని మోదీ పేర్కొన్నారు. పురస్కారాన్ని అందుకోనున్న వారంతా పేర్లతో కాకుండా వారు చేస్తున్న సేవల ద్వారా జాబితాలో చోటు సంపాదించారన్నారు. 'నగరాల్లో నివసించని వారు.. రోజూ పేపర్లు, టీవీల్లో కనిపించని వారు ఈసారి పద్మ అవార్డులు అందుకోబోతున్నారు. దీనికి కారణం ఆన్‌లైన్ నామినేషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకత పెరగటమే. అందుకే పద్మ అవార్డుల ఎంపికలో సానుకూల మార్పు వచ్చింది' అని ప్రధాని పేర్కొన్నారు. 'విజేతలను చూస్తే గర్వం కలుగుతుంది. ఇలాంటి వ్యక్తులు మన సమాజంలో ఉండటం అదృష్టం. ఇలాంటి వారు సిఫారసుల్లేకుండానే గుర్తింపు పొందటం గొప్ప విషయం' అని చెప్పారు.

అవినీతిపై 'యువ'పోరాటం

యువత సహకరించాలి: ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీలో మోదీ

న్యూఢిల్లీ: అవినీతిపై అవిశ్రాంత పోరు కొనసాగిస్తున్న తమ ప్రభుత్వానికి సహకరించాలని ప్రధాని మోదీ దేశ యువతను కోరారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో అవినీతి పరులెవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు జైళ్లలో ఉన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆదివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ ర్యాలీలో మోదీ మాట్లాడుతూ.. 'అవినీతి వ్యతిరేక కార్యక్రమాల ద్వారా ధనికులు, సమాజంలో గొప్ప పేరున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదని ప్రజలు భావించేవారు. డబ్బున్నవాళ్లను వదిలేస్తారనే భావనా ఉండేది. కానీ ఇప్పుడలా లేదు. తప్పు చేసిన ముగ్గురు మాజీ సీఎంలు జైలు కెళ్లటమే ఇందుకు ఉదాహరణ. అవినీతి చెదలను అంతం చేయడం ద్వారానే పేదలకు మేలు జరుగుతుంది' అని ఎన్‌సీసీ క్యాడెట్లకు తెలిపారు. బిహార్ మాజీ సీఎంలు లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రా, హరియాణా మాజీ సీఎం ఓపీ చౌతాలా అవినీతి ఆరోపణలపై జైలు కెళ్లిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు.

లీకేజీ అరికట్టడం ద్వారానే..: భారత యువత అవినీతిని ఎప్పుడూ ప్రోత్సహించలేదన్న మోదీ.. నల్లధనం, అవినీతిపై పోరాటం దీర్ఘకాలం జరగాలన్నారు. డిజిటల్ లావాదేవీల ద్వారా అవినీతిని తగ్గించొచ్చని.. 'భీమ్' యాప్ ద్వారా డిజిటల్ లావాదేవీలు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించడంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, యువకులు సాయం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో జరుగుతున్న లీకేజీని అరికట్టడం ద్వారా అసలైన లబ్ధిదారులకు మేలు చేకూర్చడం తద్వారా దేశాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

ఉన్నతస్థాయికి ఎన్‌సీసీ: 2023లో 75 ఏళ్లు పూర్తిచేసుకోనున్న ఎన్‌సీసీని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని మోదీ పిలుపునిచ్చారు. బాల్యంలో తను కూడా ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉన్నానని.. క్యాంపుల ద్వారా స్ఫూర్తి పొందానని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో ఎన్‌సీసీ పని తీరుపై సమీక్ష జరుపుకుని ముందుకెళ్లాలన్నారు.



విదేశాంగ కార్యదర్శి జైశంకర్ పదవీవిరమణ

కొత్త కార్యదర్శిగా విజయ్ గోఖలే

న్యూఢిల్లీ: అమెరికా-భారత్ పౌర అణు ఒప్పందంతో పాటు ఇండియా-చైనాల మధ్య నెలకొన్న డోక్లామ్ సమస్యను సామరస్యంగా పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించిన విదేశాంగ కార్యదర్శి ఎస్.జైశంకర్ ఆదివారం పదవీవిరమణ చేశారు. మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న జైశంకర్.. గత నాలుగు దశాబ్దాల్లో అత్యధిక కాలం విదేశాంగ కార్యదర్శిగా కొనసాగిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ప్రధాని మోదీ 2015, జనవరి 28న విదేశాంగ కార్యదర్శిగా జైశంకర్‌ను నియమించారు. జైశంకర్ స్థానంలో చైనా వ్యవహారాల్లో నిపుణుడైన 1981 ఐఎఫ్‌ఎస్ అధికారి విజయ్ కేశవ్ గోఖలే సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటనతో పాటు సీషెల్స్‌కు చెందిన ఓ దీవిలో మిలటరీ సౌకర్యాల అభివృద్ధికి చేసే ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవడంలో జైశంకర్ కీలకపాత్ర పోషించారు. 1977 ఐఎఫ్‌ఎస్ అధికారి అయిన జైశంకర్ నాలుగున్నరేళ్ల పాటు చైనాలో భారత రాయబారిగా పనిచేశారు. 2013లో అమెరికాలో భారత రాయబారిగా ఎంపికైన తర్వాత ఐఎఫ్‌ఎస్ అధికారిణి దేవయాని ఖోబ్రగడే ఉదంతంపై ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు కృషి చేశారు.

యాసిడ్ బాధితులకు కోటా

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: ఆటిజం, మానసిక అనారోగ్యం, బుద్ధి మాంద్యంతో పాటు యాసిడ్ దాడి బాధితులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీఅయ్యాయి. ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీచేసే గ్రూప్ ఏ, బీ, సీ ఉద్యోగాల్లో 40 శాతానికి పైగా వైకల్యస్థాయి ఉన్న అభ్యర్థులకు మొత్తం ఖాళీల్లో నాలుగు శాతం కేటాయించనున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మొత్తం గతంలో మూడు శాతంగా ఉండేది. దృష్టి లోపం, వినికిడి లోపం, సెరిబ్రల్ పాల్సీ, మరుగుజ్జు, కుష్ఠు వ్యాధి నయమైనవారు, యాసిడ్ దాడి బాధితులకు ఉద్యోగాల్లో ఒక శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర సిబ్బంది, శిక్షణా విభాగం(డీవోపీటీ) అన్ని ప్రభుత్వ విభాగాలకు ఇటీవల లేఖ రాసింది. వీరితో పాటు ఆటిజం, మానసిక అనారోగ్యం, బుద్ధిమాంద్యంతో బాధపడేవారికి కూడా ఉద్యోగాల్లో ఒక శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ప్రతి కేంద్ర ప్రభుత్వ విభాగం వైకల్యమున్న ఉద్యోగుల ఫిర్యాదులు స్వీకరించడానికి ఓ అధికారిని నియమించాల్సి ఉంటుంది. ఫిర్యాదు అందుకునే అధికారులు 2 నెలల్లోగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలకు కేటాయించిన ఉద్యోగాల్లో వైకల్యమున్న అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ సర్దుబాటు చేయరాదని కేంద్రం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.


ఆదివారం కోయంబత్తూరులో నిర్వహించిన జల్లికట్టులో పాల్గొన్న యువకుడు. ఇక్కడ తొలిసారి జరుగుతున్న పోటీల్లో 750 ఎద్దులు, 500 మంది యువకులు పాల్గొంటున్నారు.

ఎంఆర్ఐ మిషన్‌లో ఇరుక్కుని..

ముంబైలో ఆస్పత్రిలో ఒకరి మృతి.. డాక్టర్ సహా ముగ్గురి అరెస్ట్


రాజేశ్ మరు

ముంబై: మహారాష్ట్రలో ఓ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంది. ఓ వ్యక్తిని మెటల్ ఆక్సిజన్ సిలిండర్‌తో ఎంఆర్ఐ స్కానింగ్ గదిలోకి పంపడంతో అయస్కాంత ప్రభావంతో అతను సిలిండర్, మెషీన్‌కు మధ్య ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయాడు. ముంబైలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న రాజేశ్ మరు(32) శనివారం సాయంత్రం తన బంధువొకరిని ఎంఆర్ఐ స్కానింగ్ కోసం ఇక్కడి బీవైఎల్ నాయర్ చారిటబుల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. గదిలోకి ఎలాంటి లోహపు వస్తువుల్ని తీసుకెళ్లరాదని అక్కడ ఉన్న హెచ్చరికపై రాజేశ్ వార్డు బాయ్‌ను ప్రశ్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే గదిలో ఎంఆర్ఐ యంత్రం ఆఫ్‌లో ఉందనీ, మీరు సిలిండర్‌తో వెళ్లవచ్చని సదరు బాయ్ సమాధానమిచ్చినట్లు వెల్లడించారు. కానీ ఆ గదిలో అప్పటికే ఎంఆర్ఐ యంత్రం పనిచేస్తుండటంతో సిలిండర్ పట్టుకున్న రాజేశ్‌ను ఒక్కసారిగా తనవైపు లాక్కుందన్నారు. దీంతో యంత్రం, సిలిండర్ మధ్య ఇరుక్కున్న రాజేశ్‌కు తీవ్ర రక్తస్రావమైనట్లు తెలిపారు. వెంటనే బంధువులు, రోగుల కేకలతో అక్కడికి చేరుకున్న ఇతర వార్డు బాయ్‌లు రాజేశ్‌ను ఎమర్జెన్సీ వార్డుకు తరలించినప్పటికీ.. ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ ఘటనలో డా.సిద్ధార్థ్ షాతోపాటు వార్డు బాయ్, అటెండర్‌లను అరెస్ట్ చేశారు.

గోడ వెనుక ఏముంది?

అడ్డు'గోడల్ని' ఛేదించే స్మార్ట్ కెమెరాలు



లండన్: కేవలం మీ ఫోన్‌కున్న కెమెరాతో ఓ గోడకు ఇవతలి వైపు ఉండి అవతల ఎవరున్నారో తెలుసుకోగలిగితే? మీ శరీరాన్ని, మెదడును కేవలం ఓ కెమెరాతో స్కాన్ చేయగలిగితే? పొగమంచులోనూ రోడ్లను స్పష్టంగా చూడగలిగితే? వాటి ఫొటోలు కూడా స్పష్టంగా తీయగలిగితే? ప్రస్తుతానికి ఇవన్నీ అసాధ్యంగానే అనిపిస్తున్నప్పటికీ భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్న అత్యాధునిక కెమెరాలతో సాధ్యమేనని పరిశోధకులు చెబుతున్నారు. వీటి సాయంతో సరికొత్త నిఘా ఫోన్ల శకం మొదలవుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోకు చెందిన ప్రొ.డానియేల్ ఫాసియో, హెరియట్-వాట్ వర్సిటీకి చెందిన ప్రొ.స్టీఫెన్ మెక్లాగ్లీన్ ఓ వ్యాసం రాశారు. భవిష్యత్ కెమెరాల్లో షార్ట్ లేజర్ కిరణాలను ఓ గదిలో ప్రయోగించినప్పుడు గోళాకృతిలో అన్ని కోణాల్లోనూ విస్తరిస్తాయని తెలిపారు. గోడల్ని దాటివెళ్లి వస్తువుల్ని తాకే ఈ కిరణాలు వెనక్కి తిరిగి వస్తాయని వెల్లడించారు. ప్రత్యేకంగా రూపొందించిన అత్యంత సున్నితమైన కెమెరాలు వెనక్కు వచ్చే లేజర్ కిరణాలను గుర్తిస్తాయన్నారు. ఈ కెమెరాలు ఓ సెకనులో 20 బిలియన్ ఫ్రేముల్ని రికార్డు చేయగలవన్నారు. తాము ల్యాబ్ లో చేసిన పరీక్షలో ఓ గోడ అవతలి వైపున ఉండే వస్తువుల్ని ఈ కెమెరాల ద్వారా గుర్తించడం సాధ్యమేనని తేలిందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఘటనాస్థలికి చేరుకోకుండానే లేదా అక్కడికి వెళ్లలేని పరిస్థితుల్లో బాధితుల్ని రక్షించడానికి ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

బంగారు దేశం!

ప్రపంచంలోని పుత్తడిలో అత్యధిక భాగం ఇథియోపియాలోనే...



ఆఫ్రికా దేశం ఇథియోపియా అంటే కేవలం పేదరికం, యుద్ధాలు, అంతర్యుద్ధాలే గుర్తొస్తాయి. కానీ ప్రపంచంలోనే మరే దేశంలోనూ లేనంత బంగారం ఈ దేశ భూగర్భంలో ఉండొచ్చని శాస్త్రవేత్తలు తాజాగా చెబుతున్నారు.ఈ స్వర్ణ లోహాన్నంతటినీ వెలికి తీయడం ప్రారంభిస్తే బంగారం ఉత్పత్తిలో ఇథియోపియా దక్షిణాఫ్రికాను కూడా వెనక్కినెట్టే అవకాశం ఉంటుందన్నారు. స్కాట్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్‌కు చెందిన లియామ్ బుల్లాక్, ఒవెన్ మోర్గాన్ అనే ఇద్దరు భూగర్భ శాస్త్రజ్ఞులు ఇథియోపియాలో పరిశోధనలు సాగించారు. ఇథియోపియా పశ్చిమ భాగాన, సూడాన్ సరిహద్దుకు దగ్గర్లో అసోసా అనే ప్రాంతం ఉంటుంది. మైదానాలు, పర్వత ప్రాంతాలు, లోయలు, నదీ ప్రవాహాలతో కలగలసి ఉండే ఇథియోపియాలో దట్టమైన అడవులూ బాగా ఎక్కువే. 1930 నుంచి 1974 వరకు ఇథియోపియా చక్రవర్తిగా ఉన్న హైలీ సెలాస్సీ అసోసాలో బంగారాన్ని వెలికి తీయడంపై శ్రద్ధ చూపారు. అనంతరం అంతర్యుద్ధం తదితర కారణాలతో బంగారు గనుల తవ్వకాల గురించి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ 2000 తర్వాత ప్రభుత్వం గనుల తవ్వకాలకు లైసెన్సులు ఇవ్వడం ప్రారంభించింది. తులు కపి అనే ప్రాంతం నుంచి ఇప్పటికే 48 టన్నుల బంగారాన్ని బయటకు తీశారు. అసోసా ప్రాంతంలోనూ 48 టన్నుల బంగారమే ఉందని ఈజిప్టుకు చెందిన ఆస్కామ్ అనే కంపెనీ గుర్తించింది. వాస్తవానికి ఇంకా చాలా ఎక్కువ మొత్తంలో బంగారం ఉంటుందని అంచనా వేస్తున్నట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

రాష్ట్రంలో ప్రధాన ఆలయాల్లో వెండి నిల్వలు కొండల్లా పేరుకుపోతున్నాయి. శ్రీకాళహస్తి, శ్రీశైలం, విజయవాడ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల ఇలా ప్రముఖ దేవాలయాల్లో వేల కిలోల వెండి నిల్వలు ఉన్నాయి. వీటిని భద్రపరచడం ఆయా దేవస్థానాలకు భారంగా మారింది. బ్యాంకుల్లో వెండిని డిపాజిట్ చేస్తే వడ్డీ ఇచ్చే విధానం లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బంగారాన్ని బ్యాంకుల్లో బాండ్ల రూపంలో దాచుకునే పథకాన్ని ప్రకటించి వడ్డీ కూడా చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా దేవాలయాలు తమ వద్ద ఉన్న వెండి నిల్వలను అమ్మి, బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి.

కరుగుతున్న వెండి కొండలు

- బంగారం కొనుగోలు వైపు దేవాలయాల చూపు
- ప్రధాన దేవాలయాల్లో టన్నుల కొద్దీ వెండి నిల్వలు
- బ్యాంకుల్లో వెండి డిపాజిట్లకు వడ్డీ ఇచ్చే విధానం లేదు
- బంగారానికి వడ్డీ చెల్లిస్తుండటంతో వెండి అమ్మకానికి మొగ్గు


శ్రీకాళహస్తి ఆలయంలో వెండి నిల్వలు (ఫైల్)

సాక్షి, అమరావతి

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఏకంగా 21 వేల కిలోల వెండి నిల్వలు ఉన్నాయి. శని దోష నివారణకు భక్తులు శ్రీకాళహస్తిలో రాహు–కేతు పూజలు నిర్వహించి వెండి నాగ పడగలను సమర్పిస్తుంటారు. ఇక్కడే కాకుండా.. శ్రీశైలం, విజయవాడ, సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల ఆలయాల్లో కూడా ప్రతి చోటా వెయ్యి కిలోలకు పైగా వెండి నిల్వలు పేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం బంగారాన్ని బాండ్ల రూపంలో దాచుకునే పథకాన్ని ప్రకటించడంతో.. దేవుడి బంగారు ఆభరణాలను డిపాజిట్ చేస్తే బ్యాంకులు వాటి విలువ ఆధారంగా ఆలయానికి వడ్డీ చెల్లించే వెసులుబాటు ఏర్పడింది. వెండి నిల్వలను డిపాజిట్ చేస్తే వడ్డీ చెల్లించే విధానం లేకపోవడంతో వాటిని అమ్మేందుకు జేఎస్వీ ప్రసాద్ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు వెండిని అమ్మి బంగారంగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికనుగుణంగా డిసెంబర్‌లో శ్రీకాళహస్తి ఆలయం తమ దగ్గర ఉన్న వెండి నిల్వల్లో 14,935 కిలోల అమ్మకానికి ఈ – వేలం నిర్వహించింది.

10,282 కిలోల వెండితో 100 కిలోల బంగారం

శ్రీకాళహస్తిలో 14,935 కిలోల వెండి ఆభరణాలను కరిగించగా.. కడ్డీల రూపంలో స్వచ్ఛమైన వెండి 10,282 కిలోలు వచ్చింది. ఈ వెండి కడ్డీలను ప్రభుత్వ రంగ సంస్థ మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎంఎంటీసీ)కి అమ్మగా రూ.33.29 కోట్లు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తంతో ఎంఎంటీసీ ద్వారా తిరిగి వంద కిలోల బంగారాన్ని కొనుగోలు చేశారు. ఈ బంగారాన్ని బాండ్ల రూపంలో బ్యాంకుల్లో డిపాజిట్ చేయనున్నట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. శ్రీశైలంలో 2,400 కిలోల వెండి ఆభరణాలు ఉండగా, అందులో 500 కిలోలను కరిగించగా కడ్డీల రూపంలో స్వచ్ఛమైన వెండి 375 కిలోలు వచ్చినట్టు శ్రీశైల ఆలయ అధికారులు చెప్పారు. ఈ 375 కిలోల వెండిని ఎంఎంటీసీ ద్వారా అమ్మగా రూ.1.36 కోట్లు వచ్చాయి. ఈ మొత్తంతో 4.353 కిలోల బంగారాన్ని కొనుగోలు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

బ్యాంకుల్లో బాండ్ల రూపంలో ఉన్న బంగారం ఆలయాల వారీగా..

ఆలయం	బాండ్ల రూపంలో దాచిన బంగారం
సింహాచలం నరసింహస్వామి ఆలయం	23.220 కిలోలు
అన్నవరం సత్యనారాయణ స్వామి	22.128 కిలోలు
ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి	59.123 కిలోలు
విజయవాడ దుర్గామల్లేశ్వర ఆలయం	105.690 కిలోలు
శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున ఆలయం	30.129 కిలోలు
కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయం	14.781 కిలోలు
శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర ఆలయం (వెండి అమ్మడం ద్వారా వచ్చిన 100 కిలోలు కాకుండా)	15.237 కిలోలు
వైజాగ్ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం	12.031 కిలోలు

గేటు వద్ద ఆగిన లారీ.. రైళ్ల రాకపోకలకు అంతరాయం


రైల్వే గేటు కింద ఆగిన లారీని నెడుతున్న స్థానికులు

పిడుగురాళ్ల టౌన్: రైల్వే గేటు వద్ద ఓ లారీ ఆగిపోవడంతో సుమారు గంటన్నరపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల జానపాడు రోడ్డులోని ఎల్‌సీ–64 గేటు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. జానపాడు నుంచి పిడుగురాళ్లకు వస్తున్న ఓ లారీ.. రైల్వే గేటు వద్దకు రాగానే ఒక్కసారిగా ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. అదే సమయంలో గుంటూరు నుంచి హైదరాబాద్ వైపునకు ఓ రైలింజిన్ వస్తుండగా, సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో గేటు సమీపంలోనే దాన్ని నిలిపివేశారు. మరోవైపు సికింద్రాబాద్ నుంచి వచ్చిన శబరి ఎక్స్‌ప్రెస్‌ను పిడుగురాళ్ల స్టేషన్‌లోనే గంటపాటు నిలిపింది. రైల్వే సిబ్బంది గేటు వద్దకు చేరుకుని ట్రాక్టర్ సాయంతో లారీని వెనక్కు నెట్టించారు. అనంతరం రైళ్ల రాకపోకలకు అనుమతించారు. గేటు వద్ద ఇరువైపులా వందల సంఖ్యల వాహనాలు నిలిచిపోయాయి.

1న సమాచారశాఖ ఆధ్వర్యంలో రిలేదీక్ష

స.హ. ప్రచార ఐక్య వేదిక కార్యదర్శి భాస్కరరావు

మండవల్లి (కైకలూరు): రాష్ట్రానికి సమాచార కమిషనర్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 1న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నగరాల్లో ఒకరోజు నిరాహారదీక్ష చేయడానికి సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక పిలుపునిచ్చినట్లు రాష్ట్ర కార్యదర్శి భాస్కరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచార కమిషనర్లను రెండు తెలుగు రాష్ట్రాల్లో గత నవంబర్ 25 నాటికి ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- చంద్రబాబు దోచుకున్నది దాచుకునేందుకే దావోస్ పర్యటన
- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స ధ్వజం
- హోదా వచ్చి ఉంటే సదస్సులు, పర్యటనలు అవసరంలేదు
- విభజన హామీలను సాధించలేకపోయారు


మీడియాతో మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో గుడివాడ అమర్‌నాథ్, తిప్పల గురుమూర్తిరెడ్డి, బొడ్డేడ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులు, విదేశీ పర్యటనల వల్ల రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు తెచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సీఎం కృషి వల్ల వచ్చిన పెట్టుబడులు, నెలకొల్పిన పరిశ్రమలు, వచ్చిన ఉద్యోగాలు వంటి వివరాలను జిల్లాల వారీగా ఆ శ్వేతపత్రంలో పొందుపర్చాలన్నారు. విశాఖ పట్టణ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ఆరోగ్యాన్ని లెక్క చేయడం లేదంటూ చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దావోస్ సదస్సులో అందరూ తన కోసమే మాట్లాడారంటూ చంద్రబాబు డబ్బా కొట్టుకున్నారని, పైగా ఏపీలో లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నారంటూ ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయంటే అది ఒక్క దివంగత వైఎస్సార్ హయాంలో మాత్రమేనని గుర్తుచేశారు. పలు కంపెనీలకు రాష్ట్రానికి తీసుకువచ్చి వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని, ఎస్‌ఈజెడ్‌లు, ఐటీ, అపారెల్ పార్కులు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో దోచుకున్న సొమ్మును దావోస్‌లోని స్విస్ బ్యాంకులో దాచుకునేందుకు, గతంలో దాచిన సొమ్ము లెక్కలు చూసుకునేందుకు ఏటా చంద్రబాబు అక్కడకు వెళ్తున్నారే తప్ప పెట్టుబడులకోసం కాదని బొత్స విమర్శించారు.

హోదా ఉంటే పెట్టుబడులు వచ్చేవి..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే విదేశాలకు వెళ్లనవసరం లేదని, సదస్సులు అవసరం లేదని.. పెట్టుబడులు వాటంతటవే వెల్లువలా వచ్చేవన్నారు. ఓటుకు కోట్లు కేసు కోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టిన చంద్రబాబు ప్రత్యేక హోదాతో సహా విభజన హామీలను అటకెక్కించారని విమర్శించారు. హోదా స్థానంలో ప్యాకేజీ మేలన్న బాబు కనీసం ఆ ప్యాకేజీని కూడా తెచ్చుకోలేక పోయారన్నారు. రైల్వే జోన్ ఎప్పుడొస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విభజన హామీల్లో ఒకటైన దుగరాజపట్నం పోర్టు ఇవ్వడం కుదరకపోతే ఎస్‌ఈజెడ్ అయినా ఇవ్వాలని ప్రధానిని సీఎం కోరారంటే రాష్ట్ర ప్రయోజనాలను ఏ స్థాయిలో పణంగా పెట్టారో అర్థమవుతోందన్నారు. నాలుగేళ్లుగా స్వప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలను పట్టని సీఎం నేడు బీజేపీ నమస్కారం పెట్టి పొత్తు నుంచి తప్పుకుంటామనడం విడ్డూరంగా ఉందన్నారు. అమూల్ డెయిరీ షేర్లకు లేని విలువ హెరిటేజ్ షేర్లకు ఎలా ఉందో చంద్రబాబే చెప్పాలన్నారు. సమావేశంలో అనకాపల్లి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, కో ఆర్డినేటర్లు తిప్పల నాగిరెడ్డి, బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర, జిల్లా నేతలు కంపా హనోక్, రవిరెడ్డి, పక్కి దివాకర్, బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా కల్పిస్తారా?

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులపై ఆశలు
- మద్దతు ధర కల్పించడానికి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి
- ధరలు నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలి
- పాడి పరిశ్రమకు మరింత ఊతమివ్వాలి



సాక్షి, అమరావతి: ఆరుగాలం శ్రమించే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. పంటకు గిట్టుబాటు ధరలేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగుమందులతో ఏటేటా నష్టాలే మూటగట్టుకుంటున్నాడు. అప్పులు తీర్చడానికి ఉరితాడే శరణ్యమని భావిస్తున్నాడు. దేశంలో ఏటా దాదాపు 10 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఏటేటా ఈ సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క 2015 సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు 322 శాతం పెరిగాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక చెబుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రైతులకు భరోసా కల్పిస్తారా? అనే చర్చ సర్వత్రా సాగుతోంది. రైతుల్ని ఆదుకోకపోతే దేశానికే అరిష్టమని ప్రధానే చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి లబ్ధి చేకూరకుంటే ఆర్థికాభివృద్ధి న్యాయసమ్మతంగా, సముచితంగా ఉన్నట్టు కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో రైతులకు ఉపశమనం లభించవచ్చని వ్యవసాయరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

రైతులు ఆశిస్తున్నదేమిటంటే...

- ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న వంటి వాటికి ఈ ఏడాది ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడానికి ధరల స్థిరీకరణ నిధిని తక్షణమే ఏర్పాటు చేయాలి. కనీస మద్దతు ధరలు ఇవ్వలేని పరిస్థితిలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ఇచ్చి కొనుగోలు చేసే వీలు కల్పించాలి. ఆమేరకు బడ్జెట్‌లో ప్రస్తావనలు చేయాలి.
- ధరల నిర్ణాయక కమిటీలో రైతులు కాని వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ కమిటీలో రైతుల ప్రాతినిధ్యాన్ని పెంచాలి.
- రాష్ట్రానికీ రాష్ట్రానికీ సాగువ్యయంలో తేడా ఉంటుంది. అందువల్ల దేశం మొత్తానికి ఒకే కనీస మద్దతు అంటే రైతులకు ఇబ్బందే. కాబట్టి మద్దతు ధర నిర్ణయించే అధికారం రాష్ట్రాలకే ఇవ్వాలి. రబీ, ఖరీఫ్ సీజన్లలో వాటిని సమీక్షించే వీలుండాలి. గిట్టుబాటు కానీ పంటకు రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ప్రకటించే విధానాన్ని అనివార్యం చేయాలి.
- ఏ పంటకు ఎంత ధర ఉంటుందో ముందే ప్రకటించడంతో పాటు ఏయే పంటను ఎంతెంత సాగు చేయవచ్చో ముందే నిర్ణయించాలి. అలా చేయడం వల్ల ఒక సీజన్‌లో టమాటాలను రూ. 60కు, మరో సీజన్‌లో రూ.3కు కొనుక్కోవాల్సిన దుస్థితి ఉండదు.
- నకిలీ విత్తనాల బెడదను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలి. ఇలాంటి వ్యాపారులకు కఠిన శిక్షలు వేసే వీలుండాలి.
- జాతీయ స్థాయి సాగునీటి ప్రాజెక్టులకే కాకుండా రాష్ట్రాలలోని ఇతర ప్రాజెక్టులకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. కేంద్రం నేరుగా సాయం చేయలేని పరిస్థితిలో ఉంటే ప్రత్యామ్నాయ వనరులను సూచించాలి.
- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం పరిధిలోకి వేరుశనగ, పత్తి సహా అన్ని రకాల పంటల్ని తీసుకురావాలి. ప్రస్తుతం రైతులు చెల్లించే ప్రీమియం కన్నా తక్కువగా రైతులకు ఆయా కంపెనీలు ఇస్తున్నాయి. ఈ వ్యవస్థను సంస్కరించాలి.
- మార్కెటింగ్ వ్యవస్థను సరళతరం చేయాలి. డాక్యుమెంట్ల భారాన్ని తగ్గించడంతో పాటు చెల్లింపులను వెంటనే చేయాలి.
- ఎరువులపై సబ్సిడీ భారాన్ని తగ్గించుకునే పేరిట తీసుకుంటున్న కొన్ని చర్యలు రైతులకు భారంగా పరిణమించకుండా చూడాలి.
- రైతుల ఉత్పత్తుల రవాణా ఖర్చులను (మార్కెట్లకు తరలించే సమయంలో) ప్రభుత్వమే భరించాలి.
- పాడి పరిశ్రమకు మరింత చేయూత ఇవ్వాలి.
- పప్పుధాన్యాలు, నూనెగింజల దిగుమతిని నివారించాలి.
- పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయలను మాఫీ చేస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రైతులు తమకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి పరిష్కారం చూపేందుకు బడ్జెట్‌లో అవసరమైన కేటాయింపులు చేయాలి.
- వ్యవసాయ పరిశోధనలకు కేటాయింపులు పెంచాలి.
- కౌలు రైతులకు బ్యాంకర్లు కచ్చితంగా రుణం ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.
- రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారికి 55 ఏళ్లకే పెన్షన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.
- ఏయే పంటలకు ఎంతెంత రుణం (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) అనే దానిని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలి.
- ఈ విషయాలన్నింటిపై కేంద్రం చర్యలు చేపట్టినప్పుడే ప్రధాని మోదీ అనుకున్నట్టు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుందని, రైతు ఆత్మహత్యలకూ పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడి

కొరిటెపాడు(గుంటూరు): గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ఏపీ గురుకుల అధ్యాపక ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలు చదువు కొనసాగిస్తున్నారని, వారి సమస్యలను కూడా అధ్యయనం చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యావ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ సందర్భంగా గురుకుల ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఏపీ ప్రభుత్వ గురుకుల అధ్యాపక ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర చైర్మన్ బి.సాల్మన్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమాఖ్య నాయకులు ఎ.ఎల్.గురప్ప, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విజి‘లెన్స్’ ఏదీ?

- ఏడాదిన్నరగా విజిలెన్స్ డైరక్టర్ పోస్టు భర్తీ చేయని యాజమాన్యం
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు
- ఆర్టీసీ ఆస్తులకు లేకుండా పోతున్న రక్షణ
- బడా వ్యాపార సంస్థలకు స్థలాలు

సాక్షి, అమరావతి

ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించే విజిలెన్స్ విభాగం స్తబ్ధుగా మారింది. ఏడాదిన్నరగా సంస్థలో విజిలెన్స్ డైరెక్టర్ పోస్టు భర్తీ చేయలేదు. ఆర్టీసీ ఎండీ పోస్టు మాత్రమే కాకుండా విజిలెన్స్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారిని నియమించాలి. ఆర్టీసీ పరిపాలన పరంగా విడిపోయే వరకు విజిలెన్స్ డైరెక్టర్‌గా గోపాలరావు వ్యవహరించారు. విభజన తర్వాత ఆ పోస్టును ఆర్టీసీ యాజమాన్యం భర్తీ చేయలేదు. ప్రస్తుతం విజిలెన్స్ డైరెక్టర్‌గా ఎగ్జిక్యూటివ్ డైరెక్టరే ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక ఆయా జోన్లలో నియమించిన డీఎస్పీలు తమ సొంత పనులకే ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆస్తులను రక్షించడం ప్రధాన బాధ్యత

ఏపీఎస్ఆర్టీసీకి 13 జిల్లాల్లో 1,960 ఎకరాలున్నాయి. వీటి విలువ రెవెన్యూ రికార్డు ప్రకారం సుమారు రూ.15 వేల కోట్లు. మార్కెట్ రేటు ప్రకారం రూ. 50 వేల కోట్లు ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పరిరక్షించడం విజిలెన్స్ ప్రధాన బాధ్యత. ముఖ్యంగా డిపోలను తనిఖీ చేసి సివిల్ పనులు, ఆస్తుల టెండర్లపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించి విజిలెన్స్ విభాగం విచారణ చేయాలి. కానీ ఆర్టీసీలో ఇటీవలి కాలంలో సివిల్ పనులు, టెండర్లను నచ్చిన వ్యక్తులకు కట్టబెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. నిర్మాణ పనులకు టెండర్లు లేకుండానే నామినేషన్ విధానంలో అప్పగించారు. ఆర్టీసీ స్థలాల విషయంలో మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావులు పరస్పరం ఆరోపణలు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఎక్కడ ఫిర్యాదు చేయాలనే అంశంపై మంత్రి అయ్యన్నపాత్రుడు అప్పట్లో ఆర్టీసీ అధికారులను నిలదీయడం గమనార్హం. యాజమాన్యం విజిలెన్స్ విభాగాన్ని నిర్వీర్యం చేసి సివిల్ పనులు, టెండర్లు సర్కారు పెద్దలకు దక్కేలా చూశారని ఆర్టీసీలోనే ప్రచారం జరుగుతోంది.

అక్రమ రవాణాను నియంత్రించాలి..

విజిలెన్స్ విభాగం మరో ప్రధాన బాధ్యత అక్రమ రవాణా నియంత్రించి ఆ వాహనాలు సీజ్ చేయాలి. కానీ ఆర్టీసీ బస్టాండ్ల ఎదుటే ప్రైవేట్ వాహనాలు నిలిపి ప్రయాణికుల్ని ఎక్కించుకుంటున్నా.. విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు ట్రావెల్స్ అయితే బస్టాండ్లకు సమీపంలోనే తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని మరీ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ప్రయాణికుల టికెట్ల తనిఖీ, డ్రైవర్లు మద్యం సేవించారా? లేదా? అన్నది కూడా విజిలెన్స్ బాధ్యతలే.



బడా వ్యాపారులకు ఆస్తులు..

ఆర్టీసీ ఆస్తులను అభివృద్ధి ముసుగులో యాజమాన్యం బడా వ్యాపారవేత్తలకు కట్టబెడుతోంది. గుంటూరు, ఏలూరు, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, విజయవాడలలో ఆర్టీసీ స్థలాల్ని బీవోటీ విధానంలో ఆర్టీసీ యాజమాన్యం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తోంది. ఇందుకు టెండర్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని యాజమాన్యం చెబుతున్నా.. కేవలం సింగిల్ టెండర్లను ఆమోదిస్తున్నారు. గుంటూరు, తెనాలిలలో స్విస్ ఛాలెంజ్ విధానంలో స్థలాల్ని సర్కారు పెద్దలకు ధారాదత్తం చేశారు. ఏలూరు, విశాఖలలో ముఖ్యనేతల అనుచరులకు 49 ఏళ్లకు నామమాత్రపు ధరలతో లీజుకు అప్పగించారు. ఈ టెండర్లపై కార్మిక సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

110 పంచాయతీల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్లు

ఒక్కో పంచాయతీ నుంచి నెలకు రూ.35 వేలు లీజు వసూలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తొలివిడతగా 110 మేజర్ గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణకు ఆయా గ్రామాల నుంచి ఒక్కొక్కరి చొప్పున ఎస్సీ లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ రుణం కింద జనవరి 26న ట్రాక్టర్లు అందజేశారు. లబ్ధిదారులతో సంబంధిత గ్రామ పంచాయతీలు ముందుగానే లీజు ఒప్పందాలు చేసుకోవాలని, ట్రాక్టర్ యజమానికి ప్రతి నెలా రూ.35 వేల చొప్పున చెల్లించాలని ఆదేశించారు. లబ్ధిదారుడు ట్రాక్టర్ రుణాన్ని తీర్చేవరకు కనీసం ఐదేళ్లపాటు గ్రామ పంచాయతీ లీజు ఒప్పందాన్ని కొనసాగించేలా నిబంధన విధించారు. శ్రీకాకుళం–6, విజయనగరం –5, విశాఖపట్నం–7, తూర్పుగోదావరి–14, కృష్ణా– 14, గుంటూరు–12, ప్రకాశం–11, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు–4, కర్నూలు–11, వైఎస్సార్–7, అనంతపురం–11, చిత్తూరు–8 గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు అందించారు.

● తెలంగాణ

కట్టుకథలే రాజ్యమేలుతున్నాయి

- దేశంలో ప్రజాస్వామిక వాతావరణం లేదు
- ప్రముఖ సామాజిక కార్యకర్త అరుణారాయ్
- ముగిసిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా ప్రజాస్వామిక వాతావరణం లేదని, అబద్ధాలు, కట్టుకథలతో రాజ్యమేలుతున్నారని ప్రముఖ సామాజిక కార్యకర్త అరుణారాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. రచయితలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే పరిస్థితి లేదని, దళితులు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగాయని చెప్పారు. బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల పాటు జరిగిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తమ న్యాయమైన హక్కుల కోసం ఆందోళనకు దిగే అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. దళితులపై దాడులు కొనసాగుతున్నాయని, రోహిత్ వేముల ఆత్మహత్య ఇందులో భాగమేనన్నారు. బెంగళూర్‌లో గౌరీలంకేశ్‌ను చంపేశారని, తమిళనాడులో పెరుమాళ్ మురుగన్‌ను దాదాపుగా సామాజిక బహిష్కరణ చేశారని, ఇలాంటివి వెలుగులోకి వచ్చినప్పుడు వాటి చుట్టూ అనేక కట్టుకథలను ప్రచారం చేస్తూ అసలు నిజాలను మరుగున పడేస్తున్నారని చెప్పారు. మీడియా సైతం ప్రజాస్వామిక గొంతుకను వినిపించలేడం లేదన్నారు.

సమాచారం పొందలేకపోతున్న ప్రజలు

‘స్మోక్స్, ట్రోల్స్ అండ్ పోల్స్: ఇన్ఫర్మేషన్ అండ్ డెమొక్రసీ ఇన్ ఇండియా’అనే అంశంపై కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడారు. సామాన్య ప్రజలు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారాన్ని పొందలేకపోతున్నారని, ప్రభుత్వం మాత్రం ఆధార్ సాకుతో ప్రజల వ్యక్తిగత జీవితాన్ని, అన్ని వివరాలను సేకరించి పెట్టుకుందని చెప్పారు.

ముగిసిన సాహిత్య ఉత్సవాలు

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. మూడు రోజుల పాటు సదస్సులు, చర్చలు, ముఖాముఖి కార్యక్రమాలు, వర్క్‌షాపులు, కళలు, సాహిత్య, సాంస్కృతిక అంశాలపై 150 కార్యక్రమాలను నిర్వహించారు.

మోదీ ఇందిరను అనుకరిస్తున్నారు

జర్నలిస్ట్, రచయిత్రి సాగరికా ఘోష్



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఇప్పటివరకు పనిచేసిన ప్రధానుల్లో ఇందిరాగాంధీ అత్యంత శక్తివంతమైన నాయకురాలని.. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ పలు అంశాల్లో ఆమెను అనుకరిస్తున్నారని ప్రముఖ జర్నలిస్ట్, ‘ఇందిరా.. ఇండియాస్ మోస్ట్ పవర్‌ఫుల్ ప్రైమ్‌మినిస్టర్’పుస్తక రచయిత్రి సాగరికా ఘోష్ అన్నారు. సంఘ్ పరివార్ సైతం ఇందిరను ఎప్పుడూ టార్గెట్ చేయలేదన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత్రి సునీతారెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సాగరిక మాట్లాడుతూ.. ఇందిరాగాంధీపై 120 జీవిత చరిత్ర పుస్తకాలు అచ్చయ్యాయని.. వాటిలో 80 పుస్తకాలను చదివిన తర్వాత అందులో స్పృశించని పలు కోణాలను ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

బ్రేకింగ్ న్యూస్ బిజినెస్ న్యూస్‌గా మారాయి

సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్



సాక్షి, హైదరాబాద్: దేశంలోని పలు ప్రధాన న్యూస్‌చానల్స్‌లో ప్రసారమవుతున్న బ్రేకింగ్ న్యూస్.. బిజినెస్ న్యూస్‌గా మారాయని, జర్నలిస్టులు బిజినెస్ ట్రేడర్స్‌గా మారారని సీనియర్ జర్నలిస్ట్, ఇండియాటుడే గ్రూప్ కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ వ్యాఖ్యానించారు. ఆదివారం బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో లిటరరీ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ‘మీడియా ఇన్ ది ఏజ్ ఆఫ్ బ్రేకింగ్ న్యూస్’అన్న అంశంపై జరిగిన సదస్సులో సర్దేశాయ్ సుదీర్ఘంగా ప్రసంగించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న చానల్స్ అన్నీ రాజకీయ నాయకులు, పార్టీలు, బిల్డర్ల చేతిలోనే ఉన్నాయని, వీరంతా తమ వాణిజ్య, రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం చానల్స్ నడుపుతున్నారని పేర్కొన్నారు.

మూడు గంటల్లో రూ.50 లక్షలు హుష్‌కాకి

పిల్లల్ని యాడ్ సంస్థల్లో చేర్పిస్తామంటూ టోకరా

హైదరాబాద్: కేవలం మూడు గంటల్లో రూ.50 లక్షలు కాజేశారు మాయ‘లేడీలు’. కిలాడీ చేసి పిల్లల తల్లిదండ్రులను మోసం చేశారు. ఈ నెల 26న కూకట్‌పల్లి సుజన ఫోరం మాల్‌లో తమ పిల్లలతో కలసి షాపింగ్‌కు వచ్చిన తల్లిదండ్రుల వద్దకు ఆరుగురు అందమైన యువతులు వచ్చారు. మాటలు కలిపి మభ్యపెట్టారు. ‘మీ పాపలు ముద్దుముద్దుగా ఉన్నారు. యాడ్ ఫిల్మ్‌లో బాగా సూటౌతారు.. మీరు ఒప్పుకుంటే ఫొటోసెషన్స్ నిర్వహించి యాడ్స్ సంస్థల్లో చేర్పిస్తామం’అంటూ నమ్మబలికారు. పిల్లల్ని బుల్లితెరపై చూడాలన్న ఆశతో సుమారుగా 300 మంది తల్లిదండ్రులు వారికి తమ ఫోన్ నంబర్లు ఇచ్చారు. 42 యాడ్స్ సంస్థలకు పిల్లలు ఎంపికయ్యారని ఫొటోసెషన్‌కు రావాలని అందరికీ ఆ యువతులు మరునాడు ఫోన్లు చేశారు. మెసేజ్‌లు కూడా పెట్టారు. ఆదివారం ఉదయం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 లోని ఓ ఫొటోస్టూడియోకు 100 మంది తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకుని వచ్చారు. పిల్లలందరికీ యువతులు ఫొటోసెషన్ నిర్వహించారు. మూడు గంటల తర్వాత పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ‘యాడ్ ఫిల్మ్ కోసం మీ కొడుకు సెలెక్ట్ అయ్యాడు, వరుసగా రెండు సంవత్సరాల పాటు యాడ్స్ చేయాలంటే రూ.లక్ష, నాలుగేళ్లకు రెండులక్షలు, ఆరేళ్లకు నాలుగు లక్షలు, ఎనిమిదేండ్లకు రూ.6 లక్షలు అవుతుంది’అంటూ టారిఫ్ రేట్లు ముందు పెట్టారు. ఆ మేరకు తల్లిదండ్రులు పేటీఎం ద్వారా డబ్బులు చెల్లించారు. సాయంత్రం ఆరు గంటల వరకు ఈ డ్రామా కొనసాగింది. ఏడు గంటల తర్వాత చకచకా అందరి అకౌంట్ల నుంచి డబ్బులు డ్రా అవుతూ వచ్చాయి. తర్వాత యువతుల కోసం ఆరా తీయగా జరిగింది మోసమని తేలింది. ఆ స్టూడియోను రెండురోజుల కోసం అద్దెకు తీసుకున్నారని స్పష్టమైంది. దీంతో పిల్లల తల్లిదండ్రులు భాస్కర్, అమృత్‌కుమార్ తదితరులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.50 లక్షల వరకు మూడు గంటల వ్యవధిలో స్వైప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

కేసు నమోదు చేసిన పోలీసులు



వీపుపై గాయాలు చూపుతున్న విద్యార్థి (ఇన్‌సెట్‌లో వెంకట నంద)

కంచికచర్ల(వీరులపాడు): తరగతి గదిలో అకారణంగా నవ్వాడనే కారణంతో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు కర్రతో విచక్షణా రహితంగా కొట్టిన ఘటన కృష్ణా జిల్లా కంచికచర్లలోని విజయవాడ రవీంద్ర భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన పాలడుగు రాధాకృష్ణ కుమారుడు వెంకట నంద విజయవాడ రవీంద్ర భారతి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం తరగతి గదిలో తోటి విద్యార్థులతో సరదాగా మాట్లాడుతూ నవ్వాడు. దీంతో కోపగించిన ఉపాధ్యాయుడు సైదేశ్వరరావు విద్యార్థి వీపుపై కర్రతో విచక్షణా రహితంగా కొట్టటమే కాకుండా తలను నల్లబల్లకేసి కొట్టాడు. విద్యార్థి జరిగిన సంఘటనను తండ్రికి తెలపటంతో తండ్రి పాఠశాల ప్రిన్సిపల్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై డీఈవో, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. తక్షణమే ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు డిమాండ్ చేశారు. కాగా విద్యార్థిని కొట్టిన ఘటనలో ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ ఆదివారం తెలిపారు. గాయపడిన విద్యార్థి నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు.

చంద్రబాబు ముస్లిం వ్యతిరేక ధోరణి వీడాలి

ముస్లిం హక్కుల పోరాట సమితి



మాట్లాడుతున్న షేక్ ఖాజావలి

లక్ష్మీపురం (గుంటూరు): ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలపై చూపుతున్న వ్యతిరేక వైఖరికి సభ్య సమాజం తలదించుకుంటోందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి అన్నారు. గుంటూరు నగరంపాలెంలోని సమితి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారందరూ, మదర్సాలో ఉన్నవారు కూడా సూర్య నమస్కారాలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. చంద్రబాబుకు ముస్లిం వ్యతిరేక ధోరణి అవలంబించడం మంచిది కాదని హితవు పలికారు. బీజేపీ, టీడీపీలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలపై దాడులు పెరిగాయన్నారు. రాజమండ్రి మౌజన్ హత్య కేసుతో పాటు పిడుగురాళ్లలో ముస్లిం మహిళలపై జరిగిన దాడులపై ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముస్లింలంటే చిన్నచూపన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు నూటికి 80 శాతం వరకు అన్యమతస్థుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. విజయవాడ ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థులు సీట్లు కోల్పోయి రోడ్డు పాలైనా ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ముస్లిం వ్యతిరేక విధానాలను విడనాడకపోతే త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాఠశాలల్లో డిజి'డల్'



- 2,682 స్కూళ్లలో మాత్రమే డిజిటల్ తరగతులు
- వీటిలోనూ కంటెంట్, ఇతర సమస్యలతో అరకొరే
- సాంకేతిక సమస్యలొస్తే పరిష్కరించేవారు లేరు
- దీంతో ఆగిపోతున్న డిజిటల్ తరగతులు

సాక్షి, అమరావతి: అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పురోగతి సాధించాలని ప్రభుత్వం రూపొందిస్తున్న పథకాలు ఆరంభశూరత్వంగా మిగిలిపోతున్నాయి. నచ్చిన సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడం వరకే ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయి తప్ప అసలు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాయి. దీనికి తార్కాణంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన డిజిటల్ తరగతి గదులు (డీసీఆర్) నిలుస్తున్నాయి. కాంట్రాక్టులు అప్పగించాక ఆయా సంస్థలు వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటుచేశాయా? లేదా? అవి అనుకున్న లక్ష్యాల మేరకు పనిచేస్తున్నాయా? లేదా? అని పరిశీలించేవారే లేరు. దీంతో డిజిటల్ తరగతుల పరిస్థితి మూన్నాళ్ల ముచ్చటగా మారింది.

5 వేల స్కూళ్లలో సగం వరకే ఏర్పాటు

రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లు 632, జిల్లా పరిషత్, మండల పరిషత్ స్కూళ్లు 38,497, ఆదర్శ పాఠశాలలు 161, కస్తూర్బా బాలికా విద్యాలయాలు 352, మున్సిపల్ స్కూళ్లు 2,102, రెసిడెన్షియల్ స్కూళ్లు 34, ఇతర ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లు 3,224 ఉన్నాయి. డిజిటల్ తరగతుల ద్వారా విద్యాబోధన చేయాలని ప్రభుత్వం గతంలో విద్యాశాఖను ఆదేశించడంతో విద్యుత్, ఇతర సదుపాయాలు ఉన్న 5 వేల స్కూళ్లను ఎంపిక చేశారు. అయితే గత మూడేళ్లలో 2,682 స్కూళ్లకే డిజిటల్ తరగతులు పరిమితమయ్యాయి. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఈ స్కూళ్లలో డిజిటల్ తరగతుల ఏర్పాటు బాధ్యతను ఎర్నెట్ అనే సంస్థకు, సర్వశిక్ష అభియాన్ ద్వారా కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో రైల్‌టెల్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ప్రోగ్రామ్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను దీనికి వినియోగిస్తున్నారు.

బోధన ఇలా చేయాలి

ఆయా స్కూళ్లలో ప్రత్యేక గదులు, విద్యుత్, ప్రాజెక్టర్లు, కంప్యూటర్లు, మానిటర్‌లు, వాల్‌మౌంటింగ్ స్క్రీన్లు, ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్, డేటా కార్డులు, వైర్‌లెస్ పరికరాలు ఏర్పాటు చేయాలి. ఇంటర్నెట్ లేని స్కూళ్లకు డిజిటల్ కంటెంట్‌ను సీడీలు, డేటా కార్డ్ రూపంలో అందించాలి. వాటి ద్వారా వారానికి కనీసం మూడు గంటలు డిజిటల్ బోధన చేయాలి. ప్రత్యేక బోధకులను ఇద్దరు చొప్పున ప్రతి స్కూలుకు నియమించాలి. ఎప్పటికప్పుడు తాజా అంశాలతో డిజిటల్ కంటెంట్‌లో మార్పులు చేర్పులు చేస్తుండాలి. ఈ అంశాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలి. ప్రతి టీచర్ డిజిటల్ రూపంలో బోధించడానికి వారిని కార్యోన్ముఖుల్ని చేయాలి.

బోధన, సాంకేతిక సిబ్బంది లేమితో సమస్య

డిజిటల్ తరగతుల కోసం పరికరాలు ఏర్పాటు చేసినా బోధన చేసేందుకు నైపుణ్యమున్న బోధన సిబ్బందిని ప్రభుత్వం నియమించలేదు. ఆయా స్కూళ్లలో ఆసక్తి ఉన్న టీచర్లకే ఆ బాధ్యతలను అప్పగించింది. వారికి అవగాహన లేకపోవడంతో తోచిన రీతిలో బోధిస్తున్నారు. డిజిటల్ పరికరాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని సరిచేసేవారు లేరు. వాస్తవానికి కాంట్రాక్ట్ సంస్థలు వాటి నిర్వహణను కూడా చూడాలి. అయితే ఇవి పట్టించుకోకపోవడంతో డిజిటల్ తరగతులు ఆగిపోతున్నాయి. స్కూళ్లకు పూర్తిస్థాయిలో డిజిటల్ కంటెంట్‌ను కూడా అందుబాటులో ఉంచలేదు. ఇంటర్నెట్ లేనప్పుడు డిజిటల్ బోధన ముందుకు సాగడం లేదు.

డిజిటల్ తరగతుల్లో వెనుకంజలో 11 జిల్లాలు

డిజిటల్ తరగతుల్లో బోధన చాలా తక్కువగా ఉందని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 13 జిల్లాల్లో ఉభయగోదావరి జిల్లాలు మినహా మిగిలినవన్నీ వెనుకంజలో ఉన్నాయి.

జిల్లాల వారీగా గత రెండేళ్లలో వినియోగం చూస్తే..

జిల్లా	డీసీఆర్ స్కూళ్లు	డీసీఆర్ వినియోగం (గంటల్లో)
శ్రీకాకుళం	218	9,060
విజయనగరం	231	7,261
విశాఖపట్నం	355	10,737
తూర్పుగోదావరి	301	33,778
పశ్చిమగోదావరి	138	25,671
కృష్ణా	117	9,554
గుంటూరు	213	10,981
ప్రకాశం	254	5,355
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	183	6,586
అనంతపురం	96	2,176
చిత్తూరు	412	12,013
వైఎస్సార్	46	1,304
కర్నూలు	118	1,409
మొత్తం	2,682	1,35,885

సర్కారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మళ్లీ కోర్టుకే

- వైద్య విద్యాశాఖకు మంత్రి అయినంత మాత్రాన నచ్చినవారిని పెట్టకోలేరు
- సీనియారిటీ, పదోన్నతులపై వైద్యుల హెచ్చరిక

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరించి నచ్చిన వారిని పైస్థాయిలో కూర్చోబెడితే మళ్లీ కోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని పలు వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు హెచ్చరిస్తున్నారు. గత నాలుగేళ్లుగా వైద్య విద్యా సంచాలకులు, అదనపు వైద్యవిద్యా సంచాలకులు, ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌ల నియామకంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఎలాంటి నిబంధనలు పాటించకుండా నియమించారని, ఇకపై వీటిని చూస్తూ ఊరుకోమని సిద్ధార్థ వైద్య కళాశాలకు చెందిన ఓ వైద్యుడు అన్నారు. వైద్యవిద్యాశాఖకు మంత్రి అయినంత మాత్రాన కామినేని శ్రీనివాస్ తన మనుషులను పెట్టుకోలేరని, దీనికి కొన్ని నిబంధనలు ఉన్నాయని, దాని ప్రకారమే చేయాలని అన్నారు. ఎలాంటి నిబంధనలూ పాటించకుండా గుంటూరు వైద్యకళాశాల ప్రిన్సిపల్‌ను, సూపరింటెండెంట్‌ను నియమించడమే దీనికి ఉదాహరణ అని గుంటూరు వైద్యకళాశాలకు చెందిన మరో వైద్యుడు వాపోయారు. వెర్టికల్ సీనియారిటీ (ఏపీ పీఎస్సీ ద్వారా నియామకం పొందిన నాటినుంచి) వచ్చిన వారిని కాదని నిన్నా మొన్న పదేళ్ల కిందట అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన వారిని ఇప్పుడు డీఎంఈ, ప్రిన్సిపాల్‌గా ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కొన్ని విభాగాల్లో ఆప్తమాలిక్, ఈఎన్‌టీ వంటి వాటిలో పదోన్నతులు త్వరగా రావు, వాళ్లందరూ ఉన్నత పదవులు చేపట్టకుండా వెళ్లిపోవాలా? అని ప్రశ్నించారు.

ఫిరాయింపుల చట్టంలో మార్పులు అవశ్యం

బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు



విశాఖసిటీ: పార్టీ ఫిరాయింపుల చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యానించారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జరిగిన పీఏసీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడేందుకు సరైన స్థలం లేకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చాంబర్‌లోకి వెళ్లి పీఏసీ సభ్యులం మీడియాకు సమావేశ వివరాలను వెల్లడించామన్నారు. ఈ సందర్భంలో ఓ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు తాను పార్టీలు మారిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులివ్వడం నచ్చలేదని సమాధానం చెప్పానని అంగీకరించారు. అయితే అది కేవలం తన వ్యక్తిగత విషయమే తప్ప.. బీజేపీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాకతాళీయంగా చేసిన వ్యాఖ్యల వల్ల ఇటీవల అనేక పరిణామాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. కాని ఫిరాయింపులపై తాను మాట్లాడిన వ్యక్తిగత వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఫిరాయింపుల చట్టంలో మార్పులు చేస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. పొత్తుల విషయంపై మాట్లాడే స్థాయి రాష్ట్రంలోని బీజేపీ, టీడీపీ నేతలెవరికీ లేదనీ, అది కేవలం సీఎం చంద్రబాబు, అమిత్‌షా, ప్రధాని మోదీ నిర్ణయించాల్సిన అంశమన్నారు. తిరుపతి దర్శనం ఏడాదికి రెండు సార్లు మాత్రమే చేసుకోవాలన్న మంత్రి మాణిక్యాలరావు చెప్పడం సరైన నిర్ణయం కాదన్నారు. వచ్చే ఎన్నికల నాటికి విశాఖకు రైల్వే జోన్ వచ్చి తీరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మీ మంత్రులను ఉపసంహరించుకోండి

చంద్రబాబుకు సీపీఐ నేత రామకృష్ణ డిమాండ్

అల్లిపురం (విశాఖ దక్షిణ): రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర కేబినెట్‌లో టీడీపీ మంత్రులను ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ''విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే దీనిపై నిలదీయాల్సిన సీఎం చంద్రబాబుసుప్రీంకోర్టుకు పోతామంటున్నారు. కానీ ఆయన జిల్లా కోర్టుకు కూడా పోలేరు'' అని రామకృష్ణ వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విభజన హామీల అమలుపై చంద్రబాబు కేంద్రాన్ని నిలదీయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారని మండిపడ్డారు.

జాతీయ ఫిజియో కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

కేంద్రానికి పీఎఫ్ఐ అధ్యక్షుడు చంద్రప్రసాద్ డిమాండ్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ఫిజియో థెరపిస్టుల సమస్యల పరిష్కారం కోసం జాతీయ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఫిజియో థెరపీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) అధ్యక్షుడు అచ్యుత చంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. పీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం వుడా చిల్డ్రన్ ఏరినాలో నిర్వహించిన జాతీయ సదస్సులో చంద్రప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని ఏళ్లగా ప్రభుత్వాలను కోరుతున్నా పట్టించుకోవట్లేదని వాపోయారు. ఫిజియో థెరపిస్టుల్లో 90 శాతం మంది రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందించాల్సి ఉంటుందని, మార్గం మధ్యలో వారికి ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ఫిజియో థెరపిస్టుల సమస్యలు, వారి ఉద్యోగ భద్రతపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, ఫెడరేషన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, క్యూ–1 ఆస్పత్రి అధినేత డాక్టర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభిస్తున్న పీఎఫ్ఐ అధ్యక్షుడు అచ్యుత చంద్రప్రసాద్, ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు

స్పోర్ట్స్

మళ్లీ నిరాశ



- తై జు యింగ్ చేతిలో సైనా వరుసగా ఏడో ఓటమి
- ఇండోనేసియా ఓపెన్‌లో రన్నరప్‌తో సంతృప్తి

జకార్తా: కొత్త సీజన్‌ను టైటిల్‌తో ప్రారంభించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్‌కు నిరాశ ఎదురైంది. ఇండోనేసియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో ఈ హైదరాబాద్ అమ్మాయి రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ సైనా 9–21, 13–21తో ఓడిపోయింది. కేవలం 27 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సైనా తన ప్రత్యర్థికి ఏదశలోనూ పోటీనివ్వలేకపోయింది. రెండు గేముల్లోనూ ఆరంభం నుంచే తై జు యింగ్ జోరు కొనసాగింది. సైనాపై తై జు యింగ్‌కిది వరుసగా ఏడో విజయం కావడం విశేషం. తై జు యింగ్‌పై సైనా చివరిసారి 2013 స్విస్ ఓపెన్‌లో గెలుపొందడం గమనార్హం. విజేతగా నిలిచిన తై జు యింగ్‌కు 26,250 డాలర్లు (రూ. 16 లక్షల 69 వేలు)... రన్నరప్ సైనాకు 13,300 డాలర్లు (రూ. 8 లక్షల 45 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



పాకిస్తాన్‌దే టి20 సిరీస్

మౌంట్ మాంగనీ: వన్డే సిరీస్‌ను 0–5తో కోల్పోయిన పాకిస్తాన్ జట్టు న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టి20ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. మూడో టి20లో పాక్ 18 పరుగులతో నెగ్గింది. ఈ విజయంతో పాక్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను తిరిగి దక్కించుకుంది. తొలుత పాక్ 6 వికెట్లకు 181 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (36 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్), అమీన్ (7 బంతుల్లో 21; 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం కివీస్ ఆరు వికెట్లు కోల్పోయి 163 పరుగులకే పరిమితమైంది. షాదాబ్ ఖాన్ (2/19)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

రైనా పునరాగమనం

హైదరాబాదీ సిరాజ్ ఔట్ • దక్షిణాఫ్రికాతో టి20లకు భారత జట్టు ప్రకటన



ముంబై: దక్షిణాఫ్రికాతో జరిగే మూడు టి20ల సిరీస్ కోసం ఆదివారం సెలక్టర్లు భారత జట్టును ప్రకటించారు. సీనియర్ బ్యాట్స్‌మన్ సురేశ్ రైనా దాదాపు ఏడాది తర్వాత తిరిగి ఎంపిక కావడం విశేషం. గత ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో ఆఖరి టి20 ఆడిన రైనా... ఫిట్‌నెస్ సమస్యలతో పాటు ఫామ్ కోల్పోయి టీమ్‌కు దూరమయ్యాడు. అనంతరం 'యోయో టెస్టు'లో కూడా సఫలమైన అతను ముస్తాక్ అలీ టి20 టోర్నీలో చెలరేగాడు. ఈ టోర్నమెంట్‌లో రైనా ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. కోహ్లి సారథ్యంలో 16 మంది సభ్యుల టీమ్‌లో అక్షర్ పటేల్, పేసర్ శార్దుల్ ఠాకూర్‌లకు కూడా అవకాశం లభించింది. భారత్ తరఫున 2 వన్డేలు ఆడిన శార్దుల్‌కు టి20 పిలుపు లభించడం ఇదే తొలిసారి.

శ్రేయస్ అయ్యర్‌పైనా వేటు...: ఇటీవల శ్రీలంకతో సిరీస్‌లో కెప్టెన్ కోహ్లి సహా పలువురు కీలక ఆటగాళ్లకు భారత్ విశ్రాంతినిచ్చింది. వారందరూ ఇప్పుడు తిరిగి జట్టులోకి వచ్చారు. ఫలితంగా బాసిల్ థంపి, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్ చోటు కోల్పోయారు. లంకతో ఒక మ్యాచ్ ఆడిన హైదరాబాద్ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్‌పై కూడా వేటు పడింది. మరోవైపు ముంబై యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్‌ను కూడా జట్టు నుంచి తప్పించారు. శ్రీలంకతో మూడు వన్డేల్లో రెండు అర్ధ సెంచరీలు చేసి ఆకట్టుకున్న అయ్యర్... ఆ తర్వాత మూడు టి20ల్లో కలిపి 54 పరుగులే చేయగలిగాడు. ఇటీవల పంజాబ్‌తో జరిగిన ముస్తాక్ అలీ టోర్నీ మ్యాచ్‌లో 44 బంతుల్లో 79 చేసినా...సెలక్టర్లు దీనిని పరిగణలోకి తీసుకోకుండా అయ్యర్‌ను తప్పించారు. వన్డే సిరీస్ ముగిసిన అనంతరం ఫిబ్రవరి 18, 21, 24 తేదీల్లో మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

భారత టి20 జట్టు వివరాలు: కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), ధావన్, రాహుల్, రైనా, ధోని, దినేశ్ కార్తీక్, పాండ్యా, మనీశ్ పాండే, అక్షర్ పటేల్, చహల్, కుల్దీప్, భువనేశ్వర్, బుమ్రా, జైదేవ్ ఉనాద్కట్, శార్దుల్ ఠాకూర్.

రెండోసారీ రన్నరప్‌తో సరి



హామిల్టన్: నాలుగు దేశాల అంతర్జాతీయ హాకీ రెండో అంచె టోర్నమెంట్‌లోనూ భారత్ రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ మూడో ర్యాంకర్ బెల్జియంతో ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా పెనాల్టీ షూటౌట్‌లో 0–3తో పరాజయం పాలైంది. తొలి అంచె టోర్నమెంట్ ఫైనల్లోనూ భారత్‌కు బెల్జియం చేతిలో ఓటమి ఎదురైన సంగతి విదితమే. రెండో అంచె టోర్నీ లీగ్ దశలో బెల్జియంపై సంచలన విజయం సాధించిన భారత్ ఈసారి ఫైనల్లోనూ ఆ జట్టుకు గట్టిపోటీనే ఇచ్చింది. నిర్ణీత సమయానికి రెండు జట్లు 4–4తో సమఉజ్జీగా నిలువడంతో ఫలితం తేలడానికి షూటౌట్‌ను నిర్వహించారు. షూటౌట్‌లో బెల్జియం తరఫున ఫెలిక్స్, సెబాస్టియన్, అర్థుర్ వాన్ డోరెన్ సఫలమయ్యారు. భారత్ తరఫున ఎవరూ గోల్ చేయలేదు. అంతకుముందు నిర్ణీత సమయంలో రెండు జట్లు నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డాయి. పోటా పోటీగా సాగిన పోరులో ఎక్కువ శాతం భారత్‌దే పైచేయి అయింది. భారత్ తరఫున రమణ్‌దీప్ సింగ్ (29వ, 53వ ని.లో) రెండు గోల్స్, నీలకంఠ శర్మ (42వ ని.లో), మన్‌దీప్ సింగ్ (49వ ని.లో) చెరో గోల్ చేశారు. బెల్జియం తరఫున తాంగై కాసిన్స్ (41వ ని.లో), కెడ్రిక్ చార్లైర్ (43వ ని.లో), అమౌరి కొస్టర్స్ (51వ ని.లో), ఫెలిక్స్ (56వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

విజయంతో ముగించారు

ఐదో వన్డేలో ఆసీస్‌పై ఇంగ్లండ్ గెలుపు • సిరీస్ 4–1తో కైవసం



పెర్త్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో 0–4తో ఓటమి పాలైన ఇంగ్లండ్, వన్డే సిరీస్‌ను విజయంతో ముగించింది. ఆస్ట్రేలియాతో ఆదివారం హోరాహోరీగా జరిగిన చివరిదైన ఐదో వన్డేలో 12 పరుగులతో విజయం సాధించి 4–1తో సిరీస్ చేజిక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది. జాసన్ రాయ్ (49; 7 ఫోర్లు, 1 సిక్స్), బెయిర్‌స్టో (44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అలెక్స్ హేల్స్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (62; 2 ఫోర్లు) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆండ్రూ టై ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 48.2 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటైంది. స్టొయినిస్ (87; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడగా... మ్యాక్స్‌వెల్ (34; 3 ఫోర్లు, ఒక సిక్స్), పైన్ (34; 2 ఫోర్లు, ఒక సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఒక దశలో ఆసీస్ 189/4తో పటిష్టంగా కనిపించినా... ఇంగ్లండ్ పేసర్ కరన్ (5/35) విజృంభించడంతో ఆసీస్ జట్టు 58 పరుగులకే చివరి 6 వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. మరో బౌలర్ మొయిన్ అలీకి 3 వికెట్లు దక్కాయి. కరన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'... జో రూట్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

పేస్ ఖాతాలో మరో టైటిల్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ కొత్త ఏడాదిలో తొలి టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఓవరాల్‌గా తన కెరీర్‌లో 25వ ఏటీపీ చాలెంజర్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అమెరికాలో జరిగిన న్యూపోర్ట్ బీచ్ ఓపెన్ టోర్నీలో తన భాగస్వామి జేమ్స్ సెరిటాని (అమెరికా)తో కలిసి పేస్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో పేస్–సెరిటాని ద్వయం 6–4, 7–5తో డెనిస్ కుడ్లా (అమెరికా)–ట్రీట్ హుయ్ (ఫిలిప్పీన్స్) జంటపై గెలుపొందింది. ప్రస్తుతం ప్రపంచ 61వ ర్యాంకులో ఉన్న పేస్ ఈ విజయంతో 125 పాయింట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరడం ద్వారా 90 పాయింట్లు పొందాడు. వీటితో నేడు విడుదల కానున్న ర్యాంకింగ్స్‌లో పేస్‌కు టాప్–50 లో చోటు దక్కే అవకాశం ఉంది. పేస్ ఇప్పటివరకు చాలెంజర్ టూర్‌లలో 11 సింగిల్స్ టైటిల్స్ సాధించాడు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



కేంద్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్‌డీ) మంత్రిత్వ శాఖ నాన్ టెక్నికల్ సబ్జెక్టులకు సంబంధించి ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో మరో నెల రోజుల్లోనే నూతన విధానాలు రూపొందే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఆన్‌లైన్ డిగ్రీ విధివిధానాలు, ప్రయోజనాలు, ప్రతికూలతలపై ప్రత్యేక కథనం..

గ్రాడ్యుయేట్స్ స్పెషల్

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్.. Facts and Figures

- ఇటీవల ఓ ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం ఆన్‌లైన్ కోర్సులు చేస్తున్న వారిలో 55 శాతం మంది ఉద్యోగులే.
- ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో ప్రపంచంలో రెండో పెద్ద దేశంగా భారత్.
- ఓ అధ్యయనం ప్రకారం భారత ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ మార్కెట్ విలువ 2021 నాటికి 1.96 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా.

ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రయోజనాలు
- తరగతులకు ప్రత్యక్షంగా హాజరు కానవసరం లేదు.
- లైవ్ లెక్చర్స్, ట్యుటోరియల్స్ ఫలితంగా క్లాస్‌రూంలోనే చదువుతున్నామనే భావన.
- లైవ్ డిస్కషన్స్ ఫలితంగా ఆన్‌లైన్లోనే సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం.
- అంతకుముందు వినని క్లాస్‌లను ప్రీ-లోడెడ్ లెక్చర్స్ ద్వారా వినే అవకాశం

ప్రతికూలతలు
- క్లాస్‌రూంలో ప్రత్యక్షంగా వినే లెక్చర్‌కు ఆన్‌లైన్ ట్యుటోరియల్‌కు మధ్య వ్యత్యాసం.
- లైవ్ లెక్చర్ సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే విద్యార్థులకు ఇబ్బందే.
- ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న మూక్స్ సక్సెస్ రేట్ 40 శాతంలోపు ఉంది.
- ఇప్పటికీ కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులోకి రాని ఇంటర్నెట్ సదుపాయం.

ఆన్‌లైన్ డిగ్రీ

ఉన్నత విద్యకు సంబంధించి స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) 20 నుంచి 25 శాతం మధ్యలో ఉంటోంది. దూరవిద్య నమోదు నిష్పత్తి 11.45 శాతంగా ఉంది. ఆర్ట్స్, హ్యుమానిటీస్ వంటి కోర్సుల్లో (యూజీ లెవల్) నమోదు నిష్పత్తి 38 శాతం కాగా, కామర్స్ కోర్సుల్లో ఇది అత్యల్పంగా 14.1 శాతంగా ఉంది. ఈ వివరాలన్నీ ఉన్నత విద్య నమోదు కోణంలో ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్ఈ)లో వెల్లడయ్యాయి. దీంతో హెచ్ఆర్‌డీ మంత్రిత్వ శాఖ ఉన్నత విద్యా నమోదు నిష్పత్తిని పెంచే లక్ష్యంతో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టాలని చూస్తోంది. తద్వారా 18 నుంచి 23 ఏళ్ల విద్యార్థులు కాలేజీకి వెళ్లకుండానే ఉన్నత విద్య అభ్యసిస్తారని భావిస్తోంది.

ఆన్‌లైన్ డిగ్రీ?

ఈ విధానంలో డిగ్రీ కోర్సులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అమలవుతాయి. నమోదు, మూల్యాంకనం, సర్టిఫికెట్ల ప్రదానం వంటివన్నీ ఆన్‌లైన్‌లో ద్వారానే జరుగుతాయి. ఈ విధానంలో విద్యార్థులు వ్యక్తిగతంగా తరగతులకు హాజరు కావాల్సిన అవసరం ఉండదు. కోర్సును అందిస్తున్న యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ఆన్‌లైన్ టూల్స్ సహాయంతో కోర్సును అభ్యసించొచ్చు.

అంతా ఆన్‌లైన్లోనే..

ప్రస్తుతం దేశంలో రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించలేని వారి కోసం దూర విద్య, ఓపెన్ యూనివర్సిటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు వీటికి పూర్తి భిన్నంగా ఉంటాయి. పై రెండు విద్యా విధానాల్లో ప్రతి విద్యా సంవత్సరం నిర్ణీత కాలంలో విద్యార్థులు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో 'ఫిజికల్ తరగతుల నిర్వహణ' ప్రసక్తే ఉండదు. కోర్సు మొత్తం ఆన్‌లైన్లోనే పూర్తవుతుంది.

తొలుత న్యాక్ ఎ+, ఏ గ్రేడ్ వర్సిటీల్లో ..

ప్రాక్టికల్స్ తప్పనిసరైన టెక్నికల్, మెడికల్ తదితర కోర్సులు మినహా.. మిగిలిన అన్ని విభాగాల్లో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టే అవకాశముంది. వీటిని ముందుగా న్యాక్ ఎ+, ఏ గ్రేడ్ యూనివర్సిటీల్లో అందుబాటులోకి తేవాలని ఆలోచిస్తున్నారు. ప్రస్తుత న్యాక్ గ్రేడ్‌లు-యూనివర్సిటీలను పరిగణనలోకి తీసుకుంటే 15 శాతం యూనివర్సిటీల్లో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు ప్రయోజనం

ఇంటర్ తర్వాత చదువు ఆపేసిన వారితో పాటు వివిధ కారణాల వల్ల ప్రత్యక్షంగా ఉన్నతవిద్యను అభ్యసించలేని వారికి కూడా ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల వల్ల ప్రయోజనం ఉంటుంది. ఇలాంటి అభ్యర్థులు తమ విద్యార్హతలను పెంచుకుని.. కెరీర్ పరంగా ముందడుగు వేసేందుకు అవకాశముంటుంది.

ఫిబ్రవరి చివరకు తుది రూపం

ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల స్వరూపం, వాటి నిర్వహణకు యూనివర్సిటీలు అనుసరించాల్సిన విధానాలు, సిలబస్, మూల్యాంకనం తదితర అంశాలపై ఫిబ్రవరి చివరినాటికి తుది రూపం వచ్చే అవకాశముంది. వీటిపై యూజీసీ పరిధిలో నిపుణుల కమిటీ కసరత్తు చేస్తోంది. అదే విధంగా ఔత్సాహిక అభ్యర్థులకు జీమ్యాట్, జీఆర్ఈ తరహాలో ఆన్‌లైన్‌లోనే ప్రవేశ పరీక్ష నిర్వహించి.. అందులో ప్రతిభ ఆధారంగా ప్రతిపాదిత ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే అంశంపై చర్చ జరుగుతోంది.

యూనివర్సిటీల విధులు

ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను అందించే యూనివర్సిటీలు తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రతి ప్రోగ్రామ్, కోర్సుకు సంబంధించి.. ఆన్‌లైన్ లెక్చర్స్, ట్యుటోరియల్స్, డిస్కషన్ ఫోరమ్ (ఆన్‌లైన్ చాటింగ్) సదుపాయాలు కల్పించాలి. అంతేకాకుండా ప్రీ-లోడెడ్ లెక్చర్స్‌నూ అందుబాటులో ఉంచాలి. ఫలితంగా విద్యార్థులు ఎప్పుడైనా లైవ్ లెక్చర్స్‌కు హాజరు కాకుంటే.. వాటిని తర్వాత వినే అవకాశముంటుంది.

'స్వయం'తో అనుసంధానం

ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను అందించే క్రమంలో యూనివర్సిటీలు ఆన్‌లైన్ ట్యుటోరియల్స్ కోసం విద్యార్థులు 'స్వయం' పోర్టల్‌లో కూడా రిజిస్టర్ చేసుకోవాలనే నిబంధన విధించనున్నట్లు తెలుస్తోంది. ఈ పోర్టల్ ద్వారా విన్న లెక్చర్స్‌కు సంబంధించి నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే వచ్చే క్రెడిట్స్‌ను కూడా డిగ్రీ మూల్యాంకనంలో కలిపే అవకాశముంది.

ప్రతిపాదిత ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులు-ముఖ్యాంశాలు

- పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ప్రవేశ, మూల్యాంకన ప్రక్రియ.
- సాంకేతిక, మెడికల్, ఇతర ప్రాక్టికల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌ల్లో మినహా మిగిలిన వాటిలో ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశపెట్టే యోచన.
- ఫిబ్రవరి చివరి నాటికి విధివిధానాల ఖరారు.
- 2020 నాటికి ఉన్నత విద్యలో జీఈఆర్‌ను 30 శాతానికి పైగా చేర్చాలని లక్ష్యం.



సానుకూల దృక్పథంతో..

నాణేనికి రెండు వైపులు ఉన్నట్లే.. ప్రతి అంశానికి మంచి, చెడు ఉంటాయి. మంచిని గ్రహించి సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తే సత్ఫలితాలు రావడం ఖాయం. ఇదే విషయం ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకూ వర్తిస్తుందని చెప్పొచ్చు. ప్రస్తుతం ఇగ్నో పరిధిలో కొన్ని డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల స్థాయిలో ఆన్‌లైన్ విధానం విజయవంతంగా అమలవుతోంది. ఇదే పరిస్థితి ప్రతిపాదిత ఆన్‌లైన్ డిగ్రీ కోర్సుల్లోనూ ఉంటుందని చెప్పొచ్చు. కారణం.. ఇప్పుడు అన్ని యూనివర్సిటీలు సాంకేతికంగా, ఆన్‌లైన్ టూల్స్ పరంగా సమర్థవంతంగా వ్యవహరిస్తున్నాయి. కాబట్టి ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకు అందించాల్సిన సదుపాయాల విషయంలో ఎలాంటి సమస్య తలెత్తదనేది నా అభిప్రాయం. ఇక విద్యార్థుల విషయానికొస్తే.. ఇంటర్నెట్‌ను ఉపయోగించడంపై ప్రాథమిక అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ సులువుగానే కోర్సులు చేయగలరు.

– ప్రొఫెసర్ డి.ఆర్.శర్మ, రీజనల్ డైరెక్టర్, ఇగ్నో-విజయవాడ రీజనల్ సెంటర్.

గెస్ట్ కాలమ్

నిత్య విద్యార్థిగా ఉంటేనే..!

విజయం సాధ్యం

"ఎప్పటికప్పుడు సరికొత్త నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. లేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందనేది ఇప్పుడు సర్వసాధారణం. అయితే ఉద్యోగం కోల్పోతామనే ఆలోచనలను పక్కనపెట్టి, కొత్త నైపుణ్యాలను పెంపొందించుకుంటే కెరీర్ పరంగా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చనే విషయాన్ని గుర్తించాలి. ఆ దిశగా ఆశావహ దృక్పథం పెంపొందించుకొని యువత, ఉద్యోగులు ముందడుగు వేయాలి" అని సూచిస్తున్నారు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్. ప్రస్తుతం ఐటీ రంగంలో ఒకవైపు కొత్త నైపుణ్యాలతో ఉద్యోగాలు.. మరోవైపు స్కిల్స్ లేమితో కొలువుల్లో కోతల పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఆయనతో ఈ వారం గెస్ట్‌కాలమ్



ఆర్.చంద్రశేఖర్, ప్రెసిడెంట్, నాస్కామ్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, 3-డీ టెక్నాలజీస్ తదితర అంశాల్లో శిక్షణకు బెంగళూరులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం.



ఐటీ రంగం ఆవిర్భావం నుంచి అందులో నిరంతరం ఏదో ఒక కొత్త టెక్నాలజీ ప్రవేశిస్తోంది. వీటిపై ఉద్యోగులు, ఉద్యోగార్థులు ఎప్పటికప్పుడు దృష్టిపెట్టి నేర్చుకోవాల్సిన ఆవశ్యకతా నెలకొంటూనే ఉంది. ఉదాహరణకు ఆరేడేళ్ల కిందట క్లౌడ్ కంప్యూటింగ్ అనే కొత్త టెక్నాలజీ వచ్చింది. దీంతో చాలా మంది కెరీర్ పరంగా ఆందోళన చెందారు. కానీ, తర్వాత కాలంలో క్లౌడ్ టెక్నాలజీ రోజువారీ విధుల్లో భాగమైంది. దీంతో ఐటీ రంగంలోనే కొనసాగాలనుకునే ఉద్యోగార్థులు, ఔత్సాహికులు ఈ కొత్త టెక్నాలజీని నేర్చుకొని తమ నైపుణ్యాలు మెరుగుపరచుకున్నారు.

ఆటోమేషన్, రోబోటిక్స్ సమస్య భిన్నమైందే

క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి టెక్నాలజీలతో పోల్చితే ప్రస్తుతం నెలకొన్న ఆటోమేషన్, రోబోటిక్స్ సమస్య కొంత భిన్నమైందే. కారణం.. ఇందులో మానవ వనరులకు బదులు నైపుణ్యం ఉన్న యంత్రాల నుంచి పోటీ ఎదురుకావడం. అయితే వీటికి సంబంధించిన నైపుణ్యాలనూ ఎప్పటికప్పుడు నేర్చుకోవడం వల్ల ఉద్యోగాలు కోల్పోతామనే ఆందోళన నుంచి బయటపడొచ్చు. ఉద్యోగార్థులు సైతం ఈ దిశగా కృషి చేయాలి. అలా ప్రయత్నించని వారే ఆటోమేషన్, రోబోటిక్స్ సమస్య ప్రభావానికి గురవుతున్నారు. వీరిని చూసి మిగతా వారు ఆందోళన చెందడం, ఐటీ రంగంలో ఇక మనుగడ ఉండదనుకోవడం సరికాదు.

ఆ నివేదికలు నిజమే

ఈ ఏడాది ఆటోమేషన్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. ఈ మూడు విభాగాల్లోనే దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు లభించనున్నాయనే ఫిక్కీ, ఇతర స్టాఫింగ్ సంస్థల సర్వే నివేదికలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే విధంగానే ఉన్నాయి. వీటిని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ఔత్సాహికులదే.

నాస్కామ్ తోడుగా..

ఉద్యోగార్థులు, యువతకు నైపుణ్యాల పరంగా నాస్కామ్ ఎప్పుడూ తోడుగా ఉంటుంది. ఈ దిశగా ఇప్పటికే సెక్టార్ స్కిల్ కౌన్సెల్స్ ఏర్పాటు చేశాం. అలాగే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, 3-డీ టెక్నాలజీస్ తదితర అంశాల్లో శిక్షణకు బెంగళూరులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పాం. మరో మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం.

అకడమిక్స్‌లోనూ భాగం చేయాలి

కొత్త నైపుణ్యాలు నిరంతరం ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో వాటిని అకడమిక్స్‌లోనూ చేర్చేలా చర్యలు తీసుకోవాలి. కనీసం మూడేళ్లకోసారైనా సిలబస్‌లో మార్పులు చేసేందుకు ప్రయత్నించాలి. ఇండస్ట్రీ నిపుణులను భాగస్వాములను చేస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

నిత్య విద్యార్థి.. అదే విజయమంత్రం

విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఇచ్చే సలహా ఏమంటే.. ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలి. అప్పుడే ఏ రంగంలోనైనా విజయం సాధించగలరు. పాత పద్ధతుల్లోనే కొనసాగుదాం అనే ధోరణి వదిలి.. ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీల వైపు అడుగులు వేయాలి. అదే విజయ మంత్రం!!

కాంపిటీటివ్ కౌన్సెలింగ్


గ్రూప్స్‌లో ఇండియన్ ఎకానమీకి సంబంధించి ప్రధానంగా చదవాల్సిన అంశాలేమిటి?
- ఆర్.ఎస్.వి.ప్రసాద్, హైదరాబాద్.

మానవాభివృద్ధి సూచిక (Human Development Index), అసమానతలు, సమ న్యాయం, లింగ వివక్ష సూచీ, బహుమితీయ పేదరిక సూచీ (Multidimensional Poverty Index); మిలీనియం వృద్ధి లక్ష్యాలు, పంచవర్ష ప్రణాళికలు- లక్ష్యాలు- వ్యూహాలు; ప్రభుత్వ, ప్రైవేటు రంగ పెట్టుబడులు, 11వ పంచవర్ష ప్రణాళిక విజయాలు, 12వ పంచవర్ష ప్రణాళిక లక్ష్యాలు-ప్రగతి, వనరుల పంపిణీ; నీతి ఆయోగ్, పేదరికం- భావనలు- అంచనాలు, పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు; నిరుద్యోగం-రకాలు, నిరుద్యోగ నిర్మూలనా కార్యక్రమాలు, శ్రామికశక్తి భాగస్వామ్యం, పనిలో పాలుపంచుకునే రేటు; జాతీయాదాయం-భావనలు, జాతీయాదాయ లెక్కింపులో సమస్యలు; పన్నుల వ్యవస్థ- పన్నుల సంస్కరణలు – వివిధ కమిటీలు, వస్తు సేవలపై పన్ను, కోశ విధానం; బ్యాంకింగ్ రంగం, ద్రవ్య మార్కెట్, ద్రవ్య విధానం, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు; వ్యవసాయ రంగం, హరిత విప్లవం, వ్యవసాయ పరపతి, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పరంగా వివిధ పంటల్లో రాష్ట్రాల స్థానం; పారిశ్రామిక తీర్మానాలు (1948, 1956, 1977, 1980, 1991), పారిశ్రామిక విత్త సంస్థలు; సేవా రంగం- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం; 2011 జనాభా లెక్కలు, డెమోగ్రాఫిక్ డివిడెండ్; ద్రవ్యోల్బణం – డబ్ల్యూపీఐ, సీపీఐ, ఐఐపీ, ద్రవ్యం; ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు; ప్రపంచ వాణిజ్య సంస్థ; విదేశీ వాణిజ్యం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, చెల్లింపుల శేషం, మూల్యహీనీకరణ; ఆర్థిక సంస్కరణలు-సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ తదితర అంశాలను చదవాలి.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్స్ పరీక్షల్లో ప్రశ్నల స్థాయి ఏ విధంగా ఉంటుంది? **- కె.ఎస్.రవికుమార్, కాకినాడ.**

సబ్జెక్టుకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని ఔపోసన పట్టాలి. ప్రశ్నల స్థాయిని బట్టి విషయాన్ని మరింత విస్తృతంగా అధ్యయనం చేయాలి. సబ్జెక్టుని తార్కికంగా, విశ్లేషణాత్మకంగా, విచక్షణా జ్ఞానంతో అన్వయించడానికి ప్రయత్నించాలి. సాధారణంగా ప్రశ్నల స్థాయిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి.. జ్ఞానాత్మకమైనవి లేదా పరిజ్ఞానాన్ని పరిశీలించేవి; విషయ అవగాహనకు సంబంధించినవి, విషయ అనువర్తనకు సంబంధించినవి.

జ్ఞానాత్మకమైనవి లేదా పరిజ్ఞానాన్ని పరిశీలించేవి
ఈ తరహా ప్రశ్నలు ప్రధానంగా కంటెంట్‌కు సంబంధించి ఉంటాయి. వీటి ద్వారా అభ్యర్థి పరిజ్ఞానాన్ని, జ్ఞాపక శక్తిని పరిశీలిస్తారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలంటే విస్తృత పఠనంతో పాటు పునశ్చరణ అవసరం. ఈ ప్రశ్నల సంఖ్య పరీక్ష స్థాయిని బట్టి మారుతుంది.



విషయ అవగాహనకు సంబంధించినవి
కొన్ని ప్రశ్నలు అభ్యర్థి అవగాహన, తెలివితేటలను పరీక్షిస్తాయి. ఇవి రెండూ నిరంతర సాధన, ప్రత్యేక శ్రద్ధతోనే సాధ్యమవుతాయి.

విషయ అనువర్తనకు సంబంధించినవి
ఈ తరహా ప్రశ్నల్లో అభ్యర్థి అసాధారణ తెలివితేటలు ప్రదర్శించాలి. లోతైన ఆలోచనతో పాటు సహజ ప్రతిభ, విచక్షణాశక్తులను ఉపయోగించాలి. ఈ ప్రశ్నల ద్వారా అభ్యర్థి అప్లికేషన్ నైపుణ్యాలను పరీక్షిస్తారు.

బులెటిన్ బోర్డ్

ఎన్ఐటీ ఢిల్లీలో 20 ఖాళీలు

ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)... 20 బోధనేతర ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** సూపరింటెండెంట్-2, అకౌంటెంట్-1, పర్సనల్ అసిస్టెంట్-1, టెక్నికల్ అసిస్టెంట్-6, స్టెనోగ్రాఫర్-1, సీనియర్ అసిస్టెంట్-1, టెక్నీషియన్-5, లేబొరేటరీ అసిస్టెంట్-2, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (అటెండెంట్/డ్రైవర్)-2.
- **వేతనశ్రేణి:** సూపరింటెండెంట్, అకౌంటెంట్, పర్సనల్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.9,300-రూ.34,800; మిగిలిన పోస్టులకు రూ.5,200-రూ.20,200.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి ఇంటర్మీడియెట్/ఐటీఐ/బ్యాచిలర్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ/ఎంబీఏ/బీఈ/బీటెక్/ఇంజనీరింగ్ డిప్లొమా/తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, కంప్యూటర్ అంశాలపై నైపుణ్యం, టైపింగ్ తదితర అర్హతలుండాలి.
- **వయసు:** సీనియర్ అసిస్టెంట్‌కు 33 ఏళ్లు, సూపరింటెండెంట్, అకౌంటెంట్, పర్సనల్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు 30 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ప్రొఫిషియెన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ రూ.250.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్ (జనవరి 27-2 ఫిబ్రవరి సంచిక)లో నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు.
- **వెబ్‌సైట్:** nitdelhi.ac.in

హిందుస్థాన్ ప్రిఫాబ్ లిమిటెడ్‌లో 8 ఖాళీలు

న్యూఢిల్లీలోని హిందుస్థాన్ ప్రిఫాబ్ లిమిటెడ్ (హెచ్‌పీఎల్).. 8 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్).
- **వేతనం:** రూ.46,200.
- **అర్హతలు:** బీఈ (సివిల్) ఉత్తీర్ణతతోపాటు సివిల్ ఇంజనీరింగ్ రంగంలో కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. ఎంటెక్/ఎంబీఏ ఉత్తీర్ణత అభిలషణీయం.
- **వయసు:** 2017, డిసెంబర్ 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 22, 2018.
- **వెబ్‌సైట్:** www.hindprefab.in

సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో 12 ఆర్ఏలు

కోల్‌కతాలోని సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ (ఎస్ఐఎన్‌పీ).. 12 రీసెర్చ్ అసోసియేట్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ).
- **అసోసియేట్‌షిప్:** రూ.32,000/రూ.36,000/రూ.38,000+హెచ్ఆర్ఏ.
- **విభాగాల వారీ ఖాళీలు:** కెమికల్ సైన్సెస్-1, సర్ఫేస్ ఫిజిక్స్ అండ్ మెటీరియల్ సైన్స్-1, బయోఫిజిక్స్ అండ్ స్ట్రక్చరల్ జెనోమిక్స్-1, ప్లాస్మా ఫిజిక్స్-2, క్రిస్టలోగ్రఫీ అండ్ మాలిక్యులార్ బయాలజీ-1, కంప్యూటేషన్ సైన్స్-1, కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్-3, న్యూక్లియర్ ఫిజిక్స్-1, అప్లైడ్ న్యూక్లియర్ ఫిజిక్స్-1.
- **అర్హతలు:** ఫిజికల్ అండ్ బయోఫిజికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ/పీహెచ్‌డీ స్కాలర్స్ (థీసిస్ సమర్పించి ఉండాలి).
- **వయసు:** దరఖాస్తు సమర్పణ గడువు నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్.
- **చివరి తేదీ:** జనవరి 31, 2018.
- **వెబ్‌సైట్:** www.saha.ac.in

హెచ్‌సీయూలో జేఆర్ఎఫ్/ఆర్ఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)... జేఆర్ఎఫ్/ఆర్ఏ ఖాళీ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలో)/ఆర్ఏ (రీసెర్చ్ అసోసియేట్).
- **అర్హతలు:** ఎంఎస్సీ/పీహెచ్‌డీ (ఎర్త్ సైన్సెస్/ఫిజిక్స్/శాటిలైట్ మెటియొరాలజీ/ఎకాలజీ, ఫారెస్ట్రీ (నెట్ క్వాలిఫైడ్)/ఎంటెక్ (రిమోట్ సెన్సింగ్/జియోఇన్ఫర్మేటిక్స్).
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 17, 2018.
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 29-1-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్	నిఫ్టీ
111 ▼	16 ▼
36,050	11,070

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,506	▲ 95
డోజోన్స్	26,617	▲ 224
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,666	▲ 50
డాక్స్	13,340	▲ 42
షాంఘై	3,559	▲ 11
నికాయ్	23,632	▼ 38

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.25	64.38
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	92.20	92.39
€	యూరో	ఎస్‌బీఐ	80.15	80.31
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.19	59.31
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.36	52.47
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.42	49.52
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.36	18.21
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.72	18.38
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.08	11.51

'క్రెడిట్' బాకీలకు.. బదిలీ మందు!



కార్డు బాకీ సకాలంలో చెల్లించకుంటే భారీ వడ్డీ

- ఆ బకాయిలు వేరే కార్డుకు బదిలీ చేసుకుంటే నయం
- అలాగైతే పరిమిత కాలం పాటు తక్కువ చార్జీలు
- ఆ గడువు లోపు తిరిగి చెల్లించేస్తే బదిలీ లాభమే

వరుసగా పండుగలు. ఇంటి నిండా బంధువులు. కొందరైతే పండగలకు ఊళ్లకు వెళ్లటం. ఏదైనా పండగలంటే అదనపు ఖర్చులు తప్పవు. ఆ సందడి, సంతోషాలతో పోలిస్తే ఖర్చులు పెద్ద లెక్కేమీ కావనుకోండి!!. క్రెడిట్ కార్డులున్నాయి కనక ఆ ఖర్చుల్ని అప్పటికప్పుడు తేలిగ్గానే అధిగమించేశారు. అంతా సవ్యంగా గడిచిపోయింది. కాకపోతే క్రెడిట్ కార్డుపై తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సిన గడువు రానే వచ్చింది. ఇప్పుడేంటి పరిష్కారం...? సకాలంలో బకాయి చెల్లించకపోతే వడ్డీ మామూలుగా ఉండదనేది క్రెడిట్‌కార్డు వాడేవారికి తెలిసిన విషయమే. మరి వడ్డీ బాదుడు ఇష్టం లేని వారు, తమ దగ్గర తిరిగి చెల్లించేంత వెసులుబాటు కూడా లేనివారు ఏదో ఒక పరిష్కారాన్ని కనుక్కుని ఆ క్రెడిట్ కార్డు భారాన్ని దింపుకోవాలి కదా..?!! ఇదిగో... సరిగ్గా ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనే వారికోసం ఓ ఆప్షన్ ఉంది. అది... ఆ బకాయిలను మరో క్రెడిట్ కార్డుకు బదిలీ చేసుకోవటం.

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

క్రెడిట్ కార్డు సంస్థలు కార్డుపై మిగిలి ఉన్న బకాయిని మరో కార్డుకు బదిలీ చేసుకునేందుకు అనుమతిస్తున్నాయి. దాదాపు అన్ని సంస్థలూ...ఇలా బదిలీ చేసుకునే బకాయిలపై పరిమిత కాలం పాటు తక్కువ వడ్డీ చార్జీలను ఆఫర్ చేస్తున్నాయి. అయితే, దీన్ని చేతిలో తగినన్ని డబ్బుల్లేనపుడు చేసుకునే తాత్కాలిక సర్దుబాటుగానే చూడాలి తప్ప శాశ్వత పరిష్కారంగా చూడకూడదనేది నిపుణుల సలహా.

బ్యాలెన్స్ బదిలీ కొంత కాలానికే...

బ్యాలెన్స్ బదిలీ ఆప్షన్ కింద ఒక కార్డుపై చెల్లించాల్సిన రుణ బకాయిలను మరో కార్డుకు బదలాయించుకోవచ్చు. ఇలా బదిలీ చేసుకున్న మొత్తంపై కొత్త సంస్థ కొన్నాళ్లపాటు తక్కువ చార్జీలే తీసుకుంటుంది. ఓ క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ మొత్తాన్ని వాడేసి సకాలంలో చెల్లించకపోతే పడే వడ్డీ చార్జీల కంటే బదిలీ చేసుకునే బకాయిలపై ఆయా సంస్థలు విధించే వడ్డీ చార్జీలు తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపులు ఆలస్యమైతే వాటిపై విధించే వడ్డీ చార్జీలు నెలవారీగా 2– 3.5 శాతం మధ్య ఉన్నాయి. అదే బదిలీ చేసుకునే బకాయిలపై ఇదే సంస్థ కేవలం 0.99 శాతమే వసూలు చేస్తోంది. కాకపోతే ఈ సదుపాయం కొంత కాలం పాటే అమల్లో ఉంటుంది. చాలా బ్యాంకులు మూడు నుంచి ఆరు నెలల వరకే తక్కువ చార్జీల అవకాశం కల్పిస్తున్నాయి. ఈ పరిమిత కాలం ముగిసిన తర్వాత సాధారణ వడ్డీ చార్జీలు అమల్లోకి వస్తాయి. ఒక్క సిటీ బ్యాంకు మాత్రం బదిలీ చేసుకున్న బకాయిలపై తక్కువ వడ్డీ చార్జీలను 15 నెలల నుంచి 21 నెలల వరకు అమలు చేస్తోంది.

ఎలా పనిచేస్తుంది...?

కనీస అర్హతలుంటేనే బ్యాలెన్స్ బదిలీకి క్రెడిట్ కార్డు కంపెనీలు ఆమోదం తెలుపుతాయి. ఉదాహరణకు ఐసీఐసీఐ బ్యాంకు అయితే, ఇతర బ్యాంకు క్రెడిట్ కార్డుపై కనీసం రూ.15,000 బకాయి ఉంటేనే ఆ మొత్తాన్ని బదిలీ చేసుకోవటానికి ఓకే చెబుతోంది. గరిష్ట బదిలీపై కూడా పరిమితులున్నాయి. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సంస్థ యితే బకాయిల మొత్తంలో 75 శాతాన్నే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుకు బదిలీ చేసుకునేందుకు అనుమతిస్తోంది. మిగిలిన 25 శాతం బకాయిలను కార్డు దారుడే సెటిల్ చేసుకోవాల్సి ఉంటుంది. చెక్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా ఆన్‌లైన్‌లోనూ బ్యాలెన్స్ బదిలీకి ఎస్‌బీఐ అవకాశమిస్తోంది. ఇలా అవుట్ స్టాండింగ్ బ్యాలెన్స్ బదిలీకి సాధారణంగా మూడు నుంచి ఐదు రోజులు పడుతుంది. ఒక్కసారి విధించే ప్రాసెసింగ్ చార్జీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని బ్యాంకులయితే వడ్డీ రేట్లు, కాల వ్యవధి, ప్రాసెసింగ్ ఫీజుల్లో కస్టమర్ ఇష్టానికి అనుగుణంగా పలు ఆప్షన్లను కూడా అందిస్తున్నాయి. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు సంస్థ రెండు ఆప్షన్లిస్తోంది. 60 రోజుల కాల వ్యవధిని ఎంపిక చేసుకుంటే బదిలీ చేసుకునే మొత్తంపై 2 శాతం లేదా రూ.199 వీటిలో ఏది ఎక్కువయితే దాన్ని వసూలు చేస్తోంది. వడ్డీ రేటు మాత్రం ఉండదు. మరో ఆప్షన్లో ఎస్‌బీఐ ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీ తీసుకోదు. కాకపోతే బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్‌ను 180 రోజుల కాల వ్యవధికి ఎంచుకుంటే నెలకు 1.7 శాతం చార్జ్ చేస్తోంది. అయితే, గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమిటంటే ఏ కార్డుకు అయితే బకాయిలను బదిలీ చేసుకున్నారో ఆ కార్డుపై క్రెడిట్ లిమిట్ ఆ మేరకు తగ్గిపోతుంది.

ఇవి గుర్తుంచుకోవాలి సుమా...

వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాలెన్స్ బదిలీ అనేది మెరుగైన ఆప్షన్ అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అయితే, తక్కువ వడ్డీ చార్జీలు అన్నవి పరిమిత కాలం పాటే ఉంటాయన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఈ వ్యవధిలోపు చెల్లించలేకపోతే తిరిగి అధిక వడ్డీ చార్జీలను భరించాల్సి వస్తుంది. అయితే, బదిలీ చేసుకునే బకాయిలపైనే తక్కువ వడ్డీ చార్జీలు వర్తిస్తాయే గానీ ఆ కార్డుతో చేసే నూతన చెల్లింపులపై కాదు. ఒక్కసారే అయినా ప్రాసెసింగ్ ఫీజు విషయమూ పరిశీలించాలి. బ్యాలెన్స్ బదిలీపై ఉన్న అన్ని అంశాలనూ పరిశీలించిన తర్వాత ఏది లాభదాయకం అనిపిస్తే దాన్ని అనుసరించడం మంచిది.

బిజినెస్ క్విజ్ -2

WWW.SAKSHIBUSINESS.COM
SAKSHIBUSINESS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
GET IT ON Google Play
Available on the App Store

ఇప్పుడు మనకు ఆర్థిక సంవత్సరమంటే... ఏప్రిల్ 1తో మొదలై మార్చి 31తో ముగుస్తుంది. మొదటి నుంచీ ఇంతేనా? లేకపోతే మధ్యలో మార్చారా? నిజానికిది 1867 నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పాలి. మరి అంతకు ముందు మనకు ఆర్థిక సంవత్సరమంటే ఏంటి? ఎప్పుడు మొదలై... ఎప్పుడు ముగిసేది? ఈ ప్రశ్నే కాదు... బడ్జెట్, ఆర్థిక అంశాలకు సంబంధించి ఆసక్తికరమైన ప్రశ్నలు, వాటికి జవాబులు తెలియాలంటే... థర్డ్ అంపైర్ మీడియా సీఈవో సునీల్ ధవళ అందిస్తున్న క్విజ్‌ను WWW.SAKSHIBUSINESS.COM లో చూడండి.

పొదుపు పెంచితే.. గెలుపు తథ్యం!

అదనంగా ఏటా కొంత మొత్తం కేటాయింపు

- పెరిగే వేతనానికి తగ్గ స్థాయిలో ఈ పెంపు కూడా
- నిర్ణీత శాతం సిప్ రూపంలో పెట్టుబడులకు మళ్లింపు
- దీనివల్ల రాబడి తగ్గినా... అవసరమైన నిధి ఏర్పడుతుంది
- ద్రవ్యోల్బణంతో ఖర్చులు పెరిగినా తట్టుకోవచ్చు

అసలు జీవితంలో కీలకమైన లక్ష్యాలేంటి? పెళ్లికాని యువతకైతే ఉద్యోగం. పెళ్లయిన వారికైతే... పిల్లల చదువు, సొంతిల్లు, విశ్రాంత జీవనాన్ని సాఫీగా గడపటం!!. పొదుపు, మదుపు ఏం చేసినా వీటి కోసమే. కానీ ఈ పొదుపు, మదుపుల విషయంలో స్మార్ట్‌గా ఉంటేనే అనుకున్నవి సాఫీగా నెరవేరతాయి. మీ పిల్లల కాలేజీ విద్య కోసం అవసరమైన రూ.కోటి నిధిని సమకూర్చుకునేందుకు ఇప్పటి నుంచి ప్రతి నెలా రూ.50,000 చొప్పున రానున్న పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలని నిర్ణయించుకున్నారనుకోండి. అప్పుడు మీ పెట్టుబడులపై వార్షిక రాబడులు కనీసం 9.5 శాతం మేర ఉండాలి. అప్పుడే రూ.కోటి నిధి సమకూరుతుంది. అయితే ఇక్కడో చిక్కుంది. వడ్డీ మనం అనుకున్నంత రాకపోవచ్చు. ఒకోసారి అనుకున్న నిధికన్నా ఎక్కువ అవసరం పడొచ్చు. మరి అలాంటపుడు ఏం చేయాలి? దానికో మంత్రముంది. అది... ప్రతి నెలా రూ.50,000 పొదుపు చేస్తూ వెళ్లడమే కాక కొంత అదనంగా పొదుపు చేయడం. ఏటా పెట్టుబడుల మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లాలి. దీనివల్ల మీ లక్ష్యాలను నెవవేర్చుకునే అవకాశాలు మరింత పటిష్టం అవుతాయి. ఈ విషయంలో ఏం చేయాలన్న దానిపై నిపుణుల అభిప్రాయాలను అందించేదే ఈ ప్రాఫిట్ కథనం.



పొదుపు పెంచుకుంటూ వెళ్లాలి...

ఇక్కడ పొదుపును పెంచడమనేది రెండు రిస్కులను తట్టుకోవడానికేనని గుర్తుంచుకోవాలి. ఆ రిస్కుల్లో మొదటిది... రాబడి మనం ఊహించినట్లుగా లేకపోవటం. రెండోది... ద్రవ్యోల్బణం పెరిగి ఖర్చు మనం అనుకున్న దానికన్నా ఎక్కువ పెట్టాల్సి రావటం. ఇక్కడ పిల్లల చదువుకు నిధిని సమకూర్చుకోవటం కూడా ఇలాంటిదే. అందుకే ఈ నిధి కోసం ప్రత్యామ్నాయ వనరులపైనా దృష్టి సారించాలి. తగినంత నిధి సమకూరని పక్షంలో విద్యారుణాలుండనే ఉన్నాయి. అయితే, తప్పనిసరి సందర్భాల్లోనే వాటిని వినియోగించుకోవాలి. అందుకే ఆయా ఆప్షన్లను అత్యవసరం కాని సందర్భాల్లో పక్కనబెట్టాలి. ఏటా పొదుపు మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లడానికి... వేతనం వార్షికంగా కొంత పెరుగుతుంది కనక ఆ భాగాన్ని ఉపయోగించుకోవాలి. ఏదైనా రుణం ఉంటే ఇతర లక్ష్యాలకు చేసే పొదుపు పరిమితమవుతుంది. రుణాలేవీ లేకుంటే మాత్రం పన్ను అనంతరం నెలవారీ ఆదాయంలో 30–40 శాతం వరకూ పొదుపు చేసే అవకాశముంటుంది. ఉదాహరణకు నెలకు రూ.1.5 లక్షల ఆదాయం వస్తుందనుకుంటే ప్రారంభంలో కనీసం 30 శాతం పొదుపు చేయగలరనుకోవాలి. అంటే రూ.45,000. మరుసటేడాది వేతనంలో పెంపు 10 శాతం ఉంటే నెలసరి వేతనం రూ.1.65 లక్షలవుతుంది. దాంతో నెలనెలా చేసే రూ.45,000 పొదుపునకు అదనంగా పెరిగిన రూ.15 వేల నుంచి 30 శాతాన్ని మళ్లించాలి. ఇలా ఏటా పెరిగే వేతనంలో ఈ స్థాయిలో మళ్లించుకుంటూ వెళితే నిర్ణీత కాలానికి భారీగా నిధి సమకూరుతుంది. అంతేకాదు, ఇలా చేయడం వల్ల మీ పోర్ట్‌ఫోలియో రాబడుల పరంగా డౌన్‌సైడ్ రిస్క్ తగ్గుతుంది కూడా. ఎలాగంటే..? ఉదాహరణకు ఈక్విటీలకు 65 శాతం , బాండ్లకు 35% పొదుపు నిధుల్ని కేటాయించారనుకోండి. దీనిపై కనీస రాబడులు 9.5 శాతంగా ఉండాలన్నది మీ లక్ష్యం. ఒకవేళ రాబడులు తగ్గినప్పటికీ ఏటా పెట్టుబడులను పెంచుకుంటూ వెళ్లడం వల్ల లక్ష్యాలను విజయవంతంగా అధిగమించొచ్చు.

ఫార్వర్డ్ సిప్ ఎంతో బెటర్...

ఏటా ఏప్రిల్‌లో వేతన సవరణ ఉందనుకోండి. మే 5వ తేదీన వేతనం వస్తుందనుకుంటే, అందుకు ఒక నెల ముందే సిప్ ప్రణాళికను ఆరంభించాలి. ఏటా పెంచుకుంటూ వెళ్లే మొత్తాన్ని అప్పటి వరకు ఎంపిక చేసుకున్న సాధనాల్లోకే (మ్యూచువల్ ఫండ్స్, రికరింగ్ బ్యాంకు డిపాజిట్లు) వెళ్లాలి. ఇలా లక్ష్య సాధనకు గడువు దగ్గర పడే వరకూ ఈ వ్యూహాన్నే అనుసరించడం మంచిది. ఉదాహరణకు ఈక్విటీకి 75 శాతం, బాండ్లకు 35 శాతం కేటాయిస్తుంటే, ఏటా పెంచే పెట్టుబడుల మొత్తాన్ని ఈ రెండు సాధనాల్లోకి ఇదే నిష్పత్తిలో కేటాయించాలి. ఒకవేళ వేతన సవరణ జరగకపోయిన పక్షంలో... అవసరమనుకుంటే సిప్‌ను రద్దు చేసుకోవచ్చు.

ఈ తప్పులు మళ్లీ చేయొద్దు..

ఫండ్స్ పెట్టుబడుల్లో చేయకూడని తప్పులెన్నో

- కాస్త అవగాహనతో వాటిని నివారించొచ్చు
- స్వల్పకాలంలో పెట్టుబడి రెట్టింపు కాదు..
- అధిక రాబడులపై అపోహలొద్దు



ఎ. బాలసుబ్రమణియన్, సీఈవో, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ



మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మంచి రాబడులనిస్తాయా? ఎంత శాతం గిట్టుబాటవుతుంది? నిజానికివన్నీ అంత తేలిగ్గా సమాధానాలు దొరికే ప్రశ్నలు కావు. ఎందుకంటే మ్యూచ్‌వల్ ఫండ్స్ పనితీరు చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, దేశీ స్థూల ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, కమోడిటీలు, కరెన్సీ, వడ్డీ రేట్లు, కంపెనీల ఆర్థిక ఫలితాలు ఇలాంటివెన్నో షేర్ల ధరలను ప్రభావితం చేస్తాయి. ప్రతి సంవత్సరం కొత్త పరిణామాలు చోటు చేసుకుంటూ ఇన్వెస్ట్‌మెంట్స్ తీరుతెన్నులపై ప్రభావం చూపుతుంటాయి. కాబట్టి, ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేవారు పూర్తి క్రమశిక్షణతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు సాధారణంగా చేసే తప్పిదాలపై అవగాహన పెంచేదే ఈ కథనం...

ఇంకా పెరుగుతాయని అనుకోవద్దు...

రాబడులు గతేడాది బాగా వచ్చాయి కనక ఈ ఏడాది, వచ్చే సంవత్సరం అంతకు మించి వస్తాయనే భ్రమల్లో ఉండొద్దు. ప్రతి ఏడాదీ ఒకేలా (బాగుండటం లేదా బాగాలేకపోవడం) ఉంటుందని అనుకోవద్దు. రాబడి తగ్గినా, అంచనాలను అందుకోలేకపోయినా.. ముందుగా ఫండ్స్ నుంచి పెట్టుబడులు వెనక్కి తీసేసుకోవడం చాలా మంది ఇన్వెస్టర్లు చేసే తప్పుల్లో ఒకటి. ఫండ్స్‌లో పెట్టుబడులు సాధారణంగా దీర్ఘకాలికమైనవి, నిర్దిష్ట ఆర్థిక లక్ష్యాల సాధనకు ఉద్దేశించుకున్నవై ఉండాలి. స్వల్పకాలికంగా రాబడులు తగ్గినంత మాత్రాన భయపడి వైదొలిగితే.. దీర్ఘకాలిక ప్రయోజనాలను అందుకోలేం. కాబట్టి ఈ తప్పిదాన్ని నివారించవచ్చు.

స్థిరమైన రాబడుల అంచనాలొద్దు..

ఫిక్సిడ్ డిపాజిట్లతో పోలిస్తే మరింత ఎక్కువ రాబడులిచ్చేస్తాయనే ఆలోచనతో చాలామంది ఇన్వెస్టర్లు ఎఫ్‌డీల్లో ఉన్న డబ్బును మ్యూచువల్ ఫండ్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ డిపాజిట్ స్కీముల్లోకి మళ్లిస్తుంటారు. అధిక రాబడులు రావడమనేది ఒకోసారి జరగొచ్చు.. ఒకోసారి జరగకపోవచ్చు. వడ్డీ రేట్లలో మార్పుల కారణంగా మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనైతే ఆ ప్రభావం మ్యూచువల్ ఫండ్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ స్కీమ్స్ మీదా ఉంటుంది. ఆర్‌బీఐ నిర్ణయాలు లేదా మార్కెట్ పరిణామాలు వీటిపై ప్రభావం చూపిస్తాయి. కాబట్టి ఆ మేరకు రిస్కులుంటాయని గుర్తించాలి. ఫండ్స్ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ స్కీములు స్థిరంగా అధిక రాబడులే ఇస్తాయన్న భావన పెట్టుకోవద్దు.

నెలవారీ డివిడెండ్లపై అపోహలొద్దు..

కొందరు ఇన్వెస్టర్లు క్రమంగా ప్రతినెలా డివిడెండ్ చెల్లించే ఫండ్స్‌ను ఎంచుకుంటూ ఉంటారు. అయితే, వీరు తెలుసుకోవాల్సిన విషయం ఒకటుంది. సదరు ఫండ్ మెరుగ్గా రాణించి, నిల్వలు పెరిగితే.. అందులో నుంచి మాత్రమే డివిడెండ్లు చెల్లించడం జరుగుతుంది. ఒకవేళ కొన్నాళ్ల పాటు ఆయా స్కీములు సరిగ్గా రాణించలేని పక్షంలో, నిల్వలు కూడా తగ్గిపోయి.. నెలవారీ డివిడెండ్లను ఫండ్ చెల్లించలేకపోవచ్చు. కనుక నెలవారీ డివిడెండ్లపై భారీ అంచనాలు పెట్టుకుని ఆయా స్కీములను ఎంచుకునే వారు ఈ విషయం గుర్తెరిగి వ్యవహరించాలి. అలాగే, ఆర్థిక వ్యవస్థ సరిగ్గా లేకపోతే మార్కెట్లు ప్రతికూలంగా గానీ లేదా కొన్నాళ్ల పాటు స్తబ్దుగా మారిపోవచ్చు. అలాంటి సందర్భాల్లో సహనం కోల్పోకుండా ఓపిగ్గా పెట్టుబడులను కొనసాగించగలిగితే.. తాత్కాలికమైన మార్కెట్ ఆటుపోట్ల నుంచి బయటపడొచ్చు.

అత్యాశకు పోవద్దు..

ఇది కేవలం ఫండ్స్‌కి మాత్రమే కాదు. మిగతా అన్ని సాధనాలకూ వర్తిస్తుంది. చాలా సందర్భాల్లో భారీ రాబడులను ఊహించుకుని, స్వల్పకాలంలోనే పెట్టుబడి రెట్టింపు అయిపోతుందనే అంచనాలు మొదటికే మోసం తెస్తుంది. ఎందుకంటే నిరంతరం భారీ రాబడులు వస్తూనే ఉంటాయని ఎవరూ కచ్చితమైన హామీ ఇవ్వలేరు. కాబట్టి.. మ్యూచువల్ ఫండ్స్‌లోని ఏ స్కీములో ఇన్వెస్ట్ చేసినా ఒక మోస్తరు రాబడులనే ఆశించడం శ్రేయస్కరం. ఒకవేళ స్కీము మెరుగ్గా రాణిస్తే అధిక రాబడులు ఎలాగూ వస్తాయి. ఒకవేళ రాణించలేకపోతే నిరాశ చెందడం, ఆర్థిక ప్రణాళికలు తల్లకిందులు కావడం లాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చూసుకోవచ్చు. ఈ సూచనలు ఈ ఏడాదికే కాదు.. ప్రతీ సంవత్సరానికీ వర్తిస్తాయి. స్థూలంగా చెప్పాలంటే.. క్రమశిక్షణతో వ్యవహరించడమే వివేకవంతమైన పెట్టుబడి విధానానికి ప్రధాన సూత్రం.



నీవు ఏ పని చేస్తున్నావనే దాని కన్నా
ఆ పనిని ఏ విధంగా చేస్తున్నావనే అంశమే ముఖ్యం.
– ఆది గోద్రెజ్, గోద్రెజ్ గ్రూప్ చైర్మన్

పొదుపు-మదుపు



ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?



రూ. కోటి వరకు డిపాజిట్లు,
జనవరి 9 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.25- 6.75	6.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.25	6.45- 6.55	6.25-6.5
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.3- 6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.6	6.50
డీసీబీ బ్యాంక్	6.65	6.85- 7	7- 7.1
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25 - 6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6 - 6.50	6.6- 6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6 - 6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75 - 6.25	6.50 - 6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25 - 6.5	6.75 - 6.85	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6- 6.7	6.7-6.85	6.25
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.2-6.4	6.60	6.40
ఎస్‌బీఐ	6.25	6.25	6.00
సిండికేట్ బ్యాంక్	6.15	6.50	6.50

బ్యాంక్ బజార్. కామ్ అందించిన వివరాల ఆధారంగా...

రిలయన్స్ రెగ్యులర్ సేవింగ్ ఫండ్



ఇది బ్యాలెన్స్‌డ్ ఫండ్. ఈక్విటీలో ఎక్కువ శాతం పెట్టుబడులు పెడితే మార్కెట్లు కరెక్షన్‌కు లోనైనప్పుడు తమ పెట్టుబడుల విలువ కుంగిపోతుందన్న ఆందోళన ఉంటే దీన్ని పరిశీలించొచ్చు. ఎందుకంటే ఇది ఈక్విటీ, డెట్‌ల కలబోత. ముఖ్యంగా మార్కెట్లు అధిక స్థాయికి చేరిన తరుణంలో పూర్తి ఈక్విటీ పథకాలతో రిస్క్ ఎక్కువే ఉంటుంది. ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆ రిస్క్ పరిమితం చేసుకోవచ్చు. మరోవైపు గత ఏడాది ఆగస్ట్‌లో 25 బేసిస్ పాయింట్ల రెపో రేటు కోత తర్వాత ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పరంగా కఠిన, తటస్థ విధానాన్నే కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో మధ్యస్థాయి రిస్క్‌కు సిద్ధపడేవారు రిలయన్స్ రెగ్యులర్ సేవింగ్ తరహా బ్యాలెన్స్‌డ్ ఫండ్లను పెట్టుబడులకు పరిశీలించొచ్చు. రిస్క్‌తో కూడిన సాధనాల్లో పెట్టుబడులను కొంత మేర బ్యాలెన్స్‌డ్ ఫండ్లలోకి మళ్లించడం కూడా వివేకమే.

రిస్క్ బ్యాలెన్స్

బ్యాలెన్స్‌డ్ ఫండ్స్ ప్రధానంగా లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటాయి. డెట్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించి అక్రూయెల్ స్ట్రాటజీ (క్రెడిట్ రేటింగ్ మెరుగుపడే అవకాశం ఉన్న వాటిలో ఇన్వెస్ట్ చేయడం) పాటిస్తుంటాయి. రిలయన్స్ రెగ్యులర్ సేవింగ్స్ ఫండ్ – బ్యాలెన్స్‌డ్ కూడా ఇదే తరహా పథకమే. హైబ్రిడ్ ఈక్విటీ తరహా కేటగిరీలోకి వస్తుంది. పథకం కింద సమీకరించే నిధుల్లో 65 శాతం మేర ఈక్విటీలకు కేటాయిస్తుంది. లార్జ్‌క్యాప్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చే పథకం కావడంతో మార్కెట్లలో అనూహ్య ఆటు పోట్లు ఎదురైనా తట్టుకునే విధంగా మెరుగైన స్థానంలో ఉంది. ఈ కేటగిరీలోనే మంచి పనితీరు చూపిస్తున్న ఇతర పథకాలు... హెచ్‌డీఎఫ్‌సీ ప్రుడెన్స్ ఫండ్, ప్రిన్సిపల్ బ్యాలెన్స్‌డ్ ఫండ్, యూటీఐ బ్యాలెన్స్‌డ్ ఫండ్‌లు మాత్రం స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఎక్కువగా పెట్టుబడులు పెట్టే విధానాన్ని అనుసరిస్తున్నాయి.

పోర్ట్‌ఫోలియో, పనితీరు

ఈ పథకం పనితీరు 2013–16 మధ్య కాలంలో ఆశించిన మేర లేదు. ఎందుకంటే ఆ సమయంలో మిడ్ క్యాప్ స్టాక్స్ ర్యాలీ చేయడంతో రాబడుల విషయంలో మిగిలిన పథకాలతో పోలిస్తే వెనుకబడింది. కారణం ఎక్కువ పెట్టుబడుల్ని లార్జ్‌క్యాప్‌కు కేటాయించడమే. కానీ, 2017లో తిరిగి రాబడుల పరంగా మంచి స్థానానికి చేరుకుంది. టాప్–3 పథకాల్లో ఒకటిగా నిలిచింది. బ్యాంకు స్టాక్స్‌కు అధిక కేటాయింపులతో గత 10 సంవత్సరాల కాలంలో ఏటా 12 శాతం చొప్పున కాంపౌండెడ్ రాబడులను అందించింది. పెట్టుబడులను రక్షించుకోవడంతోపాటు రిస్క్‌ను పరిమితం చేసే విధంగా ఈ పథకం విధానం ఉంటుంది. గత ఐదేళ్లలో పరిశీలిస్తే ఈక్విటీలకు కేటాయింపులను 72 శాతం స్థాయిలో కొనసాగిస్తూ వస్తోంది. ప్రస్తుతం పథకం పరిధిలోని మొత్తం నిధుల్లో 70 శాతం ఈక్విటీలకు కేటాయించగా, అందులో 83 శాతం లార్జ్‌క్యాప్స్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన 17 శాతం నిధుల్ని మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులుగా పెట్టింది. ఇన్విట్‌లకు 2 శాతం కేటాయించడం గమనార్హం. బ్యాంకులు, ఫైనాన్స్, ఆటో, సిమెంట్ రంగాల స్టాక్స్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. రాబడుల విషయానికొస్తే ఏడాది కాలంలో 29 శాతం, మూడేళ్లలో 13.2 శాతం, ఐదేళ్లలో 16.4 శాతం, పదేళ్లలో 12 శాతం చొప్పున వార్షికంగా ప్రతిఫలం ఇచ్చింది.



ఈక్విటీలో టాప్ పెట్టుబడులు

కంపెనీ	కేటాయింపులు (%)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	8.55
గ్రాసిమ్ ఇండస్ట్రీస్	5.56
ఇన్ఫోసిస్	4.37
ఐసీఐసీఐ బ్యాంకు	4.09
భారత్ ఫైనాన్షియల్	3.27
లార్సన్ అండ్ టుబ్రో	3.20
హెచ్‌డీఎఫ్‌సీ	2.61
ఆర్‌ఐఎల్	2.38
కోటక్ మహీంద్రాబ్యాంకు	2.26
ఇండియన్ ఆయిల్	2.18

బడ్జెట్లో ఇవి ఆశిద్దామా..!



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

మరో మూడు రోజుల్లో బడ్జెట్ రాబోతోంది. 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి ప్రవేశపెడుతున్నారు. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని... ఈ బడ్జెట్ మీద ఎందరో ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందరి ఆశలూ నెరవేరకున్నా దేశ ఆర్థిక పరిస్థితి, ప్రజల కనీస ఆశలు, అవసరాలు పరిగణనలోకి తీసుకుంటారనే అంచనాలున్నాయి. పన్నులకు సంబంధించి అంచనాలు ఇలా...

(1)**స్టాండర్డ్ డిడక్షన్:** ఒకప్పుడు కేవలం ఉద్యోగస్తులకిచ్చే మినహాయింపు/ తగ్గింపు స్టాండర్డ్ డిడక్షన్‌ని మళ్లీ పునరుద్ధరించాలి. ఎందుకంటే దీని వల్ల ఎంతో ప్రయోజనం, ఉపశమనం ఉండేవి. ఈ తగ్గింపు కేవలం ఉద్యోగులకే. ఇతర ఆదాయం ఉండే వారు... స్థూల ఆదాయం లోంచి సంబంధిత ఖర్చులన్నీ పోగా మిగిలిన ఆదాయంపైనే పన్ను కట్టాలి. ఆ విధంగా ఆమోదిస్తే ఉద్యోగస్తులు ఉద్యోగం నిమిత్తం రోజూ ఆఫీసు వెళ్లి రావడానికి కొంత ఖర్చులు తప్పవు.... బస్‌పాస్, మెట్రోపాస్, పెట్రోలు, క్యాబ్... వంటి ఖర్చులుంటాయి. దీనికి ఈ అలవెన్స్ ఇవ్వాలి.

(2)ఇక 80 ఇ కింద ఇచ్చే మినహాయింపు రూ.2,00,000 మాత్రమే. ఇందులో 20కి పైగా అంశాలున్నాయి. కానీ మొత్తం అన్నింటి మీద 2,00,000 దాటి ఇవ్వరు. ఇంటి రుణం మీద వడ్డీ భారం ఎక్కువే ఉంటోంది. స్కూలు పిల్లల చదువు ఖర్చులు బాగా పెరిగాయి. కాబట్టి వీటి కోసం అదనంగా మినహాయింపు ఇవ్వాలి.

(3) ఇల్లు కొనడం, కట్టడం మొదలైన విషయాల్లో ఎంతో ప్రోత్సాహం చూపుతున్న సర్కారు... రుణంపై వడ్డీ విషయంలో రెండు లక్షలంటూ ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షల వల్ల 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఎందరికో పన్ను భారం పెరిగింది. ఈ ఆంక్షలను సడలించి... దీనిని సరిదిద్దాలి.

(4) ఇక బేసిక్ లిమిట్ ప్రస్తుతం 3,00,000 అనుకోవచ్చు... ఈ లిమిట్‌ని సవరించాలి. ఒక కుటుంబంలో నలుగురు చొప్పున...ఒక్కొక్కరికి సంవత్సరానికి లక్షరూపాయల చొప్పున అంటే కనీసం 4,00,000 చేయాలి.



(5) శ్లాబులు సవరించిన తరువాత రేట్లను కూడా తగ్గించాలి... 5- 10 -15 -20 - 25 శాతం శ్లాబుల్లో.... వ్యక్తులకు 25 % దాటి పన్ను భారం ఉండకూడదు. కాళిదాసు చెప్పింది, కౌటిల్యుడు చెప్పింది, మనుస్మృతిలో చెప్పింది కేవలం 1/6వ భాగం మాత్రమే. ఆ లెక్కన చూసుకున్నా 17 శాతం మించకూడదు కదా!! పోనీ 1/4 ... అంటే 25%.

(6)10 లక్షలు దాటిన మామూలు వ్యక్తికి కోట్లు సంపాదిస్తున్న వ్యక్తికి ఒకే రేటా?.. ఇది సరికాదన్నదే జనం బాధ. భరించే స్థాయి ఉన్న సంపన్న వర్గాలకు ఎక్కువ పన్ను విధించినా... 10 లక్షలు దాటిన వారందరినీ అదే కోవలోకి తేవటం సరికాదు.

(7) చాలామంది వ్యాపారం భాగస్వామ్యంలో చేస్తుంటారు. ప్రస్తుతం వారికి ట్యాక్స్ రేటు 30%. ఇటువంటి చిన్న సంస్థలకు పెద్ద కంపెనీలకు ఒకే రేటు అమలులో ఉంది. చిన్న చిన్న భాగస్వామ్య సంస్థలకు తక్కువ రేటు విధించాలి.

(8) టెక్నాలజీ ద్వారా ఎంతో పురోగతి సాధిస్తున్నాం. కాబట్టి పాన్(PAN) విషయంలో టాన్ (TAN) విషయంలో అసెస్‌మెంట్ విషయంలో రిఫండ్ల విషయంలో మరింత సరళీకరణ అవసరం. సజావుగా ఉండి, త్వరగా అయ్యేలా చూడాల్సిన అవసరముంది. గతంలో ట్యాక్స్ అధికారులుSMILE.. FILE.. GO అని చెప్పారు. ఇది అక్షరాలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలి.

● యాప్‌కీ కహానీ...

ఇల్ టేక్ కేర్

ప్రైవేట్ రంగ అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీ 'ఐసీఐసీఐ లంబార్డ్ జీఐసీ' తాజాగా 'ఇల్ టేక్ కేర్' అనే మొబైల్ హెల్త్ యాప్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను 'గూగుల్ ప్లేస్టోర్' నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు



- ➢ దగ్గరిలో ఉన్న డాక్టర్లు, డయాగ్నస్టిక్స్, ఫార్మసీ వివరాలు పొందొచ్చు.
- ➢ రియల్ టైమ్‌లో డాక్టర్ల అపాయింట్‌మెంట్‌ను బుక్ చేసుకోవచ్చు. అవసరమైతే డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడే వెసులుబాటు ఉంది.
- ➢ దగ్గరిలోని డయాగ్నస్టిక్ సెంటర్లలో టెస్ట్‌లు చేయించుకోవచ్చు.
- ➢ స్టోర్‌లో మెడిసిన్స్‌ను డిస్కౌంట్‌లో కొనుగోలు చేయవచ్చు. హోమ్ డెలివరీ కూడా పొందొచ్చు.
- ➢ షెడ్యూల్ హెల్త్ చెకప్‌లు చేయించుకునే అవకాశముంది.
- ➢ ఐసీఐసీఐ లంబార్డ్ నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీకి రియల్ టైమ్ క్యాష్‌లెస్ అప్రూవల్ పొందొచ్చు.
- ➢ పాలసీ అర్హత, ప్రయోజనాలు, లావాదేవీలను ట్రాక్ చేయవచ్చు.
- ➢ మెడిసిన్ రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు. మెడికల్ రికార్డ్‌లను యాప్‌లో భద్రంగా ఉంటాయి. వీటిని ఎక్కడి నుంచైనా యాక్సెస్ చేయవచ్చు. సేవలపై సంబంధిత సంస్థలకు రేటింగ్ ఇవ్వొచ్చు.

నాలుగు నెలల గరిష్టానికి పసిడి

మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందంటున్న నిపుణులు

అంతర్జాతీయ న్యూయార్క్ మర్కెంటైల్ ఎక్స్ఛేంజ్– నైమెక్స్‌లో పసిడి తిరిగి నాలుగు నెలల గరిష్టస్థాయిని తాకింది. వారం మధ్యలో ఒక దశలో 1,365 డాలర్ల స్థాయికి చేరిన ఔన్స్ (31.1గ్రా) పసిడి ధర వారం చివరిలో లాభాల స్వీకరణతో 1,348 స్థాయి వద్ద ముగిసింది. వారంవారీగా 22 డాలర్లు బలపడింది. అమెరికాలో రాజకీయ, ఆర్థిక అనిశ్చితి, డాలర్ ఇండెక్స్ మూడేళ్ల కనిష్ట స్థాయికి పతనం (వారం మధ్యలో 88.30 స్థాయిని తాకి వారం చివరిలో 88.87 వద్ద ముగింపు) వంటి అంశాలు పసిడి బలానికి కారణమయ్యాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం కొంత కన్సాలిడేషన్ దశలో ఉన్న పసిడి 1,400 డాలర్ల స్థాయికి వెళ్లే అవకాశాలు ఉన్నాయన్నది నిపుణుల విశ్లేషణ. 1,310 పసిడికి తక్షణ మద్దతని వారి అభిప్రాయం. అయితే ఈ దశలో కొంత ఒడిదుడుకులు ఉంటాయన్నది వారి వాదన. ఈ వారం ఫెడరల్ రిజర్వ్ మొట్టమొదటి ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశం జరగనుంది. జనవరి ఉపాధి అవకాశాల కల్పన గణాంకాలు కూడా వెలువడనున్నాయి. నిజానికి ఆయా అంశాలు పసిడి ధర గతిని నిర్ణయించాల్సి ఉంది. అయితే అమెరికా పాలనాయంత్రాంగం కరెన్సీ మార్కెట్లలో ఒడిదుడుకులను సృష్టిస్తోందని, దీంతో డాలర్ ఇండెక్స్ ఒడిదుడుకులకు గురవుతుందనీ, ఇదే ధోరణి పసిడిలోనూ కనిపిస్తుందన్నది విశ్లేషణ.



దేశీయంగా...: ఇక దేశీయంగా చూస్తే, ఫ్యూచర్స్ మార్కెట్‌లో పసిడి వారంలో 10 గ్రాములకు రూ.592 పెరిగి రూ.30,361కి చేరింది. ప్రధాన ముంబై స్పాట్ మార్కెట్‌లో ధర 99.9 స్వచ్ఛత ధర రూ.420 పెరిగి రూ.30,595కు చేరింది.

స్టాక్స్ వ్యూ

ఎల్ అండ్ టీ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.1,413 టార్గెట్ ధర: రూ.1,540

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు క్వార్టర్లు బలహీనంగా ఉన్న ఆర్డర్ల వృద్ధి ఈ క్యూ3లో పుంజుకుంది. ఈ క్యూ3లో ఇప్పటికే రూ.37,300 కోట్ల ఆర్డర్లు సాధించింది.మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్డర్లు 5 శాతం వరకూ వృద్ధి చెంది రూ.1.5 లక్షల కోట్లకు చేరతాయని భావిస్తున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 15 శాతంగా ఉన్న దేశీయ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ విభాగం వృద్ధి ఈ క్యూ2లో 5 శాతానికే పరిమితమైంది. జీఎస్‌టీ సంబంధిత సమస్యలే దీనికి ప్రధాన కారణం. జీఎస్‌టీ సమస్యలు క్రమక్రమంగా తగ్గుతుండటంతో ఈ విభాగం వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 12%గా ఉండగలదని అంచనా. 2015–16 ఆర్థిక సంవత్సరం చివరి కల్లా 25 శాతంగా(నికర అమ్మకాల్లో) ఉన్న నెట్ వర్కింగ్ క్యాపిటల్(ఎన్‌డబ్ల్యూసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 20 శాతానికి తగ్గింది. జీఎస్‌టీ కింద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందడానికి సుదీర్ఘమైన జాప్యం జరుగుతుండడం, దేశీయ ఆర్డర్ల అమలులకు భారీగా వర్కింగ్ క్యాపిటల్ అవసరమవుతుండడం వంటి కారణాల వల్ల ఈ క్యూ3లో కూడా ఎన్‌డబ్ల్యూసీ 20 శాతం రేంజ్‌లోనే ఉండనున్నదని అంచనా వేస్తున్నాం. 2020–21 ఆర్థిక సంవత్సరం కల్లా ఎన్‌డబ్ల్యూసీని 18 శాతంగా (నికర అమ్మకాల్లో) సాధించాలని కంపెనీ 'లక్ష్య' వ్యూహాత్మక ప్రణాళిక నిర్దేశించింది. దీనికనుగుణంగానే కంపెనీ చర్యలు తీసుకుంటోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా షేర్ వారీ ఆర్జన(ఈపీఎస్)కు 22 రెట్ల ధరకు ప్రస్తుతం ఈ షేర్ ట్రేడవుతోంది. సమ్ ఆఫ్ ద పార్ట్స్(ఎస్ఓటీపీ) ప్రాతిపదికన టార్గెట్ ధరను రూ.1,540గా నిర్ణయించాం. ఏడాదిలోగా ఈ షేర్ ఈ ధరను చేరగలదని భావిస్తున్నాం. ప్రభుత్వ వ్యయంలో భారీగా కోత ఏర్పడడం, పశ్చిమాసియా ప్రాంతం(ఇక్కడే ఈ కంపెనీ భారీ ఆర్డర్లను సాధించింది)లో ముడి చమురు ధరలు బాగా పతనం కావడం ప్రతికూలాంశాలు.

జీ ఎంటర్‌టైన్మెంట్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.595 టార్గెట్ ధర: రూ.640

ఎందుకంటే: జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించాయి. ప్రకటనల ఆదాయం 26శాతం పెరగడంతో మొత్తం ఆదాయం రూ.1,838 కోట్లకు పెరిగింది. చందా ఆదాయం మాత్రం 16 శాతం క్షీణించి రూ.502 కోట్లకు తగ్గింది. స్పోర్ట్స్‌వ్యాపారం నుంచి ఈ కంపెనీ నిష్క్రమించడం, అంతర్జాతీయ చందా ఆదాయం బలహీనంగా ఉండడం దీనికి ప్రధాన కారణాలు. మొత్తం ఆదాయం పెరగడంతో ఇబిటా కూడా పుంజుకుంది. ఇబిటా రూ.594 కోట్లుగా ఉండగా, ఇబిటా మార్జిన్లు 1 శాతం వృద్ధితో 32.3 శాతానికి ఎగిశాయి. ప్రకటనల ఆదాయం వృద్ధి, మార్జిన్ల విషయంలో ఈ రంగంలో అగ్రస్థానం ఈ కంపెనీదే. కంటెంట్‌పై తగిన విధంగా వ్యయం చేయడం, ప్రాంతీయ చానెళ్లు పటిష్టంగా ఉండడం వంటి కారణాల వల్ల ఇతర బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీల కంటే మంచి వృద్ధి సాధిస్తోంది. ఈ క్యూ3లో రూ.322 కోట్ల నికర లాభం సాధించింది. పన్ను కేటాయింపులు అధికంగా ఉండటం నికర లాభంపై ప్రతికూల ప్రభావం చూపించింది. స్పోర్ట్స్‌యేతర ఎంటర్‌టైన్మెంట్ నెట్‌వర్క్ వ్యూయర్‌షిప్ మార్కెట్ షేర్ 2 శాతం వృద్ధితో 18.3 శాతానికి ఎగసింది. 'జడ్‌ఫైవ్' పేరుతో డిజిటల్ వెంచర్‌ను వచ్చే నెలలో ఈ కంపెనీ అందుబాటులోకి తేనున్నది. డిజిటల్ సెగ్మెంట్లో మార్జిన్లు 30 శాతానికి పైగానే ఉండగలవన్న అంచనాలున్నాయి. రెండేళ్లలో నికర ఆదాయం 15 శాతం చొప్పున చక్రగతి వృద్ధితో రూ.5,560 కోట్లకు, చందా ఆదాయం 6 శాతం చక్రగతి వృద్ధితో రూ.2,696 కోట్లకు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. 2019–20 ఆర్థిక సంవత్సరం అంచనా పీ/ఈకి 20 రెట్ల ధరను టార్గెట్ ధరగా నిర్ణయించాం. ట్రాయ్ కొత్త టారిఫ్ నిబంధనల కారణంగా డిస్ట్రిబ్యూషన్ భాగస్వాములతో కంటెంట్ డీల్స్ కుదరడంలో జాప్యం జరుగుతుండడం..ప్రతికూలాంశం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

సమ్మిళిత వృద్ధిలో అట్టడుగున భారత్




సమ్మిళిత వృద్ధిలో పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్‌ల కన్నా కూడా భారత్ అట్టడుగు స్థాయిలో ఉంది. వర్ధమాన దేశాలకు సంబంధించిన సమ్మిళిత వృద్ధి సూచీలో 62వ స్థానంలో నిల్చింది. చైనా 26, పాకిస్తాన్ 47వ స్థానాల్లో ఉండటం గమనార్హం. వర్ధమాన దేశాల జాబితాలో లిథువేనియా అగ్రస్థానంలో నిల్చింది. సంపన్న దేశాల జాబితాలో అత్యంత సమ్మిళిత ఆర్థిక వ్యవస్థగా నార్వే అగ్ర స్థానాన్ని నిలబెట్టుకుంది. వార్షిక సదస్సు నేపథ్యంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) ఈ సూచీ విశేషాలు విడుదల చేసింది.

అందుబాటులోకి 'అమెజాన్ గో' స్టోర్


అమెజాన్ ఎట్టకేలకు తన తొలి 'అమెజాన్ గో' స్టోర్‌ను కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కంపెనీ.. మెషీన్ లెర్నింగ్, సెన్సార్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీలతో అమెరికాలోని సీటెల్‌లో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఎలాంటి చెక్ పాయింట్స్ ఉండవు. అంటే కస్టమర్ స్టోర్ లోనికి వెళ్లి తనకు నచ్చిన వస్తువులు/సరుకులు తీసుకొని ఇంటికి వెళ్లిపోవచ్చు. కస్టమర్ అమెజాన్ అకౌంట్ నుంచి బిల్లు ఆటోమేటిక్‌గా డెబిట్ అయిపోతుంది.

గెయిల్, ఐవోసీ నుంచి ఓఎన్‌జీసీ ఔట్!



ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీ, గెయిల్‌లో తనకున్న వాటాలను విక్రయించడానికి ఓఎన్‌జీసీ సిద్ధమయింది. ఇందుకోసం కేంద్రం నుంచి అనుమతి పొందింది. వాటాల విక్రయం ద్వారా వచ్చిన నిధులను హెచ్‌పీసీఎల్ కొనుగోలు కోసం ఓఎన్‌జీసీ ఉపయోగించుకోనుంది. ఓఎన్‌జీసీకి ఐవోసీలో 13.77 శాతం వాటా, గెయిల్‌లో 4.86 శాతం వాటా ఉంది.

పోర్టుల రంగంలో భారీ పెట్టుబడులు



పోర్టులు, లాజిస్టిక్స్ రంగాల్లో మూడు బిలియన్ డాలర్ల (రూ.19,200 కోట్లు) మేర పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఓ వేదిక ఏర్పాటుకు చేయటానికి జాతీయ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల నిధితో (ఎన్ఐఐఎఫ్) ఈ రంగంలో పేరొందిన డీపీ వరల్డ్ సంస్థ చేతులు కలిపింది. ''పోర్టులు, టెర్మినళ్లు, రవాణా, లాజిస్టిక్స్‌లో పెట్టుబడులకు గాను ఎన్ఐఐఎఫ్, డీపీ వరల్డ్ కలసి పెట్టుబడుల వేదిక ఏర్పాటు చేస్తాయి. ఈ రంగంలో ప్రాజెక్టుల అభివృద్ధి, ఆస్తుల కొనుగోలు కోసం 3 బిలియన్ డాలర్ల నిధులను ఈ వేదిక ద్వారా ఇన్వెస్ట్ చేస్తాం'' అని డీపీ వరల్డ్ పేర్కొంది.


ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయ్

ఆర్థిక వృద్ధి గణాంకాలు ఎలా ఉన్నప్పటికీ దేశీయంగా ఆర్థిక అసమానతలు మాత్రం అంతకంతకూ పెరిగిపోతున్నాయి. గతేడాది జరిగిన మొత్తం సంపద సృష్టిలో 73 శాతం సొమ్మంతా ఒక్క శాతం సంపన్నుల దగ్గరే పోగుపడింది. అదే సమయంలో దేశ జనాభాలో దాదాపు సగభాగమైన 67 కోట్ల మంది పైగా పేదల సంపద కేవలం ఒకే ఒక్క శాతం పెరిగింది. అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

వృద్ధిలో మహిళలనూ కలపండి: ఐఎంఎఫ్

అధిక వృద్ధి సాధించేందుకు ఆర్థిక వ్యవస్థలో మహిళలను మరింత భాగస్వాముల్ని చేయడంపై భారత్ దృష్టి పెట్టాలని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టీన్ లగార్డ్ సూచించారు. ఆర్థిక సేవలు తదితర కీలక రంగాల్లో సంస్కరణలను కొనసాగించాలని పేర్కొన్నారు. పురుష ఉద్యోగులకు దీటుగా ఉద్యోగినుల సంఖ్య పెరిగిన పక్షంలో భారత ఎకానమీ 27 శాతం మేర వృద్ధి చెందేందుకు తోడ్పడగలదని ఐఎంఎఫ్ అధ్యయనంలో తేలినట్లు ఆమె వెల్లడించారు.

డీల్స్..



- ➢ మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ (ఎమ్ఆర్‌పీఎల్)ను నగదు, షేర్ల మార్పిడి రూపంలో కొనుగోలు చేసే అవకాశాలున్నట్లు హెచ్‌పీసీఎల్ సీఎండీ ముకేశ్ కుమార్ సురానా చెప్పారు. కాగా హెచ్‌పీసీఎల్‌ను ఓఎన్‌జీసీ రూ.36,915 కోట్లకు కొనుగోలు చేయనున్న విషయం తెలిసిందే.
- ➢ మీడియా సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్లో ప్రమోటర్ సంస్థ ఎస్సెల్ హోల్డింగ్స్ 1.44 శాతం వాటాలను విక్రయించింది. ఈ డీల్ విలువ రూ. 825 కోట్లు.
- ➢ గ్రామీణ గృహ నిర్మాణానికి సంబంధించి వడ్డీ సబ్సిడీ పథకం (ఆర్‌హెచ్ఐఎస్ఎస్) అమలు విషయంలో నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌తో (ఎన్‌హెచ్‌బీ) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తెలిపింది.
- ➢ అమెరికాకు చెందిన హర్టే హంక్స్‌లో ఐటీ సంస్థ విప్రో తన అనుబంధ కంపెనీ అయిన విప్రో ఎల్ఎల్‌సీ ద్వారా 9.9 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయనుంది.
- ➢ కిశోర్ బియానీకి చెందిన ఫ్యూచర్ సప్లై చెయిన్ సొల్యూషన్స్.. ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్ స్నాప్‌డీల్‌కు చెందిన లాజిస్టిక్స్ విభాగం వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ.35 కోట్లు.
- ➢ బంగాళాఖాతంలోని 'ఎన్ఈసీ (నార్త్ ఈస్ట్ కోస్ట్)– 25' చమురు క్షేత్రంలో నికో రిసోర్సెస్ సంస్థకున్న వాటాను రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటిష్ పెట్రోలియం పీఎల్‌సీలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పెట్టుబడులకు బెస్ట్.. భారత్



పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన మార్కెట్ల జాబితాలో భారత్ 5వ ర్యాంకు దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఒక స్థానం ఎగబాకింది. అంతర్జాతీయ సంస్థల సీఈవోలతో కన్సల్టెన్సీ దిగ్గజం 'పీడబ్ల్యూసీ' నిర్వహించిన ఒక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. దీని ప్రకారం... 2018లో అత్యంత ఆకర్షణీయ మార్కెట్‌గా జపాన్‌ను అధిగమించి భారత్ ఐదో స్థానానికి చేరింది. 2017లో భారత్ ఆరో స్థానంలో ఉంది. మరోవైపు, ఈ లిస్టులో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది.

ఆటో షోలో మారుతీ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ!



దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ 'మారుతీ సుజుకీ ఇండియా' తన కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ 'ఇ–సర్వైవర్'ను ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచనుంది. ఇది టూ సీట్స్ కలిగిన ఓపెన్ టాప్ ఎస్‌యూవీ. అలాగే కంపెనీ.. కాన్సెప్ట్ 'ఫ్యూచర్ ఎస్' (ఎస్‌యూవీ ప్రత్యేకతలు కలిగిన కాంపాక్ట్ కారు)ను, సరికొత్త మూడో జనరేషన్ స్విఫ్ట్ కారును, నెక్స్ట్ జనరేషన్ సుజుకీ హైబ్రిడ్ సిస్టమ్ (హెచ్ఈవీ) వర్కింగ్ మోడల్‌ను ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచనుంది.

2017-18 క్యూ3 ఆర్థిక ఫలితాలు

కంపెనీ	నికర లాభం (కోట్లలో)			మొత్తం ఆదాయం (కోట్లలో)		
	2017-18	2016-17	వృ/క్షీ(%)	2017-18	2016-17	వృ/క్షీ(%)
ఏషియన్ పెయింట్స్	567	489	16	4,317	4,315	--
హావెల్స్ ఇండియా	194	153	27	1,994	1,651	21
యాక్సిస్ బ్యాంక్	726	580	25	14,315	14,501	-1
ఇండియాబుల్స్ హౌసింగ్	1,168	752	55	--	--	--
ఆర్‌బీఎల్ బ్యాంక్	165	--	28	--	--	--
ఐడియా	-1,284	-384	--	6,510	8,668	-25
ఇండిగో	762	487	56	6,178	4,986	24
విజయ బ్యాంక్	80	230	-65	3,451	3,714	-7
డాక్టర్ రెడ్డీస్	334	470	-29	3,806	3706	3
మారుతీ సుజుకీ	1,799	1,742	3	19,528	19,793	-1
కెనరా బ్యాంక్	126	322	-61	--	--	--
బయోకాన్	92	171	-46	1,058	1,044	1



బొమ్మ-బొరుసు

విజయం వరించినప్పుడు గర్వాన్ని ప్రదర్శించొద్దు. అలా చేస్తే నీవు ఓటమి బాటలో ఉన్నట్లే.
అలాగే నీవు ఓటమి పాలైనప్పుడు దాని నుంచి గుణపాఠం నేర్చుకోవడం మరువద్దు.
– అజీమ్ ప్రేమ్‌జీ, విప్రో ఛైర్మన్



పన్నుల అనిశ్చితికి తెరదించండి

అమెరికా – భారత వాణిజ్య మండలి డిమాండ్

వాషింగ్టన్: బహుళజాతి కంపెనీలు, సంస్థాగత ఇన్వెస్టర్లకు సంబంధించి పన్నుల పరంగా ఉన్న అనిశ్చితికి తెరదించాలని అమెరికా కార్పొరేట్ రంగం కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీకి సూచించింది. మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించేందుకు ఇది ఎంతో సానుకూల చర్య అవుతుందని అమెరికా–భారత్ వాణిజ్య కౌన్సిల్ (యూఎస్ఐబీసీ) ప్రెసిడెంట్ నిషా దేశాయ్ బిశ్వాల్ పేర్కొన్నారు. పన్నుల పరంగా వ్యయాలపై స్పష్టత లేకపోతే ఇన్వెస్టర్లు సంప్రదాయ విధానాన్ని అనుసరిస్తారు. కనుక పన్నుల పరంగా అనిశ్చితి వల్ల రిస్క్ పెరుగుతుంది. దీని వల్ల ఇన్వెస్టర్లు పెట్టుబడులను నిలిపివేయాల్సి రావడం లేదా అధిక రాబడులను తెచ్చుకోవాల్సి రావడం అవసరం అవుతుంది. దీంతో అనిశ్చిత మార్కెట్‌లో పెట్టుబడులపై వ్యయాలు అధికమవుతాయి'' అని బిశ్వాల్ తెలిపారు. భారత్‌ను ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మలిచేందుకు ప్రధానమంత్రి మోదీ చేస్తున్న కృషిని ఆమె స్వాగతించారు. అంతర్జాతీయ ఇన్వెస్టర్లను విజయవంతంగా ఆకర్షించాలంటే మరింత స్థిరమైన, ఊహించతగిన రెట్రోస్పెక్టివ్ పన్ను ఉండాలన్నారు. ఈ అంశాలను పరిష్కరించకుంటే, పన్ను పరంగా ప్రభుత్వ విధానంలో స్పష్టత లేకుంటే ఆర్థిక వ్యవస్థలో ఇతర విభాగాల ప్రగతికి అడ్డుపడుతుందని అభిప్రాయపడ్డారు.

భూషణ్ స్టీల్‌కు జేఎస్‌డబ్ల్యూ రూ. 30వేల కోట్ల ఆఫర్!



న్యూఢిల్లీ: తీవ్ర రుణ భారంతో ఎన్‌సీఎల్‌టీకి చేరిన భూషణ్ స్టీల్ ఆస్తుల కొనుగోలుకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తన బిడ్‌ను రెట్టింపు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 3 వరకు బిడ్లు వేసేందుకు గడువు ఉంది. రూ.15,000 కోట్లను లిక్విడేషన్ వ్యాల్యూగా నిర్ణయించారు. ''అంతకంటే తక్కువ విలువకు బిడ్ ఆమోదించరు. తీవ్ర పోటీ దృష్ట్యా జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తన బిడ్‌ను రెట్టింపు చేసే అవకాశం ఉంది. ఇది రూ.25,000–30,000 కోట్ల వరకు ఉండొచ్చు'' అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. లిక్విడేషన్ వ్యాల్యూ అంటే కంపెనీ ఆస్తుల కనీస విక్రయ ధర. భూషణ్ స్టీల్‌కు రుణం ఇచ్చిన బ్యాంకుల కమిటీ ఈ మేరకు విలువ కట్టింది. భూషణ్ స్టీల్ ఆస్తుల కొనుగోలుకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జపాన్‌కు చెందిన జేఎఫ్ఈ స్టీల్ కార్ప్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ భాగస్వామ్యంతో బిడ్ వేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

కేజీ డీ-6 ఉత్పత్తిలో క్షీణత

డిసెంబర్ క్వార్టర్లో 4.9 ఎంఎంఎస్‌సీఎండి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లోని డి-6 గ్యాస్ క్షేత్రాల్లో ఉత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కనిష్ట స్థాయికి చేరింది. ధీరూభాయి–1, 3 (ఏడు బావులు)తోపాటు ఎంఏ క్షేత్రాల్లో (మూడు బావులు) రోజువారీ ఉత్పత్తి 4.9 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లకు (ఎంఎంఎస్‌సీఎండీ) పడిపోయినట్టు ఆర్ఐఎల్ ఇన్వెస్టర్లకు తెలియజేసింది. ఈ క్షేత్రాల్లో సహజ గ్యాస్ తగ్గిపోవడంతోపాటు బావుల్లోకి నీరు, ఇసుక చేరడమే కారణాలని కంపెనీ వివరించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రోజువారీ ఉత్పత్తి 5.4 ఎంఎంఎస్‌సీఎండీలుగా ఉండగా, అంతకుముందు త్రైమాసికంలో 6.4 ఎంఎంఎస్‌సీఎండీలు, 2016–17 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో 7.5 ఎంఎంఎస్‌సీఎండీలు కావడం గమనార్హం. సహజ వాయువు, చమురు ఉత్పత్తి కేజీ బేసిన్‌లో ఎప్పటికప్పుడు తగ్గిపోతోందని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

బడ్జెట్ చుట్టూనే ఇన్వెస్టర్ల చూపులన్నీ..



ఆర్థిక మంత్రి నిర్ణయాలపై ఆసక్తి

ఆర్థిక సర్వే, తయారీ గణాంకాలూ కీలకమే

ప్రభావం చూపనున్న దిగ్గజ కంపెనీల క్యూ3 ఫలితాలు

న్యూఢిల్లీ: ఇన్వెస్టర్ల కళ్లన్నీ ఇప్పుడు బడ్జెట్ కోసం వేచి చూస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ గురువారం(ఫిబ్రవరి 1)న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఈ వారం మార్కెట్‌పై ప్రభావం చూపుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు ఇదే పూర్తి స్థాయి బడ్జెట్. బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు, ఈ వారం వెలువడే బ్లూచిప్ కంపెనీల క్యూ3 ఫలితాలు, తయారీ రంగ గణాంకాలు స్టాక్ సూచీల గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల కదలికలు, డాలర్‌తో రూపాయి మారకం, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, ప్రపంచ మార్కెట్ల పోకడ తదితర అంశాలు కూడా ఈ వారం మార్కెట్‌పై తగిన ప్రభావం చూపనున్నాయి. బడ్జెట్ రోజే తయారీ రంగానికి సంబంధించి పీఎమ్ఐ గణాంకాలు వెల్లడి కానుండటం కీలకం. ''ప్రస్తుతం స్టాక్ విలువలు అధిక స్థాయిల్లో ఉండటంతోపాటు, త్వరలో జరిగే పరిణామాలు దూకుడుతో కూడిన కొనుగోళ్లకు బ్రేక్ వేయొచ్చు. కీలకమైన బడ్జెట్, ఆర్థిక గణాంకాల నేపథ్యంలో ఆటుపోట్లు ఎక్కువగా ఉండొచ్చు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్‌నాయర్ అన్నారు. ''జీఎస్టీ తర్వాత ఇది మొదటి బడ్జెట్. అలాగే, ప్రస్తుత ప్రభుత్వానికి చివరి పూర్తి సంవత్సరపు బడ్జెట్ కావడంతో అంచనాలు అధికంగా ఉన్నాయి. ద్రవ్య క్రమశిక్షణతోపాటు మౌలిక, గ్రామీణ ప్రాంతాలపై ప్రభుత్వ వ్యయాలు కొనసాగుతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ప్రైవేటు క్లయింట్ గ్రూపు హెడ్ వీకే శర్మ తెలిపారు.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు..

నేటి(సోమవారం) నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇదే రోజే ప్రభుత్వం ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పిస్తుంది. ఫిబ్రవరి 1(గురువారం) మార్కిట్ ఎకనామిక్స్ సంస్థ జనవరి నెలకు సంబంధించిన భారత సేవల రంగం పనితీరును ప్రతిబింబించే పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) గణాంకాలను వెల్లడిస్తుంది. గత ఏడాది నవంబర్లో 52.6గా ఉన్న పీఎమ్ఐ సూచీ గత నెలలో 54.7కు పెరిగాయి. ఇక అంతర్జాతీయ అంశాల పరంగా చూస్తే, చైనా, యూరోజోన్, అమెరికా జనవరి నెల తయారీ రంగ పీఎమ్ఐ గణాంకాలు ఈ గురువారం (ఫిబ్రవరి 1న) వస్తాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రెండు రోజుల సమావేశాలు ఈ నెల 30న ఆరంభమవుతాయి.

నేడు హెచ్‌డీఎఫ్‌సీ ఫలితాలు: ఇక కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాల విషయానికొస్తే, నేడు(సోమవారం) హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ, టెక్ మహీంద్రాలు క్యూ3 ఫలితాలను వెల్లడిస్తాయి. మంగళవారం(ఈ నెల 30) ఐటీసీ, ఈ నెల 31న(బుధవారం) ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్ టీ, ఎన్‌టీపీసీ, వేదాంత కంపెనీలు, శుక్రవారం (ఫిబ్రవరి 2న) బజాజ్ ఆటో, హిందాల్కో కంపెనీల క్యూ3 ఫలితాలు వస్తాయి.

నేటి నుంచి గెలాక్సీ ఐపీఓ

గెలాక్సీ సర్ఫాక్టంట్స్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) నేటి నుంచి ప్రారంభమవుతోంది. రూ. 1,470–1,480 ప్రైస్‌బాండ్‌తో వస్తున్న ఈ ఐపీఓ ద్వారా రూ. 937 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. కనీసం 10 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 31న ముగిసే ఈ ఐపీఓలో భాగంగా మొత్తం 63.31 లక్షల షేర్లను జారీ చేయనున్నారు. వచ్చే నెల 8న ఈ షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి.

రెండు లిస్టింగ్‌లు..

ఈ వారంలో రెండు కొత్త కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి. నేడు(సోమవారం) న్యూజెన్ సాఫ్ట్‌వేర్ షేర్లు లిస్టవుతాయి. ఈ నెల 16–18 మధ్య రూ.240–245 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ 8 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. ఇక అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఈ నెల 30న(మంగళవారం) స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నది. ఈ నెల 17–19 మధ్య రూ.855–859 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ 165 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది.

ఈ వారం ఈవెంట్స్

జనవరి 29	పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఆరంభం, ఆర్థిక సర్వే, హెచ్‌డీఎఫ్‌సీ, టెక్ మహీంద్రా క్యూ3 ఫలితాలు
జనవరి 30	ఐటీసీ ఫలితాలు
జనవరి 31	ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ, వేదాంత ఫలితాలు
ఫిబ్రవరి 1	బడ్జెట్, తయారీ రంగ పీఎమ్ఐ గణాంకాలు
ఫిబ్రవరి 2	బజాజ్ ఆటో, హిందాల్కో క్యూ3 ఫలితాలు

కొత్త ఏడాదిలోనూ ఎఫ్‌పీఐల జోరు

- ఇప్పటికే రూ.19,000 కోట్ల పెట్టుబడులు
- కార్పొరేట్ ఎర్నింగ్స్‌పై అంచనాలతోనే

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన దేశ క్యాపిటల్ మార్కెట్ల పట్ల తమ మక్కువను ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటికే మూడు బిలియన్ డాలర్ల మేర (సుమారు రూ.19,200 కోట్లు) పెట్టుబడులు పెట్టారు. కార్పొరేట్ కంపెనీల ఎర్నింగ్స్ మెరుగుపడతాయన్న అంచనాలు, ఆకర్షణీయ రాబడులే వారిని పెట్టుబడులకు ప్రోత్సహిస్తున్నట్టు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన క్యాపిటల్ మార్కెట్ల (డెట్, ఈక్విటీ) నుంచి నికరంగా రూ.3,500 కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత ఈ నెలలో ఇప్పటి వరకు నికర కొనుగోలుదారులుగా ఉండటం గమనార్హం. ''ప్రస్తుత నెలలో విదేశీ పెట్టుబడుల ప్రవాహానికి.. ఎర్నింగ్స్ రికవరీపై ఉన్న అంచనాలు, ఆకర్షణీయ రాబడులే కారణం. ఈ అంశాలే విదేశీ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల రాకను మరింత బలోపేతం చేస్తాయి''అని 5నాన్స్ సీఈవో దినేష్ రోహిరా తెలిపారు. డిపాజిటరీల డేటా ప్రకారం ఈ నెల 1 నుంచి 25 వరకు... విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నికరంగా ఈక్విటీల్లో రూ.11,759 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయగా, డెట్‌లో రూ.6,127 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. దీంతో నికరంగా 17,866 కోట్ల మేర వారు దేశీయ క్యాపిటల్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసినట్లయింది. 2017లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు మన దేశ ఈక్విటీ, డెట్ మార్కెట్లో నికరంగా రూ.2 లక్షల కోట్ల మేర ఇన్వెస్ట్ చేయడం తెలిసిందే. అయితే, ఇదే పరిస్థితి 2018లోనూ పునరావృతం కాకపోవచ్చని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ మేనేజర్ పంకజ్ పాఠక్ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో రేట్లు పెరగడం, ఉపసంహరణలే దీనికి కారణాలుగా పేర్కొన్నారు.

గత వారం హీరోలు

స్టాక్స్	25 ముగింపు	18 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	505	437	16
ఐబి హౌసింగ్	1,394	1,243	12
టెక్ మహీంద్రా	599	553	8
ఏబీబీ ఇండియా	1,659	1,541	8
ఓఎన్‌జీసీ	208	194	7
టీసీఎస్	3,118	2,910	7
యస్ బ్యాంక్	363	340	7
బీహెచ్ఈఎల్	103	97	6
వేదాంత	345	326	6
పీఎన్‌బీ	181	171	6

ఎందుకు పెరిగాయంటే..

క్యూ3లో నికరలాభం అంతక్రితం మూడునెలలతో పోలిస్తే భారీగా 30 శాతం పెరగడంతో వక్రంగీ షేరు దూసుకుపోయింది. ఇదే బాటలో ఇండియాబుల్స్ హౌసింగ్ నికరలాభం 50 శాతం మేర పెరగడంతో ఈ షేరులో కొనుగోళ్లు జరిగాయి. టీసీఎస్, యస్ బ్యాంక్ షేర్లపై సైతం ఫలితాల సానుకూల ప్రభావం పడింది. చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఓఎన్‌జీసీ ర్యాలీ జరిపింది. కమోడిటీల ర్యాలీ ఫలితంగా వేదాంత ఎగిసింది. ఇంజనీరింగ్ షేర్లలో జరిగిన కొనుగోళ్ల కారణంగా ఏబీబీ ఇండియా, బీహెచ్ఈఎల్‌లు పెరిగాయి.

గత వారం జీరోలు

స్టాక్స్	25 ముగింపు	18 ముగింపు	మార్పు(%)
క్రాంప్టన్ గ్రీవ్స్	237	266	-11
భారతీ ఎయిర్‌టెల్	453	494	-8
హెచ్‌పీసీఎల్	384	411	-7
టాటా మోటార్స్–డీవీఆర్	228	243	-6
ఏసీసీ	1,727	1,838	-6
ఐడియా సెల్యులర్	95	101	-6
ఐషర్ మోటార్స్	26,525	27,926	-5
అంబుజా సిమెంట్	263	276	-5
టాటా మోటార్స్	400	419	-4
విప్రో	312	326	-4

ఎందుకు తగ్గాయంటే...

క్యూ3 ఫలితాలు నిరుత్సాహపర్చడంతో క్రాంప్టన్ గ్రీవ్స్ షేరు క్షీణించింది. జియో ప్రకటించిన కొత్త ఆఫర్లో భాగంగా భారీ అదనపు డేటాను అందిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్, ఐడియాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చమురు ధరలు పెరుగుతున్నందున, హెచ్‌పీసీఎల్ కౌంటర్లో అమ్మకాలు జరగడంతో ఈ షేరు క్షీణించింది. జాగ్వర్, లాండ్‌రోవర్ ఉత్పత్తిని యూకే ప్లాంటులో తగ్గించుకుందన్న వార్తలతో టాటా మోటార్స్ షేరు తగ్గింది. నికర లాభం తగ్గిన ప్రభావం విప్రో షేర్‌పై పడింది.

భారత్‌లో జీవన వ్యయం ఎంతో చౌక!

- ప్రపంచంలో దక్షిణాఫ్రికాకు మొదటి స్థానం
- రెండో స్థానంలో భారత్
- గోబ్యాంకింగ్‌రేట్స్ సర్వే



హూస్టన్: ఈ ప్రపంచంలో చాలా చౌకగా జీవించేందుకు అనువైన దేశాల్లో భారత్ రెండో స్థానం దక్కించుకుంది. దక్షిణాఫ్రికా మొదటి స్థానంలో ఉంది. గోబ్యాంకింగ్‌రేట్స్ అనే సంస్థ ఇటీవలి కాలంలో 112 దేశాల్లో ఈ సర్వే నిర్వహించింది. స్థానికంగా కొనుగోలు శక్తిని ప్రతిబింబించే సూచీ, ఇంటి అద్దె సూచీ, గ్రోసరీల సూచీ, వినియోగ ధరల సూచీ అనే ఈ నాలుగు కొలమానాల ఆధారంగా ప్రపంచ దేశాలకు గోబ్యాంకింగ్ ర్యాంకులను కేటాయించింది.


- ఇంటి అద్దె నేపాల్ తర్వాత చాలా తక్కువగా ఉన్నది భారత్‌లోనే.
- వినియోగ ఉత్పత్తులు, గ్రోసరీలు కొన్ని మన దగ్గరే చాలా తక్కువ ధరలకు లభ్యమవుతున్నాయి. కోల్‌కతా నగరంలో ఓ వ్యక్తి నెలసరి వ్యయం 285 డాలర్లు.
- 50 చౌక దేశాల్లో అధిక జనాభా ఉన్నది కూడా మనదగ్గరే (125 కోట్లు). టెక్స్‌టైల్స్, కెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇక్కడి ప్రధాన పరిశ్రమలు.
- భారత్‌లో స్థానిక కొనుగోలు శక్తి 20.9 శాతం తక్కువ. అద్దె 95.2 శాతం చౌక. గ్రోసరీలు 74.4 శాతం చౌక. స్థానిక సరుకులు, సేవలు కూడా 74.9 శాతం తక్కువే. స్థానిక కొనుగోలుశక్తిని, ఇంటి అద్దెలను, ఆహారోత్పత్తుల ధరలను న్యూయార్క్ సిటీతో పోల్చారు.
- కొలంబియా (13), పాకిస్థాన్ (14), నేపాల్ (28), బంగ్లాదేశ్ (40) కంటే కూడా భారత్ నివాసానికి ఎంతో చౌక.
- జీవించడానికి, విశ్రాంత జీవనానికి దక్షిణాఫ్రికా ప్రపంచంలోనే అత్యంత చౌకైన దేశంగా ఈ సర్వే పేర్కొంది. ఖరీదైన ప్లాటినం, బంగారం, క్రోమియం లోహాలను భారీగా ఉత్పత్తి చేస్తుండడంతో ఈ దేశ ప్రజల కొనుగోలు శక్తి న్యూయార్క్ వాసుల కంటే ఎక్కువే ఉంది.
- ఇక జీవించేందుకు అత్యంత ఖరీదైన దేశంగా బెర్ముడా ముందుంది. దీని స్థానం 112 దేశాల్లో చిట్టచివరిది. బహమాస్ 111, హాంగ్‌కాంగ్ 110, స్విట్జర్లాండ్ 109, ఘనా 108 చొప్పున చివరి స్థానాల్లో ఉన్నాయి.

సెన్సెక్స్ తొలి నిరోధం 36,400

మార్కెట్ పంచాంగం


అమెరికా సూచీల నేతృత్వంలో కొత్త ఏడాదిలో ప్రపంచ ఈక్విటీల ర్యాలీ జనవరి మూడోవారంలో వేగవంతమయ్యింది. ఎంఎస్‌సీఐ వరల్డ్ ఈక్విటీ ఇండెక్స్ వరుసగా పదోవారం అప్రతిహత ర్యాలీ జరిపింది. 1999 తర్వాత ఇంతదీర్ఘకాలంపాటు ప్రపంచ ఈక్విటీలు పెరగడం ఇదే ప్రథమం. 1999లో డాట్‌కామ్ విప్లవం ఫలితంగా ఆ ఏడాది ద్వితీయార్థ ప్రారంభం నుంచి 2000 ఫిబ్రవరి రెండోవారం వరకూ జరిగిన ర్యాలీ ఫిబ్రవరి మూడోవారంలో అంతమయిపోయింది. ఈ నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిలించ్ అనలిస్టులు ఒక ఆసక్తికరమైన నివేదిక విడుదల చేశారు. 98 శాతం ప్రపంచ మార్కెట్లు... 50 రోజులు, 200 రోజుల చలన సగటు రేఖకు ఎగువన ట్రేడవుతున్నాయని, ఈ కారణంగా కరెక్షన్ వచ్చే అవకాశాలు పెరిగాయన్నది ఈ నివేదిక సారాంశం. ఇదే సమయంలో ఇక్కడ కేంద్ర బడ్జెట్ వెలువడనుంది. బడ్జెట్లో ప్రతికూల ప్రతిపాదనలేవీ లేకపోతే...భారత్ మార్కెట్ ప్రపంచ ట్రెండ్‌ను అనుసరిస్తుందని అత్యధిక విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇక మన సూచీల సాంకేతికాలకొస్తే...

సెన్సెక్స్ సాంకేతికాలు..



జనవరి 25తో ముగిసిన నాలుగు రోజుల ట్రేడింగ్ వారంలో గత మార్కెట్ పంచాంగంలోసూచించిన రీతిలో 35,500 పాయింట్లపైన స్థిరపడినంతనే బీఎస్ఈ సెన్సెక్స్ వేగవంతమైన ర్యాలీ జరిపి 36,268 పాయింట్ల రికార్డు గరిష్టస్థాయిని తాకింది.చివరకు అంతక్రితం వారంకంటే 538 పాయింట్ల లాభంతో 36,050 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ పెద్ద ర్యాలీ జరిపిన నేపథ్యంలో ఈ సోమవారం మార్కెట్ గ్యాప్‌అప్‌తో మొదలైతే సెన్సెక్స్ 36,400 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన ముగిస్తే వేగంగా 36,650 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంటుంది. ఈ స్థాయిని ఛేదిస్తే 36,980 పాయింట్ల వద్దకు ర్యాలీ జరపవచ్చు. తొలి నిరోధాన్ని ఛేదించలేకపోతే 35,820 పాయింట్ల వద్ద సెన్సెక్స్‌కు తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును ముగింపులో కోల్పోతే 35,540 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 35,160 పాయింట్ల వద్ద కీలక మద్దతు లభిస్తున్నది.


నిఫ్టీ తొలి అవరోధం 11,160 పాయింట్లు...



గతవారం మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన రీతిలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,890 పాయింట్ల సమీపంలో మద్దతు పొంది, 11,110 పాయింట్ల వరకూ పెరిగింది. చివరకు అంతక్రితం వారం కంటే 175 పాయింట్ల లాభంతో 11,070 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం గ్యాప్ అప్‌తో మార్కెట్ మొదలైతే నిఫ్టీ 11,160 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. తదుపరి ర్యాలీ జరగాలంటే ఈ నిరోధస్థాయి నిఫ్టీకి కీలకం. అటుపైన 11,220 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తే నిఫ్టీ క్రమేపీ 11,300–11,350 శ్రేణిని చేరవచ్చు. ఈ వారం తొలి నిరోధస్థాయిని దాటలేకపోతే 11,010 పాయింట్ల వద్ద నిఫ్టీకి తొలి మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే 10,880 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 10,780 పాయింట్ల వద్దకు పడిపోవచ్చు.

– పి. సత్యప్రసాద్

అత్యవసర నిధి సొమ్ములకు లిక్విడ్ ఫండ్స్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అనుకోకుండా ఒక లావాదేవీ ద్వారా రూ. 30 లక్షలు వచ్చాయి. ఈ డబ్బులు ప్రస్తుతం నాకు అవసరం లేదు. వీటిని ఎలా ఇన్వెస్ట్ చేయాలో సలహా ఇవ్వండి. ?

– వీరేష్, నెల్లూరు

ఈ సొమ్ములను మీరు ఎలా ఉపయోగిస్తారో అనే దానిని బట్టి ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు ఉంటాయి. మార్కెట్ బాగా ఉంది కదా అని గుడ్డిగా మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం సరైన పనికాదు. జీవితంలో ఇలాంటి అనూహ్య లాభాలు ఒక్కసారి వస్తాయి. అందుకని ఈ సొమ్ములను ఇన్వెస్ట్ చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించండి. అనూహ్య లాభాలు కాబట్టి.. ఎలా బడితే అలా ఇన్వెస్ట్ చేయకండి. సిస్టమేటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్(ఎస్‌టీపీ)ని మూడేళ్ల పాటు పాటించండి. మీరు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను నిర్వహించే సంస్థకు చెందిన ఒకటి లేదు రెండు డెట్ ఫండ్స్‌ను ఎంచుకోండి. ఈ రూ.30 లక్షల మొత్తాన్ని ఈ డెట్ ఫండ్స్‌లో ఒకేసారి ఇన్వెస్ట్ చేయండి. నెలకు కొంత మొత్తం చొప్పున ఈ ఫండ్స్ నుంచి ఎస్‌టీపీ మార్గంలో మీరు దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్న ఈక్విటీ ఫండ్స్‌లోకి ఈ పెట్టుబడులను బదిలీ చేయండి. ఈ ఈక్విటీ ఫండ్స్‌లో ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కనీసం ఐదేళ్లపాటైనా కొనసాగిస్తే, మీకు మంచి రాబడులు వస్తాయి.

నేను నా పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం నెలకు రూ.3,000 నుంచి రూ.5,000 వరకూ పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాను. తగిన సూచనలు ఇవ్వండి ?

– మనోజ్, కరీంనగర్

పిల్లల ఉన్నత చదువులకు వివిధ దశల్లో పెద్ద మొత్తాలు అవసరమవుతాయి. పాఠశాల విద్య ముగిసిన తర్వాత వాళ్లు కాలేజీలో చేరేటప్పుడు, కాలేజీ విద్య ముగిసి, డిగ్రీలో చేరేటప్పుడు, ఆ తర్వాత పీజీ చేసేటప్పుడు మీకు డబ్బులు అవసరమవుతాయి. మొదటి దశ డబ్బులు మరో ఐదేళ్లలో అవసరమనుకుంటే, ముందుగా ఒక బ్యాలన్స్‌డ్ ఫండ్‌లో ఇప్పటి నుంచే ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించండి. రెండో దశ డబ్బులు మరో పదేళ్లలో అవసరమనుకుంటే ఇప్పటి నుంచే కొంత మొత్తాన్ని మల్టీ క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. మూడో దశకు అవసరమైన డబ్బులు మరో పదిహేనేళ్లలో అవసరమనుకుంటే ఇప్పటి నుంచే కొంత మొత్తాన్ని ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. ఈ ఫండ్స్‌లో ప్రతి నెలా కొంత, కొంత మొత్తాన్ని సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే మీకు మంచి రాబడులు వస్తాయి. ఆయా దశ డబ్బులు అవసరమయ్యే ఏడాదికి ముందే ఆయా ఫండ్స్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను ఉపసంహరించుకోవాలి. ఉదాహరణకు మొదటి దశ డబ్బులు మీకు ఐదేళ్లలో అవసరమనుకుంటే, నాలుగో ఏట నుంచి ఆ ఫండ్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోండి. ఐదే ఏటనే తీసుకోవాలనుకుంటే మార్కెట్ పతన బాటలో ఉంటే మీకు తగిన రాబడులు రావు. అందుకని ఒక ఏడాది ముందే ఇన్వెస్ట్‌మెంట్స్ ఉపసంహరించుకుంటే మంచిది.

నేను ఒక సెక్టోరియల్ ఫండ్‌లో రెండు నుంచి మూడేళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. తగిన ఫండ్‌ను సూచించండి?

– కల్పన, హైదరాబాద్

మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారంటే దానర్థం డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందాలని. అయితే సెక్టోరియల్ ఫండ్స్ దీనికి పూర్తిగా విరుద్ధం. ఈ ఫండ్స్ కేవలం ఒక్క రంగం కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. సెక్టోరియల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలంటే బలమైన కారణాలుండాలి. మీ పోర్ట్‌ఫోలియోలో లేని రంగం కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడానికి సెక్టోరియల్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చు. లేకుంటే. సదరు రంగంపై మీకు అపారమైన అవగాహన, పరిజ్ఞానం ఉండి, భవిష్యత్తులో ఈ రంగం అంతులేని వృద్ధిని సాధిస్తుందనే అంచనాలు మీకు ఉంటేనే సెక్టోరియల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. ఇవేవీ లేనప్పుడు సెక్టోరియల్ ఫండ్స్ జోలికి వెళ్లకపోవడమే మంచిది.

నేను కోటక్ గోల్డ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. స్టాక్ మార్కెట్ బాగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో పుత్తడిపై పెట్టుబడి పెట్టడం సమంజసమేనా ?

– సారథి, విజయవాడ

భారత్‌లో పుత్తడికి బాగా ప్రాధాన్యం ఉంది. కానీ దీర్ఘకాలంగా ఇది మంచి రాబడులనిస్తుందనే నమ్మకం చాలా మంది మార్కెట్ నిపుణుల్లో ఉండదు. కొన్ని యాదృచ్ఛిక కారణాల వల్ల మాత్రమే గత కొంత కాలంగా ఇది ఆకర్షణీయమైన పెట్టుబడిగా నిలుస్తోంది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, పుత్తడి ఈటీఎఫ్‌లు అందుబాటులోకి రావడం వల్ల బంగారానికి డిమాండ్ పెరిగింది. కాదూ, కూడదు పుత్తడిలో కొంతైనా పెట్టుబడి పెట్టాల్సిందేనన్న పట్టుదల మీకు ఉంటే సావరిన్ గోల్డ్ బాండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. పుత్తడి రాబడులతో పాటు కొంత వడ్డీ కూడా మీరు పొందవచ్చు. వివిధ ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఈక్విటీ, డెట్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. పుత్తడిని కాదు.

అత్యవసర నిధి పెట్టుబడులను లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా ?

– వెంకట్, విశాఖ పట్టణం

ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు తీసుకోగలిగే వీలుండేలా అత్యవసర నిధి పెట్టుబడులు ఉండాలి. ఈ తరహా అత్యవసర నిధి పెట్టుబడులపై వీలైనంత ఎక్కువగా రాబడి పొందాలనే ఆలోచన సరైనదే. సాధారణంగా అత్యవసర నిధులను చాలా మంది సేవింగ్స్ ఖాతాలో ఉంచేస్తారు. దీనిపై వచ్చే వడ్డీ చాలా తక్కువగా ఉంటుంది. లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే అంతకంటే అధికంగానే రాబడులు పొందవచ్చు. అదృష్టవశాత్తూ మూడేళ్ల పాటు ఈ అత్యవసర నిధి సొమ్ములను వాడే అవసరం మీకు రాకుంటే, మూడేళ్ల పాటు ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను లిక్విడ్ ఫండ్స్‌లో కొనసాగిస్తే, మీకు పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ ద్వారా రూ.50,000 దాకా లిక్విడ్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి, రిడీమ్ చేసుకునే వెసులుబాటు కూడా అందుబాటులోకి వచ్చింది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్‌మ్యూచువల్ ఫండ్ వంటి కొన్ని సంస్థలు ఈ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. మీరు అరగంట నుంచి గంట వ్యవధిలోనే లిక్విడ్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను రిడీమ్ చేసుకోవచ్చు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 29-1-2018

'గ్రాండ్' 20




టెన్నిస్‌లో ఎవరైనా ఒక గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిస్తేనే కల సాకారమైందంటారు. మరి ఒక్కడే 20 గెలిస్తే జీవితమే సాఫల్యమైందనాలేమో! ఎందుకంటే 200 గ్రాండ్‌స్లామ్‌లు జరిగిన టెన్నిస్ చరిత్రలో ఒక్కడే పది శాతం ట్రోఫీలు ఎగరేసుకుపోతే అది గ్రేట్ కాదు... ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ గ్రేట్ రికార్డు అవుతుంది. మెల్‌బోర్న్‌లో స్విట్జర్లాండ్ సూపర్ స్టార్ రోజర్ ఫెడరర్ అదే చేశాడు. బరిలో మేటి... పోటీలో ఘనాపాఠి. పోరాడితే ఎవ్వరికీ మింగుడు పడని ప్రత్యర్థి. నిలిస్తే గెలుస్తాడు. గెలిస్తే చరిత్ర సృష్టిస్తాడు. ఔను... ఈ చరిత్ర పుటలకెక్కుతుంది. కాబట్టి మిన్నకుండిపోయింది... లేదంటే ఆ చరిత్రకే కళ్లుంటే మురిపెంగా ఈ విశ్వవిజేతను తన్మయత్వంతో చూసేది.

కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సొంతం

- ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన స్విస్ స్టార్
- ఫైనల్లో మారిన్ సిలిచ్‌పై విజయం

మెల్‌బోర్న్: చూస్తుంటే... గ్రాండ్‌స్లామ్ చరిత్రలో రోజర్ ఫెడరర్ తరతరాలకు చెరగని రికార్డును లిఖిస్తాడేమో! ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టైటిల్ నిలబెట్టుకున్న ఈ డిఫెండింగ్ చాంపియన్ 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో టెన్నిస్ లోకాన్నే మురిపించాడు. వయసు మూడు పదులు దాటినా తనలో వాడి తగ్గలేదని తాజా విజయంతో మళ్లీ నిరూపించాడు. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో స్విట్జర్లాండ్ లెజెండ్ ఫెడరర్ 6-2, 6-7 (5/7), 6-3, 3-6, 6-1తో ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై చెమటోడ్చి నెగ్గాడు. 36 ఏళ్ల రోజర్ తన కెరీర్‌లో 20వ టైటిల్ కోసం 3 గంటల 3 నిమిషాలు పోరాడాడు. పోరు ముగియగానే అదుపులేని ఆనందాన్ని, భావోద్వేగాన్ని దాచుకోలేకపోయిన ఫెడరర్ బిగ్గరగా ఏడ్చేశాడు. తనకు జేజేలు పలుకుతున్న స్టేడియంలోని ప్రేక్షకులకు ఆనంద బాష్పాలతో మాట కలిపాడు. విజేతగా నిలిచిన ఫెడరర్‌కు 40 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 20 కోట్ల 63 లక్షలు)... రన్నరప్ మారిన్ సిలిచ్‌కు 20 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 10 కోట్ల 31 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



చాలా సంతోషంగా ఉంది. ఈ విజయాన్ని నమ్మలేకపోతున్నాను. గతేడాది నాకు గొప్పగా గడిచింది. అది ఇచ్చిన ఉత్సాహమే ఈ టైటిల్ కూడా. ఎక్కడలేని ఆనందాన్ని, అనుభూతినిచ్చింది. ఈ ఫైనల్ నాకు 2006 తుది పోరును గుర్తుకు తెచ్చింది. బగ్దాటిస్‌తో జరిగిన ఆ పోరును, విజయాన్ని మర్చిపోలేను. ఈ ఫైనల్లోనూ అదే విధంగా పోరాడాను. అనుకున్నది సాధించాను. ఫైనల్‌దాకా అద్భుతంగా సాగింది. నా టీమ్ (సహాయక సిబ్బంది)కు కృతజ్ఞతలు. నేను గెలిచేందుకు వాళ్లు కష్టపడ్డారు.
–ఫెడరర్

200వ గ్రాండ్‌స్లామ్... 30వ ఫైనల్...

టెన్నిస్ చరిత్రలో ఇది 200వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ. ఇందులో 30వ ఫైనల్ ఆడిన ఫెడరర్ 20వ టైటిల్ గెలవడం నిజంగా అద్భుతమే కదా! ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతనికిది ఆరో టైటిల్... దీంతో ఇది వరకే ఈ ఘనత సాధించిన జొకోవిచ్ (సెర్బియా), అలనాటి ఆసీస్ దిగ్గజం రాయ్ ఎమర్సన్‌ల సరసన నిలిచాడు. అలుపెరగని ఈ పోరాట యోధుడు ఫైనల్ పోరును దూకుడుగానే ఆరంభించాడు. తొలి సెట్‌ను తనదైన శైలిలో గెలుచుకున్న ఫెడరర్‌కు రెండో సెట్‌లో క్రొయేషియన్ ప్రత్యర్థి నుంచి అనూహ్య పోటీ ఎదురైంది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ సెట్ చివరకు టైబ్రేక్‌కు దారి తీసింది. అక్కడా అదే తీరు కొనసాగడంతో స్టేడియంలోని ప్రేక్షకులు ఒళ్లంతా కళ్లు చేసుకున్నారు. చివరకు సెట్ కోల్పోయిన ఫెడరర్ మూడో సెట్‌లో పుంజుకొని ఆడాడు. పోటీ లేకుండానే 6-3తో ఈ సెట్‌ను ముగించాడు. నాలుగో సెట్ ఓడటంతో నిర్ణాయక ఐదో సెట్‌లో ఫెడరర్ తన అనుభవాన్నంతా రంగరించి తేలిగ్గా ప్రత్యర్థిని చిత్తు చేశాడు. ఆరోసారి ఆస్ట్రేలియన్ ట్రోఫీని ముద్దాడాడు. ఫైనల్లో ప్రత్యర్థి సిలిచ్ సర్వీస్‌ను ఆరు సార్లు బ్రేక్ చేసిన ఫెడరర్ 24 ఏస్‌లు సంధించాడు. సిలిచ్ 16 ఏస్‌లు సంధించాడు. ఎండ వేడిమి... ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు పెరగడంతో టెన్నిస్ కోర్టు పైకప్పును మూసి ఆడించారు.

మీకు తెలుసా...

332-52 గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో ఫెడరర్ జయాపజయాల రికార్డు ఇది. మెల్‌బోర్న్‌లోనూ అతనికి ఘనమైన రికార్డే (94-13) ఉంది.

10% చరిత్రలో పది శాతం గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు రోజర్ ఇంట్లోనే ఉన్నాయి.

9-1 సిలిచ్‌పై ఫెడరర్ పైచేయి ఇది. పదిసార్లు ముఖాముఖిగా తలపడితే ఒక్కసారి మాత్రమే (2014, యూఎస్ ఓపెన్ సెమీస్) ఓడాడు రోజర్.

ఇవీ ఫెడరర్ 'గ్రాండ్' టైటిల్స్

ఆస్ట్రేలియన్ ఓపెన్ (6): 2004, 2006, 2007, 2010, 2017, 2018
ఫ్రెంచ్ ఓపెన్ (1): 2009
వింబుల్డన్ (8): 2003, 2004, 2005, 2006, 2007, 2009, 2012, 2017
యూఎస్ ఓపెన్ (5): 2004, 2005, 2006, 2007, 2008

94 ఫెడరర్ కెరీర్‌లో గెలిచిన టైటిల్స్. అత్యధిక సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుల జాబితాలో ఇవాన్ లెండిల్ సరసన ఫెడరర్ చేరాడు. 109 టైటిల్స్‌తో జిమ్మీ కానర్స్ అగ్రస్థానంలో ఉన్నాడు.

3 ఓపెన్ శకంలో (1968 తర్వాత) 30 ఏళ్లు దాటిన తర్వాత నాలుగు వేర్వేరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన మూడో ప్లేయర్ ఫెడరర్. గతంలో రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా), కెన్ రోజ్‌వెల్ (అమెరికా) మాత్రమే ఇలాంటి ఘనత సాధించారు.

కోట్లతో 'జై' కొట్టారు


ఉనాద్కట్

అనూహ్యానికి, ఆశ్చర్యానికి అడ్రస్‌లాంటి ఐపీఎల్ వేలంలో మరో పెద్ద సంచలనం. ఏడేళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో భారత్ తరఫున డజను మ్యాచ్‌లు మాత్రమే ఆడగలిగిన లెఫ్టార్మ్ పేస్ బౌలర్ జైదేవ్ ఉనాద్కట్‌పై కోట్ల వర్షం కురిసింది. రాజస్తాన్ రాయల్స్ ఏకంగా రూ. 11.5 కోట్ల మొత్తానికి అతడిని సొంతం చేసుకొని అందరికీ షాక్ ఇచ్చింది. గత ఏడాది ఐపీఎల్‌లో నిలకడగా రాణించడం ఒక కారణమైనా... ఇంత భారీ ధర పలకడం మాత్రం నివ్వెరపరిచేదే! తాజా వేలంలో అత్యధిక మొత్తానికి అమ్ముడుపోయిన భారత ఆటగాడిగా నిలిచిన ఉనాద్కట్... స్టోక్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. అన్‌క్యాప్డ్ ఆటగాడు కృష్ణప్ప గౌతమ్‌కు రూ.6.2 కోట్లు లభించడం మరో విశేషం కాగా... ఎట్టకేలకు రూ. 2 కోట్ల కనీస ధరతో క్రిస్ గేల్ పంజాబ్ చెంత చేరడం కొసమెరుపు.

- వేలంలో రూ.11.5 కోట్ల ధర పలికిన లెఫ్టార్మ్ పేసర్
- భారత ఆటగాళ్లలో అత్యధిక మొత్తానికి రాజస్తాన్ సొంతం
- కృష్ణప్ప గౌతమ్‌కు రూ. 6.2 కోట్లు
- క్రిస్ గేల్‌ను తీసుకున్న పంజాబ్
- రూ. 2.6 కోట్లతో బెంగళూరుకు సిరాజ్

బెంగళూరు: ఐపీఎల్–2018 కోసం జరిగిన వేలంలో రెండో రోజు కూడా ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించాయి. ఇప్పటికే గుర్తింపు పొందిన ఆటగాళ్లతో పాటు కొత్తవాళ్లకు కూడా పెద్ద మొత్తం చెల్లించేందుకు సిద్ధమయ్యాయి. ఈ జాబితాలో ఉనాద్కట్, గౌతమ్ ముందు వరుసలో నిలిచారు. ఆస్ట్రేలియా పేస్ బౌలర్ ఆండ్రూ టైని పంజాబ్ జట్టు రూ.7.20 కోట్లకు గెలుచుకుంది. విదేశీ ఆటగాళ్లలో రెండో రోజు ఇదే అత్యధిక మొత్తం. తొలి రోజు సన్‌రైజర్స్ తీసుకున్న రషీద్ ఖాన్‌తో పాటు మరో ముగ్గురు అఫ్గానిస్తాన్ ఆటగాళ్లకు కూడా ఐపీఎల్‌లో చోటు లభించగా... సందీప్ లిమిచానే ఈ లీగ్‌లో అడుగు పెడుతున్న తొలి నేపాల్ క్రికెటర్‌గా నిలవడం విశేషం. కోల్‌కతా జట్టు తమకు అందుబాటులో ఉన్న మొత్తం రూ. 80 కోట్లను పూర్తిగా వినియోగించుకోగా... చివర్లో ఆటగాళ్లను ఎంచుకోవడంలో గందరగోళానికి గురైన చెన్నై రూ.6.50 కోట్లను ఉపయోగించుకోలేక వృథా చేసుకుంది. ఎనిమిది జట్లలో కోల్‌కతా, పంజాబ్ గరిష్ట విదేశీ ఆటగాళ్ల (8)ను ఎంచుకోకుండా 7కే పరిమితమయ్యాయి. ఒక్కోజట్టు సభ్యుల సంఖ్య గరిష్టంగా 25 కాగా చెన్నై, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ సరిగ్గా 25 మందిని తీసుకున్నాయి. బెంగళూరు (24), రాజస్తాన్ (23), పంజాబ్ (21), కోల్‌కతా (19) తక్కువ సంఖ్యకే తమ వేలాన్ని ముగించాయి.

ఉనాద్కట్ కోసం పోటీ పడి...

స్వయంగా ఉనాద్కట్ కూడా కలలో ఊహించలేని విధంగా అతని కోసం వేలం సాగింది. రూ. 1.5 కోట్ల కనీస ధరతో అతను వేలంలోకి అందుబాటులోకి వచ్చాడు. అందరికంటే ముందుగా చెన్నై రేసులోకి వచ్చింది. అయితే ఆ తర్వాత పంజాబ్ వేలానికి సిద్ధమైంది. ఒకరితో మరొకరు పోటీ పడి విలువ పెంచేశారు. ఫలితంగా 4 కోట్లు... 5... 8... ఇలా పంజాబ్ 10 కోట్లకు తీసుకుపోయింది. చెన్నై 10.5 చెప్పినా మళ్లీ పంజాబ్ 11కు పెంచి ఆగిపోయింది. ఇక పంజాబ్‌కే ఖాయం అనిపించిన దశలో అనూహ్యంగా రాజస్తాన్ ముందుకొచ్చింది. రూ. 11.5 కోట్లకు సిద్ధమని ప్రకటించి ఉనాద్కట్‌ను సొంతం చేసుకుంది. నిజానికి ఉనాద్కట్ వేలానికి వచ్చే సమయానికి రాయల్స్ వద్ద మొత్తం 16.5 కోట్లు మాత్రమే మిగిలాయి. కానీ ఆ జట్టు ఒక్క ఆటగాడి కోసం అందులో 70 శాతం మొత్తాన్ని ఖర్చు చేయడం అమితాశ్చర్యం కలిగించింది. గత ఏడాది పుణే తరఫున ఆడిన ఉనాద్కట్ హ్యాట్రిక్ సహా 7.02 ఎకానమీతో 24 వికెట్లు పడగొట్టి భువనేశ్వర్ (26) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. గౌతమ్ కనీస ధర రూ. 20 లక్షలు కాగా... బెంగళూరు, కోల్‌కతాలతో పోటీ పడి రాయల్స్ చివరకు అతడిని తీసుకుంది. ఇది గౌతమ్ కనీస ధరకంటే 31 రెట్లు ఎక్కువ కావడం విశేషం. అంతర్జాతీయ టి20ల్లో భారత్‌పైనే 2 సెంచరీలు చేసిన ఎవిన్ లూయిస్ (వెస్టిండీస్) కోసం సన్‌రైజర్స్ ఆసక్తి చూపించినా, అతడిని ముంబై దక్కించుకుంది. ధోని ఫేవరెట్ మోహిత్ శర్మను చెన్నై రూ.2.4 కోట్లకు గెలుచుకోగా... రైట్ టు మ్యాచ్ కార్డు ద్వారా అతను పంజాబ్‌కు వెళ్లాల్సి వచ్చింది.

ముచ్చటగా మూడోసారి...

విధ్వంసకర ఆటగాడిగా లెక్కలేనన్ని టి20 రికార్డులు తన పేరిట ఉన్న క్రిస్ గేల్ ఐపీఎల్ కెరీర్‌కు చివరకు పంజాబ్ ఊపిరి పోసింది. ఆదివారం రెండోసారి వేలంలో కూడా అతడిని ఎవరూ తీసుకోలేదు. మూడోసారి మాత్రం కనీస ధర రూ. 2 కోట్లకు కింగ్స్ ఎలెవన్ ఎంచుకోగా, మరే ఫ్రాంచైజీ పోటీ పడలేదు. శ్రీలంక తరఫున ఆఫ్ స్పిన్నర్ అఖిల ధనంజయ, ఆల్‌రౌండర్ దుష్మంత చమీరాలకు మాత్రమే ఐపీఎల్ అవకాశం లభించింది.

మురళీ విజయ్ కూడా...

తొలి రోజు వేలంలో అమ్ముడుపోని భారత టెస్టు ఓపెనర్ మురళీ విజయ్‌కు రెండో రోజు అదృష్టం వెంట వచ్చింది. అతని సొంత నగరానికే చెందిన చెన్నై సూపర్ కింగ్స్ కనీస ధర రూ. 2 కోట్లకు విజయ్‌ను ఎంచుకుంది. చెన్నైకి ఆ సమయంలో కచ్చితంగా ఒక భారత బ్యాట్స్‌మన్, అదీ ఓపెనర్ అవసరం ఉండటం కూడా విజయ్‌కు కలిసొచ్చింది. శనివారం ఎవరూ పట్టించుకోని పార్థివ్ పటేల్ (రూ.1.7 కోట్లు–బెంగళూరు), మిచెల్ జాన్సన్ (రూ. 2 కోట్లు – కోల్‌కతా) రెండోసారి మాత్రం ఎంపికయ్యారు.

ఐపీఎల్‌లో బిర్లా వారసుడు



బిర్లా... ఈ పేరు వినగానే మన మదిలో అతి పెద్ద పారిశ్రామికవేత్త, అపార సంపద కలిగిన కోటీశ్వరుని పేరే మదిలో మెదులుతుంది! ఇప్పుడు అలాంటి బిర్లా కుటుంబ వారసుడు ఐపీఎల్‌లో అడుగు పెట్టబోతున్నాడు. ఐపీఎల్ రాకతో పేదలు ధనవంతులుగా మారిన కథలతో పోలిస్తే ఇది కాస్త భిన్నం. 20 ఏళ్ల ఆర్యమాన్ విక్రమ్ బిర్లా తాజా వేలంలో రాజస్తాన్ రాయల్స్ జట్టులోకి ఎంపికయ్యాడు. కుమార మంగళం బిర్లా కుమారుడే ఆర్యమాన్ కావడం విశేషం. రూ.20 లక్షల కనీస విలువతో ఆర్యమాన్ పేరు వేలంలోకి వచ్చింది. రాజస్తాన్ అదే మొత్తానికి ముందుగా రాగా పంజాబ్ మరో ఐదు లక్షలు పెంచింది. అయితే ఆ తర్వాత రాయల్స్ రూ. 30 లక్షలకు ఆర్యమాన్‌ను సొంతం చేసుకుంది. ఎడమ చేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అయిన ఆర్యమాన్ మధ్యప్రదేశ్ తరఫున ఇటీవల తన ఏకైక రంజీ మ్యాచ్ ఆడాడు. కొన్నాళ్ల క్రితమే అండర్–23 సీకే నాయుడు టోర్నీలో 153 పరుగులతో గుర్తింపు తెచ్చుకున్నాడు. ముంబై జట్టులో అవకాశాలు లభించడం కష్టంగా భావించి మధ్యప్రదేశ్‌కు తరలి వెళ్లిన ఆర్యమాన్... వ్యాపారం కంటే క్రికెట్ కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నట్లు చెప్పాడు.

169 అమ్ముడుపోయిన మొత్తం ఆటగాళ్ల సంఖ్య

113 మొత్తం భారత ఆటగాళ్లు
71 అన్‌క్యాప్డ్ భారత ఆటగాళ్లు
56 మొత్తం విదేశీ ఆటగాళ్లు
ఫ్రాంచైజీలు వెచ్చించిన మొత్తం రూ. **431 కోట్ల 70 లక్షలు**



- కోల్‌కతా ముగ్గురు భారత అండర్–19 ఆటగాళ్లను సొంతం చేసుకుంది. వీరిలో పేసర్లు కమలేశ్ నాగర్‌కోటి (రూ. 3.20 కోట్లు), శివమ్ మావి (రూ. 3 కోట్లు) భారీ మొత్తాలకు అమ్ముడుపోగా, శుభ్‌మాన్ గిల్‌కు రూ. 1.80 కోట్లు దక్కాయి.

పంజాబ్ రూ. 20 లక్షలకు సొంతం చేసుకున్న మయాంక్ డాగర్ సెహ్వాగ్‌కు స్వయానా మేనల్లుడు

పంజాబ్ తీసుకున్న మంజూర్ దార్ లీగ్‌లో ఏకైక జమ్మూ కశ్మీర్ ఆటగాడు.

చెన్నై జట్టులో ఏకంగా ఎనిమిది మంది అన్‌క్యాప్డ్ ఆటగాళ్లున్నారు.



'మిక్స్‌డ్' ఫైనల్లో బోపన్న జంట ఓటమి

మెల్‌బోర్న్: కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ నెగ్గాలని ఆశించిన భారత స్టార్ రోహన్ బోపన్నకు అనుకున్న ఫలితం రాలేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బోపన్న–తిమియా బాబోస్ (హంగేరి) జంట మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. గాబ్రియేలా దబ్రౌస్కీ (కెనడా)–మాట్ పావిక్ (క్రొయేషియా) ద్వయంతో ఆదివారం జరిగిన ఫైనల్లో బోపన్న–బాబోస్ జంట 6–2, 4–6, 9–11తో 'సూపర్ టైబ్రేక్'లో ఓడిపోయింది. గతేడాది దబ్రౌస్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ నెగ్గిన బోపన్న ఈసారి ఆమెను ప్రత్యర్థిగా ఎదుర్కొన్నాడు. చెరో సెట్ గెలిచిన తర్వాత నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో బోపన్న జంట 9–8తో మ్యాచ్ పాయింట్ సాధించినా... ఆ తర్వాత వరుసగా మూడు పాయింట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. విజేత దబ్రౌస్కీ–పావిక్ జంటకు లక్షా 75 వేలు (రూ. 90 లక్షల 30 వేలు), రన్నరప్ బోపన్న–బాబోస్ జోడీకి 90 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 46 లక్షల 44 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

సిరాజ్ అదే మొత్తానికి....



హైదరాబాద్ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఈసారి కోహ్లి సారథ్యంలోని బెంగళూరు తరఫున బరిలోకి దిగనున్నాడు. గత ఏడాదిలాగే ఈసారి కూడా సిరాజ్ సరిగ్గా రూ. 2.6 కోట్ల ధర పలకడం విశేషం. 2017 ఐపీఎల్‌లో 6 మ్యాచ్‌లలో 10 వికెట్లు పడగొట్టిన సిరాజ్... ఆ తర్వాత భారత జట్టుకు కూడా ఎంపికై రెండు టి20లు ఆడి 2 వికెట్లు పడగొట్టాడు. ఆదివారం వేలంలో సిరాజ్ కోసం వరుసగా కోల్‌కతా, ముంబై, చెన్నై, పంజాబ్ పోటీ పడినా... చివరకు బెంగళూరు అతడిని దక్కించుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఇతర ఆటగాళ్లలో తన్మయ్ అగర్వాల్ ఈసారి కూడా కనీస ధర (రూ. 20 లక్షలు)కు సన్‌రైజర్స్‌కే ఎంపికయ్యాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ మెహదీ హసన్‌ను కూడా తొలిసారి రైజర్స్ ఎంచుకోవడం విశేషం. ఆంధ్ర క్రికెటర్లలో రికీ భుయ్ (రూ.20 లక్షలు) వరుసగా రెండోసారి రైజర్స్ తరఫున కొనసాగనున్నాడు.

మరో ఇద్దరు...


ముజీబ్


జహీర్

అఫ్గానిస్తాన్ తరఫున గత ఏడాది ఐపీఎల్‌లో ఇద్దరు ఆటగాళ్లు బరిలోకి దిగారు. ఈసారి కూడా రషీద్ ఖాన్ (రూ. 9 కోట్లు), మొహమ్మద్ నబీ (రూ. 1 కోటి) హైదరాబాద్‌కే ఆడనున్నారు. వీరితో పాటు కొత్తగా మరో ఇద్దరు కూడా ఐపీఎల్‌లో అడుగు పెడుతుండటం విశేషం. ప్రస్తుతం అండర్–19 ప్రపంచ కప్ ఆడుతున్న ముజీబ్ జద్రాన్, జహీర్ ఖాన్ పక్తీన్‌లకు చోటు లభించింది. 17 ఏళ్ల ముజీబ్‌కు 'మిస్టరీ స్పిన్నర్'గా గుర్తింపు ఉంది. ప్రధానంగా ఆఫ్ స్పిన్నర్ అయినా లెగ్ స్పిన్, గుగ్లీలు కలగలిపి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టగలడు. రెండు రోజుల క్రితం న్యూజిలాండ్‌పై 4 వికెట్లు తీసి అఫ్గాన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ముజీబ్‌ను పంజాబ్ ఏకంగా రూ. 4 కోట్లకు సొంతం చేసుకుంది. 19 ఏళ్ల జహీర్ ఖాన్ చైనామన్ బౌలర్. ఇటీవల వైవిధ్యమైన శైలి బౌలర్లకు డిమాండ్ కనిపిస్తున్న నేపథ్యంలో రూ. 20 లక్షలకు జహీర్‌ను ముంబై గెలుచుకుంది.

వీళ్లకు ఐపీఎల్ యోగం లేదు: ఇషాంత్ శర్మ, టైమల్ మిల్స్, ఫాల్క్‌నర్, హాజల్‌వుడ్, ఏంజెలో మాథ్యూస్, మోజెస్ హెన్రిక్స్, హషీం ఆమ్లా, నాథన్ లయన్, జో రూట్, డ్వేన్ స్మిత్, మెక్లీనగన్, లసిత్ మలింగ, డారెన్ స్యామీ, రాస్ టేలర్, మోర్నీ మోర్కెల్, తిసారా పెరీరా, ఇర్ఫాన్ పఠాన్, అశోక్ దిండా, వరుణ్ ఆరోన్.

షెడ్డుకు చేరిన 108

- ‘108’ అంబులెన్స్‌లపై సర్కారు అంతులేని నిర్లక్ష్యం
- మరమ్మతులకు గురై గ్యారేజీల్లో చేరుతున్న వాహనాలు
- రాష్ట్రవ్యాప్తంగా ఆగిపోయిన 100 అంబులెన్స్‌లు
- నాలుగు నెలలుగా నిధులు ఇవ్వని ప్రభుత్వం
- నేడు కార్మిక శాఖ కమిషనర్‌తో ఉద్యోగుల చర్చలు



తిరుపతిలోని లక్ష్మీ మోటార్స్ గ్యారేజీలో మరమ్మతులకు వచ్చి నిలిచి పోయిన అంబులెన్సులు

సాక్షి, అమరావతి: ఏ చిన్న ప్రమాదం జరిగినా ఫోన్ చేయగానే కుయ్ కుయ్ అంటూ పరుగెత్తుకురావాల్సిన ‘108’ అంబులెన్స్‌లు మరమ్మతులకు గురై మూలకు చేరుతున్నాయి. సర్కారు నిర్లక్ష్యంతో రోడ్లపై కుయ్ కుయ్ కూతలు వినిపించడమే అరుదుగా మారిపోయింది. అరిగిపోయిన టైర్లు, విరిగిపోయిన విడిభాగాలు.. ఏ అంబులెన్స్‌ను చూసినా ఇదే పరిస్థితి. మరమ్మతుల సంగతిని పక్కనపెడితే డీజిల్‌కు కూడా ప్రభుత్వం డబ్బులివ్వకపోవడంతో బాధితులకు ‘108’ సేవలు అందడం లేదు. ఎక్కడికక్కడ వాహనాలు గ్యారేజీలకు చేరుతున్నాయి. కొన్నింటికి మరమ్మతులు పూర్తయినా ప్రభుత్వం డబ్బులు చెల్లించక గ్యారేజీలు యాజమాన్యాలు అంబులెన్స్‌లను ఇవ్వడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 అంబులెన్స్‌లు గ్యారేజీలకే పరిమితమయ్యాయి.

రూ.24 కోట్ల బకాయిలు

‘108’ వాహనాల నిర్వహణ బాధ్యతలను రెండు నెలల క్రితం జీవీకే నుంచి బీవీజీ సంస్థ చేపట్టింది. అయినా పరిస్థితిలో మార్పులేదు. నాలుగు రోజులుగా పరిస్థితి మరింత దిగజారింది. ఓవైపు నిధులు లేక మరోవైపు పాత వాహనాలకు మరమ్మతులు చేయించలేక నిర్వహణ సంస్థ చేతులెత్తేస్తోంది. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోవడంతో సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. చేతులకు వేసుకోవాల్సిన గ్లౌజులు కూడా ఇవ్వడం లేదని, ఇక తాము ఎలా పని చేయాలని సిబ్బంది వాపోతున్నారు. ‘108’ అంబులెన్స్‌ల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. అక్టోబర్ నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. నెలకు రూ.6 కోట్ల చొప్పున దాదాపు రూ.24 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. మరోవైపు సిబ్బంది కొరత వేధిస్తోంది. సోమవారం ‘108’ ఉద్యోగులు, కార్మిక శాఖ కమిషనర్ మధ్య చర్చలు జరగనున్నాయి. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

కాకినాడలోని విష్ణు గ్యారేజీలో మరమ్మతులకు వచ్చి షెడ్డులోనే ఉండిపోయిన ‘108’ వాహనాలు



ఉద్యోగుల పరిస్థితి దారుణం

“అంబులెన్స్‌ల్లో పని చేస్తున్న డ్రైవర్లు, టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదు. ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదు. జీవీకే చెల్లించాల్సిన బకాయిలను కొత్తగా వచ్చిన సంస్థ ఇవ్వడం లేదు. ఉద్యోగులు ఇప్పటికే పని ఒత్తిడితో నలిగిపోతున్నారు. తెలంగాణలో ప్రతి ఉద్యోగికీ రూ.4 వేల వరకూ వేతనాలు పెంచారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ వెంటనే పెంచాలి”

– కిరణ్‌కుమార్, అధ్యక్షుడు, రాష్ట్ర ‘108’ ఉద్యోగుల సంఘం

వారాంతం.. విషాదాంతం

హైదరాబాద్‌లో ‘లాంగ్‌డ్రైవ్’కు వెళ్లిన ముగ్గురి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

చేవెళ్ల: వారాంతాన్ని సరదాగా గడుపుదామనుకున్న ఉద్యోగుల జీవితాలు విషాదాంతం అయ్యాయి. కారు అతివేగంగా వెళ్లి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు స్నేహితుల్లో ముగ్గురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ – బీజాపూర్ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో నివాసముండే కాసపోగు ప్రవీణ్(26), డేవిడ్ జాన్సన్ (34), అరుగొండ అర్జున్‌కుమార్ (25), శ్రావణ్ స్నేహితులు. ప్రవీణ్, అర్జున్‌కుమార్, శ్రావణ్ ఉప్పల్‌లోని జెన్‌పాక్ కంపెనీ ఉద్యోగులు. డేవిడ్ జాన్సన్ మెడికల్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నాడు. వారాంతాన్ని సరదాగా గడుపుదామని ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ఆల్టో కారులో వికారాబాద్‌కు లాంగ్‌డ్రైవ్ ప్లాన్ చేసుకున్నారు. ఉదయమే నగరం నుంచి బయలుదేరారు. ప్రవీణ్‌కుమార్ కారు నడుపుతున్నాడు. కారు అతివేగంగా వెళ్తూ మీర్జాగూడ సమీపంలోని మూలమలుపు వద్ద అదుపు తప్పింది. పక్కనే ఉన్న మర్రిచెట్టును ఢీకొట్టింది. దీంతో ప్రవీణ్, అర్జున్, డేవిడ్ అక్కడికక్కడే మృతి చెందారు. శ్రావణ్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి శ్రావణ్‌ను ‘108’అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పదేళ్లలో కేన్సర్‌ను జయిస్తాం

- ప్రఖ్యాత కేన్సర్ పరిశోధకుడు ప్రేమ్‌కుమార్‌రెడ్డి
- ఇమ్యూనోథెరపీ ఓ అద్భుత ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షల మంది ప్రాణాలు తీస్తున్న కేన్సర్‌పై విజయం సాధించే రోజు ఎంతో దూరం లేదని, ప్రస్తుత పరిశోధనలు పరిశీలిస్తే మరో పదేళ్లలోనే ఇది సాధ్యమవుతుందని ప్రపంచ ప్రఖ్యాత కేన్సర్ పరిశోధకుడు ప్రేమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇరవై ఏళ్ల క్రితం కేన్సర్ సోకితే మరణమే అనుకునే వారని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని, ఒక ట్రెండు రకాలు మినహా ఇతర కేన్సర్ల విషయంలో రోగులు 15–20 ఏళ్లు జీవిస్తున్నారని వివరించారు. కేన్సర్‌కు ఒకట్రెండు జన్యుమార్పులే కారణమని ఒకప్పుడు అనుకునేవారని, తాజా పరిస్థితులు గమనిస్తే వందకుపైగా మ్యూటేషన్స్ వ్యాధిని ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆన్ సెల్ బయాలజీ–2018లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ప్రేమ్‌కుమార్.. ఆదివారం ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. వైద్య రంగంలో ఇమ్యూనోథెరపీ ఓ అద్భుతమైన ఆవిష్కరణ అని.. మందులు, ఇమ్యూనోథెరపీ కలిపి వాడితే వ్యాధిని జయించవచ్చన్నారు. క్రిస్పర్, జన్యు చికిత్స విధానాలతో పెద్దగా ప్రయోజనం ఉండదని.. కేన్సర్ సోకిందని గుర్తించే సమయానికే శరీరంలో 10 కోట్లకుపైగా కేన్సర్ కణాలు ఉంటాయని, అన్ని కణాల్లోని జన్యువులను మార్చడం దాదాపు అసాధ్యమని చెప్పారు. పైగా జన్యు మార్పులున్న కణాలు గుర్తించడమూ పెద్ద సమస్య అవుతుందని వివరించారు. అయితే కొన్ని రకాల వ్యాధులు.. ముఖ్యంగా జన్యువుల్లో వచ్చే మార్పులను సరి చేసేందుకు ఈ చికిత్స ఉపయోగపడొచ్చని పేర్కొన్నారు. కేన్సర్‌కు చికిత్సకు సంబంధించి పురాతనమైన పద్ధతులపై ప్రయోగాలు చేయాల్సిన అవసరముందని ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

పౌష్టికాహారంతో నివారణ..

పౌష్టికాహారం కేన్సర్‌ను నయం చేయకపోవచ్చుగానీ.. నివారణకు మాత్రం మెరుగ్గా ఉపయోగపడుతుందని ప్రేమ్‌కుమార్ చెప్పారు. కేన్సర్ చికిత్సకు అందించే ట్యాక్సాల్ ఔషధం శరీరంలో వేగంగా విభజితమవుతున్న కణాలను చంపేస్తుందని, ఈ ప్రక్రియలో కొన్ని ఆరోగ్యకర కణాలూ నాశనమవుతూంటాయని పేర్కొన్నారు. ఈ చికిత్స ఫలితంగా వెంట్రుకలు ఊడిపోతాయని.. కడుపు, పేగుల గోడలపై ఉండే పొర కణాలూ దెబ్బతింటాయని, తెల్ల రక్త కణాలు కూడా తగ్గిపోవడంతో రోగులు బలహీనపడతారని వివరించారు. కడుపు, పేగుల్లోని కొన్ని రకాల బ్యాక్టీరియా కేన్సర్‌పై ప్రభావం చూపుతాయని.. అందుకే బ్యాక్టీరియా, కేన్సర్‌ల మధ్య సంబంధం తెలుసుకోడానికి ఫార్మా కంపెనీలు పరిశోధనలు చేస్తున్నాయన్నారు. హోమియోపతితో పోలిస్తే ఆయుర్వేదం విస్తృతంగా అర్థం చేసుకున్న విధానమన్నారు. ఈ రెండు విధానాలనూ అర్థం చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.